www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

గురువారం | 25-9-2025 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 161 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం, తిథి: తదియ ఉ.7:06 తదుపరి చవితి, నక్షత్రం: స్వాతి రా.7:09 తదుపరి విశాఖ, వర్జ్యం: రా.1:27-3:15, దుర్ముహూర్తం: ఉ.10:07-10:55, మ.2:54-3:41, అమృతఘడియలు: ఉ.9:17-11:05, రాహుకాలం: మ.1:30-3:00 వరకు, సూర్యోదయం: 6:08, సూర్యాస్తమయం: 6:05 | విజయవాడ సిటీ**


Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రైల్వే ఉద్యోగులకు బోనస్

ఒక్కో ఉద్యోగికి గరిష్ఠంగా రూ.17,951 వరకు
నౌకల తయారీ, సముద్ర వాణిజ్య మౌలిక వసతులకు 69,725 కోట్ల ప్యాకేజీ.. దీంతో 30 లక్షల ఉద్యోగాలు
విద్యాసంస్థల్లో పరిశోధనలకు రూ.2,277 కోట్లు
బిహార్‌పై వరాల జల్లు.. రైలు, రోడ్డు ప్రాజెక్టులు
కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయాలు 2

దేశవ్యాప్తంగా కొత్తగా 10,023 మెడికల్ సీట్లు 14

ఇందులో ఎంబీబీఎస్ సీట్లు 5,023.. పీజీ సీట్లు 5 వేలు
ప్రభుత్వ కాలేజీల్లో మంజూరుకు కేంద్రం నిర్ణయం
2028-29కల్లా కొత్త సీట్లు అందుబాటులోకి
ఏపీలో 250-300 యూజీ సీట్లు వచ్చే అవకాశం!


బుధవారం శాసనసభలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

గత ప్రభుత్వంలో టీడీఆర్ బాండ్లలో కోట్ల రూపాయల అవినీతి జరిగింది. అమృత్ 2.0 పథకం, గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ పనులను చాలా చోట్ల చేయకుండానే పెద్ద ఎత్తున నిధులు దోచుకున్నారనే ఆరోపణలున్నాయి. దీనికి సంబంధించి కూటమి సర్కారు స్పందిస్తుందని... నాటి మునిసిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి తోపాటు బాధ్యులైన వైసీపీ నేతలపై చర్యలు తీసుకుంటుందని అంతా భావించారు. కానీ... స్వయానా మంత్రి నారాయణే వారికి అండగా నిలుస్తున్నారు!

మౌనమేల నారాయణా?

అక్రమార్కులకు మంత్రి అండదండలు

ఒకవైపు... విపక్షంలో ఉండగానే జగన్ రెచ్చిపోతున్నారు. "ఈసారి అధికారంలోకి వస్తే కూటమి నేతలు, అధికారులను వదిలిపెట్టేది లేదు. సప్త సముద్రాల అవతల ఉన్నా లాక్కొస్తాం. సినిమా చూపిస్తాం" అని హెచ్చరిస్తున్నారు.

మరోవైపు... జగన్ హయాంలో మునిసిపల్ శాఖ పరిధిలో జరిగిన అక్రమాలు కళ్లకు కట్టినట్లు కనిపిస్తున్నా ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. స్వయానా కూటమి ఎమ్మెల్యేలే ఫిర్యాదు చేసినా స్పందన లేదు. ఆ శాఖ మంత్రి పొంగూరు నారాయణ తీరుపై కూటమి నేతలే విస్తుపోతున్నారు.

ఎందుకో ఏమో?



వైసీపీ హయాంలో మునిసిపల్ శాఖలో భారీ అవినీతి
ఐఏఎస్ శ్రీలక్ష్మి, కొందరు వైసీపీ నేతలే బాధ్యులు
వందల కోట్ల విలువైన టీడీఆర్ బాండ్ల స్కామ్
'అది చిన్న ఇష్యూ' అని తుస్సుమనిపించిన మంత్రి
అంతర్గత విచారణకూ ఆయన బ్రేకులు
'అమృత్', బ్యూటిఫికేషన్ పనులపైనా అదే తీరు
అక్రమాలపై కూటమి ఎమ్మెల్యేల ఆరోపణలు
ఆధారాలు చూపిస్తున్నా స్పందించని నారాయణ
సభా సంఘం వేసేందుకూ ససేమిరా
నాటి అక్రమార్కులపై ఆయనకు ఎందుకంత ప్రేమ?

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ జమానాలో అవినీతి రాజ్యమేలింది! పలు స్కామ్‌లపై కూటమి ప్రభుత్వం ఇప్పటికే చర్యలు తీసుకుంటోంది. కానీ... మునిసిపల్ శాఖా మంత్రి నారాయణ తీరే వేరు. ఎందుకో ఏమోగానీ... వైసీపీ హయాంలో అక్రమాలకు పాల్పడిన వారిపై ఆయన విపరీతమైన ప్రేమ కనబరుస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. టీడీఆర్ కుంభకోణాన్ని ఆయనే 'తుస్సు'మనిపించగా... 'అమృత్', గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ పథకాల్లోని అక్రమాలపైనా అదే వైఖరి ప్రదర్శిస్తుండటం గమనార్హం. ఈ రెండింటిలోనూ సీనియర్ ఐఏఎస్ ఆఫీసర్ శ్రీలక్ష్మిపైనే తీవ్ర ఆరోపణలున్నాయి. ఆమెతోపాటు దీనికి బాధ్యులైన వైసీపీ నేతలు, అధికారులను నారాయణ కాపాడుతున్నారనే అభిప్రాయం నెలకొంది.

టీడీఆర్ స్కామ్‌లో ఇలా...

గత ప్రభుత్వ హయాంలో మునిసిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన

మిగతా 13వ పేజీలో...


బుధవారం తిరుమల శ్రీవారికి పట్టువస్త్రాలు తీసుకువెళుతున్న సీఎం చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు

బ్రహ్మోత్సవ సంరంభం

ధ్వజారోహణంతో ప్రారంభమైన శ్రీవారి బ్రహ్మోత్సవాలు
స్వామికి పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు
రాత్రి పెద్దశేష వాహనంపై విహరించిన మలయప్ప
వాహన సేవలో పాల్గొన్న ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ 11
ఎవరికీ ఇవ్వని అవకాశం శ్రీవారు నాకు ఇచ్చారు
14సార్లు పట్టువస్త్రాలు సమర్పించే భాగ్యం దక్కింది: సీఎం

సినిమా చూపిస్తా



డిజిటల్ బుక్‌తో ప్రతీకారం తీర్చుకుందాం
కూటమి నేతలు, అధికారులు సప్త సముద్రాల అవతల ఉన్నా వదిలిపెట్టేది లేదు
ప్రభుత్వంపై 15 నెలల్లోనే తీవ్ర అసంతృప్తి
మేం అధికారంలోకి వస్తే పార్టీ క్యాడర్ ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు: జగన్
వైసీపీ సమావేశంలో డిజిటల్ బుక్ ఆవిష్కరణ 13

మోహిత్‌రెడ్డి 'వాహనాల్లో'నే మద్యం ముడుపుల తరలింపు 13

లాగ్‌బుక్‌లో తిరుపతి పరిసరాల్లో.. కానీ హైదరాబాద్‌కు వాహనాలు
వారి కంపెనీల ఖాతాలకు భారీగా సొమ్ము.. మోహిత్‌ను విచారించాలి
ముందస్తు బెయిలివ్వొద్దు.. లూథ్రా వాదనలు.. హైకోర్టు తీర్పు రిజర్వ్

తొలగించిన ఉద్యోగులకు మళ్లీ డిమాండ్!

హెచ్-1బీ వీసా ఫీజు భారీ పెంపుతో మారిన పరిణామాలు
ఆ వీసాపై అమెరికాకు వెళ్లి.. ఇటీవలి కాలంలో ఉద్యోగం కోల్పోయినవారికి కంపెనీల పిలుపు 2
ప్రతిభావంతులైన భారతీయ టెకీలకు స్వాగతం: జర్మనీ


బిహార్‌లోని పట్నాలో జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, రాహుల్, కేసీ వేణుగోపాల్

మోదీ సర్కార్‌కు చట్టబద్ధత లేదు

ఓట్ల చోరీతో గెలిచిన ఈ ప్రభుత్వానికి నైతికంగా, రాజకీయంగా ఏ విలువా లేదు
ఎక్కడ చూసినా 'ఓట్ చోర్.. గద్దీ చోడ్'
కాంగ్రెస్ పోరాటంలో అంతా కలసి రావాలి
మోదీ 'కౌగిలింతల దౌత్యం' బెడిసికొట్టింది
మిత్ర దేశమంటూనే ట్రంప్ సుంకాలు వేశారు
అమెరికా జబ్బు కంటే చైనా మందు ప్రమాదం

బిహార్‌లో సీడబ్ల్యూసీ భేటీలో తీర్మానం

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ తరహాలో ఎంబీసీలకు చట్టం: రాహుల్

పట్నా, సెప్టెంబరు 24: ఎన్నికల్లో బీజేపీయే గెలిచేలా వ్యవస్థీకృతంగా జరుగుతున్న ఓట్ల చోరీ కుట్ర బయటపడిందని.. అలా ఏర్పడిన ఈ ప్రభుత్వానికి ఎలాంటి నైతిక, రాజకీయ చట్టబద్ధత లేదని కాంగ్రెస్ పేర్కొంది. ఓట్ల చోరీ వ్యవహారంతో ప్రజాస్వామ్యంపై ప్రజల్లో ఉన్న నమ్మకం సడలిపోతోందని

మిగతా 2వ పేజీలో...

కొత్త టీచర్లు వచ్చేస్తున్నారు!

15,941 మందికి నేడే నియామక పత్రాలు.. అమరావతి సభలో అందజేత

కొత్త టీచర్లలో సగం మంది మహిళలు
టాపర్లుగా నిలిచిన 16 మంది సహా 22 మందికి పత్రాలు ఇవ్వనున్న సీఎం
తక్కినవారికి అందించనున్న అధికారులు
పాల్గొననున్న పవన్ కల్యాణ్, లోకేశ్
హాజరవనున్న ఎమ్మెల్యేలు, నేతలు
34 వేల మంది కోసం ప్రాంగణం సిద్ధం
47 ఉద్యోగాలకు 10 నోటిఫికేషన్లు
వేర్వేరు శాఖల్లో భర్తీకి ఏపీపీఎస్సీ రెడీ



అమరావతి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): టీచర్ ఉద్యోగం కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూసిన వారి కల నెరవేరే వేళయింది. 15,941 మంది ఉపాధ్యాయులుగా గురువారం నియామక పత్రాలు అందుకోబోతున్నారు. ఇటీవల మెగా డీఎస్సీ ఫలితాలు ప్రకటించిన ప్రభుత్వం.. ఎంపికైనవారందరికీ అమరావతిలో అపాయింట్‌మెంట్ ఆర్డర్లు అందజేయనుంది. అతిత్వరలోనే వీరంతా ప్రభుత్వ బడుల్లో ఉపాధ్యాయ వృత్తి చేపట్టబోతున్నారు. దీని కోసం అమరావతిలో సచివాలయం పక్కనే భారీగా

మిగతా 13వ పేజీలో...


14

2న 'ఆటో డ్రైవర్ల సేవలో'!

మొత్తం లబ్ధిదారులు 3.10 లక్షల మంది
ఒక్కొక్కరి ఖాతాలో 15 వేలు చొప్పున జమ
రాష్ట్ర ప్రభుత్వంపై రూ.466 కోట్ల భారం

భగ్గుమన్న లద్దాఖ్

హింసాత్మకంగా మారిన 'రాష్ట్ర హోదా' నిరసనలు

నలుగురి మృతి

70 మందికి పైగా గాయాలు
లేహ్‌లో బీజేపీ ఆఫీసు దహనం
సెక్రటేరియట్ భవనానికి నిప్పు
పోలీసులపై రాళ్లు రువ్విన ఆందోళనకారులు


ఆందోళనకారులు నిప్పు పెట్టడంతో లేహ్‌లోని బీజేపీ ఆఫీసు నుంచి వెలువడుతున్న పొగలు

లేహ్, సెప్టెంబరు 24: లద్దాఖ్‌లో ఆందోళనకారులు రెచ్చిపోయారు. కేంద్ర పాలిత ప్రాంతమైన లద్దాఖ్‌కు రాష్ట్ర హోదా కల్పించడంతో పాటు ఆరో షెడ్యూల్‌లో చేర్చాలన్న డిమాండ్లతో ప్రారంభించిన నిరసనలు హింసాత్మకంగా మారాయి. బుధవారం లేహ్ నగరంలో ఆందోళనకారులు విధ్వంసం సృష్టించారు. స్థానిక బీజేపీ కార్యాలయానికి నిప్పుపెట్టారు. పోలీసులతోనూ ఘర్షణకు దిగారు. వారిపై రాళ్లు రువ్వారు. దీంతో ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు బాష్ప వాయువును ప్రయోగించారు. లాఠీచార్జి

మిగతా 2వ పేజీలో...



● **బ్యాంకాక్‌లో నడిరోడ్డు మీద భారీ గొయ్యి!**

న్యూఢిల్లీ, సెప్టెంబరు 24: థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్ నడిబొడ్డున.. రోడ్డు ఆకస్మాత్తుగా భూమిలోకి కుంగిపోయి 50 మీటర్ల భారీ గొయ్యి ఏర్పడింది. ఫలితంగా పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. విద్యుత్ స్తంభాలు కూలిపోయి, కరెంటు తీగలు గాల్లో వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. నీటి పైపులైన్లు పగిలిపోయి పెద్ద ఎత్తున్న నీరు పైకి ఉబికి రావడంతో పాటు సమీపంలోని భవనాలకు పగుళ్లు ఏర్పడ్డాయి. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ ఘటన బుధవారం ఉదయం సమ్సెన్ రోడ్డులోని ఓ ఆస్పత్రి సమీపంలో జరిగింది. దీంతో ఆ ప్రాంతాన్ని అధికారులు పూర్తిగా మూసివేశారు. ముందు జాగ్రత్త చర్యగా హాస్పిటల్ నుంచి రోగులను, సమీప అపార్ట్‌మెంట్ వాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఘటన జరిగిన ప్రాంతానికి సమీపంలో జరుగుతోన్న భూగర్భ రైల్వే స్టేషన్ నిర్మాణ పనుల కారణంగానే భారీ గొయ్యి ఏర్పడిందని బ్యాంకాక్ గవర్నర్ చాడ్‌చార్ట్ సిట్టిపాంట్ స్పష్టం చేశారు. అయితే, ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని, మూడు వాహనాలు ధ్వంసమయ్యాయని తెలిపారు.

మోదీ సర్కార్‌కు చట్టబద్ధత లేదు



(మొదటి పేజీ తరువాయి)

వ్యాఖ్యానించింది. ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) మన ప్రజాస్వామ్యానికి ముప్పు అని.. ఓటర్ల జాబితాల్లో అక్రమాల కోసం బీజేపీ చేస్తున్న మోసమని అభివర్ణించింది. దేశ ప్రజలు దీనంతటినీ గమనించాలని.. ఓటు చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ చేస్తున్న పోరాటంలో కలిసి రావాలని పిలుపునిచ్చింది. 'ఓట్ చోర్.. గద్దీ చోడ్ (ఓట్ల దొంగ.. గద్దె దిగు)' నినాదం ఇప్పుడు బిహార్‌లో ఇంటింటా వినిపిస్తోందని, రేపు దేశవ్యాప్తంగా మారుమోగుతుందని పేర్కొంది. ఈ మేరకు బిహార్‌లోని పాట్నాలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశంలో రెండు తీర్మానాలు చేసింది. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఆధ్వర్యంలో జరిగిన ఈ భేటీలో అగ్రనేత రాహుల్ గాంధీ, సీనియర్లు అజయ్ మాకెన్, కేసీ వేణుగోపాల్, జైరామ్ రమేశ్, సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి దామోదర, పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీలో కీలక నిర్ణయాలు తీసుకునే సీడబ్ల్యూసీ సమావేశాలను దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత బిహార్‌లో నిర్వహించడం ఇదే మొదటిసారి.

రాహుల్‌కు సెల్యూట్ చేస్తున్నాం..

ఓటు చోరీ వ్యవహారంతో దేశ ప్రజల్లో ప్రజాస్వామ్యంపై నమ్మకం సడలిపోతోందని సీడబ్ల్యూసీ తీర్మానంలో పేర్కొంది. "బీజేపీ గెలిచేలా వ్యవస్థీకృతంగా, క్రమపద్ధతిలో జరుగుతున్న కుట్ర బయటపడింది. ఇలా ఓట్ల చోరీతో ఏర్పడిన ఈ ప్రభుత్వానికి ఎలాంటి నైతిక, రాజకీయ చట్టబద్ధత లేదు. నిరుద్యోగం, రైతుల ఆత్మహత్యలు, ధరల పెరుగుదల, విద్య, వైద్య వ్యవస్థల విధ్వంసం వంటివేవీ బీజేపీకి పట్టవు. ఎందుకంటే తాము ప్రజలకు సేవ చేసి ఓట్లు పొందాల్సిన అవసరం లేదని, ఓట్ల చోరీతో గెలిచేయవచ్చని వారికి తెలుసు. అలాంటి ఓటు చోరీపై ధైర్యంగా పోరాడుతూ, అవకతవకలను బయటపెడుతున్న రాహుల్ గాంధీకి సెల్యూట్ చేస్తున్నాం" అని తెలిపింది. సమావేశం అనంతరం జైరామ్ రమేశ్ మీడియాతో మాట్లాడారు. "వచ్చే నెలలో రాహుల్ గాంధీ ఓటుచోరీపై మరిన్ని కీలక అంశాలను బయటపెడతారు. ఎన్డీయే ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయి. తెలంగాణలో సీడబ్ల్యూసీ భేటీ నిర్వహించిన ఐదు నెలల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు రెండు నెలల్లో బిహార్‌లో మహాఘట్‌బంధన్ అధికారంలోకి రావడం ఖాయం" అని పేర్కొన్నారు.

మోదీ 'కౌగిలింతల దౌత్యం' బెడిసికొట్టింది

గత పదేళ్లలో భారత విదేశాంగ విధానం కుప్పకూలిపోయిందని.. మోదీ 'కౌగిలింత దౌత్యం' బెడిసికొట్టిందని కాంగ్రెస్ తీర్మానంలో విమర్శించింది. "ఎన్డీయే ప్రభుత్వం అటు అమెరికా, ఇటు చైనాల మధ్య ఊగిసలాడుతూ తెలివితక్కువగా వ్యవహరించింది. మిత్రదేశం అంటూనే భారత్‌పై ట్రంప్ భారీగా టారిఫ్‌లు విధించారు. హెచ్1బీ వీసాల విధానాన్ని కఠినతరం చేశారు. దీనికి ప్రతిగా మోదీ ప్రభుత్వం చైనా వైపు మళ్లింది. ఇది మరింత ప్రమాదకరం. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు చైనా ఆయుధాలు అందించింది" అని పేర్కొంది.

మోదీ ప్రభుత్వ పతనానికి నాంది: ఖర్గే

బిహార్‌లో జరగనున్న ఎన్నికలు భవిష్యత్తులో కేంద్రంలో మోదీ అవినీతి ప్రభుత్వ పతనానికి నాంది పలకనున్నాయని ఖర్గే పేర్కొన్నారు. ఓట్ల చోరీ, ఆర్థిక వ్యవస్థ మందగమనం, నిరుద్యోగం, సామాజిక విభజన, స్వతంత్ర రాజ్యాంగ వ్యవస్థలను బలహీనం చేయడం వంటివాటితో దేశం అల్లకల్లోలం అవుతోందని ఆరోపించారు. అయితే, బిహార్‌లో మిత్రపక్షాలపై పెత్తనం చేసేందుకే పాట్నాలో సీడబ్ల్యూసీ భేటీ నిర్వహించారని కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్, బీజేపీ ఎంపీ రవిశంకర్ ప్రసాద్ ఆరోపించారు. దీనిని కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేరా ఖండించారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ తరహాలో ఈబీసీలకు చట్టం: రాహుల్

బీసీల్లో మరింత వెనుకబడిన కులాల (ఈబీసీ) వారి కోసం.. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీస్ చట్టం తరహాలో ప్రత్యేక చట్టం తెస్తామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. బిహార్‌లోని పాట్నాలో సీడబ్ల్యూసీ భేటీ అనంతరం 'ఈబీసీలకు న్యాయ సంకల్పం' పేరిట నిర్వహించిన కార్యక్రమంలో రాహుల్ మాట్లాడారు. బిహార్ జనాభాలో ఎక్కువశాతం ఉన్న ఈబీసీల కోసం 10 ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని ప్రకటించారు. ఈబీసీ అట్రాసిటీస్ చట్టం తెస్తామని, స్థానిక ఎన్నికల్లో వారి రిజర్వేషన్లను 30శాతానికి పెంచుతామని, ప్రభుత్వ కాంట్రాక్టుల్లోనూ రిజర్వేషన్ ఇస్తామని హామీ ఇచ్చారు.

లోకం తీరు



ఓటు రక్షకులు వస్తున్నారు!

» 'ఓట్ల చోరీ' కట్టడిలో భాగంగా

నియమించనున్న కాంగ్రెస్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 24 : 'ఓట్ల చోరీ'పై ఈసీని తప్పుబడుతూ పెద్ద ఎత్తున ప్రచారం సాగిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఓట్ల రక్షకులను రంగంలోకి దింపుతోంది. ఓటరు జాబితాలను పరిశీలించి ఓటు చేర్పు, తొలగింపుల్లో గుర్తించిన అక్రమాలను 'ఓట్ల రక్షకులు' ఈసీ దృష్టికి తీసుకెళతారు. ఇందుకు అవసరమైన శిక్షణను వీరికి కాంగ్రెస్ ఇస్తుంది. ఈ మొత్తం కార్యక్రమాన్ని కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంక వాద్రా పర్యవేక్షిస్తున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఓట్ల రక్షకుల తుది జాబితా ఖరారు, వారికి శిక్షణ ఆమె ఆధ్వర్యంలో చేపడుతున్నట్టు సమాచారం. ఈ కార్యక్రమంలో భాగంగా.. ప్రయోగాత్మకంగా తొలుత ఐదు లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో వీరిని నియమిస్తారు. గత లోక్‌సభ ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయిన రాజస్థాన్ రూరల్, ఆల్వార్ (రాజస్థాన్); కాంకేర్ (ఛత్తీస్‌గఢ్), మొరేనా(మధ్యప్రదేశ్), బాన్స్‌గావ్(యూపీ)లను ఇందుకోసం ఎంపిక చేశారు. ఇరవై పోలింగ్ కేంద్రాలకు ఒకరి చొప్పున ఒక లోక్‌సభ పరిధిలో 100 మందిని నియమిస్తారు. గత ఎన్నికల్లో పోటీచేసి ఓడిన కాంగ్రెస్ అభ్యర్థి సమక్షంలోనే శిక్షణా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఆ తర్వాత 20వేలు కంటే తక్కువ ఓట్ల తేడాతో కోల్పోయిన మరో ఐదు స్థానాలను ఎంపిక చేయనున్నారు. కాగా, సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌పై రాహుల్‌గాంధీ మరోసారి విరుచుకుపడ్డారు. కర్ణాటకలోని అలంద్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఓట్లచోరీ వ్యవహారంలో సీఐడీ అడిగిన ఆధారాలను ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. అలంద్‌లో ఓటరు జాబితానుంచి కొందరి పేర్లు ఈసీ తొలగించిందనేది తేలిపోయిందని రాహుల్ వ్యాఖ్యానించారు.

మిగ్ శకం ముగిసే వేళాయె!

» మిగ్-21 ఫైటర్ జెట్ల సేవలకు రేపే వీడ్కోలు



చండీగఢ్, సెప్టెంబరు 24: భారత వాయుసేన (ఐఏఎఫ్)లో ఓ చారిత్రక అధ్యయనానికి తెరపడనుంది. ఆరు దశాబ్దాలకు పైగా భారత గగనతల రక్షణకు వెన్నుదన్నుగా నిలిచిన మిగ్-21 సేవలకు వీడ్కోలు పలికే సమయం ఆసన్నమైంది. రష్యాకు చెందిన దిగ్గజ మిగ్-21 ఫైటర్ జెట్లు శుక్రవారం చండీగఢ్ ఎయిర్ బేస్‌లో జరిగే డీకమిషన్ కార్యక్రమంలో వాయుసేన నుంచి గౌరవంగా రిటైర్ కానున్నాయి. ఐఏఎఫ్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ వీటికి ఘనంగా వీడ్కోలు పలకనున్నారు. 'పాంథర్స్' అనే మారుపేరుతో పిలిచే 23వ స్క్వాడ్రన్‌కు చెందిన చివరి మిగ్-21 బైసన్ యుద్ధ విమానంలో చివరిసారిగా ప్రయాణించి 'బాదల్-3' అనే కాల్‌సైన్‌తో వీడ్కోలు పలుకుతారు. మిగ్-21 యుద్ధ విమానం 1963లో తొలిసారిగా భారత్‌లో అడుగుపెట్టింది కూడా ఈ ఎయిర్‌ఫోర్స్ కేంద్రంలోనే. అప్పట్లో వింగ్ కమాండర్ దిల్బాగ్ సింగ్ దీనికి నాయకత్వం వహించారు. ఆ తర్వాత 1981లో ఆయన ఎయిర్ చీఫ్ మార్షల్ స్థాయికి ఎదిగారు. ఆరు దశాబ్దాలపాటు సేవలందించిన మిగ్-21ల వీడ్కోలుపై ఐఏఎఫ్ ఎక్స్‌లో ట్వీట్ చేసింది. 'ఆరు దశాబ్దాల సేవ.. లెక్కలేనన్ని ధైర్యసాహసాల కథలు.. ఒక దేశ ఆత్మగౌరవాన్ని గగతనలంలో మోసిన సమరాశ్వం' అని ట్వీట్ చేసింది. శుక్రవారం జరిగే ఫ్లైపాస్ట్ వేడుకలో పాల్గొనే 23వ స్క్వాడ్రన్‌కు చెందిన ఆరు మిగ్-21 జెట్లు ల్యాండింగ్ అయిన తర్వాత వాటికి జల ఫిరంగులతో అభివాదం చేస్తారు.

నీట్‌లో 1475వ ర్యాంకు.. కాలేజీలో చేరాల్సిన రోజే యువకుడి ఆత్మహత్య!

ఎంబీబీఎస్ ఇష్టం లేదని సూసైడ్ నోట్.. మహారాష్ట్రలో ఘటన

ముంబై, సెప్టెంబరు 24: తమ బిడ్డడు ఇక వైద్యవిద్యలో చేరనున్నాడనే సంబురం ఆ తల్లిదండ్రుల్లో క్షణాల్లోనే మాయమై తీరని విషాదం మిగిలింది. ఎంబీబీఎస్ చదివేందుకు కాలేజీలో ప్రవేశం పొందాల్సిన రోజే ఆ అబ్బాయి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లాలో ఈ ఘటన జరిగింది. మృతుడు 19 ఏళ్ల అనురాగ్ అనిల్ బోర్కర్. నవార్‌గావ్ గ్రామానికి చెందిన అనురాగ్, నీట్ (అండర్ గ్రాడ్యుయేట్)లో 99.99 పర్సంటైల్ సాధించాడు. జాతీయ స్థాయిలో 1475వ ర్యాంకు వచ్చింది. కౌన్సెలింగ్‌లో యూపీలోని గోరఖ్‌పూర్ కాలేజీలో సీటొచ్చింది. అక్కడికి వెళ్లేందుకు లగేజీతో సిద్ధమైన అనురాగ్, ఇంట్లోనే ఓ గదిలో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఘటనా స్థలిలో పోలీసులకు సూసైడ్ నోట్ లభ్యమైంది. అందులో అనురాగ్ ఏం రాశాడన్న విషయాన్ని పోలీసులు వెల్లడించలేదు. అయితే.. తనకు వైద్య విద్య చదవడం గానీ, డాక్టర్ అవ్వడం గానీ ఇష్టం లేదని ఆ నోట్‌లో అనురాగ్ రాసినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి.

ఆరేళ్లలోపు పిల్లలను తాత్కాలిక సంరక్షణకు తీసుకోరాదు: కేంద్రం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 24: అనాథ పిల్లలను తాత్కాలిక సంరక్షణకు స్వీకరించేందుకు సంబంధించిన నిబంధనలపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. ఆరేళ్లలోపు పిల్లలను తాత్కాలిక సంరక్షణ (ఫోస్టర్ కేర్)కు స్వీకరించకూడదని తెలిపింది. తాత్కాలిక సంరక్షణ విషయమై జువెనైల్ జస్టిస్ రూల్స్‌లోని నిబంధన నెంబరు 23(3), తాత్కాలిక సంరక్షణ మార్గదర్శకాల్లోని పాయింట్ నెంబరు 4(1)కి రకరకాలుగా భాష్యాలు చెబుతున్న నేపథ్యంలో ఈ స్పష్టతనిచ్చింది. ఏయే సందర్భాల్లో పిల్లలను తాత్కాలిక సంరక్షణకు స్వీకరించవచ్చో అన్నదాన్ని జువెనైల్ జస్టిస్ చట్టంలోని రూల్ నెంబరు 44లో వివరించారని, వాటిని పాటిస్తూ ఆరేళ్లు, అంతకుపైబడ్డ వయసు ఉన్నవారినే స్వీకరించాల్సి ఉంటుందని తెలిపింది. ఈ మేరకు దత్తత వ్యవహారాలను పర్యవేక్షించే సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ (కారా) రాష్ట్ర, జిల్లా స్థాయి సంస్థలకు సమాచారం పంపించింది. మరోవైపు, తప్పిపోయిన పిల్లలను గుర్తించేందుకు, అందుకు సంబంధించిన కేసులను దర్యాప్తు చేసేందుకు ప్రత్యేకంగా ఆన్‌లైన్ పోర్టల్‌ను రూపొందించాలని బుధవారం సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి సూచించింది.

మతమార్పిడి అక్రమమైతే పెళ్లి చెల్లదు

» అలహాబాద్ హైకోర్టు తీర్పు

ప్రయాగ్‌రాజ్, సెప్టెంబరు 24: మతమార్పిడి చట్టవిరుద్ధమని తేలినప్పుడు దాని ఆధారంగా జరిగే వివాహం కూడా ఆటోమేటిక్‌గా రద్దవుతుందని అలహాబాద్ హైకోర్టు తీర్పు చెప్పింది. చట్టం దృష్టిలో వారు వివాహితులు కారని తెలిపింది. ముస్లిం మతానికి చెందిన మహమ్మద్ బిన్ కాసీం అలియాస్ అక్బర్, హిందూ మతానికి చెందిన జైనాబ్ పర్వీన్ అలియాస్ చంద్రకాంతల వివాహం విషయంలో కోర్టు ఈ తీర్పునిచ్చింది. చంద్రకాంత మతం మారినట్టు దొంగ సర్టిఫికెట్లు సమర్పించారని ఆమె తల్లిదండ్రులు పిటిషన్ సమర్పించగా, తమ వివాహంలో ఇతరులు జోక్యం చేసుకోకూడదంటూ కాసీం వేసిన మరో పిటిషన్ వేశారు. ఈ రెండింటిపై న్యాయమూర్తి విచారణ జరిపారు. చంద్రకాంత ముస్లిం మతంలోకి మారినట్టు ఖాన్‌కారే ఆలియా అరిఫీయా సంస్థ ఫిబ్రవరి 22న సర్టిఫికెట్ ఇచ్చింది. దాన్ని ఆధారం చేసుకొని మే 26న ముస్లిం చట్టాల ప్రకారం వివాహం జరిపించినట్టు క్వాజీ ధ్రువపత్రం ఇచ్చారు. మతమార్పిడి జరిగినట్టు ఇచ్చిన సర్టిఫికెట్ నకిలీదని ఆమె తల్లిదండ్రులు ఆరోపించారు. ఆ ఆరోపణ సరైనదేనని, తాము ఎలాంటి సర్టిఫికెట్ ఇవ్వలేదని ఆ సంస్థ కార్యదర్శి తెలిపారు. దీన్ని పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి వివాహం చెల్లదని ప్రకటించారు. అయితే వారు ప్రత్యేక వివాహం చట్టం కింద పెళ్లిని రిజిస్టర్ చేసుకోవచ్చని, దాని ప్రకారమయితే మత మార్పిడి సమస్య తలెత్తదని సూచించారు.

భారతీయ చట్టాలను పాటించాల్సిందే

» 'ఎక్స్'కు స్పష్టం చేసిన కర్ణాటక హైకోర్టు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 24: భారతదేశ చట్టాలను పాటించాల్సిందేనని సోషల్ మీడియా సంస్థ 'ఎక్స్'కు కర్ణాటక హైకోర్టు తేల్చి చెప్పింది. ఆర్టికల్ 19 ప్రకారం వాక్ స్వాతంత్య్రానికి సంబంధించి రాజ్యాంగ రక్షణ భారతీయులకు మాత్రమే ఉంటుందని, విదేశీయులకు కాదని స్పష్టం చేసింది. కొన్ని ఖాతాలను, పోస్టులను బ్లాక్ చేయాలంటూ కేంద్రం ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ ఎక్స్ దాఖలు చేసిన పిటిషన్లను కోర్టు బుధవారం కొట్టివేసింది. ఈ సందర్భంగా సోషల్ మీడియా సంస్థలపై ధర్మాసనం పలు వ్యాఖ్యలు చేసింది. ప్రస్తుత తరుణంలో వాటిపై నియంత్రణ అవసరమని పేర్కొంది. పర్యవేక్షణ లేకుండా ఆ సంస్థలను దేశంలో అనుమతించకూడదని స్పష్టం చేసింది. అమెరికా న్యాయ శాస్త్రాలను ఇక్కడికి బదిలీ చేయలేమని, యూఎస్ చట్టాలను పాటిస్తున్న ఎక్స్ ఇక్కడ నిరాకరిస్తోందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. టెక్నాలజీ రోజురోజుకు మారుతున్న నేపథ్యంలో నియంత్రణ కూడా అవసరం అని అభిప్రాయపడింది. దేశ చట్టాల నుంచి ఏ సామాజిక మాధ్యమం కూడా మినహాయింపు పొందలేదంది.

ఓటు తొలగింపునకు ఈ-వెరిఫికేషన్ తప్పనిసరి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 24: ఓటర్ల జాబితా నుంచి ఓటు తొలగింపు ప్రక్రియ దుర్వినియోగం కాకుండా కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. గతంలో, ఓటర్ ఐడీకి జత చేయబడిన మొబైల్‌కు ఓటీపీ పంపించడం ద్వారా ఓటును తొలగించడానికి అవకాశం ఉండేది. తాజా మార్పుతో ఈసీ వెబ్‌సైట్ లేదా యాప్‌లో ఓటు తొలగింపునకు ఫాం 7, కొత్త ఓటు కోసం ఫాం 6 దరఖాస్తు చేసినపుడు పాప్ అప్ వస్తుంది. అది ఆధార్ వెరిఫికేషన్‌కు సూచనలు చేస్తుంది. అది పూర్తయిన తరువాత మాత్రమే తిరిగి ఈసీ వెబ్‌సైట్ లేదా యాప్‌లో దరఖాస్తు స్వీకరణ పూర్తి అవుతుంది. కర్ణాటకలోని ఆళంద అసెంబ్లీ నియోజకవర్గంలో ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపణలు చేయడానికి చాలా ముందుగానే... ఈ ఏడాది జూలై - ఆగస్టు నెలల్లోనే ఆ మేరకు సాంకేతిక మార్పులు చేసినట్లు ఈసీ వర్గాలు వెల్లడించాయి. ఈ మార్పు రాహుల్ ఆరోపణలకు స్పందన ఎంత మాత్రం కాదని ఈసీ స్పష్టం చేసింది. 'ఆళందలో ఓట్ల తొలగింపునకు 6,018 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో అందాయి. పరిశీలన అనంతరం కేవలం 24 మాత్రమే సరైనవని, మిగిలిన 5,994 దరఖాస్తులు తప్పుడివని తేలింది. వాటిని తిరస్కరించాం' అని ఈసీ పేర్కొంది.

రైల్వే ఉద్యోగులకు బోనస్

» ఒక్కో ఉద్యోగికి గరిష్ఠంగా రూ.17,951

» 10.91 లక్షల మందికి ప్రయోజనం



న్యూఢిల్లీ, సెప్టెంబరు 24: రైల్వే ఉద్యోగులకు ఉత్పాదకత ఆధారిత బోనస్‌ను కేంద్రప్రభుత్వం ప్రకటించింది. ఇది ఒక్కో ఉద్యోగికి గరిష్ఠంగా రూ.17,951 వరకు ఉంటుందని తెలిపింది. దీని వల్ల 10,91,146 మంది ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనం చేకూరనుంది. బుధవారం ప్రధాని మోదీ అధ్యక్షతన సమావేశమైన ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ.. రైల్వే ఉద్యోగుల బోనస్‌కు ఆమోద ముద్ర వేసింది. ఏటా దసరా పండగ వేళ ఉత్పాదకత ఆధారిత బోనస్‌ను రైల్వే ఉద్యోగులకు కేంద్రం ప్రకటిస్తోంది. 2024-25లో రైల్వే ఉద్యోగుల పనితీరు చాలా బాగుందని, 1614.9 మెట్రిక్ టన్నుల సరుకు రవాణా జరిగిందని, 730 కోట్ల మంది ప్రయాణికులు రైల్వేలో ప్రయాణించారని ఒక ప్రకటనలో కేంద్రం తెలిపింది. సముద్ర వాణిజ్యరంగానికి పెద్ద పీట వేస్తూ నౌకల తయారీ, మౌలిక సదుపాయాల పెంపుదలకు రూ.69,725 కోట్ల భారీ ప్యాకేజీకి కేంద్ర క్యాబినెట్ అంగీకరించింది. దీనివల్ల 45 లక్షల టన్నుల నౌకా నిర్మాణ సామర్థ్యం సమకూరుతుందని, ఈ రంగంలోకి రూ.4.5 లక్షల కోట్ల పెట్టుబడులు తరలివస్తాయని, ఫలితంగా కొత్తగా దాదాపు 30 లక్షల ఉద్యోగాల కల్పన జరుగుతుందని కేంద్రం ఒక ప్రకటనలో వెల్లడించింది. మరోవైపు, దేశంలోని ఉన్నత విద్యాసంస్థల్లో పరిశోధనలను ప్రోత్సహించే లక్ష్యంతో డాక్టోరల్, పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్‌లకు రూ.2,277 కోట్లను కేటాయించే పథకానికి క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. ఎన్నికలు జరగనున్న బిహార్‌లో రూ.2,192 కోట్ల వ్యయంతో 104 కి.మీ.ల సింగిల్ రైల్వే ట్రాక్‌ను డబ్లింగ్ చేసే ప్రాజెక్టుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దీంతోపాటు ఆ రాష్ట్రంలో రహదారుల విస్తరణకు రూ.3,822 కోట్ల మొత్తాన్ని కేటాయించింది.

ఝార్ఖండ్‌లో ఎన్‌కౌంటర్..

» ముగ్గురు మావోయిస్టుల మృతి

రాంచీ, సెప్టెంబరు 24: ఝార్ఖండ్ రాష్ట్రంలోని గుమ్లా జిల్లాలో భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. బుధవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో బిష్ణుపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారన్న సమాచారం అందడంతో భద్రతా బలగాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ నేపథ్యంలో బలగాలను చూసిన మావోయిస్టులు కాల్పులకు తెగబడ్డారు. ప్రతిదాడిగా బలగాలు ఎదురుకాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు చనిపోయారు. ఇదిలా ఉండగా, మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో ఆరుగురు నక్సలైట్లు బుధవారం పోలీసుల ఎదుట లొంగిపోయారు. వీరిలో ముగ్గురు మహిళలు కూడా ఉన్నారు. ఈ ఆరుగురిపై మొత్తం రూ.62 లక్షల రివార్డులు ఉన్నాయని డీజీపీ రష్మి శుక్లా తెలిపారు. లొంగిపోయిన వారిలో నార్త్ బస్తర్ డివిజనల్ కమిటీ సభ్యుడు భీమన్న అలియాస్ సుఖ్‌లాల్ ముత్తయ్య కుల్మేథే (58), అతడి భార్య విమలక్క సద్మేక్ (56) కూడా ఉన్నారు. వీరిద్దరిపై రూ. 16 లక్షల చొప్పున రివార్డు ఉంది.

భగ్గుమన్న లద్దాఖ్



లద్దాఖ్ కౌన్సిల్ సెక్రటేరియట్‌కు నిప్పు పెట్టిన ఆందోళనకారులు

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. ఈ హింసాత్మక ఘటనల్లో నలుగురు మరణించగా, 22 మంది పోలీసులు సహా 70 మందికిపైగా గాయపడినట్లు అధికారులు తెలిపారు. నిరసనలు హింసగా మారడంతో కేంద్ర ప్రభుత్వం లేహ్‌లో ఆంక్షలు విధించింది. నిరసనలు, ఎక్కువ మంది గుమిగూడడంపై తక్షణమే నిషేధం విధిస్తున్నట్లు ప్రకటించింది. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించే ఆర్టికల్ 370ని ఎన్డీయే ప్రభుత్వం 2019, ఆగస్టు 5న రద్దు చేసింది. ఆ రాష్ట్రాన్ని జమ్మూకశ్మీర్, లద్దాఖ్ కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించింది. ఆ తర్వాత జమ్మూకశ్మీరు, లద్దాఖ్‌లకు రాష్ట్ర హోదా కల్పించాలన్న డిమాండ్లు వచ్చాయి. లద్దాఖ్‌ను రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్ పరిధిలో చేర్చాలని స్థానికులు ఆందోళన చేస్తున్నారు. ఈ డిమాండ్లతో పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ నేతృత్వంలో 15 మంది నిరాహార దీక్ష ప్రారంభించారు. వారిలో ఇద్దరి ఆరోగ్యం క్షీణించడంతో బలవంతంగా ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో వాంగ్‌చుక్ మంగళవారం తన నిరశనను విరమించారు. హింసకు పాల్పడవద్దని ఆందోళనకారులకు విజ్ఞప్తి చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో 'లేహ్ అపెక్స్ బాడీ (ఎల్ఏబీ)'కి చెందిన యువజన విభాగం ఆందోళనలకు పిలుపునిచ్చింది. బుధవారం కొందరు నిరసనకారులు పోలీసులపైకి రాళ్లు విసరడంతో హింస మొదలైంది. నిరసనకారులు బీజేపీ కార్యాలయానికి, సెక్రటేరియట్ భవనానికి నిప్పు పెట్టారు. ప్రజల డిమాండ్లపై చర్చించేందుకు అక్టోబరు 6న సమావేశానికి రావాలంటూ కేంద్రం లద్దాఖ్ ప్రతినిధులను ఆహ్వానించిన సమయంలో ఈ హింస చోటుచేసుకోవడం గమనార్హం. కాగా, లద్దాఖ్‌లో హింసకు కారణం పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ అని కేంద్ర హోం శాఖ ఆరోపించింది. "అరబ్ ప్రజాస్వామ్య ఉద్యమాలు, నేపాల్‌లో జెన్-జీ ఉద్యమాలను ప్రస్తావిస్తూ వాంగ్‌చుక్ రెచ్చగొట్టే ప్రకటనలు చేశారు. ఆ ప్రకటనలతో రెచ్చిపోయిన అల్లరిమూకలు హింసకు పాల్పడ్డారు" అని పేర్కొంది.

రాజ్యాంగ భద్రతల కోసం..!

కేంద్ర ప్రభుత్వ ప్రత్యక్ష పాలనను లద్దాఖ్ ప్రజలు మూడేళ్లుగా నిరసిస్తున్నారు. తమ భూమి, సంస్కృతి, వనరుల పరిరక్షణ కోసం రాజ్యాంగ భద్రత ఉండాలని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర హోదాతో పాటు లద్దాఖ్‌ను ఆరో షెడ్యూల్‌లో చేర్చాలని కోరుతున్నారు. అలాగే లేహ్, కార్గిల్‌కు వేర్వేరు లోక్‌సభ స్థానాలు ఉండాలని, లద్దాఖ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కూడా డిమాండ్ చేస్తున్నారు. వాంగ్‌చుక్ పదేపదే నిరాహార దీక్షలకు దిగడంతో లద్దాఖ్ ప్రజల ఉద్యమం వెలుగులోకి వచ్చింది. తాజాగా ఆయన ఈ నెల 10 నుంచి 35 రోజుల పాటు నిరాహార దీక్ష చేస్తానని ప్రకటించారు. కానీ, ఆందోళనలు హింసాత్మకం కావడంతో మంగళవారం దీక్షను విరమించారు.

తొలగించిన ఉద్యోగులకు మళ్లీ డిమాండ్!

» హెచ్-1బీ వీసా ఫీజు భారీ పెంపుతో మారిన పరిణామాలు

వాషింగ్టన్, సెప్టెంబరు 24: ఒకరి సంక్షోభం మరొకరికి అవకాశం. ఇది ప్రకృతి చేసే న్యాయం. హెచ్-1బీ వీసా ఫీజు పెంపు విషయంలోనూ అదే జరగబోతోంది. టెక్ కంపెనీలకు పెనుభారంగా మారనున్న ఈ నిర్ణయం.. ఇప్పటికే ఆ వీసాను కలిగి ఉండి, ఉద్యోగాలు పోగొట్టుకున్న వారికి వరంగా మారనుంది. అదెలా అంటే.. కృత్రిమ మేధ అందుబాటులోకి రావడంతో వ్యయ నియంత్రణలో భాగంగా ఒరాకిల్, ఇంటెల్, మైక్రోసాఫ్ట్, ఏడబ్ల్యూఎస్ తదితర టెక్ దిగ్గజ సంస్థలు ఇటీవలికాలంలో చాలా మంది ఉద్యోగులను తొలగించిన సంగతి తెలిసిందే. కొత్త వీసా దరఖాస్తులకు లక్ష డాలర్ల ఫీజు చెల్లించడం కన్నా.. తీసేసిన పాత ఉద్యోగులనే మళ్లీ కొలువుల్లోకి తీసుకుందామనే నిర్ణయానికి ఆయా కంపెనీలు వస్తున్నాయి. గణాంకాలు చూస్తే.. 2025 జనవరి నుంచి ఇప్పటిదాకా టెక్ కంపెనీలు 1,44,926 మందిని తొలగించాయి. వ్యయనియంత్రణ పేరుతోనో.. కృత్రిమ మేధ కారణంగానో.. 2024లో తొలగించిన ఉద్యోగుల సంఖ్య ఏకంగా 2,38,461 కావడం గమనార్హం. హెచ్-1బీ వీసా కలిగి ఉండి ఇలా కంపెనీల నిర్ణయాల కారణంగా ఉద్యోగాలు కోల్పోయినవారికి ఆ వీసా స్టేటస్ 60 రోజులపాటు యాక్టివ్‌గానే ఉంటుంది. ఆలోగా వారు వేరే కంపెనీల్లో ఉద్యోగాలు చూసుకోవడానికే ఆ వెసులుబాటు. అలా ఇటీవలికాలంలో ఉద్యోగాన్ని కోల్పోయినవారిలో చాలా మందికి.. తమ వద్ద చేరాలంటూ త్వరలోనే కంపెనీల నుంచి ఫోన్ కాల్స్ వచ్చే అవకాశం ఉందని అమెరికాలోని ఇమిగ్రేషన్ లా ఫర్మ్ 'చగ్ ఎల్ఎల్‌సీ' న్యాయవాది నవనీత్ ఎస్ చగ్ తెలిపారు. వారికి హెచ్-1బీ వీసా ఉన్నందున.. మళ్లీ లాటరీలోకి వెళ్లాల్సిన అవసరం ఉండదు. సాధారణ ట్రాన్స్‌ఫర్ పిటిషన్ ద్వారా తమ కంపెనీలోకి తీసుకోవచ్చు. ఇన్ని ప్రయోజనాలు ఉండడంతో కంపెనీల దృష్టి అలాంటి ఉద్యోగులపై పడింది.

మా దేశానికి రండి: జర్మనీ

నిపుణులైన భారతీయ టెకీలకు అమెరికా తన ద్వారాలు మూసేస్తుంటే.. వరుసగా ఇతర దేశాల నుంచి ఆఫర్లు వస్తున్నాయి. ఇటీవల చైనా మన టెకీలకు ఆహ్వానం పలకగా.. తాజాగా జర్మనీ భారతీయ ప్రతిభకు తలుపులు తెరిచింది. "స్థిరమైన వలస విధానాలు, ఐటీ, మేనేజ్‌మెంట్, టెక్నాలజీ, సైన్స్ రంగాల్లో ఇండియన్లకు గొప్ప ఉద్యోగావకాశాలతో జర్మనీ ప్రత్యేకంగా నిలుస్తోంది.. అత్యంత నిపుణులైన భారతీయులకు ఇదే నా పిలుపు" అంటూ భారత్‌లో జర్మనీ రాయబారి ఫిలిప్ అకర్‌మాన్ 'ఎక్స్' ద్వారా పిలుపునిచ్చారు. జర్మనీలో స్థానికుల కన్నా అక్కడ పనిచేస్తున్న భారతీయుల సగటు సంపాదనే ఎక్కువగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

ఏటీఎంల నుంచి పీఎఫ్ సొమ్ము

2026 జనవరి నుంచి అందుబాటులోకి సౌకర్యం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 24: ఈపీఎఫ్ఓ చందాదారులు జనవరి 2026 నుంచి తమ ఖాతా నుంచి నగదును ఏటీఎంల నుంచి విత్‌డ్రా చేసుకోవచ్చు. అందుకోసం సంస్థ తన ఖాతాదారులకు ఏటీఎం కార్డు మాదిరి కార్డును జారీ చేస్తుంది. అందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని సంస్థ ఇప్పటికే సమకూర్చుకుంది. అయితే ఖాతాదారుడు భవిష్యనిధి నుంచి ఎంత వరకూ డబ్బులు విత్ డ్రా చేసుకోవచ్చన్న అంశాన్ని సంస్థ ట్రస్టీల కేంద్ర బోర్డు(సీబీటీ) సమావేశం చర్చించి నిర్ణయించాల్సి ఉంటుంది. ఈ సమావేశం అక్టోబరు రెండవ వారంలో జరగాల్సి ఉంది. ప్రస్తుతం ఈపీఎఫ్ఓకు 7.8 కోట్ల మంది ఖాతాదారులు ఉండగా..రూ.28లక్షల కోట్ల కార్పస్‌ఫండ్ సంస్థ వద్ద ఉంది.

సాహితీవేత్త బైరప్ప కన్నుమూత



బెంగళూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కన్నడ సాహితీవేత్త ఎస్ఎల్ బైరప్ప(94) బుధవారం కన్నుమూశారు. ఆయన హాసన్ జిల్లా చన్నరాయపట్టణలో 1931, ఆగస్టు 30న జన్మించారు. తన రచనల ద్వారా ఎంతోమంది అభిమానులను సంపాదించుకున్నారు. ఆయన రాసిన 'తంతు' నవలకు భారతీయ భాషా పరిషత్ పురస్కారం లభించింది. 'దాటు' నవలకు 1975లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం దక్కింది. 2010లో మంద్ర నవలకు సరస్వతి సమ్మాన్ పురస్కారం లభించింది. సరస్వతీ సమ్మాన్ పురస్కారం పొందిన తొలి కన్నడిగుడిగా ఆయన గుర్తింపు పొందారు. బైరప్ప 2023లో పద్మభూషణ్ పురస్కారం అందుకున్నారు.


దసరా శుభాకాంక్షలు
LED TV's, Air Conditioners లపై తగ్గించిన 18% GST తో కొనుగోలుచేయండి,
దానిపైన దసరా ప్రత్యేక తగ్గింపు
సోనోవిజన్ దసరా సేల్
6% పైన అదనపు డిస్కౌంట్ లభించే స్క్రాచ్ కార్డ్ స్కీమ్
ప్రతి ₹2000/- కొనుగోలుతో స్క్రాచ్ కార్డ్ పొందండి
₹100/- నుండి ₹1,00,000/- వరకు తక్షణ నగదు బహుమతి అందుకోండి.
(సెలెక్టెడ్ మోడల్స్ పై)
Festive DHAMAKA OFFERS
HDB FINANCIAL SERVICES
Upto 25000 క్యాష్‌బ్యాక్
క్రెడిట్ కార్డ్ & డెబిట్ కార్డ్ ఇ.యం.ఐ. కొనుగోలుదారులకు, సెలెక్టెడ్ మోడల్స్‌పై, షరతులు వర్తిస్తాయి.
IDFC FIRST Bank
Upto 30000 క్యాష్‌బ్యాక్
కాంపిటేటర్ కొనుగోలుదారులకు, ఎగ్జిస్టింగ్ కొనుగోలుదారులకు, క్రెడిట్ కార్డ్ కొనుగోలుదారులకు, సెలెక్టెడ్ మోడల్స్‌పై, షరతులు వర్తిస్తాయి.
BAJAJ FINSERV
Upto 15000 క్యాష్‌బ్యాక్
బజాజ్ ఫైనాన్స్ ఇ.యం.ఐ. కొనుగోలుదారులకు, సెలెక్టెడ్ మోడల్స్‌పై, షరతులు వర్తిస్తాయి.
1 EMI FREE
క్రెడిట్ కార్డ్ కొనుగోలుదారులకు, సెలెక్టెడ్ మోడల్స్‌పై, షరతులు వర్తిస్తాయి.
HDFC BANK
ICICI Bank
SBI
AXIS BANK
స్క్రాచ్ కార్డ్ పెద్ద మొత్తంలో గెలుచుకొన్న కొనుగోలుదారులు, అందరికి అభినందనలు
రూ. 1,00,000/- విజేత
శ్రీ పన్నాల అనిరుధ్ గారు
బొటానికల్ గార్డెన్, హైదరాబాద్.
7674076393
రూ. 1,00,000/- విజేత
శ్రీ ఆర్. సంతోష్ శివకుమార్ గారు
సాగర్ నగర్, విశాఖపట్నం.
6302643557
రూ. 1,00,000/- విజేత
శ్రీమతి ఎ. హేమలత గారు
కింగ్స్ కోర్ట్, నెల్లూరు.
9849072387
రూ. 1,00,000/- విజేత
శ్రీ పి. శ్రీనివాస్ గారు
సీతమ్మధార, విశాఖపట్నం.
9177701617
రూ. 1,00,000/- విజేత
శ్రీమతి యన్. సింధుచౌదరి గారు
నెహ్రూ నగర్, ఖమ్మం.
7799756667
రూ. 50,000/- విజేత
శ్రీ హర్ష రామినేని గారు
క్రాంతినగర్, జీవకోన, తిరుపతి.
8099084808
రూ. 50,000/- విజేత
శ్రీమతి యం. హేమ గారు
బైపాస్ రోడ్, మంగళగిరి.
8885343511
రూ. 50,000/- విజేత
శ్రీ కె.యల్. రాజు గారు
బాలానగర్, హైదరాబాద్.
6363264879
రూ. 50,000/- విజేత
శ్రీ డి. కృష్ణ గారు
అంకన్నగూడెం, ఖమ్మం.
9704985364
రూ. 50,000/- విజేత
శ్రీమతి చంద్రకళ గారు
రాజం, విజయనగరం.
9000381313
రూ. 50,000/- విజేత
శ్రీ కె. జానయ్య గారు
శ్రీరామ్ నగర్, సూర్యాపేట.
9440480192
రూ. 50,000/- విజేత
శ్రీ డి. ప్రదీప్ కుమార్ గారు
బ్రాడిపేట, గుంటూరు.
9032741186
రూ. 50,000/- విజేత
శ్రీ సి. రాంభద్రి రాజు గారు
అల్లూరి సీతారామరాజు రోడ్, భీమవరం.
8294877789
రూ. 50,000/- విజేత
శ్రీ టి. మహేశ్ రెడ్డి గారు
కుంచనపల్లి, తాడేపల్లి.
9705566922
రూ. 25,000/- విజేత
శ్రీ యం. భాస్కర్ గారు
వకలపూడి, కాకినాడ.
9704985364
రూ. 25,000/- విజేత
శ్రీ ఆర్ అభిషేక్ గారు
పాత అల్వాల్, సికింద్రబాద్
9959097504
అన్ని పెద్ద కంపెనీల నుండి గృహోపకరణాలు ఇంకా మొబైల్స్ & ల్యాప్‌టాప్స్‌లు 2025 లేటెస్ట్ మోడల్స్ అత్యంత విస్తృతశ్రేణిలో లభిస్తున్నాయి.
LG
Home Theatre
208 Cm (83") Ultra HD 4K OLED
139 Cm (55") Ultra HD 4K Smart
SAMSUNG
189 Cm (75") LED 4K Ultra UHD
SONY
164 Cm (65") LED 4K Ultra HD Smart
Panasonic
108 Cm (43") LED 4K HD
LLOYD
108 Cm (43") Ultra 4K Google LED
TCL
108 Cm (43") 4K Google LED
Haier
108 Cm (43") UHD Google LED
BPL
108 Cm (43") UHD 4K Smart LED
XIAOMI
108 Cm (43") UHD 4K Smart LED
iPhone
17, 17 Pro Upto 4000/- Cash Back
16 Pro, 16 Pro Max Upto 3000/- Cash Back
iPhone Air New Arrival
9/0, 12/0, 24/0 Schemes Available SBI, ICICI, Kotak Credit Cards and Selected Bank Cards (Exchange Bonus)
S-25 Ultra 5G Discount Upto 15000/- Conditions Apply
9/0, 12/0, 24/0 Schemes Available
SAMSUNG
A-36 5G
A-56 5G
Instant Discount Upto 3000/-
vivo
5G V-60
5G X-200, X-200FE
Pre Book Now
Upto 10% Cash Back 9/0, 10/2, 12/4 Schemes Available
oppo
5G F-31, F-31 Pro
5G Reno-14, 14 Pro
6/0, 7/0, 8/0, 11/2 Schemes Available
ONEPLUS
5G 13-S
CashBack 4500/- SBI, RBL Credit Card 12/4 Scheme Available
realme
5G 15 Pro
6/0, 8/2, 10/3 Schemes Available
Redmi
5G Note 14 & 15 Series
6/0, 8/0, 10/2, 12/4 Schemes Available
LG
5Star & 3Star Inverter A.C
LLOYD
5Star & 3Star Inverter A.C
BLUE STAR
5Star & 3Star Inverter A.C
VOLTAS
5Star & 3Star Inverter A.C
DAIKIN
5Star & 3Star Inverter A.C
HITACHI
5Star & 3Star Inverter A.C
Haier
5Star & 3Star Inverter A.C
Conditions Apply
Sonovision Dasara Sale Special Offers On Mobiles & Laptops
AMAZON PAY Upto 2000/- CASH BACK Conditions Apply
అందరికన్న తక్కువ ధరలు, నమ్మకమైన సర్వీస్‌తో అందరి అభిమానం పొందిన షోరూం సోనోవిజన్
మా నూతన ప్రారంభమైన షోరూం కు ఆహ్వానం : సోనోవిజన్, చాకలి బజార్ మెయిన్ రోడ్, ఎనికేపాడు, విజయవాడ. - 8712416250, 51, 52.
విజయవాడ, విజయప్లాజా, ఏలూరు రోడ్, విజయవాడ 9154281648, 649, 650.
విజయవాడ, ఏలూరు రోడ్, రామమందిరం దగ్గర. 9440804182, 9246666202
విజయవాడ, ప్రియదర్శిని థియేటర్ బిల్డింగ్, అరండల్‌పేట. 9246666664, 9100991701, 9440804184
విజయవాడ, యం.జి.రోడ్, ఆల్ ఇండియా రేడియో ఎదురు. 9246666203, 9154281640
విజయవాడ, పటమట, మోహన్‌దాస్ థియేటర్ దగ్గర. 9246661616, 9100991702
విజయవాడ, కంట్రోల్ రూమ్ దగ్గర, యం.జి.రోడ్ 9440804183, 9246666209
గొల్లపూడి, ఆంధ్రహాస్పిటల్ బిల్డింగ్. 8333924930, 9154281628
విజయవాడ, కానూరు, యం.జి.రోడ్. 8712600536, 8712600537,
శ్రీనగర్ కాలని, రింగ్ రోడ్డు, విజయవాడ. 8712600531, 32, 33
మెయిన్ రోడ్డు, చికిత్స హాస్పిటల్ దగ్గర, పాయకాపురం. విజయవాడ. ఫోన్ : 8712648704, 05, 06.
ఎనికేపాడు - 1, ఏలూరు రోడ్, విజయవాడ. 9100991703, 9154281626
పోరంకి, మెయిన్ రోడ్ సెంటర్. 9154281645, 46, 47
కనకదుర్గమ్మ వారధి దగ్గర, తాడేపల్లి. 7331149366, 367, 368
గుడివాడ, ఏలూరు రోడ్. 9154281178, 79
మచిలీపట్నం, కోనేరు సెంటర్, మునిసిపల్ పార్క్ ఎదురు. 7331149379, 80, 81

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ట్రంప్ నోట అదేమాట!

ఐక్యరాజ్యసమితిలో అమెరికా అధ్యక్షుడి ప్రసంగం కంటున్న, వింటున్న వారికి ఎదురుగా డోనాల్డ్ ట్రంప్ కాక ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూను చూస్తున్నట్టే ఉందట. పాలస్తీనా విషయంలో ట్రంప్ ఈ అంతర్జాతీయ వేదికమీద చేసిన వ్యాఖ్యలన్నీ ఇజ్రాయెల్ ప్రధాని స్వహస్తాలతో రాసిచ్చినట్టుగా ఉండటంలో ఆశ్చర్యమేమీ లేదు. అమెరికా అధ్యక్షుడు కాస్తంత ఎడంగా గాజా, పాలస్తీనాల విషయంలో ఆలోచనలు చేస్తున్నారన్న భ్రమలు ఎవరికైనా ఇంకా మిగిలివుంటే ఈ దెబ్బతో తొలిగిపోయినట్టే. దౌత్యానికీ, చర్చలకు, అవగాహనకు వేదికగా నిలవాల్సిన ఐక్యరాజ్యసమితిలో ఆయన ఓ చవుకబారు రాజకీయ ప్రసంగం చేశారు. పనిలోపనిగా సమితిని ఎందుకూ కొరగానిదంటూ తీవ్రంగా అవమానించాడు. పాలస్తీనాను స్వతంత్రదేశంగా గుర్తించిన 80శాతం సభ్యదేశాలను ఉగ్రవాదుల మద్దతుదారులుగా అభివర్ణించాడు. ఇజ్రాయెల్, పాలస్తీనాలు ఇరుగుపొరుగు దేశాలుగా సుహృద్భావంతో కొనసాగడమనే ఆలోచనే మహాపాపమని ఆయన తేల్చేశాక, మిగతా ప్రపంచం ఎంత గొంతుచించుకున్నా ప్రయోజనం ఉండకపోవచ్చు.

గాజా పూర్తిగా నేలమట్టమై, ఆకలికీ, ఆయుధాలకు డెబ్బైవేలమంది పాలస్తీనియన్లు ప్రాణాలు వదిలేసి, లక్షలాది మంది తరలిపోయిన తరువాత, ఇంతకాలమూ నోరుమెదపని దేశాలన్నీ ఇప్పుడు ఒక్కసారిగా స్వతంత్ర పాలస్తీనా వంటి పెద్దపెద్ద మాటలు మాట్లాడటం పాలస్తీనియన్లను అవమానించడమేనని అంటారు కొందరు. అమెరికా అధ్యక్షుడి ప్రసంగంలో గాజా ఊసులేదు, అక్కడ ఒక మారణకాండ సాగుతోందనీ, అది మరుభూమిగా మారిందన్న స్పృహే ఆయన భాషలో కనబడలేదు. నెతన్యాహూ మాదిరిగానే ట్రంప్ దృష్టిలో పాలస్తీనియన్లు అరాచకశక్తులు, విధ్వంసకారులు. వారి గురించి ఆలోచించడం, వారి ఉనికిని గుర్తించడమంటే ఆప్తమిత్ర ఇజ్రాయెల్‌కు ద్రోహం చేయడమే.

యూకే, ఫ్రాన్స్, కెనడా, ఆస్ట్రేలియా ఇత్యాది పెద్దదేశాలు సైతం ఐక్యరాజ్య సమితిలో పాలస్తీనాను అధికారికంగా గుర్తించడం వందేళ్ళ ఇజ్రాయెల్–పాలస్తీనా ఘర్షణలో చరిత్రాత్మకమైన మార్పుగానే చెప్పుకోవాలి. ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ సారథ్యంలో సాగుతున్న ఈ ప్రయత్నం దౌత్యం మాత్రమే హమాస్ మీద ఒత్తిడి పెంచుతుందని నమ్ముతోంది. గాజాలో యుద్ధం ముగించి, రెండు రాజ్యాల ఏర్పాటుతో శాంతి నెలకొంటుందని వీరి వాదన. అరబ్ దేశాలన్నీ హమాస్ నిరాయుధీకరణను, పాలస్తీనా అథారిటీకి ఆయుధాల అప్పగింతనూ గట్టిగా కోరుతున్నందున రెండేళ్ళకు పైగా సాగుతున్న యుద్ధాన్ని ఈ మార్గంలో ఆపవచ్చునని వాటి నమ్మకం. అయితే, అమెరికా మద్దతుతోనే పాలస్తీనా రాజ్యస్థాపన సాధ్యమవుతుందనీ, లేనిపక్షంలో అది పగటికలగా మిగిలిపోతుందనీ, గాజా పీడకల సజీవంగా కొనసాగుతుందని యూరప్ పెద్దలకు తెలియనిదేమీ కాదు. గాజా మారణకాండ అంతిమదశకు చేరుకున్న ఈ తరుణంలోనైనా అమెరికా అభీష్టానికి వ్యతిరేకంగా వ్యవహరించనిపక్షంలో యూరప్ పరువు పూర్తిగా మంటగలిసిపోతుందని వారి భయం. ఆచరణసాధ్యమేనా అన్న ప్రశ్నను అటుంచితే, రెండుదేశాల సిద్ధాంతాన్ని సజీవంగా ఉంచడానికి వీరి ప్రయత్నం ఉపకరిస్తుంది. అమెరికా మీద కాకున్నా, ఇజ్రాయెల్‌మీద ఒత్తిడి పెంచడానికి పనికొస్తుంది.

పాలస్తీనా దేశం ప్రస్తావన తెస్తే, గాజాకు పట్టిన గతే వెస్ట్‌బ్యాంక్ వంటి ఆక్రమిత భూభాగాలకు పడుతుందన్నది నెతన్యాహూ వ్యాఖ్యల సారాంశం. వెస్ట్‌బ్యాంక్‌ను పూర్తిగా ఆక్రమించుకొని రెండు దేశాల ఆలోచనకు పునాదిలోనే గండికొట్టేందుకు ఆయన సిద్ధంగా ఉన్నాడు. పాలస్తీనా ఊసుని మొత్తంగా చెరిపివేయడానికి ఆ ప్రాంతాల్లో గాజా తరహా ఊచకోతలకు కూడా ఆయన వెనుకాడడు. ఆ కర్తవ్య నిర్వహణలో తన అండదండలు సంపూర్ణంగా ఉంటాయన్నది ట్రంప్ ప్రసంగం సారాంశం. భద్రతామండలిలో మిగతా పద్నాలుగు దేశాలూ మరోవైపు ఉన్నప్పటికీ, వీటో ప్రయోగించి ఇజ్రాయెల్‌ను ఎప్పటికప్పుడు అమెరికా రక్షించుకు వస్తున్నది. ఇప్పుడు సర్వప్రతినిధి సభలోనూ స్వతంత్ర పాలస్తీనా విషయంలో అమెరికా, ఇజ్రాయెల్ ఏకమాటగా ఉన్నాయి. ఇజ్రాయెల్‌కు నిరంతరాయంగా సర్వశక్తులూ సమకూరుస్తూ పాలస్తీనియన్ల ఊచకోతలో తన చేయి కూడా ఉన్న అమెరికా అధ్యక్షుడు నోబెల్‌శాంతి గురించి వల్లిస్తూండటం ఆశ్చర్యం కలిగిస్తోంది.

‘విజయవాడ ఉత్సవ్’ కొంత ఆనందం, కొంత వెలితి!

రాష్ట్ర నడిగడ్డ నగరం, తెలుగు వారి గుండె చప్పుడు అయిన విజయవాడలో ‘విజయవాడ ఉత్సవాలు’ భారీ ఎత్తున ప్రారంభమయ్యాయి. ఇందుకు కారకులయిన ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అభినందనీయులు. కొన్ని ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థల ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరుగుతున్నాయి. ప్రపంచంలోనే భారీ ఉత్సవంగా నిర్వాహకులు చెపుతున్నారు. దాదాపు 280 ఈవెంట్స్ జరుగుతున్నట్లు ప్రకటనల ద్వారా తెలుస్తున్నది. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు, మంత్రి నారా లోకేశ్ ఈ వేడుకలను ప్రారంభించారు. వెంకయ్యానాయుడు మాట్లాడుతూ ‘ఉమ్మడి కృష్ణా–విజయవాడ’ ప్రాశస్త్యాన్ని చాలా గొప్పగా చెప్పారు.

విజయవాడ ప్రాశస్త్యం వర్తమానానికి సంబంధించినది కాదు. మహాభారతం వంటి ప్రాచీన ఇతిహాసాల్లో కూడా దీని ప్రస్తావన ఉంది. సామాన్య శకం (సా.శ.) మహాభారతం జరిగిందో లేదో అని చరిత్రకారులు మల్లగుల్లాలు పడుతున్నా, మహాభారత ఇతిహాసమైతే నిజం కదా! ఆ ఇతిహాసంలోని కథాకాలం సా.శ. పూర్వం 1500 సంవత్సరాలుగా చరిత్రకారులు చెపుతున్నారు. అనగా ఆ కాలంలోనే ఈ నగరం ఉందనేందుకు అందులో పేర్కొన్న ఇంద్రకీలాద్రి ఒక ఆధారం. అది పురాణ కథనుకున్నా, సా.శ. పూర్వ 300 నాటికి ముందు నుంచి గల చారిత్రక ప్రాంతం ఇది. తెల్‌వాహీ నది ఒడ్డున ఉన్న అంధ్రనగరి ధాన్యకటకం అని, విజయవాడ అని సంశయాలున్నా, మొత్తంగా అది ఈ ప్రాంతమే కదా! అమరావతి శిల్పాలు, చైత్యాలు, శాసనాలు, భట్టిప్రోలు లిపి, ఇక్కడి గుహలు (ఇంద్రకీలాద్రి, మొగల్రాజపురం, ఉండవల్లి, గుణదల, ముస్తాబాద, అంబాపురం) సా.శ. 3–6 శతాబ్దాల నాటివి. 7వ శతాబ్దిలో విష్ణుకుండిన శాసనాలు, అదే శతాబ్దంలో చైనా యాత్రికుడు యువాన్‌చాంగ్ రాతల్లోని ప్రస్తావనలు.. ఇవన్నీ ఈ నగర చారిత్రక ప్రాధాన్యతను తెలియజేస్తాయి. నదీ–సముద్ర మార్గాల సమీపాన ఉండటం వల్ల విజయవాడ పూర్వం నుంచి వాణిజ్య నగరం.

ఆధునిక కాలంలో.. బందర్ ద్వారా విదేశీయుల రాకతో ముందస్తుగా పాశ్చాత్య నాగరికతలను కూడా అందిపుచ్చుకున్న ప్రాంతం. అచ్చు యంత్రాలతో పుస్తకాలు, పత్రికల ముద్రణ, తద్వారా గ్రంథాలయోద్యమాలు అనేక సంస్కరణోద్యమాలు, హేతువాద ఉద్యమాలు, స్వేచ్ఛా ఉద్యమాలు, ఆపై రాజకీయోద్యమాలతో ఆధునిక కాలంలో రాజకీయ రాజధానిగా పేరుగాంచింది. తెలుగునాట స్వాతంత్ర్య పోరాట వేదిక ఇది. మహాత్మాగాంధీ ఈ నగరాన్ని



ఏడుసార్లు సందర్శించాడంటేనే దీని ప్రాధాన్యతను అర్థం చేసుకోవచ్చు. ఈ ప్రాంతం తెలంగాణ సాయుధ పోరాటానికి సమిధలిచ్చింది. స్వరాష్ట్రోద్యమానికి వేదికయింది. బ్రిటిష్ కాలం నుంచి జాతీయ రోడ్డు రైల్వే రవాణా మార్గాలకు ఇది దక్షిణాదిలోనే పెద్ద కూడలి. కూచిపూడి నాట్యం, కొండపల్లి బొమ్మ, నూజివీడు వీణలు వంటి కళా సంస్కృతుల వైభవం ఈ ప్రాంతం సొంతం.

అలాంటి ప్రాంతంలో ‘విజయవాడ ఉత్సవ్’ జరగడం ఎంత సంతోషదాయకమో, ఆ ప్రాశస్త్యాలకు సంబంధించిన ప్రదర్శనలు ఇందులో లేకపోవడం భారీ వెలితి. స్వాతంత్ర్యోద్యమ ఘట్టాల ప్రదర్శనలు లేవు. స్వరాష్ట్రోద్యమ కేంద్రం ఇది. పొట్టి శ్రీరాములు గుడివాడ గాంధీ ఆశ్రమంలోనే ఉంటూ చెన్నై వెళ్లి నిరాహారదీక్ష చేసి అసువులు బాశారు. గాంధీ హిల్ వంటి స్వాతంత్ర్యోద్యమ ప్రాంతాల సందర్శనలు లేవు. విశ్వనాథ, చలం, జాషువా, వంటివారున్న ఈ ప్రాంత భాషా సాహిత్య ప్రాశస్త్యాల ప్రదర్శనలు లేవు. పుస్తకాల ప్రదర్శనలు లేవు. ఇక్కడి విజయవాడ బుక్ సొసైటీని సంప్రదించినట్లు కూడా సమాచారం లేదు. ఇక్కడికే ప్రత్యేకమయిన పెడన కలంకారీ, మంగళగిరి చేనేత, నూజివీడు–జగ్గయ్యపేట వీణలు, కొండపల్లి బొమ్మలు వంటి వస్తు కళా ప్రదర్శనలు లేవు. కొండపల్లి, కొండవీడు కోటలు, కొల్లేరు సరస్సు, భవానీ ద్వీపం, మంగళగిరి, ఆగిరిపల్లి, యనమలకుదురు గుడులు, అమరావతి, భట్టిప్రోలు, ఘంటసాల, బ్రహ్మలింగం చెరువు వంటి సందర్శనలు లేవు.

తెలుగు పత్రికలు పుట్టిందీ పెరిగిందీ ఇక్కడే. కృష్ణా పత్రిక, ప్రజాశక్తి, విశాలాంధ్ర, ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక, ఆంధ్రజ్యోతి వంటి ఎన్నో పత్రికల పాదు ఇది. తెలుగు నాటకం విస్తరించింది ఇక్కడ. దుర్గాకళామందిరం వంటి నాటకశాలలు ఆనాడే పదుల సంఖ్యలో వెలిశాయి. తెలుగు సినిమా పుట్టిందీ, పెరిగిందీ ఇక్కడ. వేటూరి వంటి దిగ్గజ రచయితలు, గూడవల్లి, రాఘవేంద్రరావు వంటి దర్శకులు, చల్లపల్లి జమిందారు, అశ్వనీదత్ వంటి నిర్మాతలు, ఎన్టీయార్, ఎయన్నార్, ఎస్వీయార్, సావిత్రి వంటి నటులు, ఘంటసాల వంటి సంగీతజ్ఞులు ఇక్కడివారే. మొత్తం సినిమా డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థ ఇక్కడే ఉండేది. రాష్ట్రంలోనే అత్యధిక సినిమా థియేటర్లు ఉండేవి. వీటికి సంబంధించిన ఎగ్జిబిషన్లు ఈ ఉత్సవంలో ఎక్కడా చోటుచేసుకోలేదు.

కేవలం నాలుగు వేదికలకు పరిమితం చేసి దీనిని ఒక కార్నివాల్ లాగా మార్చేశారు. గొల్లపూడి నుంచి పున్నమీ ఘాట్ వరకు మూడు కి.మీ పరిధిలోనే మొత్తం ఉత్సవం వేదికలపై జరుగుతున్నది. (మ్యూజిక్ కాలేజీ ఒకటి వేరే ప్రాంతం). కనీసం పవిత్ర సంగమం దగ్గర ఒక వేదిక పెట్టాలనే ఆలోచనే చేయలేదు. విజయవాడ అంటే కనకదుర్గమ్మ మాత్రమే, కృష్ణానది మాత్రమే అన్నట్లు ఉన్నాయి.. ప్రదర్శనలు కూడా! అవకాశమున్న మేరకు ఈ లోపాలను సవరించుకునే ప్రయత్నం చేయాలి. ఏదేమైనా ఈ ఉత్సవం విజయవంతం కావాలని ఆకాంక్షిద్దాం.

○ టి. కొండబాబు
సీనియర్ జర్నలిస్ట్

వర్గీకరణ చేసినందుకు వందనాలు!

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి...


ఎస్సీ రిజర్వేషన్ల హేతుబద్ధీకరణ మాదిగల, ఎస్సీ చిన్న కులాల చిరకాల ఆకాంక్ష. ఈ కోర్కె ద్వారా ప్రతి ఎస్సీ కులానికీ విద్య, ఉద్యోగ అవకాశాల్లో పంపిణీ న్యాయం కల్పించుకోవడానికి మేము సుదీర్ఘ, చారిత్రక ప్రజా ఉద్యమాన్ని నిర్వహించాం. వేలాది మంది కార్యకర్తలు లక్షలాదిమంది మాదిగ ప్రజలను కదిలించారు. దశాబ్దాలుగా సాగిన మాదిగ దండోరా ఉద్యమంలో పది మందికి పైగా కార్యకర్తలు ప్రాణత్యాగాలు చేశారు. వేలాదిమంది కార్యకర్తలు కేసులపాలయ్యారు. మా ఈ ఉద్యమానికి రాష్ట్ర ప్రభుత్వం, ప్రతీ దశలోనూ సానుకూలంగా స్పందించింది. ప్రత్యేకించి, మీరు ముఖ్యమంత్రిగా ఉన్న 1996లోనే, వర్గీకరణకు మద్దతుగా రాష్ట్ర అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం చేయించారు. జస్టిస్ రామచంద్రరాజు విచారణ కమిషన్‌ను 1997లో నియమించారు. ఈ కమిషన్ సిఫారసులకు అనుగుణంగా 1997 జూన్ 6, 7 తేదీలలో వర్గీకరణ కోసం 68, 69 జీవోలను నాటి మీ ముఖ్యమంత్రిత్వాన గల తెలుగుదేశం ప్రభుత్వం జారీ చేసింది. ఈ జీవోలను రక్షించుకోవడానికి నాటి మీ ప్రభుత్వం సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసిన విషయాన్ని కూడా మేము ఈ సందర్భంగా సంతోషంగా గుర్తు చేసుకుంటున్నాం. 1999 నవంబర్‌లో నాటి మీ టీడీపీ ప్రభుత్వం వర్గీకరణ ఆర్డినెన్స్ జారీ చేయడమే గాక, 2000 సంవత్సరం ఏప్రిల్‌లో అసెంబ్లీలో వర్గీకరణకు ఏకగ్రీవ చట్టం కూడా మీరు చేయించారు.

వర్గీకరణ వ్యతిరేకులు కల్పించిన అనేక అవాంతరాలను ఎదుర్కొని, 2024 సుప్రీంకోర్టు విస్తృత రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును మీ ప్రభుత్వం సామాజిక న్యాయానికి మార్గదర్శకంగా తీసుకున్నది. వర్గీకరణ అంశంపై పరిశీలనకు మీరు రాజీవ్ రంజన్ మిశ్రా విచారణ కమిషన్‌ను నియమించారు. గత ఏప్రిల్‌లో మీ ప్రభుత్వం వర్గీకరణకు ఆర్డినెన్సు విడుదల చెయ్యడం ఎంతో సంతోషకరమైన విషయం. సెప్టెంబర్ 23న ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ఎస్సీ రిజర్వేషన్ల హేతుబద్ధీకరణ కోసం బిల్లు ప్రవేశపెట్టించి, ఏకగ్రీవంగా చట్టం చేయించినందుకు గాను ఏపీ సీఎం అయిన మీకు రాష్ట్రంలోని యావత్ మాదిగల పక్షంగా, ఎస్సీ చిన్న కులాల పక్షంగా ‘మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి’ కృతజ్ఞతలు తెలియజేస్తోంది.

– కృపాకర్ మాదిగ, వ్యవస్థాపక కార్యదర్శి, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి

మతమేదైనా జాతీయతే ప్రధానం!

1963 భారత గణతంత్ర దినోత్సవాల్లో కవాతు వందనంలో పాల్గొనటానికి అప్పటి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ ప్రత్యేకంగా ఆహ్వానించిన ఒక స్వచ్ఛంద సంస్థ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్. చరిత్ర తెలియని ఇప్పటి తరానికి ఇది వింతగా అనిపించవచ్చు. కానీ, నెహ్రూ అలా చేయటానికి గల ఒక బలమైన కారణం– 1962 నాటి చైనా దురాక్రమణ వల్ల జరిగిన యుద్ధంలో గాయపడిన సైనికులకు తక్షణ వైద్యం అందేలా చేయటంలోను, శ్రీనగర్ విమానాశ్రయంలో పేరుకుపోయిన మంచు పెళ్లల్ని తొలగించటంలోను ఆరెస్సెస్ స్వయంసేవకులు చేసిన అసాధారణ సేవ.



ఆరు దశాబ్దాల తరువాత 2020–2022 కాలంలో కొవిడ్ కారణంగా ఉత్పన్నమైన భయంకర పరిస్థితుల్లో అదే సేవా స్ఫూర్తితో పనిచేసిన స్వచ్ఛంద సంస్థ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్. దేశంలో ఏ ప్రమాదాలూ, ఉపద్రవాలూ ఎక్కడ సంభవించినా ఎవరూ ఆహ్వానించకుండా తనంత తానుగా రంగంలోకి దిగి సేవలందించటం సంఘ్ ప్రవృత్తి. ఇంతటి సేవా స్ఫూర్తి కలిగిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆవిర్భవించి ఈ 2025 విజయదశమి నాటికి వందేళ్లు.

1925లో విజయదశమి శుభదినాన కేవలం ఐదుగురు యువకులతో నాగపూర్‌లో కేశవరావు బలిరాం హెడ్గేవార్ ‘రాష్ట్రీయ స్వయం సేవక సంఘా’న్ని స్థాపించారు. కేశవరావు పూర్వీకులు తెలంగాణ రాష్ట్రంలోని నిజామాబాదు జిల్లా బోధన్ దగ్గర కందుకూరు గ్రామానికి చెందినవారు. అక్కడి నుంచి వారు మహారాష్ట్రలోని నాగపూర్ ప్రాంతానికి వలస వెళ్లారు. కేశవరావు పేద కుటుంబంలో జన్మించి, కష్టాలు అనుభవిస్తూనే, కలకత్తాలో డాక్టర్ విద్య పూర్తి చేసారు. ఆయన బాల్యం నుంచి దేశభక్తి, జాతీయవాదం, భారతీయ సంస్కృతి, ఇతిహాసాల పట్ల మక్కువ చూపేవారు. ఆంగ్లేయులను మన దేశం నుంచి పారద్రోలాలనే భావనతో రగిలిపోయేవారు. అయితే, స్వాతంత్ర్యం కోసం పోరాటంలో హింసకు తావుండకూడదని విశ్వసించేవారు. కలకత్తా నుంచి నాగపూర్‌కి తిరిగివచ్చి, స్థానిక యువకులను సమావేశపరిచి వారిని స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనేలా ప్రోత్సహించారు. వారికి అవసరమైన వ్యాయామశాలలు, అఖాడాలు నిర్వహించారు. కాంగ్రెస్‌లో చేరి బాలగంగాధర తిలక్, మహాత్మ గాంధీ, సుభాష్ చంద్రబోస్, డా. ముంజె వంటి నాయకులతో కలిసి పనిచేసి, మహారాష్ట్రలో యువ నాయకుడిగా ఎదిగారు. బ్రిటిష్ వ్యతిరేక ఉద్యమంలో పాల్గొని కారాగార శిక్ష అనుభవించారు. స్వాతంత్ర్య సమరంలో పాల్గొంటున్న సమయంలోనే ఆయన మనసులో ఒక అంతర్మథనం సాగుతూ ఉండేది. భారతదేశానికి స్వాతంత్ర్యం ఇంతకుముందు లేదా? ఆ స్వాతంత్ర్యాన్ని ఎందుకు కోల్పోయాం? ఎందుకు మన దేశం 700 సంవత్సరాలపాటు బానిసత్వంలో మగ్గింది? ఈ అంతర్మథనం, తర్వాత సుదీర్ఘమైన అధ్యయనం వల్ల ఆయనకు ఒక విషయం స్పష్టమైంది. ఒకప్పుడు ప్రకృతిని ఆరాధించే మన భారతీయతలో ఏకత్వం ఉంది. వర్గం, వర్ణం, భాష, ప్రాంతం, సంప్రదాయం పేరుతో అనైక్యంగా ఉండడం వల్లనే అనేక విదేశీ దండయాత్రల్లో మనం ఓడిపోయాం. తిరిగి దేశానికి పూర్వ వైభవ స్థితిని తేవాలన్న దృఢమైన, అచంచలమైన సంకల్పం ఆయనలో కలిగింది. దేశం కోసం, ధర్మం కోసం, సమాజం కోసం సర్వస్వాన్ని అర్పించి సేవ చేసే యువకుల బృందమే భారతదేశానికి పూర్వ వైభవ స్థితిని తీసుకురాగలదని ఆయన విశ్వసించారు. మన ప్రాచీన ఋషులు, మునులు, సంతులు, తత్త్వవేత్తలు బోధించిన విషయాలను దృష్టిలో పెట్టుకుని, ఆ హిందుత్వం, భారతీయత మూర్తీభవించిన సంఘటిత సమాజాన్ని నిర్మించడానికై రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌ను స్థాపించారు.

శిల్పి ఒక రాయిని చెక్కి శిల్పం చేసినట్టుగా, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రతి భారతీయునిలో అంతర్లీనంగా ఉన్న ఉన్న శక్తిని జాగృతం చేసి, ఆ వ్యక్తిని క్రమశిక్షణ, దేశభక్తి, జాతీయతతో నింపటానికి తన శాఖల ద్వారా ప్రయత్నిస్తున్నది. అలాంటి శాఖల విస్తరణే సంఘ్ కార్యం. సంఘ్ ఏనాడూ మతంతో ముడిపడిలేదు. మతమేదైనా జాతీయతే ప్రధానంగా భావించింది. “ఇది నా మాతృభూమి. నా మాతృభూమి కోసం సర్వస్వాన్ని త్యాగం చేస్తాను. అవసరమైతే ప్రాణ త్యాగమైనా చేస్తాను” అన్న సంకల్పం ఉంటే చాలు. అందుకే సంఘ్ ప్రార్థన ‘నమస్తే సదా వత్సలే మాతృభూమి’ అంటూ మొదలవుతుంది.

> **శిల్పి ఒక రాయిని చెక్కి శిల్పం చేసినట్టుగా, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రతి భారతీయునిలో అంతర్లీనంగా ఉన్న శక్తిని జాగృతం చేసి, ఆ వ్యక్తిని క్రమశిక్షణ, దేశభక్తి, జాతీయతతో నింపటానికి తన శాఖల ద్వారా ప్రయత్నిస్తున్నది. అలాంటి శాఖల విస్తరణే సంఘ్ కార్యం. సంఘ్ ఏనాడూ మతం పేరుతో ముడిపడిలేదు. మతమేదైనా జాతీయతే ప్రధానంగా భావించింది.**

సంఘ్ స్వయం సేవకులను నిర్మాణం చేస్తుంది. స్వయం సేవకులు తమ బాధ్యతగా సమాజంలో ఉన్నటువంటి అన్ని క్షేత్రాలలో సంఘ్ భావజాలాన్ని, సంఘ్ సిద్ధాంతాన్ని అమలుపరిచేలా బాధ్యతలు తీసుకుంటారు. అలా దేశం గర్వించదగిన నాయకుల్ని తయారు చేసింది సంఘ్. అటల్ బిహారీ వాజపేయి, ఎల్.కె. అద్వానీ, భైరన్‌సింగ్ షెకావత్, నానాజీ దేశముఖ్, మురళీమనోహర్ జోషి, బంగారు



లక్ష్మణ్, రామనాథ్ కోవింద్, వెంకయ్యానాయుడు, నరేంద్ర మోదీ, రాజనాథ్ సింగ్, నితిన్ గడ్కరీ లాంటి వేలాదిమందిని రాజకీయ క్షేత్రంలోకి పంపింది. వీరేగాక సమాజానికి కనపడని అనేక మందిని, కార్మిక, ధార్మిక, విద్యార్థి, కిసాన్, ఆదివాసీ, సేవా, సామాజిక సమరసతా రంగాల్లోకి పంపింది. ఇంకా వివిధ వృత్తి రంగాలలో కృషి చేసేందుకు ప్రముఖ నాయకులను ఆయా రంగాలకు సంఘ్ కేటాయించింది.

1940లో కేశవరావు బలిరాం హెడ్గేవార్ పరమపదించిన తరువాత మాధవ్ సదాశివ గోల్వాల్కర్ (గురూజీ) సర్ సంఘ్ ద్వితీయ చాలక్‌గా 1940 నుంచి 1973 వరకు దాదాపు 33 సంవత్సరాల పాటు నిరంతర తపోదీక్షతో దేశమంతటా పర్యటిస్తూ పనిచేసారు. అప్పటివరకు కేవలం మహారాష్ట్ర ప్రాంతానికే పరిమితమైన సంఘాన్ని అఖిల భారతీయ స్థాయిలో విస్తృతపరిచారు. దేశవ్యాప్తంగా సంఘ్ శాఖలను, ప్రచారక్ (సన్యాసిగా) వ్యవస్థను ఉద్యమ స్థాయిలో విస్తరించారు. సమాజంలోని అన్ని రంగాలలో సంఘ్ సంస్థలను నిర్మాణం చేసి వాటికీ ప్రచారకులను పంపించారు. గురూజీ 1973లో పరమపదించారు.

గురూజీ తదనంతరం బాల సాహెబ్ దేవరస్‌గా ప్రసిద్ధి చెందిన మధుకర్ దత్తాత్రేయ దేవరస్ 1973 నుంచి సర్ సంఘ్ తృతీయ చాలక్‌గా బాధ్యతలు చేపట్టారు. హిందూ సమాజంలో లోతుగా పేరుకుపోయిన అంటరానితనం, అస్పృశ్యత, దేవాలయ ప్రవేశ నిరాకరణ, కులాంతర వివాహాల వ్యతిరేకత లాంటి సామాజిక రుగ్మతల నివారణకై కృషి చేయాలని, దళిత గిరిజన సమాజానికి సేవ చేసి, వారిని సంఘటితం చేయాలనీ ఆయన పిలుపు ఇచ్చారు. ఈ పిలుపు మేరకు స్వయం సేవకులందరు వేలాదిగా బస్తీల్లో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. సంఘ్ ‘సేవా భారతి’ పేరుతో విద్య, వైద్య, నైపుణ్య శిక్షణ తదితర కార్యక్రమాలు ప్రారంభించింది. ఈనాడు ‘సేవ భారతి’ దేశవ్యాప్తంగా 373 జిల్లాల్లో 35,560 శాఖలతో సేవలు అందిస్తున్నాయి. ఇప్పుడు ‘సామాజిక సమరసత’ జాతీయ స్థాయిలో పెద్ద ఉద్యమంగా సాగుతోంది.

1975 అత్యవసర పరిస్థితి సమయంలో ఇందిరా గాంధీ ప్రభుత్వం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌పై నిషేధం విధించింది. ఆమె నియంతృత్వానికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్యానికి పట్టిన గ్రహణాన్ని ఎదుర్కోవడానికి సంఘ్ అన్ని రాజకీయ పక్షాలను, నాయకులను ఏకతాటి మీదకు తీసుకువచ్చేందుకు కృషి చేసింది. లోక్ సంఘర్ష్ సమితి ఆధ్వర్యంలో ప్రముఖ సోషలిస్టు నాయకులైన జయప్రకాశ్ నారాయణ్, మొరార్జీదేశాయ్ లాంటి మహోన్నత నాయకులతో కలిసి సంఘ్ ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమం చేపట్టింది. భారతదేశ చరిత్రలో రెండవ స్వాతంత్ర్య సంగ్రామం అనదగినంత ప్రాముఖ్యత కలిగిన ఈ ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాటంలో అనేకమంది స్వయం సేవకులు ప్రాణాలు పణంగా పెట్టి పోరాడారు.

1947లో దేశ విభజన సమయంలో లక్షలాది మంది కాందిశీకుల శిబిరాలను నిర్వహించి, వారికి రక్షణ కల్పించి సంఘ్ అండగా నిలబడింది. 1977లో ఆంధ్రప్రదేశ్‌లోని దివిసీమలో వచ్చిన పెను ఉప్పెనకు ఊళ్ళకు ఊళ్ళే తుడిచి పెట్టుకుపోయిన సందర్భంలో సంఘ్ తన స్వయం సేవకులను వెంటనే రంగంలోకి దించింది. ఆయా సహాయ కార్యక్రమాలకు ఆరెస్సెస్ సైక్లోన్ రిలీఫ్ కమిటీలు ఏర్పాటు చేసి అనేక కార్యక్రమాలు చేపట్టింది. ఉప్పెన ఉధృతికి శవాల దిబ్బలుగా మారిన ఊళ్లల్లో ప్రత్యేకంగా ‘శవ సేన’ పేరుతో ఒక బృందాన్ని తయారు చేసి మరణించిన వారి అంతిమ సంస్కారాలు నిర్వహించే బాధ్యతను సంఘ్ తీసుకుంది. తుపానుతో తీవ్రంగా నష్టపోయిన మూలపాలెం గ్రామాన్ని విరాళాల సహాయంతో పునర్నిర్మించి, ‘దీనదయాళ్‌పురం’గా నామకరణం చేసి, అక్కడున్న అందరికీ పక్కా ఇళ్లు నిర్మించింది. వాటిని అప్పటి కేంద్ర విదేశాంగమంత్రి అటల్ బిహారీ వాజపేయి, ముఖ్యమంత్రి చెన్నారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగానే ప్రముఖ గాంధేయవాది ప్రభాకర్ జీ “ఆరెస్సెస్ అంటే రెడీ ఫర్ సెల్ఫ్‌లెస్ సర్వీస్ (Ready for Selfless Service)” అని కొనియాడారు.

సంఘ్ ఏనాడూ హింసను బోధించదు. హింసను ప్రోత్సహించదు. కేరళ, ఈశాన్య భారత రాష్ట్రాలలో దేశ వ్యతిరేకశక్తులు సంఘ్ కార్యకర్తల మీద దాడులు చేశాయి. కిరాతకంగా ప్రాణాలు తీశాయి. కానీ సంఘ్ ఏనాడూ ఇలాంటి చర్యలకు పాల్పడలేదు. కుల, వర్ణ, వర్గ వివక్షలకు అతీతంగా సంఘ్ నిర్మాణం జరిగింది. అందుకే ఈ శక్తి అచంచలమైంది. అలా నిర్మితమైంది కాబట్టే ఆరెస్సెస్ ఇద్దరు సమర్థులైన, నీతిమంతులైన ప్రధానమంత్రుల్ని ఈ దేశానికి అందించగలిగింది. వందేళ్ళ క్రితం అయిదుగురితో ప్రారంభమైన ఆరెస్సెస్ ఇవ్వాళ దేశంలో కోట్లాది స్వయం సేవకులతో భరతమాత సేవకి తనని తాను పునరంకితం చేసుకుంటోంది.

• బండారు దత్తాత్రేయ
పూర్వ గవర్నర్, హర్యానా

పట్టు వస్త్రాల సమర్పణలో చంద్రబాబు రికార్డు!



మానవాళికి మహోత్సవాలుగా భక్తులు భావించే తిరుమల–తిరుపతి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారికి ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించడంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రికార్డు సృష్టించారు. ఆయన ముఖ్యమంత్రి పదవి చేపట్టి, తొలిసారి 1995 సంవత్సరంలో తిరుమల బ్రహ్మోత్సవాలకు ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించడం ప్రారంభించారు. 2003లో బ్రహ్మోత్సవాల సందర్భంగా పట్టు వస్త్రాలు సమర్పించేందుకు తిరుమలకు వెళుతుండగా అలిపిరిలో జరిగిన బాంబు దాడిలో గాయపడిన ఆయన, బ్రహ్మోత్సవాలకు వెళ్లలేక పోయారు. 1995 నుంచి 2002, 2014నుంచి 2019 వరకు, 2024 నుంచి ముఖ్యమంత్రిగా ప్రభుత్వం తరఫున ఇప్పటివరకు మొత్తం 15సార్లు పట్టువస్త్రాలు సమర్పించిన మహద్భాగ్యం చంద్రబాబుకే దక్కింది. తెలుగు రాష్ట్రాల్లో ఇన్నిసార్లు పట్టు వస్త్రాలు సమర్పించే అదృష్టం చంద్రబాబుకు కలగడం కలియుగ దైవం కృప వల్లే అని చెప్పాలి. ఇటువంటి అవకాశం మరొకరికి దక్కుదు కూడా.


తిరుపతి శ్రీ వేంకటేశ్వరస్వామి పట్ల గొప్ప భక్తి కలిగి ఉంటారు చంద్రబాబు. తన జీవితంలో ఎన్నో సమస్యల నుంచి అలిపిరిలో బాంబు దాడి జరిగి సురక్షితంగా బయటపడటం శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆశీస్సుల వల్లేనని పలు సందర్భాలలో ఆయన చెప్పారు. ముఖ్యమంత్రిగా తిరుమల పవిత్రతకు భంగం కలగకుండా చర్యలు చేపట్టడంలో కూడా ఆయన ముందున్నారు. తరచూ కుటుంబంతో కలిసి స్వామివారిని దర్శించుకుంటారు. తిరుపతిలో ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ 1985 ఏప్రిల్ 6న ప్రారంభించిన నిత్యాన్నదాన కార్యక్రమాన్ని చంద్రబాబు కొనసాగిస్తున్నారు. ప్రారంభంలో ఈ కార్యక్రమంలో పరిమితంగానే భోజనం అందించేవారు. క్రమేణా నేడు రోజుకు లక్ష మందికి పైగా భక్తులకు అన్నదానం జరుగుతోంది.

తిరుపతి, తిరుమల ప్రాంతంలో అభివృద్ధి కార్యక్రమాలు, ఆలయ సేవలు, ఆరోగ్యం, విద్య వంటి రంగాల్లో, మౌలిక వసతులను పెంపొందించడంలో చంద్రబాబు ప్రముఖ పాత్ర పోషించారు. తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామివారి సేవలకు, ఆలయ అభివృద్ధికి పలు చర్యలు తీసుకున్నారు. గత ప్రభుత్వంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఇచ్చిన అనేక ప్రైవేటు అనుమతులను రద్దు చేశారు. తిరుమలలో పనిచేస్తున్న ఇతర మతస్థులను వేరే శాఖలకు మార్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. టీటీడీ సేవలలో 100 శాతం మార్పులు రావాలని, భక్తులకు సౌకర్యాలు మెరుగుపర్చాలని, ఆలయ నిర్వహణలో పారదర్శకత, లడ్డు ప్రసాదం నాణ్యత పెంచాలని ఆదేశించారు. అభివృద్ధి పనుల పేరుతో ఆలయ సొమ్మును దుర్వినియోగం చెయ్యవద్దని హెచ్చరించారు. భక్తులకు సులభమైన, సౌకర్యవంతమైన దర్శనాలు, వసతులు కల్పించాలనే లక్ష్యంతో దిశానిర్దేశం చేశారు. తిరుమలలో పూర్తిగా ప్రక్షాళన జరగాలని, మినహాయింపులు ఉండకూడదని సూచించారు.

తిరుమల లడ్డూ మహాప్రసాదం పవిత్రతను, విశిష్టతను, వేంకటేశ్వరస్వామి వైభవాన్ని, టీటీడీ పేరు ప్రఖ్యాతులను గత ప్రభుత్వం దిగజార్చింది. గత అయిదేళ్లుగా తిరుమల తిరుపతిలో జరిగిన ఘోరాతి ఘోరాలు, పాపాలు హిందూ సమాజాన్ని కలవరపెట్టాయి. ఈ పరిస్థితుల్లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు గత ప్రభుత్వ తప్పిదాలను సరిదిద్దుతూ, 15 నెలలుగా అనేక సంస్కరణలు తీసుకొచ్చారు. దీంతో తిరుపతికి దేశ, విదేశాల నుంచి వస్తున్న భక్తులతో పాటు, ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులు, ఎంపీలు, ఇతర రాజకీయ నాయకులు తిరుమల పవిత్రతను కాపాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబును అభినందిస్తున్నారు.

■ కలిశెట్టి అప్పలనాయుడు
విజయనగరం పార్లమెంటు సభ్యులు

ఆంధ్రా మిల్టన్



19వ శతాబ్దం చివర, 20వ శతాబ్దం ఆరంభ కాలంలో తెలుగు సాహిత్యం అభివృద్ధికి, తెలుగు నాట ఆధునిక భావాల వికాసానికి పట్టుగొమ్మలుగా నిలిచిన మహామహులలో చిలకమర్తి ఒకరు. ఇరవై రెండేళ్ళ వయసులో ఆయన రచించిన ‘గయోపాఖ్యానం’ నాటకం ప్రతులు లక్షకు పైబడి అమ్ముడుపోవటం తెలుగు సాహిత్య చరిత్రలో కనీవినీ ఎరగని విషయం. ఈ నాటకంలో టంగుటూరి ప్రకాశం పంతులు అర్జునుడి వేషం వేసేవారు. లక్ష్మీనరసింహం 1867 సెప్టెంబర్ 26న ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా, పెరవలి మండలంలోని ఖండవల్లి గ్రామంలో వెంకన్న, రత్నమ్మ దంపతులకు జన్మించారు. రాజమండ్రి పరిసర ప్రాంతాల్లోనే ఆయన విద్యాభ్యాసం సాగింది.

చిలకమర్తి మొదట కొంతకాలం ‘సరస్వతి’ పత్రిక సంపాదకునిగా పనిచేశారు. ఆపై ఉద్యోగం విరమించి 1899లో హిందూ లోయర్ సెకండరీ స్కూల్ స్థాపించి తొమ్మిది సంవత్సరాలు దానిని నడిపారు. అనంతర కాలంలో అది వీరేశలింగం ఉన్నత పాఠశాలగా మార్చబడింది. లక్ష్మీనరసింహం మొదటితరం సంఘ సంస్కర్త. 1909లో సామాజికంగా వెనుకబడిన వర్గాల కోసం రామ్మోహన పాఠశాలను స్థాపించారు. తన సొంత రాబడితోనే ఆ పాఠశాలను నడిపారు. తన 30వ ఏట నుంచి రేచీకటి వ్యాధికి గురైనప్పటికీ, రచనలు చేయడం మానలేదు. ఆయన రచనలు పది సంపుటాలుగా ప్రచురితమయ్యాయి. 1943లో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆయనను కళాప్రపూర్ణ పురస్కారంతో సత్కరించింది.

కీచకవధ ఆయన మొదటి నాటకం. తరువాత ద్రౌపదీ పరిణయం, గయోపాఖ్యానం, శ్రీరామజననం, సీతా కళ్యాణం, పారిజాతాపహరణం వంటి నాటికలు రచించారు. ఆయన రాసిన నవలల్లో రామచంద్ర విజయం, హేమలత, అహల్యాబాయి, సుధా శరచ్చంద్రము ప్రముఖమైనవి. వీటితో పాటు సౌందర్య తిలక, పార్వతీ పరిణయం రాశారు. 1908లో ఒక ప్రింటింగ్ ప్రెస్ ప్రారంభించారు. 1916లో మనోరమ అనే పత్రికను స్థాపించారు. దీని ద్వారా గణపతి, రాజరత్నము, రఘుకుల చరిత్ర (కాళిదాసు రచన రఘువంశానికి అనువాదం), సిద్ధార్థ చరిత్ర వంటివి ప్రచురించారు.

చిలకమర్తివారు దళిత జనులకు చేసిన సేవలను అప్పటి మద్రాస్ గవర్నర్ లార్డ్ పెంట్‌లాండ్ ఎంతగానో ప్రశంసించారు. బ్రహ్మసమాజం, హితకారిణీ సమాజం వంటి సంస్కరణ దృక్పథం గల సంఘాల కార్యకలాపాలలో పాలుపంచుకొన్నారు. దేశమాత అనే వారపత్రిక ద్వారా బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా వ్యాసాలు వ్రాశారు. 1894లో ఆయన రాసిన రామచంద్ర విజయం అనే సాంఘిక నవల న్యాపతి సుబ్బారావు నిర్వహించిన పోటీల్లో మొదటి బహుమతి పొందింది. ఇది ఆయన ఆత్మకథ అంటారు. 1897లో చిలకమర్తి రాసిన ‘పృథ్వీరాజీయం’ అనే గేయసంపుటి రాతప్రతి ప్రమాదవశాత్తూ చిరిగిపోయింది. కనుక ప్రచురణకు నోచుకోలేదు. ‘భరత ఖండంబు చక్కని పాడియావు’ అనేది ఆయన రచనే. 1946 జూన్ 17న లక్ష్మీనరసింహం తుదిశ్వాస విడిచారు. ఆయన్ను అందరూ ఆంధ్రా మిల్టన్ అని పిలుచుకుంటారు.

– యం. రాం ప్రదీప్, తిరువూరు

(రేపు: చిలకమర్తి లక్ష్మీనరసింహం జయంతి)

ఏపీ జెన్‌కోను అగ్రగామిగా నిలుపుతాం

- వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్: నాగలక్ష్మి
- జెన్‌కో ఎండీగా బాధ్యతల స్వీకరణ



అమరావతి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): దేశంలో ఏపీ జెన్‌కోను అగ్రగామిగా నిలుపుతామని ఆ సంస్థ ఎండీ నాగలక్ష్మి పేర్కొన్నారు. విజయవాడలోని విద్యుత్తు సౌధలో ఏపీ జెన్‌కో ఎండీగా బుధవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. అనంతరం నాగలక్ష్మి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని విద్యుత్తు వినియోగదారులకు 24/7 నిరంతరాయ, నాణ్యమైన విద్యుత్తును అందించడానికి, పెరుగుతున్న విద్యుత్తు డిమాండ్‌ను అందుకోవడానికి అవసరమైన విద్యుత్తును జెన్‌కో ఆధ్వర్యంలోని థర్మల్, హైడల్, సౌర విద్యుత్తు కేంద్రాల ద్వారా ఉత్పత్తి చేయడానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. జెన్‌కో యూనిట్ల నుంచి గరిష్ఠ విద్యుత్తు ఉత్పత్తి సాధించేందుకు చర్యలు తీసుకోవాలని, నూతనంగా రాబోతున్న ప్రాజెక్టులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. థర్మల్ విద్యుత్తు కేంద్రాల పునరుద్ధరణ, ఆధునికీకరణకు అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు. వీలైనంత వరకు కర్బన ఉద్గారాలను తగ్గించడానికి, కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలను కచ్చితంగా అనుసరించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

పంటల బీమాపై రైతులకు విశ్వాసం కల్పించండి

- బీమా కంపెనీలకు లోక్‌సభ సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ సూచన
- రెండో రోజు బీమా రంగంపై చర్చించిన కమిటీ

అమరావతి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జీవిత బీమా రంగంలో వస్తున్న మార్పులు, పంటల బీమా పట్ల రైతులకు అవగాహన కల్పించడం గురించి లోక్‌సభ సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ సమావేశంలో సుదీర్ఘ చర్చ జరిగింది. విజయవాడలో మంగళవారం ప్రారంభమైన ఈ సమావేశాల్లో రెండో రోజైన బుధవారం బీమా రంగంపై చర్చ జరిగింది. లెజిస్లేషన్ కమిటీ అధ్యక్షుడు, మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి అధ్యక్షతన ఈ సమావేశాలు జరుగుతున్నాయి. రైతులకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం, రీస్ట్రక్చర్డ్ వెదర్ బేస్డ్ పంటల బీమా పథకం అమలు చేసే విధానాల గురించి సభ్యులు బీమా కంపెనీల చైర్మన్లు, డైరెక్టర్లతో మాట్లాడారు. రైతులకు పంటల బీమా పట్ల తగిన విశ్వాసం ఏర్పడే విధంగా తీసుకోవాల్సిన చర్యల గురించి, బీమా కంపెనీల మధ్య ఆరోగ్యకరమైన పోటీ గురించి, ప్రస్తుత జీఎస్టీ తగ్గింపుల గురించి కూడా చర్చించారు. సమావేశంలో కమిటీ సభ్యులైన ఎంపీలు ప్రేమచంద్రన్, మొహమ్మద్ జావేద్, వివేక్ ఠాకూర్, రాజేశ్ వర్మతోపాటు భారత బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ చైర్మన్ అజయ్ సేథ్, దేశంలోని ప్రముఖ బీమా కంపెనీలైన ఎల్ఐసీ, నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ, ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీలతో పాటు పలు సంస్థల చైర్మన్లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

'సాల్ట్' అమలు తీరు భేష్

- లోకేశ్‌తో భేటీలో ప్రపంచబ్యాంకు ప్రతినిధులు

అమరావతి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (సాల్ట్) కార్యక్రమం అమలు తీరు బాగుందని ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు ప్రశంసించారు. ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు క్రిస్టెల్ కౌమే, సౌమ్య బజాజ్, యిన్‌విన్ ఖైన్, ప్రియాంక సాహు తదితరులు బుధవారం అసెంబ్లీలో మంత్రి లోకేశ్‌తో భేటీ అయ్యారు. సాల్ట్‌తోపాటు పాల్ (పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్), ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషన్ లిట్రసీ, న్యూమరసీ) కార్యక్రమాలపై వారు చర్చించారు. లీప్ (లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఏపీ) కార్యక్రమానికి సాల్ట్ ఉపయోగపడుతోందని లోకేశ్ అన్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను అంచనా వేయడానికి పాల్ ల్యాబ్‌లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. పాల్ ల్యాబ్స్‌తో టీచర్లు మరింత మెరుగైన ప్రణాళికతో బోధిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఉన్నతాధికారులు కోన శశిధర్, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రెండో విడత డిగ్రీ అడ్మిషన్లకు షెడ్యూలు

అమరావతి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రెండో విడత డిగ్రీ అడ్మిషన్లకు ఉన్నత విద్యామండలి బుధవారం షెడ్యూలు జారీచేసింది. ఈ నెల 26 నుంచి 29 వరకు విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, 27 నుంచి 29 వరకు సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందని, 29 నుంచి 1 వరకు వెబ్ ఆప్షన్లు ఎంపిక చేసుకోవచ్చని తెలిపింది. 3న ఆప్షన్లు మార్చుకోవచ్చని, 6న సీట్లు కేటాయింపు జరుగుతుందని పేర్కొంది. 7, 8 తేదీల్లో విద్యార్థులు కాలేజీల్లో రిపోర్టు చేయాలని సూచించింది. కాగా, తొలి విడతలో 1,30,265 మందికి సీట్లు కేటాయించారు. వారిలో 1,22,955 మంది విద్యార్థులు కాలేజీల్లో రిపోర్టు చేశారు. ఇంకా 7,310 మంది రిపోర్టు చేయాల్సి ఉంది. వారిలో సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయనివారు ఇప్పుడు అప్‌లోడ్ చేస్తే వారికి రెండో విడతలో సీట్లు కేటాయిస్తామని ఉన్నత విద్యామండలి తెలిపింది.

ఇసుక అక్రమ తవ్వకాలపై విచారణ అక్టోబరు 29కి వాయిదా

న్యూఢిల్లీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో జగన్ ప్రభుత్వ హయాంలో ఇసుక అక్రమ తవ్వకాల వ్యవహారంపై విచారణను సుప్రీంకోర్టు మరోసారి వాయిదా వేసింది. పెద్దఎత్తున ఇసుక అక్రమ తవ్వకాలు జరిగాయనే ఆరోపణలపై జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్‌జీటీ) సుదీర్ఘంగా విచారించింది. తవ్వకాలు చేపట్టిన జేపీ వెంచర్స్‌కు రూ.18 కోట్ల జరిమానా విధించింది. ఈ తీర్పును ఆ సంస్థ 2023 మే 15న సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఆ పిటిషన్ బుధవారం జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ మన్మోహన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం ముందుకు వచ్చింది. విచారణను అక్టోబరు 29కి వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది.

దసరాకు రెండు డీఏలు ప్రకటించండి: ఏపీ జేఏసీ

విజయవాడ (గాంధీనగర్), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని ఏపీ జేఏసీ చైర్మన్ విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు. విజయవాడ ఎన్జీవో హోంలో బుధవారం విద్యాసాగర్ మీడియాతో మాట్లాడుతూ దసరాకు నాలుగు డీఏ బకాయిల్లో కనీసం రెండైనా ప్రకటించి ఉద్యోగుల కుటుంబాల్లో సంతోషం నింపాలని కోరారు. ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తే పోరాటలే శరణ్యమన్నారు. కేఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ కరోనా సమయంలో మృతిచెందిన ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు.

ఉద్యోగులను పట్టించుకోని ప్రభుత్వం: బొప్పరాజు

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలవుతున్నా ఉద్యోగులను పట్టించుకోలేదని ఏపీ జేఏసీ అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. తిరుపతిలో బుధవారం ఆయన ఏపీ జేఏసీ అమరావతి, ఏపీ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్లతో సమావేశమై ఉద్యోగుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రభుత్వం దృష్టికి ఈ సమస్యలను తీసుకెళ్లి మూడు నెలల్లో పరిష్కరించుకుందామన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఉద్యోగులకున్న రూ.వేల కోట్ల బకాయిలపై ఇప్పటి వరకు ప్రభుత్వం చర్చించలేదన్నారు. వచ్చే మూడునెలల్లో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుంటే జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు.

తిరుమల నడక మార్గంలో చిరుత సంచారం



మంగళం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరుమల నడక మార్గంలోని ఏడవ మైలు లక్ష్మీనరసింహ స్వామి ఆలయం వద్ద బుధవారం తెల్లవారుజామున చిరుత సంచరించింది. దీనికి సంబంధించిన ఫొటోలు అటవీ శాఖ ఏర్పాటు చేసిన కెమెరాలకు చిక్కాయి. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో చిరుత సంచారంతో అప్రమత్తమైన అటవీ శాఖ అధికారులు ఏడవ మైలు వద్ద ఒక సెక్షన్ ఆఫీసర్‌తోపాటు బీట్ ఆఫీసర్ 15 మంది వాచర్లు, వెటర్నరీ డాక్టర్‌ను నియమించారు.

టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి పితృ వియోగం

తిరుమల, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి పితృ వియోగం కలిగింది. కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న ఆయన తండ్రి చిరుమామిళ్ల చలమయ్య(85) హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం కన్నుమూశారు. సమాచారం తెలియగానే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లలో ఉన్న వెంకయ్య చౌదరి వెంటనే హైదరాబాద్‌కు వెళ్లారు. గురువారం ఉదయం 10 గంటలకు వెంకయ్య చౌదరి స్వస్థలం గుంటూరు జిల్లా నాగులవరం, బెల్లంకొండవారిపాలెంలో అంత్యక్రియలు జరుగనున్నాయి.

ఏఐ చేతిలో నేరగాళ్ల చిట్టా..!

విజయవాడలో 100 ఎఫ్ఆర్‌సీలు

- కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు చేరుతున్న చిత్రాలు
- టెక్నాలజీ సాయంతో గుర్తిస్తున్న నగర పోలీసులు
- దసరా ఉత్సవాల్లో నేరాల అడ్డుకట్టకు కృషి

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం. పోలీసు శాఖలో ఉన్నతాధికారుల అభిప్రాయమిది. దీన్ని నిజం చేసి చూపించారు విజయవాడ పోలీసులు. నేరాల నియంత్రణ, నేరగాళ్ల గుర్తింపునకు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ఇప్పుడు శరన్నవరాత్రుల్లో పోలీసులకు ఆయుధాలుగా మారాయి. దసర ఉత్సవాల కోసం సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులను టార్గెట్ చేసుకుని చేతివాటం చూపించే దొంగలకు కళ్లెం వేయడానికి ఎఫ్ఆర్‌సీ (ఫేషియల్ రికగ్నైజ్ కెమెరా)లు ఉపయోగిస్తున్నారు. ఇంద్రకీలాద్రిపై ఈనెల 22న ప్రారంభమైన ఉత్సవాల కోసం దేశం నలుమూలల నుంచి భక్తులు భారీ సంఖ్యలో వస్తారు. ఈ క్రమంలో ఎక్కడెక్కడో నేరచరిత్ర ఉన్న నేరగాళ్లంతా బెజవాడలో వాలిపోతారు. అలాంటి వారిని పోలీసులు ఎఫ్ఆర్‌సీ ద్వారా గుర్తిస్తున్నారు.

వీడియోనెటిక్స్ సాఫ్ట్‌వేర్‌తో అనుసంధానం

విజయవాడ నగరాన్ని సురక్షితంగా ఉంచేందుకు పోలీసులు గతేడాది ఆగస్టులో సురక్ష ప్రాజెక్టును ప్రారంభించారు. ఇందులో భాగంగా ఎన్టీఆర్ జిల్లాలో 6వేల సీసీ కెమెరాలను అమర్చారు. నిందితులను గుర్తించడానికి జిల్లాలో 248 ఎఫ్ఆర్‌సీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వాటిలో 100కు పైగా కెమెరాలు విజయవాడలోనే ఉన్నాయి. వివిధ కేసుల్లోని నిందితుల ఫొటోలు, వేలిముద్రలతోపాటు వారు ఎక్కడెక్కడ నేరాలు చేశారనే వివరాలను సీసీటీఎన్ఎస్ (క్రైం అండ్ క్రిమినల్ ట్రాకింగ్ సిస్టం)లో పొందుపరిచారు. నిందితులు, నేరగాళ్లను గుర్తించడానికి వీలుగా కేంద్ర ప్రభుత్వం రూపొందించిన వీడియోనెటిక్స్ అనే సాఫ్ట్‌వేర్‌ను సీసీటీఎన్ఎస్‌కు అనుసంధానం చేశారు.



కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో స్క్రీన్‌పై కనిపిస్తున్న వివరాలు

ఎఫ్ఆర్‌సీ కెమెరాలను కూడా ఈ సాఫ్ట్‌వేర్‌కు అనుసంధానించారు. రైళ్లు, బస్సుల్లో వచ్చిన నేరగాళ్లను, ఆలయం పరిసర ప్రాంతాల్లో సంచరించే దొంగలు ఈ కెమెరాల కంట పడగానే అవి వారి ముఖాలను స్కాన్ చేస్తాయి. ఈ చిత్రాలన్నీ మోడల్ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటుచేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వీడియోవాల్‌పై కనిపిస్తుంటాయి. స్క్రీన్‌పై భాగంలో కెమెరా చిత్రీకరించిన ముఖాలు, కింది భాగంలో సాఫ్ట్‌వేర్ డేటాలో ఉన్న ఫొటోలు కనిపిస్తాయి. ఆ రెండూ సరిపోలినప్పుడు పక్కనే పర్సంటేజీ చూపిస్తుంది. ఇది 97 శాతంగా చూపిస్తే ఆ నేరగాడు కెమెరాకు సమీప ప్రాంతంలోనే ఉన్నట్టు నిర్ధారించి కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోని సిబ్బంది వైర్‌లెస్ సెట్‌లో అక్కడున్న సీసీఎస్ సిబ్బందిని అప్రమత్తం చేస్తారు.

అమరావతిలో భూగర్భ కేబుల్ వ్యవస్థ

- విద్యుత్ ప్రమాదాలకు తావులేకుండా చర్యలు: గొట్టిపాటి

అమరావతి/తుళ్లూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): అమరావతిలో విద్యుత్తు ప్రమాదాలకు తావులేకుండా అధునాతన భూగర్భ కేబుల్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. 2.50 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో సీఆర్డీయే భవనాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోందని చెప్పారు. రాయపూడిలో సీఆర్డీయే ప్రధాన కార్యాలయ భవన నిర్మాణ పనులను మంత్రి బుధవారం పరిశీలించారు. ఇక్కడ ఏర్పాటు చేస్తున్న వివిధ చాంబర్లను అధికారులు మంత్రికి వివరించారు. అక్టోబరు 2న సీఎం చంద్రబాబు చేతుల మీదుగా భవనం ప్రారంభోత్సవం జరుగుతుండటంతో ఆ సమయానికి విద్యుత్తు పనులు పూర్తి కావాలని మంత్రి ఆదేశించారు. సీఆర్డీయేతో విద్యుత్తు శాఖ సమన్వయం చేసుకుని పనులు వేగవంతం చేయాలన్నారు.



సీఆర్డీఏ ప్రధాన కార్యాలయం లోపల పరిశీలిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రతిపక్ష హోదా ప్రజలు ఇవ్వాలి.. కోర్టులు కాదు!

జగన్‌కు ప్రతిపక్ష హోదా ఇవ్వాల్సింది ప్రజలే కానీ న్యాయస్థానం కాదని గొట్టిపాటి చెప్పారు. ఎంతమంది ఎమ్మెల్యేలు ఉంటే ప్రతిపక్ష హోదా వస్తుందనే విషయం తెలియకుండా జగన్ సీఎం ఎలా అయ్యారో అంటూ ఎద్దేవా చేశారు. జగన్ జైలు నుంచి బెయిల్‌పై బయటకు వచ్చి 12 ఏళ్లు పూర్తయినందున పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నారేమోనని వ్యాఖ్యానించారు. జగన్ విధ్వంసంతో అమరావతి పనులు ఐదేళ్లు ఆలస్యమయ్యాయన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో సోలార్ ప్యానెల్స్, విండ్ టర్బైన్ల తయారీ కూడా చేపడుతున్నామని చెప్పారు. ఏటేటా పెరుగుతున్న విద్యుత్ వినియోగానికి అనుగుణంగా సబ్‌స్టేషన్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు.

టిప్పర్ డ్రైవరు అరెస్టులో హైడ్రామా

- వేరెవరో వచ్చి లొంగిపోయిన వైనం.. కానీ అరెస్టు చూపించలేదు
- టిప్పర్ ఓనర్‌పై కేసు...కానీ పేరు రాయలేదు
- టిప్పర్ నంబర్ కాకుండా కారు నంబరే నమోదు
- నెల్లూరు జిల్లా ముంబై హైవేపై కారును ఢీకొట్టి ఏడుగురిని బలిగొన్న కేసులో పోలీసుల తీరిది
- 'లొంగిపోయిన వ్యక్తి' భార్య హెచ్చరికతో ఎట్టకేలకు డ్రైవర్ అరెస్టు


నెల్లూరు జిల్లాలో ముంబై హైవేపై కారును ఢీకొన్ని టిప్పర్ (ఫైల్)

సంగం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లాలో రాంగ్‌రూట్‌లో అతివేగంగా టిప్పర్ నడిపి ఏడుగురిని బలిగొన్న డ్రైవరు అరెస్టులో హైడ్రామా నడిచింది. వేరెవరో వచ్చి ఈ కేసులో లొంగిపోగా, ఆయన భార్య ముందుకొచ్చి గొడవ చేయడంతో విషయం బయటపడింది. దీంతో అసలు డ్రైవరును పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. నెల్లూరు జిల్లా సంగం మండలం పరమన సమీపంలోని ముంబై హైవేపై ఈ నెల 17న కారును ఇసుక టిప్పర్ ఢీకొట్టిన ప్రమాదంలో ఏడుగురు మరణించారు. ఆత్మకూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తమ బంధువును చూసేందుకు వీరంతా కారులో వెళుతుండగా ఈ ఘోరం జరిగింది. ఈ ఘటన జరిగినప్పటినుంచీ పోలీసుల తీరు అనుమానంగానే ఉంది. ప్రమాదానికి తానే కారణమంటూ.. ఆత్మకూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి అదే రోజు రాత్రి పోలీసులకు లొంగిపోయాడు. అతనిపైనా, టిప్పర్ యజమాని, ఆ ప్రాంత ఇసుక మాఫియా నేతపై పోలీసులు కేసు నమోదు చేశారు. కానీ, ఎవరినీ అరెస్టు చూపించలేదు. ఎఫ్ఐఆర్‌లో టిప్పర్ డ్రైవరు పేరు రాయలేదు. పరారీలో ఉన్నట్టు మాత్రమే ప్రస్తావించారు. టిప్పర్ నంబరు కాకుండా కారు నంబరు మాత్రం రెండు చోట్ల నమోదుచేశారు. టిప్పర్ యజమానిపై కేసు నమోదు చేసినా పేరు నమోదు చేయలేదు. అయితే, ఇది పొరపాటున జరిగిందా..? లేక నిందితులను తప్పించే క్రమంలో ఉద్దేశపూర్వకంగా చేశారా.. అనేది తెలియలేదు. ఇంతలో...లొంగిపోయిన వ్యక్తి భార్య మీడియా ముందుకువచ్చారు. "నా భర్తను కేసులో ఇరికిస్తే అసలు గుట్టు విప్పుతాను" అంటూ ఇటు పోలీసులకు, అటు టిప్పర్ యజమానికి, ఇసుక మాఫియాకు హెచ్చరికలు జారీ చేశారు. దీంతో వారం రోజులుగా పరారీగా ఉన్నాడంటూ చెబుతూ వచ్చిన అసలు డ్రైవరును మంగళవారం అర్ధరాత్రి పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం కోర్టులో హాజరుపరిచారు. మేజిస్ట్రేట్ నిందితుడిని రిమాండ్‌కు ఆదేశించినట్లు పోలీసులు తెలిపారు.

కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇవ్వండి!

- ఫార్ములా ఈ-రేసు కేసులో గవర్నర్‌ను కోరిన ప్రభుత్వం

హైదరాబాద్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఫార్ములా ఈ-కారు రేసు కేసు ఫైలు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వద్ద నుంచి రాజ్‌భవన్‌కు చేరింది. ఈ కేసులో ఏ1గా ఉన్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్‌పై ప్రాసిక్యూషన్ చర్యలు చేపట్టడానికి అనుమతి ఇవ్వాల్సిందిగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను ప్రభుత్వం కోరింది. దీనిపై గవర్నర్ న్యాయనిపుణుల అభిప్రాయం కోరినట్లు తెలిసింది. ఫార్ములా ఈ-కారు రేసు కేసు దర్యాప్తు చేపట్టిన ఏసీబీ.. తమ దర్యాప్తు పూర్తయిందని, కేటీఆర్‌పై ప్రాసిక్యూషన్ చర్యలకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ఇదివరకే ప్రభుత్వానికి లేఖ రాసింది. ప్రభుత్వం ఆ లేఖను, ఏసీబీ రిపోర్టును విజిలెన్స్ కమిషనర్‌కు పంపించింది. ఏసీబీ రిపోర్టును పరిశీలించిన విజిలెన్స్ కమిషనర్.. నిందితులపై ప్రాసిక్యూషన్ చర్యలు చేపట్టవచ్చంటూ క్లియరెన్స్ ఇచ్చారు. అయితే ఎమ్మెల్యేగా ఉన్న కేటీఆర్‌పై ప్రాసిక్యూషన్ చర్యలకు గవర్నర్ అనుమతి అవసరమైనందున.. విజిలెన్స్ సిఫారసుతోపాటు ఏసీబీ నివేదికను గవర్నర్‌కు సీఎస్ పంపించారు. దీనిపై గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ బుధవారం న్యాయనిపుణుల అభిప్రాయాన్ని కోరినట్లు తెలుస్తోంది. వారి అభిప్రాయం అందిన తర్వాత కేటీఆర్ ప్రాసిక్యూషన్‌పై గవర్నర్ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఫార్ములా ఈ-కారు రేసు కేసులో కేటీఆర్ సహా ఐదుగురిని నిందితులుగా ఏసీబీ పేర్కొన్న విషయం తెలిసిందే.

స్టాంప్ డ్యూటీ.. ఎస్‌జీఎస్టీ లేదు

- పెట్టుబడులే లక్ష్యంగా టూరిజం పాలసీ
- మార్గదర్శకాలు విడుదల చేసిన ప్రభుత్వం
- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కింద ప్రోత్సాహకాలు

అమరావతి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పెట్టుబడిదారులను ఆకర్షించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ టూరిజం పాలసీ 2024-29 మార్గదర్శకాలను విడుదల చేసింది. స్టాంప్ డ్యూటీ, ఎస్‌జీఎస్టీలకు వంద శాతం మినహాయింపు ఇస్తూ.. పవర్ ఇన్‌సెంటివ్స్ భారీగా ఇస్తూ పాలసీని ఆకర్షణీయంగా తీర్చిదిద్దింది. ఈ రాయితీలన్నీ పెట్టుబడి ఆధారంగా ఉంటాయి. పాలసీ మార్గదర్శకాలకు సంబంధించి స్పెషల్ సీఎస్ అజయ్‌జైన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీటిని గత ఏడాది డిసెంబరు 10వ తేదీ నుంచి అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. 2029 డిసెంబరు 9వ తేదీ వరకూ ఇవి అమలులో ఉంటాయి. పర్యాటకంలో పెట్టుబడులను ఆరు రకాలుగా వర్గీకరించారు. పెట్టుబడి రూ.కోటి ఉంటే మైక్రో టూరిజం ప్రాజెక్టుగా, రూ.10 కోట్లు ఉంటే చిన్న టూరిజం ప్రాజెక్టుగా, రూ.50 కోట్లు ఉంటే మీడియం, రూ.250 కోట్లు ఉంటే లార్జ్, రూ.500 కోట్లు ఉంటే మెగా టూరిజం ప్రాజెక్టుగా పరిగణిస్తారు. రూ.500 కోట్లు కంటే ఎక్కువ ఉంటే అల్ట్రా మెగా టూరిజం ప్రాజెక్టుగా పరిగణిస్తారు. పర్యాటక శాఖ అధికారులు ఆరు నెలలకు ఒకసారి ప్రాజెక్టులను తనిఖీ చేస్తారు. జిల్లాస్థాయి స్క్రూటీనీ కమిటీ ఇచ్చిన వివరాల ఆధారంగా ఇన్సెంటివ్స్ నిర్ణయిస్తారు. దీని కోసం జిల్లాస్థాయిలో ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్ చైర్మన్‌గా, 12 మంది సభ్యులతో కమిటీని నియమిస్తారు. ఈ కమిటీ నివేదికను జిల్లా ఇండస్ట్రీస్ అండ్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ పరిశీలించి ప్రాజెక్టుకు అనుమతులు ఇస్తుంది. మైక్రో, చిన్న, మీడియం ప్రాజెక్టుల విషయంలో ఈ కమిటీదే తుది నిర్ణయం. లార్జ్, ఆ పైన పెట్టుబడులకు సంబంధించిన ప్రాజెక్టు నివేదికలను ఏపీ టూరిజం అథారిటీ జాయింట్ డైరెక్టర్ ప్రభుత్వానికి పంపించాలి. దీనికి కలెక్టర్ నేతృత్వంలో ప్రభుత్వం మరో కమిటీని నియమించింది.

స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్

పర్యాటక పెట్టుబడులకు సంబంధించిన ప్రాజెక్టులకు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కింద ఇన్సెంటివ్స్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. లార్జ్, మెగా, అల్ట్రా మెగా ప్రాజెక్టులకు ప్రభుత్వం ఇన్‌సెంటివ్స్ ఇస్తుంది. ప్రభుత్వం నిర్ణయించిన సమయానికి పూర్తి చేసిన ప్రాజెక్టులకే ఇది వర్తిస్తుంది. మైక్రో ప్రాజెక్టులకు రూ.25 లక్షలు, చిన్న ప్రాజెక్టుకు రూ.1.5 కోట్లు, మీడియా ప్రాజెక్టులకు రూ.7.5 కోట్లు, లార్జ్ ప్రాజెక్టులకు రూ.10 కోట్లు, మెగాకు రూ.25 కోట్లు, అల్ట్రా మెగాకు రూ.40 కోట్ల విలువైన ఇన్‌సెంటివ్స్ ప్రభుత్వం అందిస్తుంది.

లేపాక్షిలో రాయితీ అమ్మకాలు

అమరావతి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): దసరా నవరాత్రుల సందర్భంగా లేపాక్షి సంస్థ ప్రత్యేక రాయితీతో అమ్మకాలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ చైర్మన్ పి.హరిప్రసాద్ తెలిపారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని అన్ని లేపాక్షి షోరూమ్‌లతోపాటు హైదరాబాద్ షోరూమ్‌లో జరిపే అమ్మకాల్లో హ్యాండీక్రాఫ్ట్స్‌పై 15, హ్యాండ్లూమ్స్‌పై 10 శాతం రాయితీతో అమ్మకాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ దసరా పండుగ సమయంలో సమీపంలోని లేపాక్షి షోరూములను సందర్శించి కళాకారులను ప్రోత్సహించాలని కోరారు.

ఎర్రమట్టి దిబ్బల సర్వేకు హైకోర్టు ఉత్తర్వులు

- జీఎస్ఐ, రెవెన్యూ అధికారులతో కమిటీ
- కాంక్రీట్ రాళ్లతో కంచె వేయాలని అధికారులకు స్పష్టీకరణ
- క్షేత్రస్థాయి పరిస్థితులపై నివేదిక సమర్పించాలని ఆదేశం

అమరావతి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): విశాఖలోని ఎర్రమట్టి దిబ్బలను ఆక్రమణల నుండి రక్షించేందుకు హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్ఐ) ఇచ్చిన కోఆర్డినేట్స్‌ను ఆధారం చేసుకొని ఎర్రమట్టి దిబ్బలపై సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని జీఎస్ఐ, రెవెన్యూ ఉన్నతాధికారులను ఆదేశించింది. సర్వే అనంతరం కాంక్రీట్ రాళ్లతో కంచె ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. సర్వే నిర్వహణ కోసం జీఎస్ఐ, రెవెన్యూ శాఖల నుండి ఇద్దరేసి చొప్పున అధికారులను ఎంపిక చేయాలని పేర్కొంది. అధికారుల ఎంపిక ప్రక్రియను మూడు వారాల్లో పూర్తి చేసి నవంబరు మొదటి వారంలో సర్వే నిర్వహించాలని ఆదేశించింది. క్షేత్రస్థాయి పరిస్థితులపై నివేదిక సమర్పించాలని కమిటీకి స్పష్టం చేసింది. యునెస్కో సంస్థ ఎర్రమట్టి దిబ్బలను ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించిందని, ఈ నేపథ్యంలో ఆక్రమణకు గురికాకుండా కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొంది. పిటిషన్‌పై తదుపరి విచారణను నవంబరు 19కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. విశాఖ జిల్లా, భీమునిపట్నం మండలం, నేరెళ్లవలస గ్రామం పరిధిలోని సర్వే నం.118/5ఏ, సర్వే నం.49/1 ఎర్రమట్టి దిబ్బలను హెరిటేజ్ సైట్‌గా ప్రకటిస్తూ జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా జారీ చేసిన నోటిఫికేషన్‌ను అమలు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ జనసేన కార్పొరేటర్ పీవీఎల్ఎన్ మూర్తి యాదవ్, టి.శంకరరావు హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఎర్రమట్టి దిబ్బలు ఉన్న ప్రాంతాన్ని ఇళ్ల నిర్మాణం కోసం భీమునిపట్నం మ్యూచ్యువల్ ఎయిడెడ్ కో ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీకి కేటాయిస్తూ ఇచ్చిన జీవోలను రద్దు చేయాలని కోరారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి వాదనలు వినిపిస్తూ... ఎర్రమట్టి దిబ్బలను హెరిటేజ్ సైట్‌గా ప్రకటిస్తూ 2014లో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. ఎర్రమట్టి దిబ్బలకు హద్దులు నిర్ణయించేందుకు కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. భీమునిపట్నం మ్యూచ్యువల్ ఎయిడెడ్ కో ఆపరేటివ్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ... 'ఇళ్ల నిర్మాణం కోసం సొసైటీకి మొత్తం 373 ఎకరాలు కేటాయిస్తూ ప్రభుత్వం 2012లో జీవో ఇచ్చింది. అందులోని 91 ఎకరాలను తిరిగి వెనక్కి ఇచ్చాం. హెరిటేజ్ సైట్‌లో మేం ఎలాంటి తవ్వకాలు, నిర్మాణాలు జరపడం లేదు' అని తెలిపారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) ఎస్.ప్రణతి వాదనలు వినిపిస్తూ... ఎర్రమట్టి దిబ్బల పరిధిలోకి వచ్చే ప్రాంతంలో ఎలాంటి తవ్వకాలు జరపవద్దని జీవీఎంసీ స్టాప్ వర్క్ ఆర్డర్ ఇచ్చిందన్నారు.

ఐదు జిల్లాలకు సీనరేజీ టెండర్లు ఖరారు

అమరావతి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గనుల శాఖ పరిధిలో ఐదు ఉమ్మడి జిల్లాల్లో సీనరేజీ కలెక్షన్ కాంట్రాక్టులు ఖరారయ్యాయి. మొన్నటి వరకు గుంటూరు జిల్లా కాంట్రాక్ట్ చేసిన ఏఎంఆర్ సంస్థకు ఈ సారి నాలుగు జిల్లాల టెండర్ దక్కింది. గనుల శాఖ ఇటీవల ఉమ్మడి విశాఖపట్నం, పశ్చిమగోదావరి, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు జిల్లాలకు టెండర్లు పిలిచిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో విశాఖపట్నం, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు జిల్లాల టెండర్లు ఏఎంఆర్ సంస్థ దక్కించుకోగా.. కర్నూలు జిల్లా టెండర్ సుధాకర్ ఇన్‌ఫ్రాకు వెళ్లింది. ఇంతకు ముందు సుధాకర్ ఇన్‌ఫ్రా తూర్పుగోదావరి కాంట్రాక్ట్ చేసింది. త్వరలో మిగిలిన జిల్లాలకు కూడా టెండర్ల ప్రక్రియ ఖరారు కానుందని అధికార వర్గాలు తెలిపాయి.

'మంగళగిరి గోల్డ్ క్లస్టర్'కు కాంపిటెంట్ అథారిటీ

అమరావతి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి గోల్డ్ క్లస్టర్ ల్యాండ్‌పూలింగ్ స్కీమ్-2025 అమలుకు తెనాలి సబ్‌కలెక్టర్‌ను కాంపిటెంట్ అథారిటీగా నియమిస్తూ మున్సిపల్‌శాఖ, పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీచేసింది. మంగళగిరిలో గోల్డ్ క్లస్టర్ ఏర్పాటు చేసేందుకు సీఆర్‌డీఏ ఇప్పటికే ఆత్మకూరు గ్రామంలో 78.01 ఎకరాలను కేటాయించింది. కాంపిటెంట్ అథారిటీ గుంటూరు కలెక్టర్ పరిధిలో పనిచేస్తూ ల్యాండ్‌పూలింగ్ పథకాన్ని అమలు చేస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కాపాడమంటే కాటేసిన ఖాకీలు!

- కూల్‌డ్రింక్‌లో మత్తుమందు కలిపి అఘాయిత్యం
- ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరింపులు
- చిత్తూరు జిల్లాలో వివాహితపై దారుణం
- కానిస్టేబుల్, హోంగార్డుపై కేసు నమోదు

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): భర్త వేధింపులు భరించలేక కాపాడాలంటూ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన వివాహితను ఖాకీలే కాటేశారు. చిత్తూరు జిల్లా పలమనేరుకు చెందిన బాధితురాలు బుధవారం చిత్తూరులో మీడియాకు ఆ వివరాలు వెల్లడించారు. 'భర్త తరచూ గొడవపడుతూ పెట్రోల్ పోసి కాల్చేస్తానని బెదిరిస్తుండటంతో పలమనేరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్లాను. అక్కడ హోంగార్డుగా పనిచేసే కిరణ్ కుమార్ నా మొబైల్ తీసుకుని, నీకు న్యాయం చేయాలంటే నాతో మాట్లాడాలని చెప్పి, మానసికంగా ఇబ్బంది పెట్టాడు. కిరణ్‌కుమార్ ఇబ్బంది పెడుతున్నాడని బంగారుపాళ్యం పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఉమాశంకర్ అనే కానిస్టేబుల్‌కు చెప్పాను. ఆయన కూడా న్యాయం చేస్తానంటూనే మానసికంగా వేధించాడు. బ్లాక్‌మెయిల్ చేశాడు. కూల్‌డ్రింక్‌లో మత్తు మందు కలిపి నాపై అత్యాచారం చేశాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే నన్ను, నా పిల్లలను పెట్రోల్ పోసి కాల్చేస్తానని బెదిరిస్తున్నాడు. ఈ నెల 13న జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశా. మామీదే ఫిర్యాదు చేస్తావా అని హోంగార్డు, కానిస్టేబుల్ బెదిరిస్తున్నారు. మూడు నెలలుగా వీరిద్దరి వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకోవాలనుకుంటున్నా. ఎస్పీ స్పందించి నాకు న్యాయం చేయాలి' అని బాధితురాలు కన్నీటి పర్యంతమయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు హోంగార్డు కిరణ్‌కుమార్, కానిస్టేబుల్ ఉమాశంకర్‌పై బుధవారం కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ డి.ప్రభాకర్ తెలిపారు. బాధితురాలు ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జాబ్ చార్ట్‌పై చట్ట సవరణ

- వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీకి విద్యా బాధ్యతలు తొలగింపు

అమరావతి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉద్యోగుల జాబ్ చార్ట్‌ను రాష్ట్ర ప్రభుత్వం సవరించింది. వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ ఉద్యోగులకు ఎడ్యుకేషన్ బాధ్యతలను తొలగిస్తూ ప్రభుత్వం చట్ట సవరణ చేసింది. ఇక నుంచి పట్టణాల్లో పనిచేసే వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీని ఇక నుంచి వార్డు డేటా ప్రాసెసింగ్ సెక్రటరీగా పిలవనున్నారు. ఆ మేరకు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి అసెంబ్లీలో సవరణ బిల్లును ప్రవేశపెట్టగా సభ ఆమోదించింది. వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ.. వారంలో రెండు రోజులు పాఠశాలల విజిట్‌కు వెళ్తుండడంతో ఆ రోజుల్లో సచివాలయాల్లో గ్రీవెన్స్ తీసుకునే వాళ్లు లేక నగర ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సర్కారు గుర్తించింది. అందుకే వార్డు సచివాలయాల్లో పని చేసే వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీకి ఇక ఎడ్యుకేషన్ బాధ్యతలు తొలగించి కేవలం డేటా ప్రాసెసింగ్ సెక్రటరీగానే విధులు నిర్వహించేలా చట్ట సవరణ చేపట్టారు.

చిత్రజ్యోతి
SINCE 1965

ఓజీ టికెట్ ధరల పెంపును రద్దు చేసిన టీ హైకోర్టు



ఏపీ డిప్యూటీ సీఎం, ప్రముఖ నటుడు పవన్ కల్యాణ్ నటించిన 'ఓజీ' సినిమా టికెట్ ధరల పెంపునకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌ను హైకోర్టు సస్పెండ్ చేసింది. అలాగే, ఓజీ సినిమాకు సెన్సార్ ఏ సర్టిఫికెట్ ఇచ్చిన నేపథ్యంలో 18 ఏళ్లలోపు పిల్లలను సినిమాకు అనుమతించరాదని, వారికి టికెట్లు విక్రయించకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. 'ఓజీ' సినిమా టికెట్ ధరలు పెంచుకునేలా హోంశాఖ ముఖ్యకార్యదర్శి ఈ నెల 19న జారీ చేసిన మెమోను సవాల్ చేస్తూ బర్ల మల్లేశ్ యాదవ్ అనే న్యాయవాది దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదిస్తూ.. 2021లో రాష్ట్ర ప్రభుత్వం టికెట్ ధరలను నిర్ధారిస్తూ జీవో 120 జారీ చేసిందని.. సదరు జీవో ప్రకారమే టికెట్ రేట్లు వసూలు చేయాలని ఇదే హైకోర్టు డివిజన్ బెంచ్ స్పష్టం చేసిందని గుర్తు చేశారు. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రీమియర్ షోకు ఒక్కో టికెట్‌కు రూ.800, అక్టోబరు 4 వరకు ప్రదర్శించే మిగితా షోలకు టికెట్ ధరలు పెంచుకునేందుకు వీలుగా ప్రభుత్వం జారీ చేసిన మెమోను సస్పెండ్ చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే 18 ఏళ్లలోపు పిల్లలకు ఓజీ సినిమా టికెట్లు విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ అక్టోబరు 9కి వాయిదా పడింది.

హైదరాబాద్, ఆంధ్రజ్యోతి

జైలర్ సాబ్ వచ్చేది అప్పుడే!



రజనీకాంత్ హీరోగా 2023లో వచ్చిన 'జైలర్' చిత్రం పాన్ ఇండియా స్థాయిలో బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన విషయం తెలిసిందే. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో దీనికి కొనసాగింపుగా 'జైలర్ 2' తెరకెక్కుతోంది. ప్రస్తుతం చిత్రబృందం కేరళలో మరో షెడ్యూల్‌ను పూర్తి చేసింది. నెల రోజుల పాటు సాగిన ఈ షెడ్యూల్‌లో పాలక్కాడ్‌లో భారీ పోరాట ఘట్టాలతో సాగే క్లైమాక్స్ సీక్వెన్స్‌ను తెరకెక్కించారు. షూటింగ్ పూర్తవడంతో రజనీకాంత్ కేరళ నుంచి చెన్నై తిరిగొచ్చారు. ఈ చిత్రంలో రమ్యకృష్ణ, యోగిబాబు, ఎస్ జే సూర్య కీలకపాత్రలు పోషిస్తున్నారు. మోహన్‌లాల్, మిథున్ చక్రవర్తి అతిథి పాత్రల్లో కనిపించనున్నారు. వచ్చే ఏడాది జూన్ 12న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

వినోదం పంచే భూతం



ఒక భూతం బారిన పడిన ఐదుగురు కుర్రాళ్ళకు ఎదురైన భయానక అనుభవాల నేపథ్యంలో సృజన ప్రొడక్షన్స్ బేనర్‌పై బి. వెంకటేశ్వరరావు నిర్మించిన చిత్రం 'భూతం ప్రేతం'. రాజేశ్ ధృవ దర్శకుడు. యాదమ్మ రాజు, గల్లీబాయ్ భాస్కర్, గడ్డం నవీన్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. ఈ చిత్రం టైటిల్, ఫస్ట్‌లుక్, గ్లింప్స్‌ను బుధవారం దర్శకుడు అనిల్ రావిపూడి చేతుల మీదుగా యూనిట్ విడుదల చేసింది. ప్రేక్షకులను నవ్వించడంతో పాటు ఉత్కంఠకు గురిచేసే థ్రిల్లింగ్ అంశాలతో ఈ చిత్రం తెరకెక్కింది అని దర్శకుడు తెలిపారు. ఈ ఏడాది ఆఖరిలో 'భూతం ప్రేతం' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామని నిర్మాత తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: గిరీశ్ హోతుర్, సినిమాటోగ్రఫీ: యోగేశ్ గౌడ్.

భక్తిశ్రద్ధలతో...



దసరా నవరాత్రుల సందర్భంగా వారాహి అమ్మవారిపై చిత్రీకరించిన పాట 'వారాహి శరణు'. రంగనాథ్, సర్వజ్ఞ ఈ పాటను చిత్రీకరించగా, మాతంగి మూవీ మేకర్స్‌పై ధాత్రి నిర్మించారు. త్వరలోనే పాటను విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈ పాటకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ధాత్రి మాట్లాడుతూ 'మాకెంతో ఇష్టమైన వారాహి దేవికి ఈ పాటను భక్తిశ్రద్ధలతో అంకితం ఇస్తున్నాం. ఇప్పటికే పలు ప్రాజెక్టులను మొదలుపెట్టాం. మా సినీ ప్రయాణానికి అమ్మవారి ఆశీస్సులు తోడుంటాయని ఆశిస్తూ ఈ పాటను రూపొందించాం' అని చెప్పారు.

భయపెట్టే లవ్‌స్టోరీ



నాగప్రణవ్, కావేరి కర్ణిక, ఆధ్యరెడ్డి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఓ చెలియా'. ఎస్ఆర్ఎస్ మూవీ క్రియేషన్స్, ఇందిరా దేవి ప్రొడక్షన్స్ బేనర్స్‌పై రూపాశ్రీ కొపురు నిర్మిస్తున్నారు. ఎం. నాగ రాజశేఖర్‌రెడ్డి దర్శకుడు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలు పెంచాయి. బుధవారం నటుడు శ్రీకాంత్ టీజర్‌ను విడుదల చేసి, సినిమా ఘన విజయం అందుకోవాలని ఆకాంక్షించారు. హారర్, లవ్, యాక్షన్ అంశాల మేళవింపుగా ఈ చిత్రం తెరకెక్కుతోందని టీజర్‌ను బట్టి తెలుస్తోంది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'హారర్ కాన్సెప్ట్ నేపథ్యంలో ఒక చక్కటి ప్రేమకథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాము, దెయ్యాల నేపథ్యంలో ఆద్యంతం ఉత్కంఠభరితంగా కథ సాగుతుంది' అని తెలిపారు. త్వరలో ట్రైలర్‌ను విడుదల చేసి, రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తామని నిర్మాత చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: ఎం.ఎం కుమార్, సినిమాటోగ్రఫీ: సురేశ్ బాలా.







పరమేశ్వరుడికే అన్నప్రసాదాన్ని భిక్షగా పెట్టిన అన్నపూర్ణాదేవి అలంకారంలో దుర్గమ్మ బుధవారం దర్శనమిచ్చారు. జగన్మాతను కరుణా, కటాక్షాల కోసం ఇంద్రకీలాద్రికి భక్తులు పోటెత్తారు. 19,159 మంది అన్నప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం దుర్గమ్మ నగరోత్సవం కనుల పండువగా సాగింది. అశేష జనవాహిని మేళతాళాలతో ముందుకు సాగింది. అంతటా ఆధ్యాత్మిక వెలుగులు విరజిమ్మాయి.

అన్నపూర్ణాదేవిగా దుర్గమ్మ



భక్తులకు అన్నం వడ్డిస్తున్న సేవకులు

మాతాన్నపూర్ణేశ్వరి

ఇంద్రకీలాద్రికి పోటెత్తుతున్న భక్తులు





అన్నపూర్ణాదేవి అలంకారంలో అమ్మ దర్శనం

అన్నప్రసాదాన్ని స్వీకరించిన భక్తజనం



ఆదిశక్తిగా నృత్య అభినాయం

(ఆంధ్రజ్యోతి - విజయవాడ): ఇంద్రకీలాద్రికి భక్తుల రద్దీ కొనసాగుతోంది. కనకదుర్గమ్మ బుధవారం శ్రీ అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారు జామున నాలుగు గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతించారు. రాత్రి ఏడు గంటల సమయానికి అమ్మవారిని 66,177 మంది దర్శించుకున్నారు. మొత్తం 19,159 మంది అన్నప్రసాదాన్ని స్వీకరించారు. వినాయకుడి ఆలయం, కుమ్మరిపాలెం వైపు నుంచి క్యూలైన్లలో వచ్చిన భక్తులకు దర్శనం పూర్తికావడానికి గంట సమయం పట్టింది. తెల్లవారుజాము నుంచి ఉదయం తొమ్మిది గంటల వరకు క్యూలు ఖాళీగా ఉన్నాయి. పది గంటల నుంచి ఒక్కసారిగా అన్ని క్యూలు కిటకిటలాడుతున్నాయి. ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. దీంతో అధికారులు మధ్యాహ్నం 3-5 గంటల వరకు వీఐపీ స్లాట్‌ను రద్దు చేశారు. ఉపరాష్ట్రపతి రాకతో 15-20 నిమిషాల పాటు భక్తులను దర్శనానికి అనుమతించలేదు. కాగా, కనకదుర్గమ్మ గురువారం శ్రీకాత్యాయని అలంకారంలో దర్శనమిస్తారు. కొన్నాళ్ల తర్వాత అమ్మవారిని ఈ అవతారంలో అలంకరిస్తున్నారు. 11 ఏళ్ల క్రితం కనకదుర్గమ్మ కాత్యాయని అమ్మవారి అలంకారంలో దర్శనమిచ్చారు. తిథులు హెచ్చుతగ్గులు రావడంతో ఈ ఏడాది శరన్నవరాత్రులను 11 రోజులపాటు నిర్వహించాలని వైదిక కమిటీ నిర్ణయించింది. సాధారణంగా శరన్నవరాత్రులు పది రోజులపాటు సాగుతాయి. ఈ ఏడాది 11 రోజులు శరన్నవరాత్రులు రావడంతో అమ్మవారికి శ్రీకాత్యాయని అలంకారం చేయనున్నారు. తెల్లవారు జామున నాలుగు గంటల నుంచి అమ్మవారు ఈ అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు.



భక్తులకు నమస్కరిస్తున్న ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ దంపతులు

విజయవాడకు ఉజ్వల భవిష్యత్తు


వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరం ● ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

విజయవాడ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో విజయవాడకు ఉజ్వల భవిష్యత్తు ఉందని ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ వ్యాఖ్యానించారు. దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో విజయవాడ ఒకటిగా ఉందన్నారు. కనకదుర్గమ్మను దర్శించుకున్న అనంతరం ఆయన మీడియా పాయింట్‌లో మాట్లాడారు. శరన్నవరాత్రుల్లో అమ్మవారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించానన్నారు. త్వరలో విజయవాడ అద్భుతంగా అభివృద్ధిని సాధిస్తుందని ఆకాంక్షించారు.

గూగుల్ కెమెరాతో

అడ్డంగా బుక్కయ్యారు!

వన్యప్రాణుల వేట వ్యవహారంలో అటవీశాఖపై విమర్శలు



దుప్పి కళేబరం ఉన్న జియో కోఆర్డినేట్స్ మార్కింగ్ చేసిన ప్రాంతం



అటవీ అధికారులు పరిశీలన జరిపిన జియో కో ఆర్డినేట్స్ మార్కింగ్ చేసిన ప్రాంతం

- కొండపల్లి రిజర్వు ఫారెస్ట్‌లో వన్యప్రాణులను వేటాడుతున్నారని ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో కథనం
- అవి ఇంటర్ నెట్ ఫొటోలంటూ అటవీశాఖ అధికారుల ఎదురుదాడి
- మంగళవారం ఉచ్చులో పడిన దుప్పి ఫొటోలు వెలుగులోకి రావడంతో డైలమాలో అధికారులు
- మళ్లీ కొండపల్లి రిజర్వు ఫారెస్ట్‌ను సందర్శించిన అటవీశాఖ అధికారులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): కొండపల్లి రిజర్వు ఫారెస్ట్‌లో వన్యప్రాణుల వేట అబద్ధమంటూ ఎదురుదాడి చేసిన అటవీ శాఖ అధికారులు అడ్డంగా దొరికిపోయారు. వేటగాళ్లు ఉచ్చు పన్నటం లేదని, దుప్పులు వంటివి అస్సలు మిగతా 8లో..

గాయని గీతామాధురి



వినోదభరితం

వైభవంగా విజయవాడ ఉత్సవ్ సంబరాలు

- బాణసంచా ఫైరింగ్‌తో ప్రకాశించిన పున్నమి ఘాట్
- ఆకాశంలో ఆకట్టుకున్న డ్రోన్ షో
- అమ్మ రూపాలు, ఆభరణాలు, ప్రకాశం బ్యారేజీ నమూనాల ఆవిష్కరణ
- మధురగానంతో అలరించిన సినీ గాయని గీతా మాధురి

పున్నమిఘాట్‌లో జనసందోహం



అట్టహాసంగా విజయవాడ ఉత్సవ్ సంబరాలు కొనసాగుతున్నాయి. కళ్లు చెదిరేలా ఆకాశంలో డ్రోన్ షో ప్రదర్శించారు. మధురగానంతో గీతా మాధురి ఆలపించిన పాటలు యువతను ఉర్రూతలూగించాయి. ఆద్యాంతం వినోదభరితంగా పున్నమిఘాట్‌లో కార్యక్రమాలు సాగాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ /విజయవాడ కల్చరల్): సంగీతం, నృత్యం, శాస్త్రీయ ప్రదర్శనలతో కళాకారుల ప్రతిభకు పున్నమిఘాట్ వేదికగా మారింది. సినీ గాయని గీతామాధురి పలు భక్తిగీతాలను ఆలపించి ప్రేక్షకుల్లో ఆధ్యాత్మిక భావాన్ని నింపారు. మెలోడీ నుంచి మాస్ బీట్‌ల వరకు పాటలతో ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. విజయవాడ ఉత్సవ్- 2025లో భాగంగా బుధవారం మూడవ రోజు కార్యక్రమాలు అద్భుతంగా సాగాయి. ఆద్యంతం యువతలో జోష్ నింపాయి. శ్రవ్య మానస బృందం చేసిన నృత్యం ఆకట్టుకుంది. ఆంజనేయ విశ్వ స్వరూపం, నరసింహ మిగతా 8లో..

దుర్గమ్మ అవతారాలు ధైర్యం, విజయానికి ప్రతీకలు 8
● కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్
కళా సంగమం 10



అమ్మ సన్నిధిలో..


కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌కు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో.. చిత్రంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ ఎంపీ కేశినేని శివనాథ్

దుర్గమ్మ అవతారాలు
ధైర్యం, విజయానికి ప్రతీకలు

» సాంస్కృతిక వైభవానికి ప్రతిరూపం విజయవాడ ఉత్సవ్

» కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్

విజయవాడ సిటీ/లబ్బీపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : 'విజయవాడ ఉత్సవ్' ద్వారా 3వేల మంది కళాకారులు, 250కు పైగా సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించటం అద్భుతమైన విషయం. మన తెలుగు సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతిబింబాలైన పండగలు మన జీవన సంస్కృతికి ప్రతీకలు' అని కేంద్ర పర్యాటకశాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అన్నారు. విజయవాడ ఉత్సవ్ వేడుకల్లో పాల్గొన్న కేంద్ర మంత్రి మాట్లాడుతూ, దసరా సందర్భంగా సంప్రదాయ, సాంస్కృతిక, ఆధ్యాత్మిక శోభతో విజయవాడ మెరిసిపోతుండటాన్ని ప్రశంసించారు. "విజయవాడ రావటం నాకు చాలా సంతోషంగా ఉంది. దుర్గమ్మ తొమ్మిది అవతారాలు ధైర్యం, విజయం, శక్తికి ప్రతీకలు. ప్రతి ఏడాది ఇంద్రకీలాద్రిపై జరిగే శరన్నవరాత్రి ఉత్సవాలు ఎంతో వైభవంగా ఉంటాయి" అని షెకావత్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వాన్ని షెకావత్ ప్రశంశించారు. "ఆయన ఒక డైనమిక్ లీడర్. రాష్ట్రంలో టూరిజం అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. అమరావతిని ప్రపంచ నగరాల్లో ఒకటిగా తీర్చిదిద్దడానికి సీఎం కృషి చేస్తున్నారు.. పరిశుభ్రత, ఆధ్యాత్మికతలో విజయవాడ వేగంగా అభివృద్ధి చెందుతోంది" అని అన్నారు. 'వికసిత భారత కోసం ప్రధాని కృషి చేస్తున్నారు. అదే దిశలో వికసిత ఆంధ్రప్రదేశ్ కోసం సీఎం చంద్రబాబు ముందుకు తీసుకువెళ్తున్నారు. కలిసి మాట్లాడుదాం, కలిసి ముందుకు సాగుదాం" అని షెకావత్ పిలుపునిచ్చారు.

దుర్గమ్మను దర్శించుకున్న కేంద్రమంత్రి..

దసరా ఉత్సవాల్లో భాగంగా కేంద్ర మంతి గజేంద్రసింగ్ షెకావత్ బుధవారం అమ్మవారిని దర్శించుకున్నారు. అయనతో పాటు మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ కేశినేని శివనాథ్‌లు దర్శించుకున్నారు. మంత్రిని అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతించి, దర్శనం అనంతరం వేదపండితులు అశీర్వచనలు, అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం మీడియా పాయింట్ వద్ద కేంద్ర మంత్రి షెకావత్ మాట్లాడుతూ దసరా ఉత్సవాల్లో అమ్మవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు.

ఏర్పాట్లు బాగున్నాయి : రఘురామకృష్ణరాజు



చిట్టినగర్ : దసరా శరన్నవరాత్రుల్లో అమ్మవారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందని, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కమిషనర్ రామచంద్రమోహన్, ఈవో శీనానాయక్ నేతృత్వంలో నవరాత్రి ఉత్సవ నిర్వహణ ఏర్పాట్లు బాగా చేశారని శాసన సభ ఉపసభాపతి కనుమూరి రఘురామ కృష్ణరాజు అన్నారు. బుధవారం ఆయన అన్నపూర్ణాదేవి అలంకృత జగన్మాతను దర్శించుకున్నారు. దర్శనానంతరం అమ్మవారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలను వేద పండితులు అందజేశారు. అయనతోపాటు చిత్తూరు శాసనసభ్యుడు గురజాల జగన్మోహన్ జగన్మాతను దర్శించుకున్నారు.

పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష

సాధారణ భక్తుల దర్శనాలకు పెద్దపీట వేసస్తున్నామని మాటల్లో కాకుండా చేతల్లో చూపుతున్న కూటమి ప్రభుత్వం నవరాత్రి ఉత్సవాలకు చేసిన ఏర్పాట్ల పట్ల ప్రజలు ఆనందంగా ఉన్నారని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ఇంద్రకీలాద్రిపై జగన్మాతను ఆమె దర్శించుకున్నారు. అలాగే ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను అన్నపూర్ణాదేవి అలంకారంలో మాజీ మంత్రి రోజా దర్శించుకొని పూజలు చేశారు.



ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ బుధవారం అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మూడో రోజున భక్తులు పోటెత్తారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు, పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు.





'అమ్మ' సేవలో..

సృష్టిలో అమ్మ ప్రేమను మించింది లేదనడానికీ, అమ్మ త్యాగానికి సాటి మరేది రాదన్నదానికి నిలువెత్తు నిదర్శనం ఈ చిత్రం. ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాల్లో విధులు నిర్వహించేందుకు వచ్చిన ఓ మహిళా కానిస్టేబుల్ తన ఏడాదిలోపు పసికందును కడుపునకు ఒత్తుకుని విధులు నిర్వహిస్తు.. దుర్గమ్మ భక్తులకు సేవలను అందిస్తోంది. - పాయకాపురం


అన్నపూర్ణా దేవి అలంకారంలో దుర్గమ్మను దర్శించుకుంటున్న భక్తులు

శ్రీకాళహస్తి దేవస్థానం తరపున
అమ్మవారికి పట్టు వస్త్రాలు, సారె సమర్పణ



ఇంద్రకీలాద్రి : అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన దుర్గమ్మకు శ్రీకాళహస్తి దేవస్థానం తరఫున పట్టు వస్త్రాలు, సారెను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ కుమార్, శ్రీకాళహస్తి దేవస్థాన ఈవో టి.బాపిరెడ్డి సమర్పించారు. శ్రీజ్ఞాన ప్రసూనాంబిక సమేత శ్రీకాళహస్తీశ్వర ఆలయం నుంచి అమ్మవారికి పట్టు వస్త్రాలు, సారె సమర్పించడం ఆనవాయితీ అని ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండి, అభివృద్ధి పథంలో సాగాలని అమ్మవారిని ప్రార్థించినట్టు చెప్పారు. ఈ సందర్భంగా ఈవో శీనానాయక్, అర్చక బృందం వారికి స్వాగతం పలికారు. కాళహస్తీశ్వరుడు, జ్ఞాన ప్రసూనాంబల ఫోటోను, శేషవస్త్రంను ఈవో శీనానాయక్‌కు అందజేశారు. ప్రసాదం, అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రం, ఆశీస్సులు అందజేశారు.

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో దసరా మహోత్సవాలలో రెండోరోజు మంగళవారం దేవస్థానానికి వివిధ రూపాలలో మొత్తం రూ.31,30,960లు ఆదాయం సమకూ

ఆదాయం రూ.31.30 లక్షలు

రినట్టు దేవస్థానం ఈవో వీకే శీనానాయక్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రూ.300లు టిక్కెట్‌ల ద్వారా రూ.10,56,300లు, రూ.100లు టిక్కెట్ల ద్వారా రూ.3,46,400లు, లడ్డూప్రసాదం (ఒక్కొక్క లడ్డూ రూ.15లు) ద్వారా రూ.2,98,870లు, రూ.100ల లడ్డూ ద్వారా రూ.11,89,800లు లభించినట్లు పేర్కొన్నారు. పరోక్ష ప్రత్యేక కుంకుమార్చనల (టిక్కెట్టు రూ.3వేలు) టిక్కెట్టుల ద్వారా రూ.93వేలు, పరోక్ష ప్రత్యేక కుంకుమార్చన (టిక్కెట్టు రూ.5వేలు) టిక్కెట్‌ల ద్వారా రూ.45వేలు, ప్రత్యేక ఖడ్గమాలార్చన (టిక్కెట్ రూ.5,116లు) టిక్కెట్ల ద్వారా రూ.25,580లు, పుస్తకాలు, ఫోటోలు, క్యాలెండర్ల ద్వారా రూ.10,325లు, తలనీలాల సమర్పణకు (టిక్కెట్‌రూ.40) టిక్కెట్ల ద్వారా రూ.39,520లు, ప్రసాదం విక్రయం ద్వారా యుపిఐలో జమ అయిన రూ.22,315లు, ఇతరత్రా ఆదాయం రూ.3,850లు మొత్తం కలిపి రూ.31,30,960లు లభించినట్టు ఈవో వివరించారు.

భారీ వర్షం .. తడిసి ముద్దయిన భక్తులు

(ఆంధ్రజ్యోతి, లబ్బీపేట) : ఇంద్రకీలాద్రిపై బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో క్యూ లైన్‌లో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. క్యూలైన్ పై కప్పు నుంచి వర్షపునీరు కారడంతో భక్తులు మొత్తం తడిసిపోయారు. దాదాపుగా 10 నిమిషాల పాటు ఏకధాటిగా భారీ వర్షం దంచి కొట్టింది. తర్వాత వర్షం ఆగడంతో భక్తులు ఊపిరి పీల్చుకున్నారు. యధావిధిగా దర్శనాలు చేసుకున్నారు.

బుధవారం రాత్రి వర్షం కారణంగా ఇంద్రకీలాద్రిపై క్యూలో ఇబ్బందులు పడుతున్న భక్తుల



సెల్ఫీ టైమ్..







అన్నపూర్ణ సన్నిధిలో..


అమ్మవారి దర్శనానంతరం అన్నప్రసాదం తీసుకుంటున్న భక్తులు


రథం సెంటర్ వద్ద భక్తుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న హిజ్రాలు

హిజ్రాలతో భక్తుల ఇక్కట్లు!

విజయవాడ రూరల్ : దసరా ఉత్సవాలకు వచ్చిన భక్తులకు హిజ్రాల నుంచి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అమ్మవారి దర్శనం అనంతరం కొండ దిగి వచ్చిన భక్తుల కోసం మార్గమధ్యలో హిజ్రాలు కాపుకాసి ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ప్రసాదం కౌంటర్ల నుంచి బయటకు వచ్చిన దగ్గర నుంచి రథం సెంటర్ వరకు హిజ్రాలు గ్రూపులుగా చేరి భక్తుల నుంచి డబ్బులు వసూళ్లు చేస్తున్నారు. కొందరు భక్తులు ఇష్టపడి ఇస్తే.. మరికొందరు అయిష్టంగానే ఎంతో కొంత నగదు చేతిలో పెట్టి వెళ్లాల్సి వస్తున్నది. అయితే సమీపంలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు కూడా వీరికి అడ్డుచెప్పకపోవడంతో భక్తుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి.

విశ్వనాథ వీరంగం!

» ఇంద్రకీలాద్రిపై తలుపులమ్మ ఆలయ ఈవో ఓవరాక్షన్

» కానిస్టేబుల్ పట్ల అవమానకర ప్రవర్తన


కానిస్టేబుల్ మెడలో కార్డు లాగేస్తున్న విశ్వనాథరాజు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) కాకినాడ జిల్లా తలుపులమ్మ దేవస్థానం ఈవో విశ్వనాథరాజు ఇంద్రకీలాద్రిపై వీరంగం చేశారు. దేవస్థానంలో మొత్తం పెత్తనం తనదే అన్నట్టుగా వ్యవహరించారు. వీఐపీ క్యూ మార్గంలో కానిస్టేబుల్ పట్ల అనుచితంగా ప్రవర్తించారు. వన్ టౌన్ కానిస్టేబుల్ గురువులు ఇంద్రకీలాద్రిపై ప్రొటోకాల్ వ్యవహారాలు చూస్తున్నారు. అధికారులు గురువులుకు డ్యూటీ పాస్‌ను జారీచేశారు. విధి నిర్వహణలో భాగంగా గురువులు వీఐపీ క్యూ వద్ద నుంచి రాజగోపురం వైపునకు వెళ్తుండగా అక్కడే ఉన్న విశ్వనాథరాజు గేటు దగ్గర ఆపారు. తాను పోలీసు కానిస్టేబుల్‌నని గురువులు చెప్పారు. మెడలో వేసుకున్న డ్యూటీపాస్‌ను విశ్వనాథరాజుకు చూపించారు. పాస్ ఫొటోలో ఉన్నది నువ్వేనా.. అంటూ దురుసుగా మాట్లాడారు. పాస్‌ను తెంచేశారు. దీనితో గురువులు జేబులో ఉన్న పోలీసుశాఖ గుర్తింపుకార్డును చూపగా చిత్కారంగా మాట్లాడుతూ గురువులపై విశ్వనాథరాజు వీరంగం చేస్తుండటంతో చుట్టుపక్కల ఉన్న అధికారులు, మీడియా ప్రతినిధులు ఇదేం పద్ధతి అని ప్రశ్నిస్తుండగా సమాధానం చెప్పకుండా విశ్వనాథరాజు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఒక దేవస్థానానికి ఈవో హోదాలో ఉన్న అధికారి ఇలా ప్రవర్తించడంపై క్యూల్లో ఉన్న భక్తులు విస్తుపోయారు.

కుర్చీల కోసం సేవకుల నిరసన!

» దసరా ఉత్సవ సేవా సభ్యుల తీరుపై భక్తుల ఆగ్రహం

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : శరన్నవరాత్రి ఉత్సవాలలో అమ్మవారిని దర్శించుకోవటానికి వచ్చే భక్తులకు సేవలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం దసరా ఉత్సవాల సేవా సభ్యులను నియమిస్తే.. తమకు మరిన్ని సౌకర్యాలు కల్పించాలని కోరుతూ మంగళవారం కొండపై చిన్నరాజగోపురం వద్ద సేవాసభ్యులు నిరసన వ్యక్తం చేసిన


కొండపై తమకు కుర్చీలు కేటాయించాలంటూ కింద కూర్చుని నిరసన వ్యక్తం చేస్తున్న దసరా ఉత్సవాల సేవా సభ్యులు

సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం దుర్గగుడిపై దసరా ఉత్సవాలను పురస్కరించుకుని భక్తులకు సేవలు అందించేందుకు 96మంది సభ్యులతో దసరా ఉత్సవాల సేవా కమిటీని నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఉత్సవాల ప్రారంభం మొదటిరోజులోనే సభ్యులకు దేవస్థానం అధికారులు ఇద్దరు అటెండర్లను నియమించారు. వారికి కావాల్సిన వసతులు కల్పించారు. మొదటిరోజునే దేవస్థానంపై హడావుడి చేస్తూ తమవెంట పదుల సంఖ్యలో జనాన్ని తీసుకువెళ్లి దర్శనాలను చేయించారు. రెండోరోజు నుంచి తమను కొండదిగువన మహామండపం నుంచి లిఫ్ట్‌ల ద్వారా పోలీసులు పైకి రాకుండా అడ్డుకుంటున్నారని, పోలీసులను అడ్డుకోకుండా చర్యలు తీసుకోవాలని ఆలయ అధికారులకు సూచించారు. అలాగే ప్రతిరోజూ ఒక్కొక్కరికి 30 వీఐపీ టిక్కెట్లు కేటాయించాలని, కొండపై చిన్న రాజగోపురం వద్ద ప్రత్యేకంగా తమకు కుర్చీలు ఏర్పాటు చేయాలని దేవస్థానం అధికారులకు సూచించారు. దేవస్థానం అధికారులు వారి సూచనల మేరకు కుర్చీలు ఏర్పాటు చేయటంలో జాప్యం జరగటంతో 10 మందికి పైగా సభ్యులు కింద కూర్చొని నిరసన వ్యక్తంచేశారు. వీరి తీరుపై భక్తులు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. భక్తులకు సేవలు అందించాల్సిన సేవా సభ్యులే ఆలయంలో నిరసన వ్యక్తం చేయటమేమిటంటూ పలువురు ప్రశ్నించారు. సభ్యులు నిరసన చేస్తున్నారని సమాచారం తెలుసుకున్న ఆలయ అధికారులు వారికి ప్రత్యేకంగా కుర్చీలు ఏర్పాటు చేశారు.



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతో సీఆర్‌డీఏ అధికారులు

సీఆర్‌డీఏ జాబ్‌మేళాలో పలువురికి ఉద్యోగాలు

కలెక్టరేట్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (ఏపీ సీఆర్‌డీఏ) అధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ, శిక్షణ శాఖ సౌజన్యంతో తుళ్లూరులోని సీఆర్‌డీఏ స్కిల్ హబ్ ప్రాంగణంలో బుధవారం జాబ్ మేళా జరిగింది. ఈ మేళాలో మొక్సీ ఐటీ డిజిటల్ ప్రైవేట్ లిమిటెడ్, అపోలో ఫార్మసీ, పేటీఎం, ప్రీమియర్ ఎనర్జీస్ ప్రైవేట్ లిమిటెడ్, ఎస్‌బీఐ కార్డ్స్, ఎల్‌ఎంఎస్ కార్పొరేట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు పాల్గొన్నాయి. జాబ్‌మేళాకు 247 మంది అభ్యర్థులు హాజరుకాగా 102 మందికి ఉద్యోగాలు లభించాయి. ఉద్యోగాలకు ఎంపికైన పలువురు అభ్యర్థులకు ఆయా కంపెనీల హెచ్‌ఆర్ విభాగ ప్రతినిధులతో కలిసి సీఆర్‌డీఏ సామాజిక సంక్షేమ విభాగ డీసీడీఓ బొర్రా శ్రీనివాసరావు ఆఫర్ లెటర్లు అందజేశారు.

వినోదభరితం

(7వ పేజీ తరువాయి)

రోజు కార్యక్రమాలు అద్భుతంగా సాగాయి. ఆద్యంతం యువతలో జోష్ నింపాయి. శ్రవ్య మానస బృందం చేసిన నృత్యం ఆకట్టుకుంది. ఆంజనేయ విశ్వ స్వరూపం, నరసింహ అవతారం ఉగ్రరూపాన్ని, కాంతారా అభినయాన్ని కూచిపూడి నృత్యంతో కలిపి ఈ బృందం ప్రదర్శించి ప్రేక్షక ఆదరణ పొందింది.

కళ్లు చెదిరే క్రాకర్స్, డ్రోన్ షో

పున్నమి ఘాట్ వద్ద వేలాది డ్రోన్‌లతో చేసిన షో ప్రేక్షకులను మైమరిపించింది. ఆకాశంలో కనకదుర్గమ్మ వివిధ రూపాలను డ్రోన్ లైటింగ్‌తో ప్రదర్శించిన తీరు చూపరులను మంత్రముగ్ధుల్ని చేసింది. ప్రకాశం బ్యారేజీ, అమ్మవారి అలంకరణకు ఉపయోగించే బంగారు ఆభరణాలను ప్రదర్శించి భక్తులకు ఆధ్యాత్మిక వినోదాన్ని అందించారు. దీనికంటే ముందుగా జరిగిన క్రాకర్స్ షో ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యానికి గురిచేసింది. ఏడు నిమిషాల పాటు ఆగకుండా ఆకాశానికి రంగులద్దిన తీరును అక్కడున్న ప్రజలు కనురెప్ప వేయకుండా చూశారు. ఈ సుందర దృశ్యాన్ని అనేకమంది తమ సెల్‌ఫోన్లలో బంధించి ఆనందాన్ని పొందారు.

ఆకట్టుకున్న మహాభారత రూపకల్పన

కళాకారిణి దీప్తి ఆమె బృందం మహాభారతంలోని కీలక ఘట్టాలను అద్భుతంగా ప్రదర్శించారు. శిల్పసుందరమైన హావభావాలు, అభినయంతో పాండవ, కౌరవ కథలు వేదికపై ప్రత్యక్షమయ్యాయి. గీత భక్తి ప్రదర్శనలో ఆధ్యాత్మికత, భక్తిరసాన్ని ఒలకబోసి, ప్రేక్షకులను ఆత్మీయ లోకంలోకి తీసుకెళ్లారు. వైలిన్ మాధుర్యం సంగీత ప్రియులను మంత్రముగ్ధులను చేసింది. కామాక్షి ఆమె బృందం చేసిన వైలిన్ వాయిద్య కచేరీ ఆకట్టుకున్నాయి. స్వరసమూహాలు పున్నమి ఘాట్ తీరాన్ని ఒక సంగీత నిలయంగా మార్చేశాయి.

సాంస్కృతిక, నాటకాల జోష్

విజయవాడ ఉత్సవ్ కళామహోత్సవంగా మారింది. సత్యనారాయణపురంలోని సంగీత కళాశాల, తుమ్మలపల్లి కళాక్షేత్రం, పున్నమిఘాట్ కళావేదికలు నిండైన సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రేక్షకలోకానికి కనువిందు చేశాయి. సంగీత కళాశాలో నగరానికి చెందిన జీ.నీలవేణి కథక్ నృత్యంతో(సోలో) అలరించింది. కాలభైరవ అష్టకం, శివనందన అంశాలతో నర్తించారు. చిట్టా రామలక్ష్మి బృందం వీణ వాద్యంతో బృంద కచేరి చేసి అలరించారు. గజానన యుద్ధం, బంటురీతి కొలువు అంశాలను చక్కగా పలికించారు. భాగవతుల సౌమ్య భరతనాట్యంతో అన్నమాచార్యుల సంకీర్తనకు నర్తించారు. అనంతపురానికి చెందిన సి.రాము ఉరుములు వాద్యంతో రామాయణంలోని కథాంశాలతో పిట్టకథలను జోడించి చక్కని గానం చేశారు. సత్యసాయి నాట్యమండలి బృందం ప్రదర్శించిన సత్య హరిచ్చంద్ర నాటకంలోని వారణాసి, కాటి సీన్లు రక్తికట్టించాయి. హరిచ్చంద్రుడిగా ఫణిశంకర్ గౌడ్, చంద్రమతిగా డాక్టర్ రత్నశ్రీ నటభారతి, నక్షత్రుడిగా చీమకుర్తి ఆంజనేయులు, వీరబాహుడిగా దంపూరి దుర్గాప్రసాద్ అద్భుతమైన నటనాభినయ పద్యగాన, వాక్చతుర్యంతో మెప్పించారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నగరానికి చెందిన నాట్యాచారిణి అపర్ణ బృందం ఓంకార రూపిణి, అన్నపూర్ణాదేవి అర్చించునమ్మ లాంటి భక్తిగీతాలకు నయనానందకరమైన నాట్యంచేసి రంజింపచేశారు.

జేసీగా నవీన్ బాధ్యతల స్వీకరణ

(7వ పేజీ తరువాయి)

అనుగుణంగా పనిచేస్తానని వివరించారు. సీఆర్‌డీఏ పరిధిలో జిల్లాలోని కొంత భాగం ఉండటం వల్ల ఆయా ప్రాంతాలపై అవగాహన ఉందని తెలిపారు. జేసీని డీఆర్వో కె.చంద్రశేఖరరావు, వ్యవసాయశాఖ జేడీ పద్మావతి, పౌరసరఫరాలసంస్థ జిల్లా మేనేజర్ శివరాంప్రసాద్, డీఎస్‌వో మోహన్‌బాబు, ఆర్డీవో కె.స్వాతి, మార్కెటింగ్ ఏడీ నిత్యానందం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టర్ బాలాజీని జేసీ నవీన్ మర్యాదపూర్వకంగా కలిశారు.

అడ్డంగా బుక్ అయ్యారు!

(7వ పేజీ తరువాయి)

మృతి చెందిన దాఖలాలు లేవని తమకు తాము క్లీన్‌చిట్ ఇచ్చుకుంటూ 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన ఫొటోలు కొండపల్లి అటవీ ప్రాంతానివే కావని, వాటిని ఇంటర్ నెట్ నుంచి డౌన్‌లోడ్ చేశారంటూ తప్పించుకునేందుకు ప్రయత్నించి అబాసుపాలయ్యారు. వివరాల్లోకి వెళితే... కొండపల్లి రిజర్వు ఫారెస్ట్‌లో వన్యప్రాణుల వేట యథేచ్ఛగా సాగుతోంది. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో ఈనెల 21న 'అరణ్యరోదన' శీర్షికతో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అటవీ శాఖ అధికారుల బృందం కొండపల్లి రిజర్వు ఫారెస్ట్‌కు వెళ్లింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు జల్లెడ పట్టామని.. ఎలాంటి వన్యప్రాణుల వేట జరగలేదని సెలవిచ్చారు. కొండపల్లి అడవిలో తిరిగిన దృశ్యాలకు సంబంధించిన ఫొటోలను విడుదల చేశారు. ఈ ఫొటోలే సాక్ష్యాలుగా మారాయి. తాము కొండపల్లి అడవిని సందర్శించామని చెప్పుకోవటానికి గూగుల్ కెమెరాతో ఫొటోలు తీశారు. దీంతో ఫొటోలో చివరన 'గూగుల్ కో ఆర్డినేట్స్' ప్రింట్ అవుతాయి. ఇది జియో లొకేషన్‌ను ధ్రువపరుస్తుంది. అటవీశాఖ అధికారుల బృందం కొండపల్లి రిజర్వు ఫారెస్ట్‌కు వెళ్లిన మాట వాస్తవం. దీనికి జియో కోఆర్డినేట్స్ ఉన్న ఫొటోలు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. అక్కడ ఏమీ జరగలేదని వారు చెప్పింది మాత్రం అవాస్తవం. ఎందుకంటే.. ఈ నెల 23వ తేదీన అదే కొండపల్లి రిజర్వు ఫారెస్ట్‌లో వేటగాళ్ల ఉచ్చులో చిక్కుకున్న దుప్పి, చనిపోయి కుళ్లిన స్థితిలో ఉన్న మరో దుప్పి దృశ్యాలను ప్రత్యక్షంగా చూసిన వారు కూడా గూగుల్ కెమెరాతోనే ఫొటోలు తీసి వాటిని వెలుగులోకి తీసుకురావటం జరిగింది. వాటిపైనా జియోగ్రాఫికల్ కో ఆర్డినేట్స్ ప్రింట్ అయ్యాయి. 'ఆంధ్రజ్యోతి' చేతికి చిక్కిన తాజా దృశ్యాలలో అక్షాంశం 16.63662 ఉండగా.. రేఖాంశం 80.471982 ఉంది. అటవీశాఖ అధికారులు విడుదల చేసిన గూగుల్ కెమెరా ఫొటోలలో కూడా అక్షాంశం 16.677092, రేఖాంశం 80.527265గా ఉంది. వివిధ ఫొటోలు దాదాపుగా ఇదే కోఆర్డినేట్స్‌ను కొన్ని పాయింట్లు అటు, ఇటుగా చూపించటం జరిగింది. దీనిని బట్టి ఆ ఫొటోలు కొండపల్లి అటవీ ప్రాంతంలోనివేనని తేలిపోయింది. కొండపల్లి రిజర్వు ఫారెస్ట్ పరిధి 30 వేల ఎకరాల విస్తీర్ణంలో ఉంది. గూగుల్ కెమెరా ఏ రోజున ఏ సమయంలో ఫొటో తీయటం జరిగిందో కూడా ఆ ప్రింట్‌లో పేర్కొంది. దీనిని బట్టి ఎవరిది అబద్ధమో బట్టబయలైపోయింది.

అటవీశాఖ అధికారుల పరిశీలన

'ఆగని వన్యప్రాణుల వేట' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం మరో కథనం ప్రచురితమైన నేపథ్యంలో అటవీశాఖ అధికారులు కొండపల్లి రిజర్వు ఫారెస్ట్ లోపలికి వెళ్లి పరిశీలించారు. డీఎఫ్‌వో మాట్లాడుతూ అక్షాంశ, రేఖాంశాలను బట్టి చూస్తే అది కేతనకొండ దగ్గర ఉందని చెప్పారు. ఆ ప్రాంతానికి వెళ్లి చూడగా.. తమకు ఉచ్చులు కనిపించలేదని చెప్పారు. స్థానికులు కూడా ఇదే చెప్పారని చెప్పటం గమనార్హం.

డీఎంహెచ్‌వో వైద్య శిబిరాల తనిఖీ



పాయకాపురం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : దసరా ఉత్సవాల సందర్భంగా నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ ఎం.సుహాసిని బుధవారం తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు పనితీరును పరిశీలించి, భక్తులకు అసౌకర్యం కలగకుండా తక్షణం స్పందించాలని సిబ్బందికి సూచించారు. అమ్మవారి కొండపై ఓం టర్నింగ్ వద్ద ఏర్పాటు చేసిన మూడు పడకల ఆసుపత్రిని పరిశీలించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.



అన్నపూర్ణాదేవిగా ధనకొండ అమ్మవారు



ఆటోనగర్ అభయాంజనేయ స్వామి ఆలయంలో..



అన్నపూర్ణాదేవిగా గుణదల మద్దిరావమ్మతల్లి



కరెన్సీనగర్ కాలనీలోని దాసాంజనీయ దేవస్థానంలో



దేవీ భక్త బృందం ఆధ్వర్యంలో

అన్నపూర్ణాదేవికి భక్తుల నీరాజనం



గాయత్రీ దేవిగా కాళిమాత



ఆర్చర్ గార్డెన్స్‌లో

విజయవాడ తూర్పు నియోజకవర్గంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మూడో రోజు బుధవారం అమ్మవారు అన్నపూర్ణ దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. తెల్లవారు జాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు ఆలయాల వద్ద బారులు తీరారు. భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కృష్ణలంక, ఆటోనగర్, భారతీనగర్, మొగల్రాజపురం, రామలింగేశ్వరనగర్



కృష్ణలంక పోలీస్‌స్టేషన్లలో..



సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో అమ్మవారు, పల్లకీ సేవ



పటమట దత్తపీఠంలో ..

భక్తులకు తాగునీటి సమస్యలు లేకుండా చూడండి

అధికారులకు నగర కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశం

కార్పొరేషన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): భక్తులకు అందుబాటులో వాటర్ పాయింట్లు ఏర్పాటు చేయాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం భవానీఘాట్, పున్నమిఘాట్, కృష్ణవేణిఘాట్, రథం సెంటర్, కేటీ రోడ్, మిల్క్ ప్రాజెక్ట్, సీవీఆర్ ఫ్లై ఓవర్ ప్రాంతాల్లో అధికారులతో కలిసి కొండచుట్టు ఉన్న వాటర్ పాయింట్లను పరిశీలించారు. దసరా శరన్నవరాత్రులకు అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. వాటర్ పాయింట్లు ఒకదానికి ఒకటి దూరంగా ఉండకూడదని, భక్తులకు దాహం వేసే లోపు దాహం తీర్చేలా వాటర్ పాయింట్లు కనిపించాలని ఆదేశించారు. పలు ప్రాంతాల్లో వాటర్ పాయింట్లు దూరంగా ఉన్నాయని గమనించి అక్కడ మరిన్ని కొత్త వాటర్ పాయింట్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం దసరా ఉత్సవాలకు 39 వాటర్ పాయింట్లు పెట్టినప్పటికీ, భక్తుల అవసరాల కోసం రెండు పాయింట్లు పెంచమని చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డిని ఆదేశించారు. అనంతరం ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్డులో అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. అన్న క్యాంటీన్లో ఎటువంటి ఇబ్బంది కలగకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని అధికారులను ఆదేశించారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.



వాటర్ పాయింట్లను పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

టీడీపీ కార్యకర్తకు గద్దె క్రాంతి పరామర్శ

లబ్బీపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): 19వ డివిజన్ గ్రీన్‌ల్యాండ్ ప్రాంతంలో బుధవారం టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతికుమార్ పర్యటించి అనారోగ్యంతో బాధపడుతున్న కార్యకర్తను పరామర్శించి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. అంగవైకల్యంతో బాధపడుతున్న సుకుమార్ అనే వ్యక్తికి దాతలు అందించిన వీల్ చైర్‌ను అందజేశారు. డివిజన్ అధ్యక్షుడుభాగం సాయి ప్రసాద్ పాల్గొన్నారు.

ఆటోనగర్‌లో లారీల రాకపోకలకు

మరో రెండు రహదారులు అభివృద్ధి చేయాలి

ఆటోమొబైల్స్ మెకానిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గంధం వెంకటేశ్వరరావు

ఆటోనగర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జవహర్ ఆటోనగర్‌లో లారీల రాకపోకలకు మరో రెండు రహదారులను అభివృద్ధి చేయాలని ఆటోమొబైల్స్ మెకానిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గంధం వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన జవహర్ ఆటోనగర్‌లో ఆంధ్రజ్యోతి ప్రతినిధితో మాట్లాడుతూ ప్రస్తుతం ఆటోనగర్‌లోకి లారీలు వచ్చేందుకు ఒక్క మహానాడు రోడ్డే ఉందని, దీనివల్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని చెప్పారు. ఆటోనగర్‌లోని లారీల రాకపోకలకు రోజు మొత్తం అనుమతించాలని కోరారు. ఆటోనగర్‌లోని మొత్తం సుమారు 80వేల మంది కార్మికులు వివిధ రంగాల్లో పనిచేస్తుండగా వీరిలో సుమారు 50 శాతం మందికి పైగా కార్మికులు ఒక్క లారీలు, దాని అనుబంధ విభాగాల్లో పనిచేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం లారీ మెకానిక్‌లు, దాని అనుబంధ కార్మికులపై దృష్టి సారించాలని వెంకటేశ్వరరావు కోరారు.

అందుబాటులో ఉచిత బస్సు

● వినియోగించుకుంటున్న వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు

పాత రాజరాజేశ్వరి పేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా ఉత్సవాల సందర్భంగా ఆలయ అధికారులు వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు, చిన్నారుల కోసం ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం ఏర్పాటు చేశారు. ఈ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని పలువురు వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు, చిన్నారులు ఉపయోగించుకుంటున్నారు. బస్టాండ్, రైల్వే స్టేషన్, వినాయకుడి గుడి, సీతమ్మవారి పాదాలు, పున్నమి ఘాట్‌లకు ఈ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్నారు.

చాలా సౌకర్యంగా ఉంది



ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యంగా ఉంది. పెద్ద వయస్సు వారు కాళ్ల నొప్పుల వలన దూరం నడవలేక ఇబ్బం దులు పడుతున్నారు. ఉచిత బస్సు సౌకర్యం వారికి ఎంతో మేలు.

\- పద్మ భక్తురాలు

అమ్మ దర్శనం జరిగింది



అమ్మవారి దర్శనానికి క్యూ లైన్లో నడిచి వెళ్లే ఓపిక లేదు. ఉచిత బస్సులో కొండపైకి వెళ్లి అమ్మవారిని దర్శించు కున్నాను.

\- వెంకాయమ్మ, భక్తురాలు



ఉచిత బస్సు ఎక్కుతున్న విభిన్న ప్రతిభావంతురాలు

కొబ్బరికాయలు కొడితే నగదు చెల్లించక్కరలేదు



తొలగించిన బోర్డు తిరిగి ఏర్పాటు

సత్యనారాయణపురం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కనకదుర్గానగర్ అమ్మవారికి సమర్పించిన కొబ్బరికాయాలు కొట్టే ప్రదేశంలో అక్కడ సిబ్బంది డబ్బులు అడుగుతున్నారని భక్తుల నుంచి ఫిర్యాదులు రావడంతో అధికారులు స్పందించారు. బుధవారం భక్తులను డబ్బులు అడిగితే తీవ్ర పరిణామాలు ఉంటాయని, విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని హెచ్చరించారు. ఆ ప్రాంతం నుంచి తొలగించిన కొబ్బరికాయలు కొడితే డబ్బులు ఇవ్వనవసరం లేదనే బోర్డును తిరిగి ఏర్పాటు చేశారు.

రామవరప్పాడు పంచాయతీలో రూ.5కోట్లు అక్రమాలంటూ ఫిర్యాదు

ప్రసాదంపాడు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రామవరప్పాడు పంచాయతీలో గత వైసీపీ పాలనలో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి సుమారు రూ.5కోట్ల మేర అవకతవకలు చేశారని డీఎల్‌పీవో జీఎల్ఎస్‌వీ రాఘవన్‌కు బుధవారం ఆ గ్రామంలోని జీ.సతీష్ ఫిర్యాదు చేశారు. నిధులు జమ, రికార్డులు మెయింటినెన్స్‌లోనూ, గ్రామానికి వినియోగించాల్సిన నిధుల్లోనూ, ఆరు నెలలుగా పంచాయతీ పారిశుధ్య కార్మికులకు జీతాలు ఇవ్వలేదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిని పరిశీలించిన డీఎల్‌పీవో విచారణ చేయడానికి పంచాయతీ కార్యాలయానికి చేరుకున్నారు. రికార్డులు పరిశీలిస్తామని వెల్లడించారు. అలాగే ఫిర్యాదుదారుడికి, సర్పంచ్‌కి, మాజీ కార్యదర్శికి నోటీసులిస్తామన్నారు. సుమారు 15 రోజుల పాటు రికార్డులు పరిశీలించి నివేదిక తయారు చేస్తామని డీఎల్‌పీవో తెలిపారు. తదుపరి విచారణ నిమిత్తం యంత్రాంగం పనిచేస్తుందని వెల్లడించారు.

బాలల ఆహ్లాద కేంద్రం ప్రారంభం

గవర్నర్‌పేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆట, పాటల్లో పిల్లలకు ఆసక్తి కలిగించేందుకు యూటీఎఫ్ కార్యాలయంలో బాలల ఆహ్లాద కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్. వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు. ఎంజీ రోడ్డులోని యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయం ప్రాంగణంలో బుధవారం బాలల ఆహ్లాద కేంద్రాన్ని విశ్రాంత ఉపాధ్యాయుడు రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్. వెంకటేశ్వర్లు, ప్రసాద్ మాట్లాడుతూ పిల్లలకు ఆసక్తి కలిగించే అంశాలతో పాటు, సైంటిఫిక్ ప్రయోగాలు లాంటి కార్యక్రమాలను పిల్లలకు నేర్పిస్తామన్నారు. ఖాళీ సమయాల్లో వారికి ఇష్టమైన అంశాలపై, ఆసక్తిని పెంపొందించే అంశాలపై శిక్షణ ఇవ్వడం కోసం ఈ కేంద్రాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వివరాలకు 80746 56016 నెంబరులో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో నేతలు ఆర్.మోహనరావు, ఎస్.పి.మనోహర్‌కుమార్, టీపీ ఉమా మహేశ్వరరావు, టి.శ్రీరామమూర్తి, సూర్యారావు పాల్గొన్నారు.



పార్కులో మరుగుదొడ్డి నిర్మాణం కోసం వేసిన పిల్లర్లు





వ్యాయామ పరికరాలు, (ఇన్‌సెట్లో) వ్యాయామ పరికరంలో చేరిన వర్షం నీరు, చెట్టు కొమ్మలు

మూసిన పార్కులో మరుగుదొడ్డి నిర్మాణమా?

● బ్యాంకుకాలనీ -1 పార్కులో పాడవుతున్న లక్షల ఖరీదు చేసే వ్యాయామ పరికరాలు ● పార్కు నిర్వహణ పట్టించుకోని వైనం

మొగల్రాజపురం, ఆంధ్రజ్యోతి: ఎపుడు చూసినా మూసి ఉండే పార్కులో వీఎంసీ అధికారులు మరుగుదొడ్డి నిర్మాణానికి రంగం సిద్ధం చేయడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొగల్రాజపురం సిద్ధార్థనగర్‌కు ఆనుకుని ఉన్న బ్యాంకుకాలనీ -1లో కాలనీ లే అవుట్ వేసినపుడు 300 గజాల స్థలం పార్కు నిర్మాణానికి వదిలారు. ఆ తర్వాత పార్కు నిర్మాణం చేశారు. ఏళ్లపాటు ఆలనా పాలనా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. దీంతో పార్కును ఆకతాయిలు, గంజాయి, మద్యం సేవించడం కోసం వాడేవారు. పార్కు దుస్థితిపై 2017లో ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురించడంతో పార్కును బాగు చేసి గోడలు కట్టారు. తరువాత వైసీపీ హయాంలో ఈ పార్కు స్థలంలో సచివాలయం నిర్మాణానికి ఏర్పాట్లు చేయగా కాలనీ సంఘం అడ్డుకోవడంతో ఆగింది. ఇటీవల ఈ పార్కులో వ్యాయామ సామగ్రి ఏర్పాటు చేశారు. కానీ పార్కు నిర్వహణకు మాత్రం ఎవరినీ నియమించలేదు. పార్కు చెత్త, చెట్ల కొమ్మలతో నిండింది. తాళం వేసి పక్కనే ఉన్న ఇంట్లో అప్పగించారు. లోపల లక్షల ఖరీదు చేసే వ్యాయామ సామాగ్రి ఉన్నా ఉపయోగించుకునేవారు లేరు. దీంతో వ్యాయామ సామాగ్రి ఎండకు ఎండి, వర్షాలకు తడిచి పాడైపోతోంది. ఇలాంటి పార్కులో మరుగుదొడ్డి నిర్మాణానికి అధికారులు పనులు చేయిస్తున్నారు. మరుగుదొడ్డి నిర్మించినా దానిని ఉపయోగించే వారు ఉండరని చెబుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీ పెద్దలు అంటున్నారు. దీనిపై వీఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడానికి కాలనీ సంఘం పెద్దలు సమాయాత్తం అవుతున్నారు.

పొంగిపొర్లుతున్న మ్యాన్‌హోల్స్

● దుర్గంధంతో అంబేడ్కర్‌నగర్ కాలనీవాసుల పాట్లు

రామలింగేశ్వరనగర్, ఆంధ్రజ్యోతి: వర్షాలకు మ్యాన్‌హోల్స్ పొంగిపొర్లడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోందని పటమట అంబేడ్కర్ నగర్ వాటర్ ట్యాంక్ ఎదురు కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏ చిన్న వర్షం పడినా మురుగు పైకి వచ్చి ఇళ్ల మధ్యనే నిలిచి ఉంటుందని, వర్షం పడిన ప్రతిసారి శుభ్రపరుచుకోవలసిన వస్తోందంటున్నారు. అంతేకాకుండా మ్యాన్‌హోల్ పైపులైను పగిలిపోవటంతో సైడు కాలువలోకి మురుగు నీరు చేరుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఈగలు దోమలు వ్యాప్తి చెంది డెంగ్యూ, కలరా, మలేరియా, డయేరియా వంటి వ్యాధుల బారిన పడే ప్రమాదముందని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే మ్యాన్‌హోల్స్ పైపులైను శుభ్రం చేయాలని కోరుతున్నారు.





పొంగుతున్న మ్యాన్‌హోల్, సైడ్ కాల్వలోకి చేరుతున్న మురుగు

కళా సంగమం



చిన్నారులతో కేరింతలు కొట్టించిన వెంట్రిలాక్విజం

దుమ్ములేపిన జానపద నృత్యాలు చిందేయించిన రింగు డ్యాన్స్

విజయవాడ కల్చరల్/ఇబ్రహీం పట్నం, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): పవిత్ర సంగమం కళా కదంబంగా మారింది. శాస్త్రీయ, జానపద, గాత్ర నృత్యాలు, మిమిక్రీ, రింగ్ డ్యాన్స్, వెంట్రిలాక్విజం, వేంకటేశ్వర కల్యాణ రూపకం వంటి ప్రదర్శనలతో ప్రేక్షకులు ఆద్యంతం పరవశించారు. నాట్యకారిణి పావని శిష్య బృందంలోని 20 మంది విద్యార్థులు ప్రదర్శించిన జానపద నృత్యాలు ప్రేక్షకులను కట్టిపడేశాయి. ఆడొస్తా జానకి కోడి పందెం, మందులోడా ఓరి మాయలోడా, వస్తావా జానకి, నర్సపల్లె ఆడ నెమలి వంటి గ్రామీణ జానపద అల్లికలతో మధురంగా పాడి ప్రేక్షకుల చేత చిందులేయించారు. మరోవైపు నాట్యమయూరి సీహెచ్ అవీషా చౌదరి, 25 విద్యార్థులు కూచిపూడి నాట్యాలు, రింగు డ్యాన్స్‌లతో సభిక లోకాన్ని ఉర్రూతలూగించారు.

బృందావన నీలాగే, మూషిక వదన, సరస్వతి నమస్తుభ్యం శారదే, జయజయ దుర్గే, బీ ప్రీ ఫ్యూజన్, శివశివ శంకర హరహర శంకర, అయిగిరినందిని ఫ్యూజన్, శివాష్టకం, లింగాష్టకం, శాంపేయ గౌరాయ శరీర కాయ వంటి అంశాలతో ఫ్యూజన్, రింగు డ్యాన్సులు ఆహుతలను కట్టిపడేశాయి. అనంతరం తన్మయ శిష్య బృందం అన్నమయ్య పాటలతో రూపుదిద్దిన శ్రీనివాస కల్యాణం, నారాయణ సుగుణ బ్రహ్మణే, బృందావన మాళి రారా మా ఇంటికి ఒకసారి వంటి భజన పాటలు శ్రోతలను మైమరిపించాయి. హం సా అవార్డు గ్రహీత సిల్విస్టర్ చేసిన వివి ధ రాజకీయ నేతల అనుకరణ, పక్షులు, జంతువుల శబ్దాలు ప్రేక్షక ప్రశంసలు అందుకున్నాయి.

తదుపరి చిన్నారులను ఆడిస్తూ, పాడిస్తూ బొమ్మతో కథలు, కబుర్లు చెప్పి కడుపుబ్బా నవ్వులు పూయించి కేరింతలు కొట్టించారు. కళాప్రదర్శనలు ఆబాలగోపాలాన్ని ఆద్యంతం అలరించాయి. ఈ సందర్భంగా కొండపల్లి మున్సిపాలిటీ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, కమిషనర్ రమ్యకీర్తన మాట్లాడుతూ పవిత్ర సంగమం వద్ద విజయదశమి వరకు అనేక రకాల సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు, ముగ్గుల పో టీలు, బతుకమ్మ ఆట, 300 మందితో మహాబృంద నృత్యప్రదర్శన, కోలాటాలు, కుంకుమార్చనలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇవన్నీ సమాజంలో సంస్కృతి, సంప్రదాయాలను గుర్తుచేస్తూ భావితరాలకు వారసత్వ సంపదనను అందించడమే లక్ష్యమన్నారు. అనంతరం కళాకారులను సత్కరించి జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందించారు. మూడోరోజు అమ్మవారిని అన్నపూర్ణదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. కొండపల్లి, గొల్లపూడికి చెందిన స్థానిక టీడీపీ నేతలు పాల్గొన్నారు.

నేడు 300 మందితో మహాబృంద నృత్యం

దసరాను పురస్కరించుకుని పవిత్రసంగమం, విజయ నర్త నం వేదికపై గురువారం 300 మందితో మహాబృంద నృత్యం నిర్వహించనున్నారు. మహిషాసుర మర్ధిని వైభవాన్ని తెలిపే అయిగిరినందిని కీర్తనకు 300 మంది ఒకేసారి కూచిపూడి బృంద నాట్యం చేయనున్నారు. దీనితో పాటు బ్రహ్మాంజలి అనే మరో శ్లోకానికి కూడా ఈ మహాబృందం నాట్యం చేయనుంది.

పున్నమిలో దుర్గామాత టెంపుల్ భారీ సెట్టింగ్



ఉత్తరాదిశైలిలో నిర్మాణం, మూడు భారీ చాంబర్లతో ఏర్పాటు



- ఉత్తరాదిలో కనిపించే ఆకారంలో కనకదుర్గమ్మ భారీ విగ్రహం ఏర్పాటు
- మిగిలిన రెండు చాంబర్లలో భారీ నంది, జ్యోతిర్లింగాల ఏర్పాటు
- లైటింగ్‌తో జిగేల్‌మంటున్న సెట్టింగ్
- విజయా ఏర్పాటు చేసిన ఎడ్లబండి, చెక్కమగ్గం ప్రత్యేక ఆకర్షణ
- పసందైన వంటకాలతో ఫుడ్‌కోర్టులు, ఆకట్టుకుంటున్న సెల్ఫీ పాయింట్లు
- హస్తకళాఖండాల స్టాల్స్ స్వాగతం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ /ఇబ్రహీంప ట్నం): విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా పున్నమిఘాట్‌లో కనకదుర్గ మండపం సెట్టింగ్ ఆకట్టుకుంటోంది. ఉత్తరాది శైలిలో అమ్మవారి గుడి సెట్టింగ్‌ను వేశారు. సెట్టింగ్ బయట అమ్మవారి తలభాగం ప్రత్యేక ఆకర్షణగా కనిపిస్తోంది. లోపల 3 భారీ చాంబర్లు ఏర్పాటు చేశారు. ఒకేసారి 200 మంది దర్శనం చేసుకునేలా ఏర్పాటు చేశారు. విగ్రహాన్ని కూడా ఉత్తరాది కళాకారులే స్వయంగా తయారు చేశారు. అమ్మవారి ముఖం, చేతులు, కాళ్లు కనిపించే వరకు బంగారుపూతతో చేసినవి ఏర్పాటు చేశారు. మిగిలిన భాగమంతా చెక్కలతో ఉంటుంది. దీంతో అమ్మవారు సరికొత్తగా కనిపిస్తున్నారు. రెండు వైపులా స్వాగతం పలుకుతున్నట్టు పెద్ద పెద్ద ఏనుగు బొమ్మలు ఏర్పాటు చేశారు. వామహస్తం వైపునున్న చాంబర్‌లో భారీ నందిని ఏర్పాటు చేశారు. కుడిహస్తం వైపున జ్యోతిర్లింగాలను ఏర్పాటు చేశారు. మూడు చాంబర్లలోనూ అద్భుతమైన లైటింగ్‌ను ఏర్పాటు చేశారు. లోపలికి వచ్చిన వారికి అద్భుతమైన అనుభూతి కలుగుతుంది. సెట్టింగ్ బయట సాంస్కృతిక వేదికకు మధ్యన ఓపెన్ ఏరియాలో ఫుడ్‌స్టాల్స్ ఏర్పాటు చేశారు. స్వీట్లు, పూతరేకులు, పానీపూరీ తదితర ఉత్తరాది, దక్షిణాది వంటకాలు ఎన్నో ఉన్నాయి. కాఫీ, ఐస్ క్రీమ్స్, ఫాస్ట్‌ఫుడ్స్, నీలగిర్ టీ, విజయవాడ డెయిరీ ప్రొడక్ట్స్ ఎన్నో ఉన్నాయి. ఫుడ్‌స్టాల్స్ మధ్యన విజయా డెయిరీ నేతృత్వంలో మన సంస్కృతిని చాటేలా అలంకరించిన ఎడ్లబండిని ఏర్పాటు చేశారు. ఇదే ప్రాంగణంలో అనేక సెల్ఫీపాయింట్లు ఏర్పాటు చేశారు. బయటకు వచ్చేమార్గంలో హ్యాండీక్రాఫ్ట్స్ స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఉప్పాడ చీరలు, డ్రెస్‌లు, బ్యాంకాక్, పట్టాయా టూర్ ఆపరేటర్ స్టాల్స్, హస్తకళాఖండాలు వంటివి ఏర్పాటు చేశారు. ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన చెక్కమగ్గం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.





ఖాతాదారుల సేవల్లో అగ్రగామి

ది కనకమహాలక్ష్మీ కో-ఆపరేటివ్ బ్యాంకును ప్రారంభించిన ఎంపీ కేశినేని శివనాథ్



ది కనకమహాలక్ష్మీ కో-ఆపరేటివ్ బ్యాంకును ప్రారంభిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు

సత్యనారాయణపురం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఖాతాదారులకు మెరుగైన సేవలందించడంలో కనకమహాలక్ష్మీ కో-ఆపరేటివ్ బ్యాంకు ఎప్పుడూ అగ్రగామిగా నిలుస్తోందని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. విశాఖలోని అక్కయ్యపాలెం కేంద్రంగా ఏర్పడిన 'ది కనక మహాలక్ష్మీ కో-ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ 35వ శాఖను విజయవాడ సత్యనారాయణపురంలో బుధవారం ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ ఆర్థికాభివృద్ధిలో సహకార బ్యాంకులపాత్ర కీలకమని, 26 ఏళ్లుగా కనకమహాలక్ష్మీ కో-ఆపరేటివ్ బ్యాంకు సమర్థవంతమైన సేవలందిస్తోందన్నారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ తన నియోజకవర్గంలో ఏర్పాటుచేసిన శాఖ ప్రజలకు ఉత్తమ సేవలందించాలన్నారు. మాజీ మంత్రి, కేడీసీసీబీ చైర్మన్ నెట్టెం రఘురాం, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మాట్లాడుతూ అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో అందించే బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బ్యాంకు చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు మాట్లాడుతూ రాష్ట్రంలోని 11 జిల్లాల్లో 35 శాఖలున్నాయన్నారు. రూ.1,064 కోట్ల డిపాజిట్లు, రూ.696 కోట్ల రుణాల మంజూరుతో రూ.1,760 కోట్ల వ్యాపారం సాగిస్తోందన్నారు. రానున్న రోజుల్లో గన్నవరం, విశాఖలోని షీలానగర్, వన్‌టౌన్ శాఖలను ప్రారంభిస్తామన్నారు. బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణాధికారి కే శ్యామ్‌కిశోర్, ఏజీఎంలు పీ వీరభద్రరావు, జాస్తి మురళి, సత్యనారాయణపురం శాఖ మేనేజర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్‌కు ఘనస్వాగతం

విమానాశ్రయంలో పుష్పగుచ్ఛాలతో గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, భువనేశ్వరి స్వాగతం



గన్నవరం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ఆర్ సుమతి దంపతులకు గన్నవరం విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని కనకదుర్గమ్మ దర్శనం, విజయవాడ ఉత్సవ్‌లో ముఖ్య అతిథిగా పాల్గొనేందుకు బుధవారం ప్రత్యేక వాయుసేన విమానంలో ఇక్కడికి విచ్చేశారు. ఆయనకు రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరి పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనస్వాగతం పలికారు. తొలుత ఉప రాష్ట్రపతి విమానాశ్రయ రన్‌వేపై గౌరవవందనం స్వీకరించారు. అనంతరం మంత్రులు లోకేశ్, వాసంశెట్టి సుభాష్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే విజయానంద్, ప్రిన్సిపల్ సెక్రెటరీ ముఖేష్ కుమార్ మీనా, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, రాజ్యసభ సభ్యుడు సాన సతీష్, బాపట్ల ఎంపీ కృష్ణ ప్రసాద్ తెన్నేటి, పెనమలూరు, గుడివాడ, పామర్రు, పెడన, కైకలూరు ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, వెనిగండ్ల రాము, వర్ల కుమార్ రాజా, కాగిత కృష్ణ ప్రసాద్, డాక్టర్ కామినేని శ్రీనివాసరావు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్లు డీకే బాలాజీ, జీ లక్ష్మీశ, కృష్ణా ఎస్పీ వీ విద్యాసాగర్ నాయుడు ఉపరాష్ట్రపతికి స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. అనంతరం భద్రత బలగాల నడుమ ప్రత్యేక వాహనంలో రోడ్డు మార్గాన విజయవాడకు బయలుదేరి వెళ్లారు.

ఘనంగా వీడ్కోలు..

భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ తిరుపతి వెళ్లారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని కనకదుర్గమ్మ దర్శనం, విజయవాడ ఉత్సవ్ ముగించుకుని తిరిగి గన్నవరం విమానాశ్రయానికి బుధవారం సాయంత్రం 6:50 గంటలకు చేరుకున్న ఉపరాష్ట్రపతి దంపతులు సీపీ రాధాకృష్ణన్ ఆర్ సుమతికి గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. అనంతరం ప్రత్యేక విమానంలో తిరుపతి వెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్ఎంపీ వైద్యుడు మృతి

- ఇంట శుభకార్యం రోజునే అనంత లోకాలకు
- శోకసంద్రంలో పరిసరప్రాంత గ్రామాలు



కృత్తివెన్ను, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): చిన్న కుమార్తె శ్రీమంతం వేడుకకు అన్ని ఏర్పాట్లు చేసి, హడావిడిగా ఆసుపత్రిలో రోగికి వైద్యం అందించేందుకు వెళ్లిన ఆర్ఎంపీ వైద్యుడు రోడ్డు ప్రమాదంలో తిరిగి రాని అనంతలోకాలకు వెళ్లిపోయాడు. కృత్తివెన్ను గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు తెలగంశెట్టి వెంకట రమణ నాగేశ్వరరావు (58) బుధవారం తన ఇంట చిన్న కుమార్తెకు శ్రీమంతం వేడుకకు ఏర్పాటు చేశాడు. ఉదయాన్నే వచ్చిన రోగికి వైద్యం అందించి వెంటనే వచ్చేస్తానని ఇంటి నుంచి క్లీనిక్ వెళ్లాడు. అక్కడ రోగికి వైద్యం చేసి, మరో రోగికి ఇంటి వద్ద వైద్యం అందించేందుకు గాంధీనగరం గ్రామానికి బైక్‌పై బయల్దేరి తన క్లినిక్ ముందు బైక్‌పై రోడ్డు దాటుతుండగా, ప్రమాదవశాత్తు పాలకొల్లు నుంచి విజయవాడకు వెళ్తున్న కారు రమణను బలంగా ఢీకొట్టింది. దీంతో తలకు బలంగా గాయంకాగా, ఆ కారులోనే స్థానిక మరో ఆర్ఎంపీ వైద్యుడి వద్దకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందాడు. అప్పటి వరకు సంతోషంగా ఉన్న కుటుంబంలో విషాదచాయలు అలుముకున్నాయి. కృత్తివెన్ను, శీతనపల్లి పంచాయతీల్లో సుమారు 6 గ్రామాలకు ఇంటింటికి వెళ్లి డబ్బులు ఆశించకుండా వైద్యం అందించే వైద్యుడు రోడ్డుప్రమాదంలో మృతిచెందటంతో వందలాది మంది ప్రజలు కన్నీటిపర్యంతమయ్యారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, కేసు నమోదు చేసి, పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదానికి కారణమైన కారు కూడా రమణ దగ్గర బంధువులదే కావటంతో ఈ ప్రమాదంపై మరింత విషాదం నెలకొంది.



వరద నియంత్రణ పనులను అధికారులకు సూచిస్తున్న లక్ష్మీపార్థసారథి

కొండవీటి వాగు వరద నియంత్రణ పనుల పరిశీలన

కలెక్టరేట్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదికి పైఎత్తు నుంచి వరద నీరు వస్తున్నందున అప్రమత్తంగా ఉండాలని అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డీ లక్ష్మీపార్థసారథి అధికారులకు ఖచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు. కొద్ది రోజులుగా వర్షపాతం ఎక్కువగా నమోదవుతుండటంతో ఏడీసీ ఇంజనీరింగ్ అధికారులను అప్రమత్తం చేశారు. ఎన్-6 రోడ్డుపై అమృత విశ్వవిద్యాలయం వద్ద కొండవీటి వాగు నీటి ప్రవాహాన్ని బుధవారం పరిశీలించారు. నీరుకొండ నుంచి వస్తున్న వరద నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చర్యలు చేపట్టాలని ఏడీసీ చీఫ్ ఇంజినీర్లు ఆర్ గోపాలకృష్ణారెడ్డి, బీ నరసింహామూర్తి, సీహెచ్ ధనుంజయలను ఆదేశించారు. విజయవాడ బైపాస్ దాటుకువెళుతున్న ఈ-10, ఈ-11, ఈ-12 రహదార్ల వద్ద వాగు ఉధృతి ఎక్కువగా ఉన్నందున ఎక్కడా అడ్డంకులు లేకుండా చూడాలన్నారు. కొండవీటి వాగు నీటి ప్రవాహాన్ని క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పరిశీలించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ పర్యటనలో ఏడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కే బసవేశ్వరరావు, ఎంవీఆర్ ఇన్‌ఫ్రా ప్రతినిధులు పాల్గొన్నారు.

జీఎస్టీ రిఫార్మ్స్ సక్రమంగా అమలుచేయాలి

20 సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్

విజయవాడ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆత్మనిర్భర్‌లో భాగంగా తర్వాత తరానికి జీఎస్టీ రిఫార్మ్స్ సక్రమంగా అమలుచేసి ప్రధాని మోదీ సంకల్పం వికసిత్ భారత్ సాధనకు అనుగుణంగా ఈ సంస్కరణలను అమలుచేయాలని 20 సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్ అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో గురువారం జరిగిన వినియోగదారుల కొనుగోలు శక్తి పెరుగుదల, దేశాఆర్థిక వ్యవస్థపై సానుకూల ప్రభావం అనే అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జీఎస్టీ అధికారులు, వినియోగదారులకు నాణ్యమైన వస్తువులు, సేవలు న్యాయమైన ధరకు అందేలా పర్యవేక్షించాలన్నారు. కేంద్రప్రభుత్వ సంస్కరణల ద్వారా ప్రజలకు వస్తుసేవలను న్యాయంగా అందించడంతో పాటు వ్యాపారస్థులకు మేలు జరిగేలా చాంబర్ ఆఫ్ కామర్స్, హోటల్ అసోసియేషన్ ఏర్పడిందన్నారు. కేంద్రప్రభుత్వ ఉద్దేశానికి తూట్లు పొడవకుండా పేద, మధ్య తరగతి ప్రజలకు అందించాల్సిన బాధ్యత జీఎస్టీ అధికారులదేనన్నారు. జీఎస్టీ సంస్కరణలకు అనుకూలంగా అసెంబ్లీలో తీర్మాణం చేయడం సీఎం చంద్రబాబు ముందుచూపునకు నిదర్శనమన్నారు. దేశంలోని 90 శాతం కుటుంబాలకు కొనుగోలు శక్తి పెరగడంతో పొదుపు పెరుగుతుందన్నారు. దసరా, దీపావళి పండగలకు ముందే డబుల్ దమాకా మూడ్‌లో దేశప్రజలు ఉన్నారన్నారు. ఆరోగ్య బీమా, ఆహారం, ప్రాణాలను రక్షించే మందులు, వైద్యపరికరాలపై జీఎస్టీ తగ్గించడం వల్ల ప్రజల ఆరోగ్య ప్రమాణాలు మెరుగవుతాయన్నారు.



నూతన కారును విడుదల చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, వరుణ్ గ్రూప్ చైర్మన్ ప్రభుకిషోర్, మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ దేవ్

మార్కెట్‌లోకి మారుతి నూతన మోడల్ కారు

- లాంఛనంగా ప్రారంభించిన సీఎం చంద్రబాబు

భారతీనగర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వరుణ్ మోటర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో మారుతీ కంపెనీ తయారు చేసిన నూతన ఆధునిక టెక్నాలజీతో రూపొందించిన మారుతీ విక్టోరిస్ కారును బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు భారతీనగర్‌లోని నోవాటెల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వరుణ్ గ్రూప్ చైర్మన్ ప్రభుకిషోర్ మాట్లాడుతూ ఆటోమొబైల్ రంగంలోని మారుతీ కంపెనీ తయారు చేసిన నూతన ఆధునిక టెక్నాలజీతో రూపొందించిన మారుతీ విక్టోరిస్ కారులో అన్ని ఆధునిక సాంకేతిక ఫీచర్లు ఉన్నాయన్నారు. నూతన జీఎస్టీ కారణంగా తగ్గిన కార్లధరలపై కొత్త ఆఫర్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వరుణ్ గ్రూప్ చైర్మన్ ప్రభుకిషోర్, మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ దేవ్,మారుతీ సుజికి మేనేజింగ్ డైరెక్టర్ హిసాషి టకూచి, సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థో బెనర్జీ, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ట్సుయెషి టకేశితా, వరుణ్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్ సీ రాజు, సీఈవో గిరి, వరుణ్ గ్రూప్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య పరిష్కరించాలి



అమరావతి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా నున్నలో విజయవాడ వర్కింగ్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీకి కేటాయించిన ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం అసెంబ్లీ జీరో అవర్‌లో ఈ అంశాన్ని ఆయన లేవనెత్తారు. 2008 నుంచి ఈ సమస్య అపరిష్కృతంగా ఉందని, 3.5 ఎకరాల కేటాయించగా చివరికి 2.3 ఎకరాలే మిగిలిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించి జర్నలిస్టులకు న్యాయం చేయాలన్నారు. గత శాసనసభ సమావేశాల్లో ఈ విషయాన్ని ప్రస్తావించినప్పుడు గృహనిర్మాణ శాఖ మంత్రి ఇళ్లు కట్టిస్తామని హామీ ఇచ్చారని, మంత్రి ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సత్వరమే పరిష్కరించాలని యార్లగడ్డ కోరారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా పేదలకు ఇచ్చే స్థలాలతో పాటు ఒక సెంటు అదనంగా రాష్ట్రంలోని జర్నలిస్టులందరికీ ఇళ్లస్థలాలు కేటాయించాలని కోరారు.

14.850 కిలోల గంజాయి స్వాధీనం

- ఇద్దరి అరెస్ట్



గంజాయితో పట్టుబడ్డ వారితో ఎక్సైజ్ సీఐ శేషగిరిరావు, సిబ్బంది

ఉయ్యూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తాడిగడప మున్సిపాలిటీ పరిధి కానూరులో రెండస్తుల భవనంలో దాచి ఉంచిన 14 కిలోల 850 గ్రాముల గంజాయిని బుధవారం స్వాధీనం చేసుకుని ఇ ద్దరిని అరెస్ట్ చేసినట్టు ఉయ్యూరు సర్కిల్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ శేషగిరిరావు తెలిపారు. కానూరులో ఓ భవనంపైన పెంట్‌హౌస్‌లో గంజాయి దాచి ఉంచినట్టు తెలిసిన సమాచారం మేర సిబ్బందితో దాడిచేసి పానెం రామమోహన్‌రావు, యలమంచిలి మురళీకృష్ణ ప్రసాద్‌ను అరెస్టుచేసి వారి నుంచి గంజాయి స్వాధీనవ చేసుకుని కేసు నమోదుచేసి ఉయ్యూరు జూనియర్ సివిల్ జడ్జికోర్టులో మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచినట్టు తెలిపారు. నంది కేశ్వరరావు, వేణుగోపాలరావు, కే శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నట్టు తెలిపారు.



ఓజీలో పవన్ వినియోగించిన కారును ప్రదర్శిస్తున్న నిర్వాహకులు

ఘనంగా ఓజీ పవర్ ప్యాక్డ్ కర్టెన్ రైజ్

బెంజ్‌సర్కిల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎల్ఈపీఎల్ ఐకాన్ మల్టీప్లెక్స్ పటమట ఆధ్వర్యంలో ఓజీ పవర్ ప్యాక్డ్ కర్టెన్ రైజర్ ఈవెంట్‌ను యాజమాన్యం బుధవారం ఘనంగా నిర్వహించింది. పవన్ కల్యాణ్ చిత్రాల్లోని పలు గీతాలకు యువత ఉత్సాహభరితంగా ఫ్లాష్ మ్యాబ్ ప్రదర్శించారు. ఫ్లాష్‌మ్యాబ్‌లో ప్రదర్శించిన నృత్యాలను యువతను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం ఓజీ చిత్రంలో బొంబాయి బ్యాక్‌డ్రాప్‌లో 1990లో హీరో వినియోగించిన కారును ప్రదర్శించారు. చిత్ర పోస్టర్‌ను మాల్‌పై ఆవిష్కరించారు. లక్కీడిప్‌లో ఆరుగురికి ఉచితంగా ఓజీ ప్రీమియర్ షో టిక్కెట్స్‌ను అందించారు. ఈ సందర్భంగా ఎల్ఈపీఎల్ సీఈవో లింగమనేని కృష్ణకుమార్ మాట్లాడుతూ ఓజీ ప్రీరిలీజ్ ఈవెంట్‌ను విజయవాడ నగర ప్రజలకు అందించేందుకు ఈ ఈవెంట్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ఓజీ చిత్రం కోసం ఫ్యాన్స్ ఎదురుచూస్తున్నారన్నారని, ఈరోజు రాత్రి నుంచి ప్రీమియర్ షోలు నిర్వహిస్తున్నామని, టికెట్స్ ఇప్పటికే పూర్తిగా సేల్ ఐపోయాయన్నారు. దసరా ఉత్సవాల సందర్భంగా ప్రేక్షకులు ఈ చిత్రాన్ని ఆదరిస్తారని భావిస్తున్నామని వెల్లడించారు.



చుండూరు - పెదవడ్లపూడి మధ్య కొత్త 3వ లైన్‌ను తనిఖీ చేస్తున్న సౌత్ సెంట్రల్ సర్కిల్ రైల్వే సేఫ్టీ (సీఆర్ఎస్) కమిషనర్ మాధవి

చుండూరు - పెదవడ్లపూడి మధ్య కొత్త 3వ లైన్‌లో తనిఖీలు

రైల్వేస్టేషన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పౌర విమానయాన మంత్రిత్వ శాఖలోని సౌత్ సెంట్రల్ సర్కిల్ రైల్వే సేఫ్టీ (సీఆర్ఎస్) కమిషనర్ మాధవి బుధవారం దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ డివిజన్‌లోని చుండూరు - పెదవడ్లపూడి మధ్య కొత్త 3వ లైన్‌ను విస్తృతంగా తనిఖీ చేశారు. లైన్‌ను అమలులోకి తీసుకురావడానికి సంసిద్ధతను అంచనా వేయడం, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చూడటం వంటివి లక్ష్యంగా తనిఖీలు జరిగాయి. విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ మోహిత్ సోనాకియా, బ్రాంచ్ ఆఫీసర్లు తనిఖీ సమయంలో ఆమెతో ఉన్నారు. లైన్ ప్రారంభించిన తరువాత, ఈ లైన్ విజయవాడ డివిజన్ అంతటా మెరుగైన కనెక్టివిటీ క్రమబద్ధీకరించబడిన రైలు కార్యకలాపాలకు దోహం చేయనుంది.



స్వర్ణ యజ్ఞోపవీతాన్ని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకు అందజేస్తున్న మస్తాన్‌రావు దంపతులు

శ్రీవారికి రూ.3.86 కోట్ల స్వర్ణ యజ్ఞోపవీతం

» విశాఖ హిందుస్థాన్ ఎంటర్‌ప్రైజెస్ విరాళం



తిరుమల, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారికి బుధవారం వజ్రాలు పొదిగిన రూ.3.86 కోట్ల విలువైన స్వర్ణ యజ్ఞోపవీతం విరాళంగా అందింది. విశాఖపట్నానికి చెందిన హిందుస్థాన్ ఎంటర్‌ప్రైజెస్ ఎండీ పువ్వాడ మస్తాన్ రావు, కుంకుమరేఖ దంపతులు దీనిని రంగనాయకుల మండపంలో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుకి అందజేశారు. టీటీడీ బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, భానుప్రకాష్ రెడ్డి, నరేష్ కుమార్, శాంతారామ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



అన్నపూర్ణాదేవి అలంకారంలో దుర్గమ్మ ఉత్సవమూర్తి

అన్నపూర్ణాదేవిగా కనకదుర్గమ్మ

» 11 ఏళ్ల తర్వాత నేడు కాత్యాయనీ అలంకారంలో దర్శనం

విజయవాడ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ బుధవారం అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి భక్తులు అమ్మవారి దర్శనానికి పోటెత్తారు. రాత్రి 7 గంటల సమయానికి 66,177 మంది భక్తులు దర్శించుకున్నారు. మొత్తం 19,159 మంది అన్నప్రసాదాన్ని స్వీకరించారు. గురువారం దుర్గమ్మ కాత్యాయనీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. 11 ఏళ్ల తర్వాత ఈ అలంకారంలో అమ్మవారు దర్శనమివ్వనున్నారు.

చంద్రఘంట అలంకారంలో భ్రమరాంబిక

» రావణ వాహనంపై విహరించిన శివపార్వతులు



రావణ వాహనంపై స్వామిఅమ్మవార్ల విహారం

శ్రీశైలం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలంలో దసరా ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. మూడోరోజు బుధవారం భ్రమరాంబికా అమ్మవారు చంద్ర ఘంట అలంకరణలో భక్తులకు దర్శనమిచారు. చంద్రఘంట అలంకారంలో భ్రమరాంబికా అమ్మవారిని, మల్లికార్జునస్వామి వారిని రావణ వాహనంపై ఆశీనులను చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాలుగోరోజు గురువారం అమ్మవారు కూష్మాండ దుర్గ అలంకరణలో దర్శనమిస్తారు. అదే విధంగా ఆది దంపతులు కైలాస వాహనంపై విహరిస్తారు.

ఈ.కొలితోనే డయేరియా విజృంభణ

» పానీపూరి, తినుబండారాల విక్రయాలపై నిషేధం: గుంటూరు కలెక్టర్

గుంటూరు మెడికల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): డయేరియా ప్రభావిత ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన వ్యాధి నివారణ చర్యలు తీసుకుంటున్నామని గుంటూరు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. బుధవారం గుంటూరు నగర పరిధిలోని డయేరియా ప్రభావిత ప్రాంతాల్లో మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు, తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, డీఎంహెచ్‌వో విజయలక్ష్మితో కలిసి కలెక్టర్ పర్యటించారు. హ్యాండ్‌వాష్, లైఫ్‌బాయ్, ఓఆర్ఎస్, ఫినాయిల్‌తో కూడిన వెయ్యి కిట్లను స్థానికులకు అందజేశారు. రోగులకు ప్రథమ చికిత్స చేసేందుకు ఏర్పాటు చేసిన మొబైల్ మెడికల్ వ్యాన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అతిసారం తగ్గేంత వరకు నగరంలో పానీ పూరి, తోపుడు బండ్లపై తినుబండారాల విక్రయాలను నిషేధిస్తున్నట్లు ప్రకటించారు. గుంటూరు, కృష్ణా జిల్లాల్లో కలిపి బుధవారం వరకు 11 కలరా కేసులు నమోదయ్యాయి. వీరిలో అంగలకుదురుకు చెందిన మహిళ ఆస్పత్రి నుంచి డిశ్చార్జి కాగా, ఏడుగురు మంగళగిరిలోని ఎయిమ్స్‌లో, ముగ్గురు గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. 132 స్టూల్ శాంపిల్స్‌ను జీఎంసీ మైక్రోబయాలజీ ల్యాబ్‌లో పరీక్షించగా, మూడు విబ్రియో కలరే బ్యాక్టీరియా, 20 ఈ.కొలి బ్యాక్టీరియా, ఒక షిగెల్లా బ్యాక్టీరియా పాజిటివ్‌గా నివేదికలు వచ్చాయి. జిల్లాలో నెలకొన్న కలరా, డయేరియా పరిస్థితుల నేపథ్యంలో ఆర్ఎంపీ, పీఎంపీ, గ్రామీణ వైద్యులు రోగులకు యాంటీబయోటిక్ మందులు వాడటం, సెలైన్ పెట్టడం వంటివి చేయొద్దని, అతిసారంతో వచ్చే రోగుల వివరాలను తమకు తెలియజేయాలని ఆరోగ్యశాఖ ఆదేశించింది. ఆర్ఎంపీ సంఘం నేతలను బుధవారం డీఎంహెచ్‌వో కార్యాలయానికి పిలిపించి, పరిధికి మించిన వైద్యం చేసి మరిన్ని సమస్యలు సృష్టించవద్దని హెచ్చరించారు.

బ్రహ్మోత్సవ సంరంభం

ధ్వజారోహణంతో ప్రారంభమైన శ్రీవారి బ్రహ్మోత్సవాలు



ధ్వజస్తంభంపైకి గరుడ పటాన్ని ఎగుర వేస్తున్న అర్చకులు



పెద్ద శేషవాహనంపై మలయప్ప

» స్వామికి పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు

» వాహన సేవలో పాల్గొన్న ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్



పెద్ద శేషవాహనంలోని మలయప్పను దర్శించుకుంటున్న ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, సీఎం చంద్రబాబు తదితరులు

తిరుమల, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో బుధవారం ధ్వజారోహణం కార్యక్రమం ఆగమోక్తంగా జరిగింది. సాయంత్రం 5.43- 6.15 గంటల మధ్య మీన లగ్నంలో అర్చకబృందం బంగారు ధ్వజస్తంభంపై గరుడపటాన్ని ఎగురవేసి ముక్కోటి దేవతలకు ఆహ్వానం పలికారు. దీంతో సాలకట్ల బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున సీఎం చంద్రబాబు స్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు. తన సతీమణి భువనేశ్వరి, కుమారుడు, మంత్రి లోకేశ్ దంపతులతో కలిసి బుధవారం సాయంత్రం తిరుమలలోని గాయత్రి విశ్రాంతి భవనానికి చంద్రబాబు చేరుకున్నారు. సంప్రదాయ వస్త్రధారణతో బేడిఆంజనేయస్వామి ఆలయం వద్దకు చేరుకున్న ఆయన తలకు. అర్చకులు పరివట్టం చుట్టి శేషవస్త్రాన్ని మెడలో ధరింపజేశారు. నూతన పట్టువస్త్రాలను తలపై పెట్టుకున్న చంద్రబాబు మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని వస్త్రసమర్పణ చేశారు. మూలవర్లను దర్శించుకుని బలిపీఠం, ధ్వజస్తంభానికి మొక్కుకుని రంగనాయకుల మండపం చేరుకోగా వేదపండితులు ఆశీర్వాదం పలికారు. ఈ సందర్భంగా టీటీడీ ముద్రించిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను సీఎం ఆవిష్కరించారు. అనంతరం ఆయన వాహన మండపం చేరుకుని పెద్దశేష వాహనంలో పాల్గొని ఉత్సవమూర్తులను దర్శించుకున్నారు. ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ కూడా శ్రీవారిని దర్శించుకుని చంద్రబాబుతో కలిసి వాహనసేవలో పాల్గొన్నారు. దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, బోర్డు సభ్యులు, సినీ సంగీత దర్శకుడు తమన్ తదితరులు పాల్గొన్నారు.

మొదలైన వాహన సేవలు

బ్రహ్మోత్సవాల తొలిరోజు రాత్రి శ్రీదేవి, భూదేవి సమేతంగా మలయప్పస్వామి పెద్దశేష వాహనంలో నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. భక్తులు గ్యాలరీల్లో వేచివుండి, స్వామికి కర్పూరనీరాజనాలు సమర్పించారు. దీంతో బ్రహ్మోత్సవ వాహన సేవల వైభవం ప్రారంభమైంది.



తిరుమల శ్రీవారికి పట్టువస్త్రాలు తీసుకువెళుతున్న సీఎం చంద్రబాబుతో భువనేశ్వరి, లోకేశ్, దేవాన్ష్, చిత్రంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ఏకే సింఘాల్ తదితరులు

ఎవరికీ ఇవ్వని అవకాశం

శ్రీవారు నాకు ఇచ్చారు

14సార్లు పట్టువస్త్రాలు సమర్పించే భాగ్యం దక్కింది: సీఎం

'ఎవరికీ ఇవ్వని అవకాశం శ్రీవారు నాకు ఇచ్చారు. 14సార్లు బ్రహ్మోత్సవాల్లో పట్టువస్త్రాలు సమర్పించే భాగ్యం లభించింది' అని సీఎం చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు. శ్రీవారికి పట్టువస్త్రాల సమర్పణ అనంతరం ఆయన ఆలయంలోని రంగనాయక మండపంలో మాట్లాడారు. తనకు ఏ కష్టం వచ్చిన స్వామిపైనే భారం వేసి ముందుకు వెళతానని చెప్పారు. 22 ఏళ్ల ముందు బ్రహ్మోత్సవాల సమయంలో స్వామివారే తనకు ప్రాణభిక్ష పెట్టాడని, మామూలుగా అయితే అలిపిరి ఘటనలో ప్రాణాలతో బయటపడే అవకాశం లేదన్నారు. టీటీడీ, శ్రీవారి పవిత్రతను కాపాడుకుంటూ శ్రీవారి వైభవాన్ని ప్రపంచం మొత్తం తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. 'ఎన్టీ రామారావు మొదటిసారి సీఎం అయినప్పుడు అన్నదానం ప్రారంభించారు. ఇప్పుడు ఆ ట్రస్టులో రూ.2,283 కోట్ల కార్పస్ నిధులున్నాయి. ప్రతినెలా రూ.12 కోట్లు అన్నప్రసాద వితరణకు ఖర్చువుతోంది. రూ.14 కోట్ల ఆదాయం వస్తోంది. వడ్డీతోనే అన్నదానం కార్యక్రమాన్ని పూర్తిచేసే పరిస్థితులు వస్తాయి. ఇదే తరహాలో టీటీడీ ఆధ్వర్యంలోని ఆలయాలన్నిటిలో అన్నదాన కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని టీటీడీ బోర్డు, అధికారులకు సూచిస్తున్నా. శ్రీవారు నాకు ప్రాణభిక్ష పెట్టినప్పుడే ప్రాణదానం ట్రస్టును ప్రారంభించాం. ఇప్పటివరకు ఈ ట్రస్టుకు రూ.709 కోట్లు రాగా, రూ.21 కోట్లు ఖర్చు చేశాం. మరో రూ.688 కోట్ల నిధులున్నాయి. 'హిందువులు ఎక్కడుంటే అక్కడ శ్రీవారి ఆలయం ఉండాలి. ఆ ఆలయాలన్నీ తిరుమల శ్రీవారి ప్రధాన ఆలయానికి అనుసంధానం చేసుకుందాం. శ్రీవాణి ట్రస్టుల్లో ఇప్పటికే రూ.2,038 కోట్లు ఉంది. ఇప్పటికే రూ.837 కోట్లు ఖర్చు పెట్టాం. రూ.200 కోట్లకుపైగా వడ్డీ రూపంలో వచ్చింది. ఇంకా, రూ.1,700 కోట్లు ట్రస్టులో ఉంది. 5వేల ఆలయాలను గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించి పేదప్రజలకు శ్రీవారిని కొలిచే భాగ్యాన్ని కల్పించే కార్యక్రమాన్ని చేపట్టాలని టీటీడీ బోర్డు, అధికారులను కోరుతున్నా. ఇతర రాష్ట్ర రాజధానుల్లో కూడా శ్రీవారి ఆలయాలను నిర్మించేలా నేనే స్వయంగా లేఖలు రాస్తాను. ఈ పవిత్రమైన రోజున ఈ సంకల్పాన్ని ఇక్కడ నుంచే చేస్తున్నా. రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో, దేశంలోని అన్ని రాజధానుల్లో శ్రీవారి ఆలయాలు ఉండాలి. స్వామివారికి శ్రీవారి సేవకులు అతిపెద్ద సంపద. ప్రపంచం మొత్తం ఓ నెట్‌వర్క్‌లా చేసి వారి సేవలను ఉపయోగించుకుంటూ, గుర్తింపు ఇచ్చే రేటింగ్ ఇవ్వాల్సిన అవసరముంది'. అని చంద్రబాబు పేర్కొన్నారు.

వ్యవసాయ-సహకార శాఖ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా కోటేశ్వరమ్మ

అమరావతి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అదనపు కార్యదర్శి ఎస్.కోటేశ్వరమ్మను వ్యవసాయ-సహకార శాఖకు చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. విజిలెన్స్ కమిషన్ పరిపాలనలో భాగంగా జాబ్ చార్ట్ ప్రకారం కోటేశ్వరమ్మ వ్యవసాయ, సహకార శాఖకు చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



నూతన దంపతులతో సీఎం చంద్రబాబు, భువనేశ్వరి, మంత్రి లోకేశ్

వైభవంగా మంత్రి నిమ్మల కుమార్తె వివాహం

» వధూవరులను ఆశీర్వదించిన సీఎం చంద్రబాబు దంపతులు, లోకేశ్

పాలకొల్లు అర్బన్/ టౌన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో బుధవారం రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు కుమార్తె శ్రీజ, పవన్‌ల వివాహం వైభవంగా జరిగింది. ఈ వివాహానికి సీఎం చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు, మంత్రి లోకేశ్ హాజరై వధూవరులను ఆశీర్వదించి నూతన వస్త్రాలు బహూకరించారు. పాలకొల్లు బైపాస్ రోడ్డులోని 16 ఎకరాల్లో భారీ టెంట్‌లతో వివాహ వేదికను ఏర్పాటు చేశారు. సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద సీఎం చంద్రబాబు దంపతులు, లోకేశ్‌లకు భారీ గజమాలతో స్వాగతం పలికారు. అక్కడ నుంచి 2,000 వేల మందికిపైగా ప్రత్యేక దుస్తులు ధరించిన మహిళలు, పురుషులు పూలు జల్లుతూ సీఎంకు స్వాగతం పలికారు. టీడీపీ కార్యకర్తలు, నాయకులు పసుపు చొక్కాలతో సందడి చేశారు. వధూవరులను ఆశీర్వదించిన సీఎం చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు.. మంత్రి నిమ్మల రామానాయుడు, సూర్యకుమారి దంపతులు, వరుడు తల్లిదండ్రులు యిర్రింకి వెంకట సూర్య సత్యనారాయణ, కరుణామణి దంపతులతో ముచ్చటించారు. గంటకుపైగా ఇక్కడ గడిపిన అనంతరం సీఎం తిరిగి వెళ్లారు. కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు ఆరిమిల్లి రాధాకృష్ణ, పితాని సత్యనారాయణ, మాజీ మంత్రులు తోట సీతారామలక్ష్మి, కొత్తపల్లి సుబ్బారాయుడు, పీతల సుజాత, మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజుతో పాటు పెద్ద సంఖ్యలో ప్రముఖులు వివాహ వేడుకకు హాజరయ్యారు.

ఛత్తీస్‌గఢ్‌లో 71 మంది మావోయిస్టులు లొంగుబాటు



లొంగిపోయిన మావోయిస్టులతో పోలీసులు

చింతూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా సరిహద్దు ఛత్తీస్‌గఢ్‌లో 71 మంది మావోయిస్టులు బుధవారం పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఈ మేరకు దంతెవాడ జిల్లా కేంద్రంలో బస్తర్ ఐజీ సుందర్‌రాజ్, ఎస్పీ గౌరవ్‌రాయ్, సీఆర్‌పీఎఫ్ ఉన్నతాధికారి రాకేష్ చౌదరి మీడియాకు వివరాలు వెల్లడించారు. లొంగిపోయిన వారిలో 21 మంది మహిళలు ఉన్నారని తెలిపారు. 30 మంది మావోయిస్టులపై రూ.64 లక్షల వరకు రివార్డు ఉందని వెల్లడించారు.

డిప్యూటీ సీఎం హామీతో

మత్స్యకారుల దీక్ష తాత్కాలిక విరమణ

» 10 లోపు ఉప్పాడ రాకుంటే మళ్లీ ఆందోళనకు సిద్ధం



ఉప్పాడలో మత్స్యకారులతో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

కొత్తపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తీర ప్రాంతాల్లో రసాయన పరిశ్రమల వల్ల మత్స్య సంపద అంతరించిపోవడంతో తమ జీవనోపాధికి ఆటంకం కలుగుతోందని, తమకు నష్టపరిహారం చెల్లించాలని కాకినాడ జిల్లా కొత్తపల్లి మం డలం ఉప్పాడ బీచ్‌రోడ్డు సెంటర్‌లో మత్స్యకారులు చేపట్టిన ఆందోళన బుధవారం తాత్కాలికంగా విరమించారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను అక్టోబరు 2నుంచి 10వ తేదీలోగా ఉప్పాడ తీసుకొచ్చి మత్స్యకారులతో సమావేశపరుస్తామన్న జనసేన కాకినాడ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి ఇచ్చిన హామీ మేరకు తాత్కాలికంగా ఆందోళన విరమించామని మత్స్యకార నాయకులు తెలిపారు. వచ్చే నెల 10వ తేదీలోగా డిప్యూటీ సీఎం ఉప్పాడ రాకుంటే యథావిధిగా ఆందోళన చేపడతామని మత్స్యకారులు హెచ్చరించారు. బుధవారం ఉదయం డిప్యూటీ సీఎం ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఆందోళన చేస్తున్న మత్స్యకారుల దగ్గరకు చేరుకుని పవన్ కల్యాణ్ పేర్కొన్న పాయింట్లను మత్స్యకారులకు వివరించి వేటకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు.

సమస్యలు పరిష్కరిస్తా: డిప్యూటీ సీఎం

ఉప్పాడ తీర ప్రాంత మత్స్యకారుల సమస్యలన్నీ తన దృష్టిలో ఉన్నాయని, వాటి పరిష్కారానికి ఉన్నతాధికారులు, మత్స్యకార ప్రతినిధులు, స్థానిక నాయకులతో కమిటీ ఏర్పాటు చేస్తామని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చారు. కాలుష్య పరిశ్రమలవల్ల మత్స్యకారుల జీవనోపాధికి నష్టం వాటిల్లుతోందని రెండ్రోజులుగా చేస్తున్న ఆందోళనపై ఆయన స్పందించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం తాను శాసనసభ సమావేశాల కారణంగా వ్యక్తిగతంగా వచ్చి మత్స్యకారులతో చర్చించలేకపోతున్నానని, మత్స్యకారుల సమస్యల పరిష్కారం కోసం రెండురోజుల నుంచి జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులతో చర్చిస్తున్నానని తెలిపారు. కాలుష్య నియంత్రణ మండలి, పరిశ్రమలు, ఫిషరీస్, రెవెన్యూ ఉన్నతాధికారులు, కాకినాడ జిల్లా కలెక్టర్‌తో కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. ఆయా కమిటీల్లో మత్స్యకార ప్రతినిధులు, స్థానిక నాయకులకు స్థానం ఇవ్వాలని నిర్ణయించామన్నారు. సమస్యల పరిష్కారంతోపాటు జీవనోపాధి మెరుగుదల, తీరప్రాంత గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ఈ కమిటీ దృష్టిపెడుతుందన్నారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తర్వాత స్వయంగా ఉప్పాడ వచ్చి మత్స్యకారులతో కూర్చొని అన్ని సమస్యలపై సమగ్రంగా చర్చిస్తానని తెలిపారు.

బిజినెస్

హైదరాబాద్‌లో హెచ్‌సీఏ జీసీసీ

● 3,000 మందికి ఉద్యోగాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌లో మరో ప్రముఖ అమెరికా కంపెనీ కొలువు తీరింది. అమెరికా, బ్రిటన్ దేశాల్లో 195 ఆస్పత్రులు, 2500 కేర్ సెంటర్ల ద్వారా వైద్య సేవలందిస్తున్న 'హెచ్‌సీఏ హెల్త్‌కేర్ హైదరాబాద్‌లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ) ఏర్పాటు చేసింది. సత్వా నాలెడ్జ్ పార్కులో నాలుగు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ జీసీసీ కేంద్రాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు బుధవారం ప్రారంభించారు. ఈ ఏడాది చివరికి ఈ జీసీసీ కోసం 7.5 కోట్ల డాలర్లు (సుమారు రూ.665.25 కోట్లు) ఖర్చు చేయనున్నట్టు హెచ్‌సీఏ హెల్త్‌కేర్ గ్లోబల్ కేపబిలిటీ నెట్‌వర్క్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎమిలీ డంకన్ చెప్పారు. ప్రస్తుతం ఈ కేంద్రంలో 1100 మంది పనిచేస్తున్నారు. వచ్చే ఏడాది చివరికి ఉద్యోగుల సంఖ్య 3,000కు పెరగనుంది.

82,000 దిగువకు సెన్సెక్స్

● రూ.3 లక్షల కోట్ల సంపద ఆవిరి

ముంబై: ఈక్విటీ సూచీలు వరుసగా నాలుగో రోజూ నష్టాల్లో పయనించాయి. సెన్సెక్స్ 82,000 పాయింట్లు, నిఫ్టీ 25,100 పాయింట్ల దిగువకు జారాయి. బ్యాంకింగ్, ఆటో, క్యాపిటల్ గూడ్స్ రంగ షేర్లలో మదుపరులు లాభాలు స్వీకరించడం ఇందుకు కారణం. విదేశీ సంస్థాగత పెట్టుబడుల ఉపసంహరణ, ఐటీ షేర్లలో కొనసాగిన అమ్మకాలు కూడా వరుస నష్టాలకు మరో కారణం. బుధవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 386.47 పాయింట్లు కోల్పోయి 81,715.63 వద్దకు జారుకుంది. నిఫ్టీ 112.60 పాయింట్ల నష్టంతో 25,056.90 వద్ద ముగిసింది. బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ దాదాపు రూ.3 లక్షల కోట్లు తగ్గి రూ.460.56 లక్షల కోట్లకు పడిపోయింది.

అంగముత్తుకు విశాఖ పోర్టు చైర్మన్‌గా అదనపు బాధ్యతలు

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పోర్టు చైర్మన్‌గా ఎం.అంగముత్తుకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కేంద్ర పోర్టులు, నౌక, జల రవాణా మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఇక్కడ పోర్టు చైర్మన్‌గా పనిచేసిన ఆయనను ఇటీవలే ముంబై పోర్టు చైర్మన్‌గా నియమించారు. దాంతో ఆయన ముంబైలో సోమవారం బాధ్యతలు చేపట్టారు. విశాఖ పోర్టు చైర్మన్‌ను నియమించడానికి ఇంకా కొంత సమయం పట్టే అవకాశం ఉండడంతో ఆరు నెలల పాటు అదనపు బాధ్యతలు నిర్వహించాలని ఆదేశాలు వచ్చాయని పోర్టు సెక్రటరీ వేణుగోపాల్ బుధవారం తెలిపారు.

'ఎఫ్‌ఎంసీజీ'కి జీఎస్‌టీ తంటా



తగ్గింపు అమలులో చిక్కులు.. పరిమాణం పెంచి పాత ధరలు!

న్యూఢిల్లీ: జీఎస్‌టీ రేట్ల తగ్గింపు అమలు చేయడం ఎఫ్‌ఎంసీజీ కంపెనీలకు పెద్ద తలనొప్పిగా మారింది. చిన్న చిన్న ప్యాకెట్ల రూపంలో రూ.10, రూ.5, రూ.2 ఎంఆర్‌పీకి అమ్మే వస్తువుల ధరల్ని, జీఎస్‌టీ 2.0 సంస్కరణలతో పావలా నుంచి 55 పైసల వరకు తగ్గించి అమ్మాల్సి వస్తోంది. అయితే తగ్గిన ధరలకు సరిపడా చిల్లర లేక అటు కొనుగోలుదారులు, ఇటు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పేద, మధ్య తరగతి వర్గాలు, గ్రామీణ ప్రజల నుంచి ఈ సమస్య ఎక్కువగా ఉందని రిటైల్ వ్యాపారులు చెబుతున్నారు.

డిసెంబరు వరకు ఇంతే

సాధారణంగా ఎఫ్‌ఎంసీజీ కంపెనీలు రెండు నెలల వినియోగానికి సరిపడా వస్తువులను మార్కెట్‌లో విడుదల చేస్తుంటాయి. జీఎస్‌టీ రేట్ల తగ్గింపుపై ఈ నెల మొదటి వారంలో గానీ కంపెనీలకు స్పష్టత రాలేదు. నవంబరు వరకు మార్కెట్‌లో విడుదల చేసే వస్తువుల ఎంఆర్‌పీ ధరలను కంపెనీలు ఇప్పటికే ముద్రించేశాయి. ఇపుడు జీఎస్‌టీ తగ్గింపునకు అనుగుణంగా రేట్లు తగ్గించినా, చిల్లర సమస్య ఎదురవుతోంది. ఈ కారణంగా ఆయా ప్యాకెట్లలోని వస్తువుల పరిమాణం పెంచి, డిసెంబరు నుంచి పాత ఎంఆర్‌పీ ధరలకే మార్కెట్‌లో విడుదల చేయాలని కంపెనీలు యోచిస్తున్నాయి.

'ఇది తాత్కాలిక సమస్య. ప్యాకెట్‌లోని వస్తువుల పరిమాణం పెంచడం ద్వారా నెలన్నర నుంచి రెండు నెలల్లో ఈ సమస్యను అధిగమిస్తాం' అని పార్లే ప్రొడక్ట్స్ వైస్ ప్రెసిడెంట్ మయాంక్ షా చెప్పారు. నువామా ఇనిస్టిట్యూషనల్ ఈక్విటీస్ సీనియర్ అధికారి అభనీశ్ రాయ్ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు.

తగ్గిన సి'మంట'

● బస్తాపై రూ.30 వరకు ఆదా



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): తెలుగు రాష్ట్రాలతో సహా దేశ వ్యాప్తంగా సిమెంట్ ధరలు తగ్గాయి. రిటైల్ మార్కెట్‌లో సిమెంట్ 50 కిలోల బస్తా ధర రెండు తెలుగు రాష్ట్రాల్లో రూ.30 వరకు తగ్గింది. ఈ నెల 21 వరకు బ్రాండును బట్టి ధర రూ.290 నుంచి రూ.370 వరకు ఉండేది. జీఎస్‌టీ భారం 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గడంతో ఇప్పుడది రూ.260 నుంచి రూ.330 వరకు పలుకుతోంది. దీంతో గత నెల రోజుల నుంచి వినియోగదారులు కొనుగోళ్లకు ముందుకు వస్తున్నట్టు రిటైల్ డీలర్లు చెబుతున్నారు.

పెరగనున్న డిమాండ్: నిన్న మొన్నటి వరకు దేశ వ్యాప్తంగా సిమెంట్ అమ్మకాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రతి నెల సగటున 23 నుంచి 25 లక్షల టన్నుల సిమెంట్ అమ్ముడయ్యేది. వర్షాల దెబ్బకు అది గత నెల 21 లక్షల టన్నులకు పడిపోయినట్టు పరిశ్రమ వర్గాలు చెప్పాయి. పండుగల సీజన్, జీఎస్‌టీ లాభం తోడవడంతో అమ్మకాలు మళ్లీ పుంజుకుంటాయని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. దీంతో ప్రస్తుతం 55 నుంచి 60 శాతం వరకు ఉన్న ఉత్పత్తి సామర్థ్య వినియోగం జనవరి నాటికి 60 శాతం మించే అవకాశం ఉందని ఒక కంపెనీ డైరెక్టర్ చెప్పారు.

అమెజాన్‌లో 'జీఎస్‌టీ బచత్ ఉత్సవ్'

50 నుంచి 80 శాతం వరకు డిస్కౌంట్

బెంగళూరు (ఆంధ్రజ్యోతి) : 'గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్'లో భాగంగా అమెజాన్ 'గ్రేట్ సేవింగ్స్ సెలబ్రేషన్ ఎట్ జీఎస్‌టీ బచత్ ఉత్సవ్'కు శ్రీకారం చుట్టింది. ఈ ఉత్సవ్‌లో నెటిజన్లు 50 నుంచి 80 శాతం డిస్కౌంట్‌తో ఆధునిక ఎలక్ట్రానిక్ వస్తువులు, ఫ్యాషన్, బ్యూటీ, గృహోపకరణాలు, హెల్త్‌కేర్, నిత్యావసరాలను జీఎస్‌టీ తగ్గింపు ధరలతో కొనుగోలు చేయవచ్చు.

amazon.in GREAT INDIAN FESTIVAL

ఉత్సవ్ ప్రత్యేకతలు
- ప్రధాన పండగదినాల్లో డీల్ విత్ జీఎస్‌టీ సేవింగ్స్
- నో కాస్ట్ ఇఎంఐ వెసులుబాటు.
- ప్రైమ్ సభ్యులకు అమెజాన్ పే రివార్డ్స్ ద్వారా ఐదు శాతం వరకు క్యాష్‌బాక్.
- అమెజాన్ విక్రేతలకు కొత్త జీఎస్‌టీ రేట్లకు అనుగుణంగా అవసరమైన టూల్స్, మార్గదర్శకాలు.
- జీఎస్‌టీ టాక్స్ కోట్స్‌పై అవగాహనకు మాస్టర్ క్లాస్.
- ధర నిర్ణయంలో విక్రేతలకే పూర్తి హక్కు.
- అమ్మకానికి లక్షకు పైగా ఉత్పత్తులు.
- రూ.43,749కే ఐఫోన్ 15 మోడల్ లభ్యం.
- శాంసంగ్ గెలాక్సీ ఎస్24 మోడల్ ధర రూ.71,999.
- ఎస్‌బీఐ క్రెడిట్, డెబిట్ కార్డులపై 10% డిస్కౌంట్.
- అమెజాన్ పే, ఐసీఐసీఐ క్రెడిట్ కార్డులపై అపరిమిత క్యాష్‌బాక్ సదుపాయం.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,15,370 ▲	1,05,750 ▲	1,50,000 ▲
విజయవాడ	1,17,350 ▼	1,10,500 ▼	1,38,500 ▼
విశాఖపట్నం	1,17,360 ▼	1,06,050 ▲	1,50,000 ▲
రాజమండ్రి	1,15,360 ▲	1,05,750 ▲	1,38,900 ▲
ప్రొద్దుటూరు	1,18,700 ▲	1,09,200 ▲	1,39,000 ▲
ముంబై	1,13,580 ▼	1,04,040 ▼	1,34,090 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

25వ తేదీ

హైదరాబాద్	540	విజయవాడ	550
వరంగల్	542	గోదావరి	540
చిత్తూరు	578	విశాఖపట్నం	530

డజను గుడ్లు రూ. 72

ఫామ్‌గేట్ ధర — పెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	105	విజయవాడ	120
వరంగల్	105	గుంటూరు	122
కరీంనగర్	105	ఒంగోలు	122
మహబూబ్‌నగర్	105	చిత్తూరు	92
కర్నూలు	105	నెల్లూరు	97
విశాఖపట్నం	129	అనంతపురం	97
గోదావరి	120		

బజాజ్ ఎలక్ట్రికల్ చేతికి మర్ఫీ రిచర్డ్స్ బ్రాండ్ హక్కులు

ఒప్పందం విలువ రూ. 146 కోట్లు

న్యూఢిల్లీ: అంతర్జాతీయ ఎలక్ట్రికల్ అప్లయెన్స్ బ్రాండ్ మర్ఫీ రిచర్డ్స్ మేధో సంపత్తి హక్కులను కొనుగోలు చేస్తున్నట్లు బజాజ్ ఎలక్ట్రికల్స్ బుధవారం ప్రకటించింది. ఐర్లాండ్‌కు చెందిన గ్లెన్ డింప్లెక్స్ గ్రూప్‌లో భాగమైన గ్లెన్ ఎలక్ట్రిక్ నుంచి ఈ హక్కులను దక్కించుకోనున్నట్లు తెలిపింది. ఈ డీల్‌లో భాగంగా బజాజ్ ఎలక్ట్రికల్స్‌కు భారత్, నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్, మాల్దీవులు, శ్రీలంక మార్కెట్లలో మర్ఫీ రిచర్డ్స్ బ్రాండ్ హక్కులు కూడా లభించనున్నాయి. ఈ ఒప్పందం విలువ రూ.146 కోట్లు. బజాజ్ ఎలక్ట్రికల్స్ గత రెండు దశాబ్దాలుగా మర్ఫీ రిచర్డ్స్ బ్రాండ్‌తో లైసెన్సు ఒప్పందం కలిగి ఉంది. తద్వారా సంస్థ మర్ఫీ రిచర్డ్స్ బ్రాండ్ మిక్సర్లు, ఓవెన్, టోస్టర్ గ్రిల్స్, కాఫీ మేకర్స్, ఎయిర్ ఫ్రేయర్స్, ఐరన్ బాక్సులు, హాట్ ఎయిర్ బ్రష్, హెయిర్ స్ట్రెయిటెనర్స్ హెయిర్ డ్రయర్స్‌ను భారత్‌లో విక్రయిస్తోంది. మేధో సంపత్తి హక్కుల కొనుగోలుతో బజాజ్ ఎలక్ట్రికల్ భారత్ సహా నిర్దేశిత మార్కెట్లలో మర్ఫీ రిచర్డ్స్ బ్రాండ్ హక్కులపై పూర్తి యాజమాన్యాన్ని కలిగి ఉండనుంది.

ఫోన్‌పే రూ. 12,000 కోట్ల ఐపీఓ!

సెబీకి ముసాయిదా పత్రాలు

న్యూఢిల్లీ: ప్రపంచ రిటైల్ దిగ్గజం వాల్‌మార్ట్ గ్రూప్ అనుబంధ సంస్థ ఫోన్‌పే కూడా తొలి పబ్లిక్ ఆఫరింగ్‌కు (ఐపీఓ) రాబోతోంది. ఇందుకు అనుమతి కోరుతూ మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఐపీఓ వివరాలను గోప్యంగా ఉంచేందుకు ఈ సంస్థ కాన్ఫిడెన్షియల్ ప్రీ-ఫైలింగ్ మార్గాన్ని ఎంచుకుంది. ఐపీఓ ద్వారా ఫోన్‌పే రూ.12,000 కోట్ల వరకు నిధులు సమీకరించాలనుకుంటున్నదని, ఈ ఇష్యూ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్‌ఎస్) పద్ధతిన జరగనుందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఓఎఫ్‌ఎస్ ద్వారా కంపెనీ వాటాదారులైన వాల్‌మార్ట్, టైగర్ గ్లోబల్, మైక్రోసాఫ్ట్ మొత్తంగా 10 శాతం వరకు వాటాను విక్రయించనున్నాయని వారన్నారు. 2016 ఆగస్టులో ప్రారంభమైన ఫోన్‌పే డిజిటల్ చెల్లింపులతో పాటు బీమా, రుణాలు, వెల్త్ సేవలనూ అందిస్తోంది. ప్రస్తుతం మార్కెట్ వాటాపరంగా ఫోన్‌పే దేశంలో అతి పెద్ద డిజిటల్ చెల్లింపుల సేవల కంపెనీగా ఉంది.

హిండెన్‌బర్గ్ నివేదిక.. భారత సంస్థలపై దాడి

గౌతమ్ అదానీ

న్యూఢిల్లీ: అమెరికన్ షార్ట్ సెల్లింగ్ కంపెనీ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ నివేదికలోని ఆరోపణలను దేశీయ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ తోసిపుచ్చడం తమ గ్రూప్ పాలన విధానాలు, పారదర్శకతకు బలమైన సమర్థన అని అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ అన్నారు. ఎట్టకేలకు నిజం గెలిచిందని గ్రూప్ వాటాదారులకు బుధవారం రాసిన లేఖలో ఆయన పేర్కొన్నారు. హిండెన్‌బర్గ్ నివేదిక కేవలం అదానీ గ్రూప్‌పై జరిగిన దాడి మాత్రమే కాదు.. ప్రపంచ స్థాయిలో విస్తరించాలని కలలు కనే భారత సంస్థల ధైర్యసాహసాలకు ప్రత్యక్ష సవాలు అని గౌతమ్ అదానీ అన్నారు. తమను బలహీనపరిచే దురుద్దేశంతో విడుదల చేసిన నివేదిక.. గ్రూప్ పునాదులను మరింత బలోపేతం చేసిందటూ గడిచిన రెండేళ్లలో గ్రూప్ ఆర్థిక పురోగతిని అదానీ ఆ లేఖలో ప్రస్తావించారు.

స్పోర్ట్స్

పతకం తెచ్చే సత్తా ఉంటేనే..

2026 ఆసియా క్రీడలకు కఠిన ఎంపిక ప్రమాణాలు



న్యూఢిల్లీ: వచ్చే ఆసియా క్రీడల (2026)కు కఠినమైన ఎంపిక ప్రక్రియను కేంద్రం ప్రకటించింది. పతకాలు సాధించే సత్తా కలిగిన అథ్లెట్లనే ఎంపికలో పరిగణిస్తామని క్రీడా శాఖ స్పష్టంజేసింది. ఈ క్రమంలో ఆసియా ర్యాంకింగ్స్‌ను ప్రామాణికంగా తీసుకుంటారని పేర్కొంది. అలాగే ప్రభుత్వంపై భారం పడకున్నా..అంటే అథ్లెట్లు సొంత ఖర్చులతో కోచ్‌లు, ఇతర సహాయ సిబ్బందిని తీసుకువెళ్లడానికి కూడా అనుమతించబోమని తెలిపింది. ఈమేరకు ఎంపిక ప్రక్రియకు సంబంధించిన ఐదు పేజీల డాక్యుమెంట్‌ను క్రీడా శాఖ తన వెబ్‌సైట్‌లో బుధవారం అప్‌లోడ్ చేసింది. వ్యక్తిగత క్రీడాంశాల్లో తొలి ఆరు ర్యాంకుల్లో, అలాగే టీమ్ క్రీడాంశాల్లో భారత జట్టు ఎనిమిదో ర్యాంకు లోపు ఉంటేనే ఆసియా క్రీడల ఎంపికకు ఆయా క్రీడా సమాఖ్యలు సిఫారసు చేయాల్సి ఉంటుంది. ఆసియా క్రీడలు వచ్చే ఏడాది సెప్టెంబరు 19 నుంచి అక్టోబరు నాలుగు వరకు జపాన్‌లోని నగోయాలో జరగనున్నాయి. కామన్వెల్త్ క్రీడలు (ఆగస్టు 2026), సహా ఆసియా స్థాయిలో జరిగే ఇతర క్రీడలకూ ఇదే విధానం వర్తిస్తుందని వెల్లడించింది.

బ్యాటర్ల వైఫల్యం

- భారత్-ఎ 194 ఆలౌట్
- ఆసీస్-ఎ 16/3
- 242 పరుగుల ఆధిక్యంలో కంగారూలు

లఖ్‌నవూ: భారత్-ఎ బ్యాటర్లు ఘోరంగా విఫలమవడంతో.. రెండో అనధికార టెస్ట్‌లో ఆస్ట్రేలియా-ఎ భారీ ఆధిక్యాన్ని నమోదు చేసింది. ఆటకు రెండో రోజైన బుధవారం తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 194 పరుగులకే కుప్పకూలింది. దీంతో ఆసీస్ తొలి ఇన్నింగ్స్ స్కోరు 420 పరుగులకంటే భారత్ 226 రన్స్ వెనుకబడింది. సాయి సుదర్శన్ (75), నారాయణ్ జగదీశన్ (38) మినహా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. టెస్ట్ రేస్‌లో ఉన్న నితీశ్ కుమార్ (1) సింగిల్ డిజిట్‌కే వెనుదిరగ్గా.. ప్రసిద్ధ్ కృష్ణ (16) కంకషన్‌తో రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. పేసర్ హెన్రీ థార్న్‌టన్ 4 వికెట్లు తీశాడు. కాగా, రెండో ఇన్నింగ్స్‌లో ఆసీస్ 16/3 స్కోరు చేసింది. ఆలివర్ (1)ను మానవ్ అవుట్ చేయగా.. మెక్‌స్వీనే (11) క్రీజులో ఉన్నాడు. కొంటాస్ (3)ను బ్రార్.. కెల్లీ (0)ని సిరాజ్ పెవిలియన్ చేర్చారు. మొత్తంగా ఆసీస్ 242 రన్స్ ఆధిక్యంలో ఉంది.

అదరగొట్టిన వైభవ్, అభిగ్యాన్

- రెండో వన్డేలో ఆసీస్ అండర్-19 చిత్తు
- 2-0తో సిరీస్ భారత్ వశం



వైభవ్ (70)

బ్రిస్బేన్: యువ బ్యాటర్లు అభిగ్యాన్ కుందు (64 బంతుల్లో 71), వైభవ్ సూర్యవంశీ (68 బంతుల్లో 70), విహాన్ మల్హోత్రా (74 బంతుల్లో 70) చెలరేగడంతో.. ఆస్ట్రేలియా అండర్-19 జట్టుతో మూడు వన్డేల సిరీస్‌లో భారత అండర్-19 జట్టు 2-0తో తిరుగులేని స్థితిలో నిలిచింది. బుధవారం జరిగిన రెండో వన్డేలో భారత్ 51 పరుగుల తేడాతో గెలిచింది. తొలుత భారత్ 49.4 ఓవర్లలో 300 పరుగులకు ఆలౌటైంది. విల్ బైరోమ్ మూడు, యశ్ దేశ్‌ముఖ్ రెండు వికెట్లు పడగొట్టారు. ఛేదనలో ఆసీస్ 47.2 ఓవర్లలో 249 పరుగులకే కుప్పకూలింది. జేడెన్ డ్రేపర్ (107) సెంచరీ వృథా అయింది. ఆయుష్ మాత్రే మూడు, కనిష్క్ చౌహాన్ రెండు వికెట్లు పడగొట్టారు.

1 ఈ మ్యాచ్‌లో ఆరు సిక్స్‌లు బాదిన వైభవ్ మొత్తం 41 సిక్సర్లతో.. యూత్ వన్డేల్లో అత్యధిక సిక్స్‌లు కొట్టిన ఉన్ముక్త్ చాంద్ (38 సిక్స్‌లు) రికార్డును అధిగమించాడు.

ఫైనల్లో భారత్

- 41 రన్స్‌తో బంగ్లా చిత్తు
- బాదేసిన అభిషేక్ శర్మ
- తిప్పేసిన కుల్దీప్ యాదవ్



కుల్దీప్ (3/18)కు కెప్టెన్ సూర్య అభినందన



అభిషేక్ శర్మ (37 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్స్‌లతో 75)

దుబాయ్: వరుస విజయాలతో జోరు మీదున్న భారత్.. ఆసియా కప్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. అభిషేక్ శర్మ (37 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్స్‌లతో 75) ధనాధన్ అర్ధ శతకంతోపాటు బౌలర్లు రాణించడంతో.. బుధవారం జరిగిన సూపర్-4 మ్యాచ్‌లో టీమిండియా 41 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌ను చిత్తు చేసింది. తొలుత భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 168/6 స్కోరు చేసింది. హార్దిక్ పాండ్యా (38), శుభ్‌మన్ గిల్ (29) రాణించారు. రిషద్ హొస్సేన్ రెండు వికెట్లు పడగొట్టాడు. అనంతరం ఛేదనలో బంగ్లా 19.3 ఓవర్లలో 127 పరుగులకు ఆలౌటైంది. సైఫ్ హసన్ (69), పర్వేజ్ హొస్సేన్ ఇమాన్ (21) మినహా మిగతా బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. కుల్దీప్ మూడు.. బుమ్రా, వరుణ్ చక్రవర్తి చెరో రెండు వికెట్లు దక్కించుకొన్నారు. అభిషేక్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది. సూపర్-4లో నాలుగు పాయింట్లతో టీమిండియా తొలి ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకోగా.. శ్రీలంక టోర్నీ నుంచి నిష్క్రమించింది. గురువారం పాకిస్థాన్, బంగ్లాదేశ్ మధ్య జరిగే మ్యాచ్‌తో రెండో బెర్త్ ఎవరికి దక్కుతుందో తేలుతుంది. లిట్టన్ దాస్ వెన్నునొప్పితో బాధపడుతుండడంతో జాకెర్ అలీ బంగ్లా తాత్కాలిక కెప్టెన్‌గా వ్యవహరించాడు.

బౌలర్ల దెబ్బకు విలవిలా..

సైఫ్ ఒంటరి పోరాటం చేసినా.. టీమిండియా బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు పడగొట్టడంతో బంగ్లా ఏదశలోనూ మ్యాచ్‌లోకి రాలేకపోయింది. రెండో ఓవర్‌లో ఓపెనర్ తన్జిద్ హసన్ (1)ను అవుట్ చేసిన బుమ్రా.. ఆరంభంలోనే బంగ్లాను దెబ్బకొట్టాడు. దీంతో సైఫ్, పర్వేజ్ ఆచితూచి ఆడడంతో స్కోరు బోర్డు మందకొడిగా కదిలింది. అయితే, నాలుగో ఓవర్‌లో వరుణ్ బౌలింగ్‌లో రెండు వరుస బౌండ్రీలతో దూకుడు పెంచిన పర్వేజ్.. ఆ తర్వాతి ఓవర్‌లో బుమ్రా బౌలింగ్‌లో సిక్స్ బాదాడు. దీంతో ఆరు ఓవర్లకు బంగ్లా 44/1తో నిలిచింది. మధ్య ఓవర్లలో స్పిన్నర్లు కుల్దీప్, అక్షర్ పరుగులను కట్టడి చేస్తూ బంగ్లా బ్యాటర్లపై ఒత్తిడి పెంచారు. ధాటిగా ఆడే ప్రయత్నం చేస్తున్న పర్వేజ్‌ను అవుట్ చేసిన కుల్దీప్.. రెండో వికెట్‌కు 42 పరుగుల భాగస్వామ్యాన్ని విడదీశాడు. మరోవైపు సైఫ్ వీలు చిక్కినప్పుడల్లా షాట్లు ఆడుతూ స్కోరు బోర్డును నడిపించాడు. కాగా, 10వ ఓవర్‌లో తన బౌలింగ్‌లో సిక్స్ బాదిన హ్రిదయ్ (7)ను అక్షర్ అదే ఓవర్‌లో క్యాచౌట్ చేశాడు. ఆ తర్వాత షమీమ్ (0)ను వరుణ్ బౌల్డ్ చేయడంతో.. బంగ్లా 74/4తో ఇబ్బందుల్లో పడినట్టు కనిపించింది. జాకెర్ అలీ (4)ని సూర్య రనౌట్ చేశాడు. మరోవైపు అక్షర్ వేసిన 14వ ఓవర్‌లో రెండు సిక్స్‌లతో అర్ధ శతకం పూర్తి చేసుకొన్న సైఫ్.. జట్టు స్కోరును సెంచరీ దాటించాడు. బంగ్లా విజయానికి చివరి 5 ఓవర్లలో 61 పరుగులు కావల్సి ఉండగా.. సైఫుద్దీన్ (4)ను వరుణ్ వెనక్కి పంపాడు. 17వ ఓవర్‌లో రిషద్ (2), తన్జిమ్ హసన్ (0)ను కుల్దీప్ వరుస బంతుల్లో పెవిలియన్ చేర్చగా.. సైఫ్‌ను బుమ్రా అవుట్ చేయడంతో బంగ్లా పోరాటం ముగిసింది.

'డెత్'లో డీలా..

డాషింగ్ ఓపెనర్ అభిషేక్ శర్మ అదిరే ఆరంభాన్నిచ్చినా.. మిగతా బ్యాటర్ల వైఫల్యంతో భారత్ ఓ మాదిరి స్కోరుకే పరిమితమమైంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా పవర్‌ప్లే తొలి మూడు ఓవర్లలో 17 పరుగులే చేసినా.. ఆ తర్వాత ఓపెనర్లు అభిషేక్, గిల్ బ్యాట్లు ఝుళిపించారు. నాలుగో ఓవర్‌లో నసుమ్ అహ్మద్ బౌలింగ్‌లో గిల్ 4, 6తో జోరు చూపగా.. అభిషేక్ సిక్స్‌తో మొత్తం 21 పరుగులు లభించాయి. ఇక్కడి నుంచి టాప్ గేర్‌లో సాగిన శర్మ రెండు సిక్స్‌లు, నాలుగు ఫోర్లు బాదడంతో.. ఆరు ఓవర్లు ముగిసే సరికి భారత్ 72/0తో భారీ స్కోరు చేసేలా కనిపించింది. కానీ, మధ్య ఓవర్లలో స్పిన్నర్ రిషద్.. గిల్‌తోపాటు వన్‌డౌన్ బ్యాటర్ శివం దూబే (2)ను అవుట్ చేసి టీమిండియా జోరుకు బ్రేకులు వేశాడు. దీంతో తొలి వికెట్‌కు 77 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. మరోవైపు సింగిల్‌తో అభిషేక్ ఫిఫ్టీ పూర్తి చేసుకొన్నాడు. ఈ క్రమంలో కొంతసేపు స్తబ్దుగా ఉన్న అభిషేక్.. 11వ ఓవర్‌లో 6,4తో మరోసారి బ్యాట్‌కు పని చెప్పడంతో జట్టు స్కోరు సెంచరీ మార్క్ దాటింది. ధాటిగా ఆడుతున్న అభిషేక్ అనవసరంగా రనౌట్ కాగా.. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (5) స్వల్ప స్కోరుకే పెవిలియన్ చేరడంతో టీమిండియా బ్యాటింగ్ ఒక్కసారిగా కుదుపులకు లోనైంది. తిలక్ వర్మ (5) కూడా ఎక్కువసేపు క్రీజులో నిలవలేదు. అయితే, డెత్ ఓవర్లలో హార్దిక్ పాండ్యాకు అక్షర్ పటేల్ (10 నాటౌట్) జత కలవడంతో స్కోరు బోర్డు పరుగులు పెడుతుందని అంతా భావించారు. కానీ, బంగ్లా బౌలర్లు కట్టుదిట్టంగా బంతులేయడంతో.. వీరిద్దరూ 34 బంతుల్లో 39 పరుగుల భాగస్వామ్యాన్ని మాత్రమే నమోదు చేశారు. అడపాదడపా షాట్లు ఆడిన పాండ్యా ఇన్నింగ్స్ ఆఖరి బంతికి పెవిలియన్ చేరడంతో.. టీమిండియా 170 మార్క్‌ను కూడా అందుకోలేక పోయింది.

ఆసియా కప్‌లో నేడు
బంగ్లాదేశ్ X పాకిస్థాన్
రా.8 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో

స్కోరుబోర్డు

భారత్: అభిషేక్ (రనౌట్) 75, గిల్ (సి) తన్జిమ్ షకిబ్ (బి) రిషద్ 29, శివమ్ దూబె (సి) హ్రిదయ్ (బి) రిషద్ 2, సూర్యకుమార్ (సి) జాకెర్ అలీ (బి) ముస్తాఫిజుర్ 5, హార్దిక్ పాండ్యా (సి) తన్జిద్ హసన్ (బి) సైఫుద్దీన్ 38, తిలక్ (సి) సైఫ్ హసన్ (బి) తన్జిమ్ షకిబ్ 5, అక్షర్ (నాటౌట్) 10, **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 20 ఓవర్లలో 168/6; వికెట్ల పతనం:** 1-77, 2-83, 3-112, 4-114, 5-129, 6-168; **బౌలింగ్:** తన్జిమ్ షకిబ్ 4-0-29-1, నసుమ్ అహ్మద్ 4-0-34-0, ముస్తాఫిజుర్ 4-0-33-1, సైఫుద్దీన్ 3-0-37-1, రిషద్ హొస్సేన్ 3-0-27-2, సైఫ్ హసన్ 2-0-7-0.

బంగ్లాదేశ్: సైఫ్ హసన్ (సి) అక్షర్ (బి) బుమ్రా 69, తన్జిద్ హసన్ (సి) దూబే (బి) బుమ్రా 1, పర్వేజ్ హొస్సేన్ (సి) అభిషేక్ (బి) కుల్దీప్ 21, హ్రిదయ్ (సి) అభిషేక్ (బి) అక్షర్ 7, షమీమ్ హొస్సేన్ (బి) వరుణ్ 0, జాకెర్ అలీ (రనౌట్) 4, సైఫుద్దీన్ (సి) తిలక్ (బి) వరుణ్ 4, రిషద్ హొస్సేన్ (సి) తిలక్ (బి) కుల్దీప్ 2, తన్జిమ్ షకిబ్ (బి) కుల్దీప్ 0, నసుమ్ అహ్మద్ (నాటౌట్) 4, ముస్తాఫిజుర్ (సి) అక్షర్ (బి) తిలక్ 6, **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం 19.3 ఓవర్లలో 127 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-4, 2-46, 3-65, 4-74, 5-87, 6-109, 7-112, 8-112, 9-116, 10-127; **బౌలింగ్:** హార్దిక్ 2-0-14-0, బుమ్రా 4-0-18-2, వరుణ్ చక్రవర్తి 4-0-29-2, కుల్దీప్ యాదవ్ 4-0-18-3, అక్షర్ పటేల్ 4-0-37-1, శివమ్ దూబే 1-0-10-0, తిలక్ వర్మ 0.3-0-1-1.

'కొరియా'లో భారత్‌కు నిరాశ

సువాన్: కొరియా మాస్టర్స్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో తొలిరోజు భారత్‌కు నిరాశ ఎదురైంది. బుధవారం బరిలోకి దిగిన భారత షట్లర్లలో ఒక్కరు కూడా ముందంజ వేయలేకపోయారు. పురుషుల సింగిల్స్ ఆరంభ రౌండ్లో చికో ఆరా ద్వి వార్డోయో (ఇండోనేసియా)తో పోరులో 8-16తో వెనుకంజలో ఉన్న దశలో హెచ్‌ఎస్ ప్రణయ్ గాయం కారణంగా అర్ధంతరంగా వెనుదిరిగాడు. మిగతా షట్లర్లలో ఆయుష్ షెట్టి 18-21, 18-21తో సు లి యాంగ్ (తైపీ) చేతిలో, కిరణ్ జార్జ్ 14-21, 22-20, 14-21తో లో కీన్ యే (సింగపూర్) చేతిలో, అనుపమ ఉపాధ్యాయ 16-21, 15-21తో పుత్రి వర్దాని (ఇండోనేసియా) చేతిలో, మిక్స్‌డ్ డబుల్స్‌లో మోహిత్ జగ్లాన్/లక్షిత జగ్లాన్ జోడీ 7-21, 14-21తో జపాన్ ద్వయం యు షిమోగామి/సయాక హొబారా చేతిలో ఓటమి పాలయ్యారు.

అది అతడి అభిప్రాయం

షహీన్ షా అఫ్రీది

దుబాయ్: భారత్‌కు పాకిస్థాన్ పోటీయే కాదన్న టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ వ్యాఖ్యపై స్పందించేందుకు..పాక్ పేసర్ షహీన్ షా అఫ్రీది నిరాకరించాడు. 'అది అతడి అభిప్రాయం. ఈసారి మేం తలపడినప్పుడు (వచ్చే ఆదివారం జరిగే ఆసియా కప్ ఫైనల్‌ను దృష్టిలో పెట్టుకొని) ఏం జరుగుతుందో.. అప్పుడు చూద్దాం. మేం ఆసియా కప్ గెలిచేందుకు వచ్చాం. అందువల్ల మా అత్యుత్తమ ప్రదర్శన చేస్తాం' అని అఫ్రీది చెప్పుకొచ్చాడు.

వెస్టిండీస్‌తో టెస్ట్ సిరీస్‌కు భారత జట్టు ఎంపిక నేడు

ముంబై: వెస్టిండీస్‌తో రెండు టెస్ట్‌ల సిరీస్‌కు భారత జట్టును గురువారం ఎంపిక చేయనున్నారు. వాస్తవంగా 15 మంది సభ్యుల జట్టును బుధవారం రాత్రి ప్రకటించాల్సి ఉంది. కానీ అనివార్య కారణాలవల్ల వాయిదా పడినట్టు బీసీసీఐ తెలిపింది. ప్రస్తుతం ఆసియా కప్‌కోసం దుబాయ్‌లో ఉన్న జాతీయ సెలెక్షన్ కమిటీ చైర్మన్ అజిత్ అగార్కర్..సెలెక్టర్లతో వర్చువల్‌గా సమావేశమై చర్చించిన తర్వాత జట్టును ప్రకటించనున్నారు. తొలి టెస్ట్ వచ్చే నెల రెండున అహ్మదాబాద్‌లో ప్రారంభం కానుంది.

పవన్ కల్యాణ్‌పై రాజకీయ ప్రేరిత వ్యాజ్యం

- మాజీ ఐఏఎస్ పిటిషన్‌ను కొట్టివేయండి.. హైకోర్టు ఏఏజీ వినతి.. తీర్పు రిజర్వు

అమరావతి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తన సినిమా ప్రమోట్ చేసుకునేందుకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని, దీనిపై స్వతంత్ర దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ మాజీ ఐఏఎస్ అధికారి విజయ్‌కుమార్ వేసిన పిటిషన్ రాజకీయ ప్రేరితమని అదనపు అడ్వకేట్ జనరల్ (ఏఏజీ) పేర్కొన్నారు. ఆ వ్యాజ్యాన్ని కొట్టివేయాలని హైకోర్టును కోరారు. ఉపముఖ్యమంత్రిగా వ్యవహరిస్తూ సినిమాల్లో నటన కొనసాగించడం అనైతికమని.. హరిహరవీరమల్లు సినిమా టికెట్ ధరల పెంపు, వాణిజ్య కార్యక్రమాలు ప్రమోట్ చేసుకునేందుకు పవన్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని పిటిషనర్ తరఫు న్యాయవాది బాల తెలిపారు. ఇరుపక్షాల వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వు చేస్తున్నట్లు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి బుధవారం ప్రకటించారు. అంతకుముందు న్యాయవాది బాల వాదనలు వినిపిస్తూ.. సినిమాల్లో నటించకుండా పవన్ కల్యాణ్‌ను నిరోధించాలని కోరారు. డిప్యూటీ సీఎంగా బాధ్యతలు నిర్వర్తిస్తూ.. మరోవైపు సినిమాల్లో నటించడం పరస్పర విరుద్ధ ప్రయోజనం నిర్వచనం పరిధిలోకి వస్తుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విషయంలో హైకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పు ప్రస్తుత కేసుకు వర్తించదని తెలిపారు. హరిహరవీరమల్లు సినిమా టికెట్ ధరల పెంపు విషయంలో సైతం చట్టనిబంధనలు అనుసరించలేదన్నారు. అయితే రాజకీయ కక్షతో విజయకుమార్ పిటిషన్ వేశారని, ఆధారాల్లేని ఆరోపణలు చేస్తున్నారని ఏఏజీ తెలిపారు. 'పిటిషనర్‌కు రాజకీయ పార్టీ ఉంది. ఇది రాజకీయ ప్రేరేపిత వ్యాజ్యం. సినిమా నిర్మాత విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని రాష్ట్రప్రభుత్వం సినిమా టికెట్ రేట్లను పెంచింది. ఈ విషయంలో డిప్యూటీ సీఎం అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారనేందుకు పిటిషనర్ ఎలాంటి ఆధారాలనూ కోర్టు ముందుంచలేదు. ఖర్చులు విధించి పిటిషన్‌ను కొట్టివేయండి' అని కోరారు.

జగన్ 'ప్రతిపక్ష' పిటిషన్‌పై కౌంటర్ వేయండి

- అసెంబ్లీ, స్పీకర్ కార్యదర్శులకు హైకోర్టు నోటీసులు
- న్యాయశాఖ ముఖ్య కార్యదర్శికి కూడా
- విచారణ మూడు వారాలకు వాయిదా

అమరావతి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): శాసనసభలో తనను ప్రతిపక్ష నేతగా గుర్తించేందుకు నిరాకరిస్తూ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఇచ్చిన రూలింగ్‌ను రద్దు చేయాలని కోరుతూ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులను హైకోర్టు ఆదేశించింది. ప్రతివాదులుగా ఉన్న శాసనసభ కార్యదర్శి, న్యాయశాఖ ముఖ్య కార్యదర్శి, స్పీకర్ కార్యదర్శికి నోటీసులు జారీ చేసింది. వ్యక్తిగత హోదాలో ప్రతివాదులుగా ఉన్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, శాసనసభ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్‌కు నోటీసులు ఇచ్చేందుకు నిరాకరించింది. తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. ప్రతిపక్ష నేతగా తనను గుర్తించేందుకు నిరాకరిస్తూ స్పీకర్ ఈ ఏడాది ఫిబ్రవరి 5న ఇచ్చిన రూలింగ్‌ను చట్టవిరుద్ధమైనదిగా ప్రకటించడంతో పాటు దానిని రద్దు చేయాలని.. ఈ రూలింగ్ ఆంధ్రప్రదేశ్ పేమెంట్ ఆఫ్ శాలరీస్ అండ్ పెన్షన్స్ అండ్ రిమూవల్ ఆఫ్ డిస్‌క్వాలిఫికేషన్ యాక్ట్‌లోని సెక్షన్ 12బీకి విరుద్ధమని ప్రకటించాలని.. తనకు ప్రతిపక్ష నేత హోదా కల్పించేలా శాసన వ్యవహారాల కార్యదర్శి, స్పీకర్ కార్యదర్శిని ఆదేశించాలని జగన్ తన పిటిషన్‌లో కోరారు.

మౌనమేల నారాయణా?

(మొదటి పేజీ తరువాయి)

వై.శ్రీలక్ష్మిపై ఎన్నో అవినీతి ఆరోపణలు వచ్చాయి. టీడీఆర్ బాండ్లలో అవినీతి భారీగా జరిగిందని అప్పట్లోనే కలకలం రేగింది. తిరుపతి, తణుకులాంటి మున్సిపాలిటీల్లో సైతం వైసీపీ నేతల జోక్యంతో టీడీఆర్ బాండ్ల విడుదలలో వందల కోట్లు స్కామ్ జరిగిందన్న ఆరోపణలు వచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా టీడీఆర్ బాండ్లలో అవకతవకలకు పాల్పడటం ద్వారా వైసీపీ నేతలు వందల కోట్లు దోచుకున్నారన్న విమర్శలొచ్చాయి. దీనివల్ల రాష్ట్ర ఖజానా భారీగా నష్టం చేకూరింది. దీనికి సంబంధించిన ఆధారాలూ ఉన్నాయి. కానీ... మంత్రి నారాయణ మాత్రం 'ఇదేదో చిన్న విషయం' అన్నట్లుగా మాట్లాడారు. అంతర్గతంగా జరుగుతున్న విచారణకూ బ్రేకులు వేశారు. మరోరకంగా చెప్పాలంటే... ఐఏఎస్ శ్రీలక్ష్మికి మంత్రి నారాయణ క్లీన్‌చిట్ ఇచ్చేశారు. ఆ తర్వాత... వైసీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డి కూడా శ్రీలక్ష్మిపై పరోక్షంగా తీవ్ర అవినీతి ఆరోపణలు చేశారు.

గ్రీన్ బ్యూటిఫికేషన్ పనుల్లోనూ...

గత ప్రభుత్వంలో అమృత్ 2.0 పథకం, గ్రీన్ బ్యూటిఫికేషన్ పనుల్లోనూ పెద్ద ఎత్తున అవినీతి జరిగింది. బుధవారం అసెంబ్లీలో ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ఈ విషయాన్ని ప్రస్తావించారు. ఆమదాలవలస మునిసిపాలిటీలో అమృత్ 2.0, ట్రంచ్-1 కింద చెరువుల పునరుద్ధరణలో జరిగిన అవినీతిపై విచారణ జరపాలని కోరారు. మంత్రి, అధికారులు ఆమదాలవలస వచ్చి, కనీసం రూపాయి పనైనా జరిగిందేమో చూసి చెప్పాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన అవినీతిపై సభా కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. అయితే, మంత్రి నారాయణ మాత్రం ససేమిరా అన్నారు. అవినీతి జరగలేదనేలా వైసీపీ సర్కారుకు క్లీన్ చిట్ ఇచ్చేశారు. వైసీపీ హయాంలో గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా పట్టణాల్లో పేవ్‌మెంట్లు, డివైడర్లు, గ్రీనరీ కోసం భారీగా నిధులు ఖర్చు చేశారు. కొన్నిచోట్ల ఒక్క మొక్క కూడా నాటకుండానే నిధులు డ్రా చేశారు. ఈ విషయంపై తాజాగా పలువురు ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ఆరోపణలు చేశారు. అయినా మంత్రి సభాసంఘానికి అంగీకరించలేదు. ఆయా అంశాలపై సభాసంఘం వేయడం అసాధారణమేమీ కాదు. సంఘం సభ్యులు క్షేత్రస్థాయిలో వాస్తవాలు పరిశీలించి, ప్రభుత్వానికి సిఫారసులు చేస్తారు. మంత్రి నారాయణ అందుకూ ససేమిరా అనడం గమనార్హం.

అంబేడ్కర్ సాక్షిగా...

వైసీపీ ప్రభుత్వంలో విజయవాడలో బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం ప్రాజెక్టు చేపట్టిన సంగతి తెలిసిందే. అక్కడ మునిసిపల్ శాఖ ఆధ్వర్యంలో గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ పనులు చేపట్టారు. ఈ వ్యవహారంలో తానే సర్వం అన్నట్టుగా శ్రీలక్ష్మి వ్యవహరించారు. మొక్కల కొనుగోళ్ల సహా ఈ పనుల్లో భారీగా అవినీతి జరిగిందని ఆరోపణలు వచ్చాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటన్నింటిపై పూర్తి స్థాయిలో విచారణలు, చర్యలు ఉంటాయని అందరూ భావించారు. అయితే మంత్రి నారాయణ ఇవేవీ లేకుండా తుస్సుమనిపించారు.

ఎన్ని విమర్శలు వచ్చినా...

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత శ్రీలక్ష్మి నుంచి బొకే అందుకునేందుకు కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు ఇష్టపడలేదు. అలాంటి అధికారిణిని మళ్లీ కొనసాగించేందుకు మంత్రి నారాయణ సమ్మతించారని అప్పట్లో వార్తలు వచ్చాయి. నారాయణ మంత్రిగా బాధ్యతలు చేపట్టగానే శ్రీలక్ష్మి వెళ్లి అభినందించి వచ్చారు. గత ప్రభుత్వంలో మున్సిపల్ శాఖలో జరిగిన ఏ అవినీతికి సంబంధించి అయినా.. పార్టీ ఎమ్మెల్యేలు, నేతలు ఆరోపించినా, పత్రికల్లో కథనాలు వచ్చినా, ఆ శాఖ నుంచి స్పందన లేదు. గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ సీఈఓ అవినీతిపై పత్రికల్లో ఎన్ని కథనాలు వచ్చినా చాలా కాలం పాటు ఆయన్ను తొలగించకుండా కొనసాగించారు. అదేవిధంగా మున్సిపల్ శాఖకు సంబంధించి పలు విభాగాధిపతులపై ఎన్ని ఆరోపణలు వచ్చినా చర్యలు తీసుకోలేదు.

నాటి వేధింపులు మరిచిపోయారా?

వైసీపీ హయాంలో మంత్రి నారాయణను టార్గెట్ చేసి వేధించిన సంగతి తెలిసిందే. రాజధాని ప్రాంతంలో నారాయణ కుటుంబీకులు భూములు కొనుగోలు చేశారంటూ ఆరోపణలు చేసి, గత టీడీపీ సర్కారును బద్నాం చేసేందుకు వైసీపీ సర్కార్ చేయని ప్రయత్నమంటూ లేదు. నారాయణను అరెస్టు చేసేందుకు కూడా గత ప్రభుత్వం ఎన్నో ప్రయత్నాలు చేసింది. ఇందులో శ్రీలక్ష్మి పాత్ర కూడా ఉన్నట్టు ఆరోపణలున్నాయి. ఇంత జరిగినా... ఇప్పుడు ఆమెకు నారాయణ అండగా నిలవడం, గత ప్రభుత్వ అక్రమాలపై చర్యలు తీసుకోకుండా వదిలేయడం గమనార్హం!

మోహిత్‌రెడ్డి 'వాహనాల్లో'నే మద్యం

ముడుపుల తరలింపు

- లాగ్‌బుక్‌లో తిరుపతి పరిసరాల్లో... కానీ హైదరాబాద్‌కు వాహనాలు..
- వారి కంపెనీల ఖాతాలకు భారీగా సొమ్ము
- దీనిపై మోహిత్‌రెడ్డిని కస్టడీలో విచారించాలి
- ముందస్తు బెయిల్ ఇవ్వొద్దు
- సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వాదనలు
- తీర్పు రిజర్వ్ చేసిన హైకోర్టు





అమరావతి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): తుడా ఛైర్మన్ హోదాలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని, మద్యం ముడుపులు ద్వారా వచ్చిన సొమ్మును తరలించేందుకు అధికారిక వాహనాలను వినియోగించారని సిట్/సీఐడీ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా హైకోర్టుకు తెలిపారు. కుటుంబసభ్యుల పేరిట ఉన్న కంపెనీల ఖాతాల్లో కనిపిస్తున్న అనుమానాస్పద లావాదేవీలపై మోహిత్‌రెడ్డిని కస్టడీకి తీసుకొని విచారించాల్సి ఉందని....ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయవద్దని కోరారు. "లాగ్ బుక్‌లో ఈ ఏడాది మార్చి 3,4,5 తేదీల్లో తుడా అధికారిక వాహనం తిరుపతి పరిసరాల్లో తిరిగినట్లు నమోదు చేశారు. వాస్తవానికి ఆ రోజు ఆ వాహనం హైదరాబాద్ వెళ్లినట్టు టోల్ ప్లాజా సీసీటీవీ ఫుటేజ్‌లో వాహనం నంబర్ రికార్డ్ అయింది. 2024 వరకు తుడా అధికారిక వాహనం పిటిషనర్ ఆధీనంలోనే ఉంది. మద్యం ముడుపుల ద్వారా వచ్చిన సొమ్మును అధికారిక వాహనంలో తరలించినట్లు ఆయన గన్‌మెన్, మరికొందరు వాంగ్మూలం ఇచ్చారు. పిటిషనర్‌కు పూర్వ నేరచరిత్ర ఉంది. కోర్టుకు వాస్తవాలు చెప్పకుండా దాచారు. ఈ ఒక్క కారణంతోనే పిటిషనర్ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేయవచ్చు" అని సిద్ధార్థ్ లూథ్రా తెలిపారు. 2021 తర్వాత చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఆయన కుటుంబసభ్యులు అనేక కంపెనీల్లో భాగస్వాములు అయ్యారన్నారు. చెవిరెడ్డి కుటుంబానికి చెందిన ఇన్‌ఫ్రా కంపెనీ ఖాతాకు 2022 నుంచి భారీగా సొమ్ము వచ్చి చేరిందన్నారు. ఈ వ్యవహారంపై దర్యాప్తు సాగుతుందని తెలిపారు. దీనిపై పిటిషనర్‌ను కస్టడీలోకి తీసుకొని విచారించాల్సి ఉందన్నారు. బుధవారం జరిగిన విచారణలో ఇరువైపుల వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. పిటిషన్ పై నిర్ణయం వెల్లడించేవరకు పిటిషనర్‌పై తొందరపాటు చర్యలు వద్దంటూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు అమల్లో ఉంటాయని స్పష్టం చేశారు. మద్యం కుంభకోణం కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైసీపీ నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుమారుడు మోహిత్‌రెడ్డి(ఏ39) హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ బుధవారం మరోసారి విచారణకు రాగా, పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది సి.నాగేశ్వరరావు వాదనలు వినిపించారు. "మద్యం ముడుపుల ద్వారా వచ్చిన సొమ్మును రవాణా చేసేందుకు అధికారిక వాహనం వినియోగించారనేది పిటిషనర్‌పై ప్రధాన ఆరోపణ. ఆ సొమ్మును ఎన్నికల సందర్భంగా ఓటర్లకు పంచారని ప్రాసిక్యూషన్ చెబుతున్నారు. కానీ, ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తక్షణం పిటిషనర్ తన వాహనాన్ని సరెండర్ చేశారు. ఎన్నికల్లో డబ్బులు పంచినట్లు పిటిషనర్ పై ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి ఓటర్లకు డబ్బులు పంచి ఉంటే ఎన్నికల సంఘం తగిన చర్యలు తీసుకుని ఉండేది. దర్యాప్తునకు సహకరించేందుకు పిటిషనర్ సిద్ధంగా ఉన్నారు. కోర్టు విధించే షరతుకు కట్టుబడి ఉంటారు. ముందస్తు బెయిల్ మంజూరు చేయాలి" అని ఆయన కోరారు.



ఉండవల్లిలో సీఎం చంద్రబాబును కలిసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మధుకర్

ఖాదీ సంతకు రండి

- చంద్రబాబును ఆహ్వానించిన మాధవ్
- స్వదేశీ ఉద్యమంలో భాగంగా అక్టోబరు 2న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న బీజేపీ

అమరావతి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): "మహాత్మా గాంధీ జయంతి(అక్టోబరు 2) సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా 'ఖాదీ సంత' నిర్వహిస్తున్నాం. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మీరు తప్పకుండా రావాలి' అంటూ సీఎం చంద్రబాబుని ఏపీ బీజేపీ ఆహ్వానించింది. అమెరికా పన్నుల ఆంక్షల నేపథ్యంలో బీజేపీ దేశ వ్యాప్తంగా స్వదేశీ ఉద్యమాన్ని నిర్వహిస్తోంది. స్వదేశీ ఉత్పత్తులు వినియోగించేలా ప్రజల్లో చైతన్యం తీసుకొస్తూ, చేతి వృత్తుల వారికి అండగా నిలుస్తోంది. అందులో భాగంగా విశ్వకర్మలు, చేనేతలు, ఇతర వృత్తుల వారికి మద్దతుగా గాంధీ జయంతి రోజు రాష్ట్ర వ్యాప్తంగా ఖాదీ సంతలు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా బుధవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ప్రధాన కార్యదర్శి(ఆర్గనైజేషన్) మధుకర్ ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసానికి వెళ్లారు. విజయవాడలో నిర్వహించే ఖాదీ సంతకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని కోరుతూ చంద్రబాబుకు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులకు తోడ్పాటు, అమరావతిలో విశ్వకర్మ విగ్రహ ఏర్పాటు, సంచార జాతుల వారి సమస్యలపై ముఖ్యమంత్రితో బీజేపీ అధ్యక్షుడు చర్చించారు. ఎన్‌టీ-డీఎన్‌టీ కమిషన్ ఏర్పాటు చేసి సంచార జాతుల వారికి న్యాయం చేయాలని కోరారు. కుల వృత్తులను కూటమి ప్రభుత్వం అన్నివిధాలా ప్రోత్సహిస్తుందని ఈ సందర్భంగా సీఎం వ్యాఖ్యానించారు. ఖాదీ సంతకు తప్పకుండా వస్తానని బీజేపీ నేతలకు మాటిచ్చారు.

సినిమా చూపిస్తా

డిజిటల్ బుక్‌తో ప్రతీకారం తీర్చుకుందాం

- కూటమి నేతలు, అధికారులు సప్త సముద్రాల అవతల ఉన్నా వదిలిపెట్టేది లేదు
- వైసీపీ డిజిటల్ బుక్ ఆవిష్కరణ సమావేశంలో జగన్

అమరావతి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉండగా ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు బనాయించి కక్షసాధింపు చర్యలకు దిగిన మాజీ సీఎం జగన్.. ఇప్పుడు రెడ్‌బుక్‌ను సాకుగా చూపుతున్నారు. రెడ్‌బుక్ పేరిట వైసీపీ కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేసిన కూటమి నేతలు, అధికారులపై వైసీపీ డిజిటల్ బుక్‌తో ప్రతీకారం తీర్చుకుంటామని హెచ్చరించారు. తాడేపల్లి నివాస ప్రాంగణంలో బుధవారం జరిగిన వైసీపీ విస్తృత స్థాయి సమావేశంలో డిజిటల్ బుక్‌ను జగన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిజిటల్ యాప్‌ను ప్రారంభించి, యాప్ పనితీరును నేతలకు వివరించారు. ప్రభుత్వం, కూటమి నేతలు, అధికారుల వల్ల అన్యాయానికి గురైనవారు ఎవరైనా 040-48171718కు ఫోన్ చేయాలని సూచించారు. వైసీపీ కార్యకర్తలు, నాయకులపై అక్రమంగా కేసులు పెట్టి వేధిస్తున్న కూటమి నేతలతో పాటు పోలీసులు, అధికారులు రిటైర్డ్ అయినా, సప్త సముద్రాల అవతల ఉన్నా వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. వైసీపీ కార్యకర్తలను ఇబ్బంది పెట్టినవారికి తాము అధికారంలోకి వచ్చాక సినిమా చూపిస్తామని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 15 నెలల్లోనే తీవ్రస్థాయిలో ప్రజావ్యతిరేకత వచ్చిందని అన్నారు. సూపర్ సిక్స్ అంటూ అట్టర్‌ఫ్లాప్ అయిన సినిమాకు విజయోత్సవం చేశారన్నారు. వైసీపీ క్యాడర్‌కు అక్టోబరు నాటికి గుర్తింపు కార్డులు అందిస్తామని ప్రకటించారు. డిసెంబరు 15వ తేదీ నాటికి వైసీపీ సంస్థాగత కమిటీలన్నింటిని వేయాలని సమన్వయకర్తలను ఆదేశించారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్నందున గ్రామ స్థాయిలో రైతు, మహిళ, ఎస్సీ, ఎస్టీ, యువజన, విద్యార్థి, మైనారిటీ విభాగాలకు కమిటీలను నియమించాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. అధికారంలోకి వచ్చాక పార్టీ క్యాడర్ ద్వారా అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామన్నారు. పార్టీ నేతలకు పాలనలో ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా డబ్బులు వేశామని ఇప్పటి వరకూ చెబుతూ వచ్చిన జగన్.. ఇప్పుడు వైసీపీ నేతల ద్వారా పథకాలను లబ్ధిదారులకు చేరుస్తామని చెప్పారు. మెడికల్ కాలేజీలను చంద్రబాబు ప్రైవేటుపరం చేస్తున్నారని జగన్ ఆరోపించారు. అమరావతిలో ఉన్న 50,000 ఎకరాలు చాలదంటూ మరో 50,000 ఎకరాల సేకరణకు చంద్రబాబు సిద్ధమయ్యారని అన్నారు. అమరావతి కోసం లక్ష కోట్లు ఖర్చు చేస్తానంటున్న చంద్రబాబు మెడికల్ కాలేజీలకు రూ.5,000 కోట్లు ఖర్చు చేయలేనంటున్నారని విమర్శించారు. విద్యుత్తును యూనిట్‌కు రూ.4.50 చెల్లించి కొంటున్నారని, ఇలాంటి ఖర్చులతో రాష్ట్రానికి ఆదాయం తగ్గిపోతుందని అన్నారు. వైసీపీ హయాంలో ధరల స్థిరీకరణకు రూ.7,800 కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. రైతులకు గిట్టుబాటు ధరలు దక్కడం లేదని, యూరియా దొరకడం లేదని విమర్శించారు. ఆరోగ్యశ్రీని ముంచేశారని జగన్ అన్నారు.

'ఉన్నతి' మరోసారి పొడిగింపు

- 2026 మార్చి వరకూ కొనసాగించాలని నిర్ణయం
- సవరణ మార్గదర్శకాలు జారీ చేసిన కేంద్రం

అమరావతి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో పనిచేసే యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఉద్దేశించిన ఉన్నతి పథకాన్ని వచ్చే మార్చి వరకు కొనసాగించాలని కేంద్రం నిర్ణయించింది. పథకాన్ని 2026 మార్చి 31 వరకు కొనసాగిస్తూ కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆదేశాలు జారీ చేసింది. అలాగే పథకం మార్గదర్శకాలను సవరించింది. ఉన్నతి పథకం కింద దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన(డీడీయూ-జీకేవై), రూరల్ సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్(ఆర్ఎస్ఈటీఐ), నేషనల్ రూరల్ లైవ్‌లీహుడ్ మిషన్(ఎన్ఆర్ఎల్ఎం), పీఎం విశ్వకర్మ యోజన, ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన, కృషి విజ్ఞాన్ కేంద్రం, రాష్ట్ర స్కిల్లింగ్ ప్రోగ్రాంల ద్వారా 18-45 ఏళ్ల యువతకు శిక్షణ ఇస్తున్నారు. దేశవ్యాప్తంగా 1.5 లక్షల మంది ఉపాధి శ్రామికులకు శిక్షణ అందించారు. తాజా సవరణల ప్రకారం 2018-19 నుంచి ఒక ఆర్థిక సంవత్సరంలో 60 రోజులు ఉపాధి పనులకు హాజరైన వారిని, ఒక్కో కుటుంబంలో ఇద్దరిని శిక్షణకు ఎంపిక చేస్తారు. శిక్షణకు ఎంపికయ్యే ఉపాధి శ్రామికులకు 100 రోజుల పనిదినాలు కల్పిస్తారు. హాజరైన అన్ని రోజులకు ఉపాధి వేతనాన్ని స్టైపెండ్ రూపంలో కేంద్రం చెల్లిస్తుంది.

కొత్త టీచర్లు వచ్చేస్తున్నారు!

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాట్లు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా నియామక పత్రాల పంపిణీ జరుగుతుంది. సబ్జెక్టులవారీగా రాష్ట్రస్థాయిలో టాపర్లుగా నిలిచిన 16మంది సహా 22 మందికి నియామక పత్రాలు అందజేస్తారు. మిగిలిన వారికి అదే ప్రాంగణంలో అధికారులు పత్రాలు ఇస్తారు. కొత్త టీచర్లు వారితో పాటు మరొక కుటుంబసభ్యుడిని తీసుకొచ్చే అవకాశం కల్పించారు. దీంతో మొత్తంగా 34వేల మంది సభా ప్రాంగణంలో ఉంటారు. టీచర్లకు జిల్లాలవారీగా వేర్వేరుగా గ్యాలరీలు ఏర్పాటుచేశారు. అక్కడే ఆ జిల్లా ఎమ్మెల్యేలు కూడా కూర్చునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. రాయలసీమ వైపు నుంచి వచ్చేవారికి గుంటూరులో, ఉత్తరాంధ్ర వైపు నుంచి వచ్చే వారికి విజయవాడలో బస ఏర్పాటుచేశారు.

వర్గీకరణ అమలైన తొలి డీఎస్సీ..

మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను ఈ ఏడాది ఏప్రిల్ 20న చంద్రబాబు పుట్టిన రోజు సందర్భంగా విడుదల చేశారు. 16,341 పోస్టులతో నోటిఫికేషన్ ఇచ్చారు. ప్రభుత్వంలోని పది మేనేజ్‌మెంట్లలో పోస్టుల భర్తీకి రంగం సిద్ధమైంది. దీనికోసం 3,36,300 మంది అభ్యర్థులు 5,77,675 దరఖాస్తులు చేసుకున్నారు. వారికి జూన్ ఆరు నుంచి జూలై రెండు వరకు రాష్ట్రవ్యాప్తంగా సీబీటీ విధానంలో పరీక్షలు జరిగాయి. టెట్ మార్కులకు 20శాతం వెయిటేజీ ఇచ్చారు. నార్మలైజేషన్ ప్రక్రియ అనంతరం సర్టిఫికెట్ల పరిశీలనకు ఎంపికైన అభ్యర్థుల జాబితాలు ప్రకటించారు. పరిశీలనలో అన్ని అర్హతలూ ఉన్నవారిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఈ డీఎస్సీలోనే తొలిసారి ఎస్సీ వర్గీకరణ అమలైంది. అలాగే హారిజంటల్ రిజర్వేషన్ కూడా వర్తింపజేశారు. ఈ క్రమంలో కొన్ని జిల్లాల్లో అభ్యర్థులు లేక 406 పోస్టులు మిగిలిపోయాయి. ఎంపికైనవారిలో 49.9శాతం మహిళలు, 50.1శాతం పురుషులు ఉన్నారు.

అత్యంత వేగంగా భర్తీ ప్రక్రియ

సాధారణంగా ఒక డీఎస్సీ పూర్తికి కనీసం ఒక సంవత్సరం పడుతుంది. గతంలో ఎప్పుడూ ఒక సంవత్సరంలో ఇచ్చిన నోటిఫికేషన్ అదే సంవత్సరంలో పూర్తికాలేదు. అందులోనూ 16,341 పోస్టులతో మెగా డీఎస్సీ కావడంతో ఇంకా ఆలస్యం అవుతుందని అంతా భావించారు. కానీ పాఠశాల విద్యాశాఖ పక్కా ప్రణాళిక అమలుచేసింది. డీఎస్సీ ప్రారంభమయ్యాక ఎలాంటి అవరోధాలు వస్తాయనేదానిపై ముందుగానే కసరత్తు నిర్వహించింది. సుదీర్ఘంగా అధ్యయనం చేసిన తర్వాత నోటిఫికేషన్ జారీచేసింది. అయినా రకరకాల అంశాలపై న్యాయస్థానాల్లో వందకు పైగా పిటిషన్లు పడ్డాయి. వాటిని అధిగమించి ఎంపికైన అభ్యర్థుల తుది జాబితాలను పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. కేవలం 150 రోజుల్లోనే మెగా డీఎస్సీ ప్రక్రియ పూర్తిచేయడం ఇదే తొలిసారి.

47 ఉద్యోగాలకు 10 నోటిఫికేషన్లు

- విడుదల చేసిన ఏపీపీఎస్సీ.. అక్టోబరు 29 వరకు దరఖాస్తులు

అమరావతి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): వివిధ శాఖల్లో 47 ఉద్యోగాల భర్తీకి ఏపీపీఎస్సీ బుధవారం 10 నోటిఫికేషన్లు జారీచేసింది. వివిధ శాఖల్లో 11 ఏఈ, రవాణా శాఖలో ఒక ఏఎంవీ, జైళ్ల శాఖలో ఒక జూనియర్ అసిస్టెంట్, మత్స్యశాఖలో మూడు అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్, సీనియర్ సిటిజన్ల శాఖలో ఒక గ్రేడ్-1 వార్డెన్, గనుల శాఖలో ఒక రాయల్టీ ఇన్‌స్పెక్టర్, ఫ్యాక్టరీస్ విభాగంలో ఒక ఇన్‌స్పెక్టర్, మున్సిపల్ శాఖలో ఒక గ్రేడ్-2 జూనియర్ అకౌంటెంట్, నాలుగు గ్రేడ్-3 సీనియర్ అకౌంటెంట్, ఆరు జూనియర్ అకౌంటెండ్ గ్రేడ్-4, సైనిక సంక్షేమం విభాగంలో ఏడు జిల్లా సైనిక్ ఆఫీసర్, 10 వెల్ఫేర్ ఆర్గనైజర్ పోస్టులకు నోటిఫికేషన్లు జారీచేసింది. గురువారం (ఈ నెల 25) నుంచి అక్టోబరు 29 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించింది.

డీఎస్సీ అంటే టీడీపీ..

రాష్ట్ర చరిత్రలో డీఎస్సీ అంటే టీడీపీ అనే ముద్ర పడింది. 1994 నుంచి ఇప్పటివరకూ అత్యధిక డీఎస్సీలు ప్రకటించింది తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే. 14 డీఎస్సీలు ప్రకటించి 1,96,619 మంది టీచర్లను నియమించిన ఘనత టీడీపీకి దక్కింది. గత వైసీపీ ప్రభుత్వంలోనే టీచర్ పోస్టుల భర్తీకి అవకాశం ఉన్నా నిర్లక్ష్యంచేశారు. ఐదేళ్లలో ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయలేదు. నిరుద్యోగుల నుంచి ఒత్తిడి పెరగడంతో ఎన్నికలకు కొద్ది నెలల ముందు 6,100 పోస్టులతో డీఎస్సీ ప్రకటించింది. కానీ నిబంధనల గందరగోళంతో అది ఆదిలోనే ఆగిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు తొలి సంతకం డీఎస్సీ ఫైలుపైనే చేశారు. ఆ వెంటనే నోటిఫికేషన్‌కు సిద్ధమైనా ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు రావడంతో కొంత ఆలస్యమైంది.

డీసీసీబీల్లో మొండి బకాయిల వసూళ్లపై దృష్టి

- 13 బ్యాంకుల్లో 1800 కోట్ల వరకూ బకాయిలు
- వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌కు అవకాశమిచ్చే యోచన

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ)ల్లో పేరుకుపోయిన మొండి బకాయిల వసూలుపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. రాష్ట్రంలో 13 డీసీసీబీల పరిధిలో సొసైటీల ద్వారా తీసుకున్న రుణాల్లో మొండి బకాయిలు సుమారు రూ.1,600 కోట్ల నుంచి రూ.1,800 కోట్ల వరకూ ఉంటాయని అంచనా. ఎక్కువగా గోదావరి జిల్లాల్లో 6 నుంచి 7 వందల కోట్ల రూపాయలు బకాయిలు ఉన్నాయి. ఏళ్ల తరబడి పేరుకుపోయిన బకాయిలను వన్‌టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) కింద వసూలు చేసేందుకు గల అవకాశాలను పరిశీలించడానికి తొమ్మిది మందితో ప్రభుత్వం కమిటీని ఏర్పాటుచేసింది. విశాఖపట్నం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావు నేతృత్వం (ఛైర్మన్)లో తూర్పు గోదావరి, గుంటూరు, అనంతపురం డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జులు టి.రామస్వామి, ఎం.మల్లికార్జునరావు, ఎం.కేశవరెడ్డితోపాటు ఆప్కాబ్ ఎండీ, సీజీఎం (డెవలప్‌మెంట్), సీజీఎం (ఆపరేషన్స్), జనరల్ మేనేజర్లు సభ్యులుగా వ్యవహరిస్తారు. ఆప్కాబ్ డీజీఎం (డీవోఎస్) మెంబర్ కన్వీనర్‌గా నియామకమైన ఈ కమిటీ త్వరలో సమావేశం కానుంది. రాష్ట్రంలోని అన్ని డీసీసీబీలను సందర్శించి ఆయా జిల్లాల్లో మొండి బకాయిల వివరాలు సేకరించనుంది. సొసైటీల నుంచి తీసుకున్న రుణం మొత్తం ఒకేసారి చెల్లించేలా ఒక ప్రతిపాదన చేయనున్నది అని తెలుస్తోంది. అసలు చెల్లించిన వారికి వడ్డీ మాఫీ చేస్తారా? లేక తీసుకున్న రుణం, కాలం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని నిర్ణయం తీసుకోవాలా? అనేది దానిపై కమిటీ చర్చించనుంది. మొండి బకాయిలు వసూలు చేయాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు కమిటీ త్వరలోనే సమావేశమై విధి విధానాలు ఖరారు చేస్తుందని ఓటీఎస్ కమిటీ ఛైర్మన్, విశాఖ డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావు తెలిపారు.

సీఎం చంద్రబాబు క్షమాపణ చెప్పాలి

- నా పరువుకు భంగం కలిగించారు
- 1.45 కోట్లు నష్టపరిహారం చెల్లించాలి
- ముఖ్యమంత్రికి లీగల్ నోటీసు పంపిన సీఐ శంకరయ్య

అమరావతి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుకు పులివెందుల మాజీ సీఐ శంకరయ్య లీగల్ నోటీసు పంపారు. తన పరువుకు భంగం కలిగించారని, అసెంబ్లీ వేదికగా తనకు క్షమాపణ చెప్పాలని, రూ.1.45 కోట్లు పరిహారం చెల్లించాలని ఆ నోటీసులో శంకరయ్య డిమాండ్ చేశారు. ఈ నెల 18న న్యాయవాది ధరణేశ్వర్‌రెడ్డి ద్వారా ఆయన ఈ నోటీసును పంపించారు. 'మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య జరిగినప్పుడు (2019 మార్చి 15) ఘటనా స్థలంలో ఆధారాలను స్థానిక సీఐ సమక్షంలోనే నిందితులు ధ్వంసం చేశారని చంద్రబాబు పలుమార్లు ఆరోపించారు. ఆ వ్యాఖ్యలు దురుద్దేశపూర్వకంగా ఉన్నాయి. వాటివల్ల నా పరువుకు భంగం కలిగింది. అసెంబ్లీలో నాకు క్షమాపణలు చెప్పాలి. నా పరువుకు భంగం కలిగించినందుకు రూ.1.45 కోట్లు పరిహారం చెల్లించాలి' అంటూ శంకరయ్య ఆ నోటీసులో పేర్కొన్నారు. కాగా, వైఎస్ వివేకా హత్య జరిగినప్పుడు నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ అప్పటి పులివెందుల సీఐ శంకరయ్యను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. కళ్ల ముందు రక్తపు మరకలు కనిపించినా హత్య కేసు నమోదు చెయ్యకపోవడాన్ని తీవ్ర నిర్లక్ష్యంగా పరిగణించింది. ఆ తర్వాత ఈ కేసు దర్యాప్తు చేస్తున్న సీబీఐ అధికారులకు శంకరయ్య వాంగ్మూలం ఇస్తూ... "కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి, ఆయన అనుచరుడు దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి నన్ను బెదిరించారు. 'వివేకా మృతదేహాన్ని పోస్టుమార్టానికి పంపవద్దు. నుదుటిపై గాయాలున్న విషయం ఎవరికీ చెప్పొద్దు' అని హెచ్చరించారు" అని పేర్కొన్నారు. ఇదే విషయాన్ని కోర్టులో చెబుతానని సీబీఐకి చెప్పిన శంకరయ్య ఆ తర్వాత జడ్జి ముందు వాంగ్మూలం ఇచ్చేందుకు రాకుండా దాట వేశారు. ఇది జరిగిన వారం రోజుల్లోనే(2021 అక్టోబరు 6న) అప్పటి వైసీపీ ప్రభుత్వం శంకరయ్యపై సస్పెన్షన్ ఎత్తేసింది. అవాక్కైన సీబీఐ అధికారుల ఆ వారం రోజుల్లో శంకరయ్య ఎవరెవరితో మాట్లాడారనే విషయమై ఆరా తీసింది. కొన్నాళ్లుగా కర్నూలు రేంజ్‌లో వేకెన్సీ రిజర్వ్(వీఆర్)లో ఉన్న శంకరయ్య తాజాగా రాష్ట్ర ముఖ్యమంత్రికే లీగల్ నోటీసు పంపడం పోలీసు వర్గాల్లో పెద్ద చర్చనీయాంశమైంది.

శంకరయ్య వెనుక వివేకా హంతకులు

- పోలీస్ వ్యవస్థ పరువు తీసి... సీఎంకు నోటీసా?
- ప్రివిలేజ్ కమిటీ ముందుకు సీఐ వ్యవహారం: ఎమ్మెల్యే ఆది

అమరావతి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సీఐ శంకరయ్య పాత్రపై సమగ్ర విచారణ జరపాలని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి డిమాండ్ చేశారు. అసెంబ్లీలో తనకు బహిరంగ క్షమాపణ చెప్పాలంటూ సీఎం చంద్రబాబుకు శంకరయ్య లీగల్ నోటీస్ పంపడంపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. బుధవారం అమరావతి అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆదినారాయణరెడ్డి మాట్లాడారు. "సీఎంకు నోటీసులు పంపడానికి అతనికున్న హక్కేంటి? అర్హతేంటి? ఆంతర్యమేంటి? మతలబు ఏంటి? ఏమిటీ దురాగతం? ప్రజలను కాపాడాల్సిన రక్షక భట వ్యవస్థ పరువు తీసి, పోలీస్ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం లేకుండా చేసినందునే అప్పటి ప్రభుత్వం శంకరయ్యను 2019లో సస్పెండ్ చేసింది. సీబీఐ ముందు మాట్లాడకుండా ఉన్నందుకు 2021లో గత ప్రభుత్వం అతనికి మళ్లీ పోస్టింగ్ ఇచ్చింది. గత ప్రభుత్వం నిబంధనలను దాటి, అతనికి పోస్టింగ్ ఇచ్చింది. వైసీపీ నేతలతో సీఐ శంకరయ్య కుమ్మక్కై పోలీస్ వ్యవస్థను అప్రదిష్టపాలు చేశారు. అందుకే ప్రస్తుతం అతను వీఆర్‌లో ఉన్నారు. పరువు లేని వ్యక్తి పరువు నష్టం దావా వేయడం ఏంటి? వివేకా కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరి అనే వ్యక్తి నేరుగా సుప్రీం కోర్టుకే కేసు విషయం చెప్పిన తర్వాత ఈ వ్యవహారమేంటి? 2019 ఎన్నికల్లో వైసీపీ గెలవటానికి ఒకానొక కారణం వివేకా హత్య కేసు. ఎన్నికల సమయంలో విజయలక్ష్మి మాట్లాడుతూ... 'నా భర్తను చంపేశారు. నా కొడుకుని కోడి కత్తితో చంపడానికి ప్రయత్నించారు. ఇప్పుడు వివేకాను చంపేశారు' అని అన్నారు. ఆ మాటలను మహిళలంతా నమ్మేశారు. తర్వాత కేసు ఏ దర్యాప్తు ఎలా జరిగిందో అందరికీ తెలుసు. వివేకా హత్య జరిగిన రోజు రక్తపు మరకలు కడుగుతుంటే శంకరయ్య ఏం చేశారు? ఇప్పుడు సీఎంకు సీఐ శంకరయ్య నోటీసు పంపడం ఏంటి? వివేకా హంతకులే శంకరయ్యను నడిపిస్తున్నారు. ఈ నీచమైన ఘటనపై లోతైన విచారణ చేసి, సీఐని సస్పెండ్ చేయాలని డీజీపీని కోరుతున్నా. ఈ విషయాన్ని అసెంబ్లీ ప్రివిలేజ్ కమిటీ ముందుకు తీసుకెళ్తాం" అని ఎమ్మెల్యే ఆది స్పష్టం చేశారు.

2న 'ఆటో డ్రైవర్ల సేవలో..'!

- మొత్తం లబ్ధిదారులు 3.10 లక్షల మంది
- ఒక్కొక్కరి ఖాతాలో 15వేలు చొప్పున జమ
- రాష్ట్ర ప్రభుత్వంపై రూ.466 కోట్ల భారం

అమరావతి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఆటో, క్యాబ్ డ్రైవర్లకు ఏటా రూ.15 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించడానికి రంగం సిద్ధమైంది. ఈ పథకం పేరు 'ఆటో డ్రైవర్ల సేవలో..' అని ప్రభుత్వం దాదాపు ఖరారు చేసినట్లు తెలిసింది. మొత్తం 3,10,385 మందిని అర్హులుగా అధికారులు గుర్తించినట్లు తెలిసింది. గాంధీ జయంతి సందర్భంగా అక్టోబరు 2న వీరి ఖాతాల్లో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా నిధులు జమ చేస్తారు. ఈ పథకం అమలుతో రాష్ట్ర ఖజానాపై రూ.466 కోట్ల భారం పడుతుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే స్త్రీ శక్తి పథకాన్ని ఆగస్టు 15నుంచి అమలు చేశారు. దీనివల్ల తమ జీవనోపాధికి ఇబ్బంది కలుగుతోందంటూ ఆటో, క్యాబ్ డ్రైవర్లు విన్నవించడంతో వారికి ఆర్థిక సాయం అందిస్తామని సీఎం చంద్రబాబు అనంతపురం సభలో ప్రకటించారు. ఈనేపథ్యంలో సెప్టెంబరు 22 లోపు క్షేత్ర పరిశీలన పూర్తిచేసి 24న తుది జాబితా సిద్ధం చేయాలని ప్రభుత్వం పేర్కొంది. ఈ మేరకు అన్ని జిల్లాల్లో సచివాలయాల ద్వారా అర్హులను ఎంపిక చేశారు. బ్రాహ్మణ, కాపు, కమ్మ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, క్రైస్తవ, ఈబీసీ, క్షత్రియ కార్పొరేషన్ల నుంచి లబ్ధిదారులకు నిధులు జమ చేస్తారు. ఆటో, క్యాబ్ యజమానే డ్రైవర్‌గా ఉండాలని, ఇతర గూడ్స్ వాహనాలకు ఈ పథకం వర్తించదని ప్రభుత్వం స్పష్టం చేసింది. కుటుంబంలో ఒక్క వాహనానికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది. కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగులున్నా, ఆదాయపు పన్ను చెల్లించేవారున్నా, నెలవారీ విద్యుత్ వినియోగం 300యూనిట్లు దాటినా, పట్టణ ప్రాంతాల్లో వెయ్యి చదరపు అడుగులకు మించి స్థిరాస్తి ఉన్నా అర్హులు కారు.

మహిళా ఖైదీలకు పౌష్టికాహారం

- మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ వెల్లడి
- విశాఖ సెంట్రల్ జైలు సందర్శన



విశాఖ సెంట్రల్ జైల్లో మహిళా ఖైదీ ప్రసవించిన బిడ్డను ఎత్తుకున్న మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ

విశాఖపట్నం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళా, శిశు సంక్షేమశాఖ అమలు చేస్తున్న 'పోషమ్మ' పథకాన్ని మహిళా ఖైదీలు, రిమాండ్ మహిళా ఖైదీలకు కూడా వర్తింపజేయాలని యోచిస్తున్నట్టు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ వెల్లడించారు. బుధవారం విశాఖ సెంట్రల్ జైలును ఆమె సందర్శించారు. మహిళా ఖైదీల బ్యారక్‌లకు వెళ్లి సౌకర్యాలపై ఆరా తీశారు. మహిళా ఖైదీలకు పెడుతున్న ఆహారాన్ని రుచిచూసి సంతృప్తి వ్యక్తంచేశారు. మహిళా ఖైదీలకు కల్పిస్తున్న ఇతర సౌకర్యాలు, ఆస్పత్రి, బేకరీ యూనిట్, ఇతర వస్తు ఉత్పత్తి తయారీ యూనిట్లను పరిశీలించారు. ఇటీవల మహిళా ఖైదీ ప్రసవించిన చిన్నారిని ఆమె చేతుల్లోకి తీసుకున్నారు. అనంతరం జైలు బయట ఆమె మీడియాతో మాట్లాడుతూ జాతీయ మహిళా కమిషన్ ఆదేశాల మేరకు నవరాత్రుల సందర్భంగా రాష్ట్ర మహిళా కమిషనర్ తరపున పలు ప్రత్యేక కార్యక్రమాలు అమలుచేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో మహిళలు, శిశువుల ఆరోగ్యం కోసం 'పోషమ్మ' పథకం కింద ప్రత్యేక ఆహారం సరఫరా చేస్తున్నామని, మహిళా ఖైదీలకు కూడా వర్తింపజేసే అవకాశాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. జైల్లో 80 మంది మహిళా ఖైదీలు ఉన్నారని, వారిలో 50 మందికి గంజాయి కేసుల్లో ప్రమేయం ఉందని చెప్పారు. ఆమె వెంట ఐసీడీఎస్ జాయింట్ డైరెక్టర్ చిన్మయిదేవి, పీడీ రామలక్ష్మి ఉన్నారు.

నేవీ చేతికి మరో నౌక

- 6న 'ఆంద్రోత్' కమిషనింగ్



విశాఖపట్నం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): భారత నౌకాదళం చేతికి మరో నౌక రానుంది. యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్ షాలో వాటర్ క్రాఫ్ట్(ఏఎస్‌డబ్ల్యూ - ఎస్‌డబ్ల్యూసీ)గా వ్యవహరించే ఈ నౌక పేరు 'ఆంద్రోత్'. దీనిని అక్టోబరు 6న విశాఖ కేంద్రంగా ఉన్న తూర్పు నౌకాదళంలో, ఇక్కడి నేవీ చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేశ్ పెంధార్కర్ కమిషనింగ్ చేయనున్నారని నేవీ వర్గాలు బుధవారం తెలిపాయి. ఈ తరహా నౌకలు మొత్తం 16 తయారవుతుండగా అందులో ఇది రెండోది. కోల్‌కత్తాలోని గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ దీనిని నిర్మించారు. ఇందులో 80 శాతం పరికరాలు దేశీయ తయారీ కావడం విశేషం. లక్షదీవుల్లోని ఒకటైన ఆంద్రోత్ పేరును ఈ నౌకకు పెట్టారు. దీనికి ముందు ఇదే పేరుతో ఐఎన్ఎస్ ఆంద్రోత్(పీ 69) 27 ఏళ్ల సేవలందించి, విరామం తీసుకుంది. కొత్త నౌకకు అధునాతన కమ్యూనికేషన్ సిస్టమ్స్ అమర్చారు. నీటి లోపల ఉన్న శత్రువుల సబ్‌మెరైన్లను గుర్తించి, ఎటు వెళుతున్నదీ గమనించి, వాటిని కదలకుండా చేయగల సత్తా దీనికి ఉంది. సముద్రంలో నిఘా, గాలింపు, సహాయక చర్యలకు దీనిని ఉపయోగించుకోవచ్చు.


దేశవ్యాప్తంగా కొత్తగా 10,023 మెడికల్ సీట్లు

హైదరాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యకు సంబంధించి కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా ప్రభుత్వ కాలేజీల్లో కొత్తగా 10,023 యూజీ, పీజీ వైద్య విద్య సీట్లను మంజూరు చేసింది. బుధవారం జరిగిన కేంద్రమంత్రి వర్గ సమావేశంలో ఇందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కొత్తగా మంజూరైన సీట్లలో 5,023 ఎంబీబీఎస్ సీట్లు, 5,000 పీజీ సీట్లు ఉన్నాయి. 2028-29 నాటికి ఈ సీట్లు అందుబాటులోకి వస్తాయని కేంద్రం వెల్లడించింది. దీనికి మొత్తం రూ.15,034.50 కోట్ల వ్యయం కానుండగా ఇందులో కేంద్రం వాటా రూ.10,303.20 కోట్లు. రాష్ట్రాల వాటా రూ.4,731.30 కోట్లు. ఒక్కో సీటుకు రూ.1.50 కోట్లు వ్యయం చేయనున్నారు. ప్రస్తుతం దేశంలోని 808 మెడికల్ కాలేజీల్లో 1,23,700 ఎంబీబీఎస్ సీట్లున్నాయి. ప్రపంచంలోనే అత్యధిక ఎంబీబీఎస్ సీట్లు భారత్‌లోనే ఉన్నాయని కేంద్రం పేర్కొంది. గడిచిన పదేళ్లలో కొత్తగా 69,352 యూజీ, 43,041 పీజీ సీట్లు అందుబాటులోకి వచ్చాయని తెలిపింది. అయినప్పటికీ దేశంలో డాక్టర్ల కొరత ఉన్నందున వైద్య సీట్ల పెంపు అనివార్యమైందంది. ఏటా దేశవ్యాప్తంగా 22 లక్షల మంది విద్యార్థులు నీట్ రాస్తున్నారు. మెడికల్ సీట్ల సంఖ్య పరిమితంగా ఉండటంతో చాలామంది వైద్య విద్యను అభ్యసించలేని పరిస్థితి నెలకొంది. కేంద్రం తాజాగా తీసుకున్న నిర్ణయంతో వైద్య విద్యలో ప్రవేశం పొందే అవకాశం విద్యార్థులకు ఎక్కువగా ఉంటుంది. తద్వారా ఎక్కువమంది వైద్యులు అందుబాటులోకి వస్తారు. అలాగే స్పెషలిస్ట్ డాక్టర్ల లభ్యత కూడా పెరుగుతుంది. ప్రభుత్వాస్పత్రుల్లో కొత్త స్పెషాలిటీ సేవలు ప్రవేశపెట్టే అవకాశం ఉంటుంది. కాగా, కేంద్రం ప్రకటించిన కొత్త యూజీ, పీజీ సీట్లలో ఏపీకి యూనీ సీట్లే వచ్చే అవకాశం ఉందని వైద్యవర్గాలు చెప్పాయి. కొత్త సీట్లకు వచ్చే నెలలో ఎన్ఎంసీ దరఖాస్తులు కోరే అవకాశం ఉందని తెలిపాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 17 వైద్య కాలేజీ లు ఉండగా 250-300 సీట్ల వరకూ దరఖాస్తు చేయొచ్చని అంచనా వేస్తున్నారు.

పవనన్న ఓజీ సూపర్‌హిట్ కావాలి: లోకేశ్

అమరావతి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రముఖ నటుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సినిమా ఓజీ విడుదల సందర్భంగా మంత్రి లోకేశ్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. 'ఓజీ అంటే ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్. మా పవనన్న అభిమానులకు మాత్రం ఒరిజినల్ గాడ్. పవర్‌స్టార్ ఫ్యాన్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఓజీ సూపర్‌హిట్ కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా' అని లోకేశ్ ఎక్స్‌లో పేర్కొన్నారు.

బెజవాడకు దసరా కళ







దసరా సందర్భంగా విజయవాడ నగరం కళకళలాడుతోంది. కనకదుర్గమ్మ ఆలయం, వారధి, వంతెనలు, రహదారులు అన్నీ విద్యుత్ కాంతులు విరజిమ్ముతున్నాయి. విద్యుత్ దీపాలతో అలంకరించిన ఆలయం, కృష్ణానది వంతెన చిత్రంలో చూడొచ్చు. విజయవాడ ఉత్సవ్...లో బాణసంచా వెలుగులు

మద్యం స్కాంతో ప్రజలే అంతిమ బాధితులు

- నిందితుల వ్యక్తిగత స్వేచ్ఛ కంటే.. ప్రజాప్రయోజనాలకే ప్రాధాన్యమివ్వాలి
- సిట్ తరఫున సీనియర్ న్యాయవాది వినతి
- ఆర్థిక నేరాలను ఛేదించడం దర్యాప్తు సంస్థలకు సంక్లిష్టంగా మారింది
- డీఫాల్ట్ బెయిల్ మంజూరులోప్రత్యేక కోర్టు చట్టనిబంధనలు అనుసరించలేదు
- హైకోర్టులో సిద్ధార్థ్ లూథ్రా వాదనలు
- లిఖితపూర్వక వాదనల సమర్పణ కోసం విచారణ రేపటికి వాయిదా

అమరావతి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కారణంగా సాధారణ ప్రజలే అంతిమంగా బాధితులుగా మారారని, నిందితుల వ్యక్తిగత స్వేచ్ఛకంటే ప్రజాప్రయోజనాలకే అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సిట్/సీఐడీ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా హైకోర్టును అభ్యర్థించారు. ఆర్థిక నేరాలు ఛేదించడం దర్యాప్తు సంస్థలకు సంక్లిష్టంగా మారిందన్నారు. నిందితులు ధనుంజయ్‌రెడ్డి(ఏ31), కృష్ణమోహన్‌రెడ్డి(ఏ32), బాలాజీ గోవిందప్ప(ఏ33)లకు ప్రత్యేక కోర్టు డీఫాల్ట్ బెయిల్ మంజూరు చేయడాన్ని సిట్/సీఐడీ హైకోర్టులో సవాల్ చేసిన సంగతి తెలిసిందే. ఆ పిటిషన్లపై లూథ్రా బుధవారం కోర్టులో వాదనలు వినిపించారు. ఆ ముగ్గురికి సంబంధించి దర్యాప్తు ముగియడంతో తుది చార్జిషీటు దాఖలు చేశామని.. ఇతర నిందితుల పాత్రపై తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని ప్రాసిక్యూషన్ మొదటి నుంచీ చెబుతోందని తెలిపారు. 'సీఐడీ జూలై 19న చార్జిషీటు దాఖలు చేసిన అనంతరం ప్రత్యేక కోర్టు పలుసార్లు నిందితుల రిమాండ్ పొడిగించింది. ఆ ఉత్తర్వుల్లో చార్జిషీటు దాఖలు చేసినట్లు స్పష్టంగా పేర్కొంది. చార్జిషీటు దాఖలు అనంతరం నిందితులు వేసిన రెగ్యులర్ బెయిల్ పిటిషన్లను ప్రత్యేక కోర్టు కొట్టివేసింది. తదనంతరం ఆగస్టు 23న ప్రత్యేక కోర్టు ఇచ్చిన ఆఫీస్ మెమోరాండం ఆధారంగా చేసుకుని నిందితులు డీఫాల్ట్ బెయిల్ వేశారు. వారు దాఖలు చేసిన రెగ్యులర్ బెయిల్, డీఫాల్ట్ బెయిల్ లోప్రత్యేక కోర్టు ఇచ్చిన ఉత్తర్వులు పరస్పర విరుద్ధంగా ఉన్నాయి. చార్జిషీటుపై కోర్టు లేవెనెత్తిన అభ్యంతరాలకు దర్యాప్తు సంస్థ ఇచ్చిన సమాధానాలను, కోర్టు ముందు ఉన్న ఇతర ఆధారాలను ప్రత్యేక కోర్టు పరిగణనలోకి తీసుకోలేదు. డీఫాల్ట్ బెయిల్ మంజూరు చేసే విషయంలో చట్టనిబంధనలు అనుసరించలేదు. డీఫాల్ట్ బెయిల్ మంజూరుకి సంబంధించి రీతూ చాబ్రియా కేసులో ఇచ్చిన ఉత్తర్వుల అమలును రీకాల్ పిటిషన్‌లో సుప్రీంకోర్టు నిలుపుదల చేసింది. అమల్లో లేని ఉత్తర్వులను ఆధారంగా చేసుకుని నిందితులకు ప్రత్యేక కోర్టు డీఫాల్ట్ బెయిల్ మంజూరు చేసింది. డీఫాల్ట్ బెయిళ్లను రద్దు చేయండి' అని కోరారు. ధనుంజయ్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. నిందితుల వ్యక్తిగత స్వేచ్ఛను దృష్టిలో పెట్టుకుని ఏసీబీ ప్రత్యేక కోర్టు ఇచ్చిన డీఫాల్ట్ బెయిల్ ఉత్తర్వులు సరైనవేనని.. ఈ ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు. బుధవారం ఇరుపక్షాల వాదనలు ముగిశాయి. లిఖితపూర్వక వాదనలు సమర్పించేందుకు, ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకునేందుకు వీలుగా పిటిషన్లపై తదుపరి విచారణను 26కి వాయిదా వేస్తున్నట్లు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రకటించారు.

ప్రసన్న కుమార్‌రెడ్డికి ముందస్తు బెయిల్

- కానిస్టేబుల్‌పై దాడి కేసులో హైకోర్టు మంజూరు

అమరావతి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): హెడ్‌కానిస్టేబుల్ విధులకు ఆటంకం కలిగించి, దాడికి పాల్పడ్డారనే ఆరోపణలతో నమోదైన కేసులో కోవూరు వైసీపీ మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. రూ. 50 వేల బాండ్‌తో రెండు పూచికత్తులు సమర్పించాలని పిటిషనర్‌కు ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు బుధవారం తీర్పు ఇచ్చారు. వైఎస్ జగన్ నెల్లూరుజిల్లా పర్యటన సందర్భంగా తన విధులకు ఆటంకం కలిగించడంతో పాటు తనపై దాడికి పాల్పడ్డారని ప్రసన్నకుమార్‌రెడ్డిపై స్పెషల్ బ్రాంచ్ హెడ్‌కానిస్టేబుల్ మాలకొండయ్య ఫిర్యాదు ఆధారంగా దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ప్రసన్నకుమార్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై ఇటీవల హైకోర్టులో వాదనలు ముగిశాయి.

ఆ ఖాళీలు ఎప్పటిలోగా భర్తీ చేస్తారు

- లోకాయుక్త, హెచ్ఆర్సీ, ఈఆర్సీ, ఎస్‌సీఆర్‌డీసీలో పోస్టుల ఖాళీపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు

అమరావతి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్ (ఏపీహెచ్ఆర్సీ), ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ), రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ (ఎస్‌సీఆర్‌డీసీ)లో చైర్మన్/చైర్‌పర్సన్, సభ్యుల పోస్టులను ఎందుకు ఖాళీగా ఉంచుతున్నారని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఆ ఖాళీలను ఎప్పటిలోగా భర్తీ చేస్తారో స్పష్టతనిస్తూ పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. ఇదే వ్యవహారంతో ముడిపడి ఉన్న వ్యాజ్యాలతో ప్రస్తుత పిల్‌ను జత చేయాలని రిజిస్ట్రీని ఆదేశిస్తూ విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. ఆయా సంస్థల్లో సభ్యుల పోస్టులను భర్తీచేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ విల్లూరి వెంకట రమణమూర్తి హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది వైవీ రవిప్రసాద్ వాదనలు వినిపించారు. పోస్టులు భర్తీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు.

శ్రీశైలానికి ఎలివేటెడ్ కారిడారే!

- అలైన్‌మెంట్ ఖరారు చేసిన కేంద్రం
- మన్ననూరు-పాతాళగంగకు 54 కిమీ

హైదరాబాద్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): తెలంగాణ నుంచి శ్రీశైలం మీదుగా ఆంధ్రప్రదేశ్ వెళ్లేందుకు 'మార్గం' సులభతరం కానుంది. ఈ రహదారిలో ప్రస్తుతం ఉన్న ఇబ్బందులను తొలగిస్తూ రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మించనున్నారు. ఈ దారి అలైన్‌మెంట్లకు సంబంధించి ఆ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కేంద్రానికి 6 ప్రతిపాదనలను పంపగా.. ఎలివేటెడ్ కారిడారే ఉత్తమమని ప్రాథమికంగా నిర్ణయించింది. ఇంతవరకూ బాగానే ఉన్నా ఈ ప్రాజెక్టు ఆర్థికంగా అంత లాభదాయకం కాదని ఈ నెల 9న ఢిల్లీలో జరిగిన భేటీలో అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఇదే విషయాన్ని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి తె లియజేయగా.. ఈ కారిడార్ నిర్మాణంతో శ్రీశైలం పుణ్యక్షేత్రానికి మార్గం సులభతరం కావడంతో పాటు ఏపీ వెళ్లేందుకు ఎంతగానో దోహదపడుతుందని, రెండు రాష్ట్రాల మధ్య వాణిజ్య, వ్యాపార లావాదేవీలు మరింత పెరుగుతాయని కూడా తెలిపింది. ప్రాజెక్టు ఖర్చు రూ.7,700 కోట్లలో సగం భరించేందుకు సిద్ధమైంది. ఇందులో 33 శాతం అంటే సుమారు రూ.2,541 కోట్లను నేరుగా ఇవ్వనున్నట్టు సమాచారం. మిగిలిన 17 శాతానికి సంబంధించి ప్రాజెక్టు నిర్మాణ సామగ్రి, తదితరాలకు ఉండే పన్నులను రద్దు చేస్తామని చెప్పినట్లు తెలిసింది. ఈ అంశంపై కేంద్ర, రాష్ట్రాల మధ్య త్వరలో చర్చలు జరగనున్నాయి. మన్ననూర్ చెక్‌పోస్టుకు కొంచెం ముందు బ్రాహ్మణపల్లి నుంచి ప్రారంభమై.. పాతాళగంగ వరకు నిర్మించే ఈ కారిడార్ పొడవు 54 కిమీ ఉంటుంది. ఇది అందుబాటులోకి వస్తే శ్రీశైలంతో పాటు కర్నూలు వెళ్లేందుకు ప్రయాణ సమయం, దూరం కూడా తగ్గనుంది.





ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌కు స్వాగతం పలుకుతున్న గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా

ఈ రోజు ఆజన్మాంతం గుర్తుంటుంది

- అన్నపూర్ణాదేవి అలంకరణలో దుర్గమ్మను దర్శించుకున్నా
- దసరా ఉత్సవాలు మహిళల శక్తి సామర్థ్యాలకు ప్రతీకలు
- విజయవాడ ఉత్సవ్‌లో పాల్గొన్న ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్
- ఏపీలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తాం: కేంద్ర మంత్రి షెకావత్

విజయవాడ సిటీ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మహిళల శక్తి సామర్థ్యాలకు దసరా ఉత్సవాలు ప్రతీకలని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అన్నారు. విజయవాడ పున్నమి ఘాట్‌లో జరుగుతున్న 'విజయవాడ ఉత్సవ్' కార్యక్రమాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత మొట్టమొదటిగా విజయవాడనే సందర్శించానని తెలిపారు. అన్నపూర్ణాదేవి అలంకరణలో దుర్గమ్మను దర్శించుకోవడం తనకు కలిగిన భాగ్యమని పేర్కొన్నారు. సంస్కృతి సంప్రదాయాలకు అద్దంపట్టే విజయవాడ ఉత్సవ్‌లో పాల్గొన్నానని, ఈరోజు తనకు ఆజన్మాంతం గుర్తుండిపోతుందని చెప్పారు. దేశ ప్రజల ఆకలిని ఏపీ తీరుస్తోందన్నారు. విజయవాడ నగరం ఎప్పుడూ హాట్‌గా ఉన్నా.. ఇక్కడి ప్రజలు మాత్రం కూల్‌గా ఉండటం విశేషమన్నారు. విద్య, ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకుంటూ సీఎం చంద్రబాబు పాలనలో అభివృద్ధి దిశగా రాష్ట్రం దూసుకుపోతోందని పేర్కొన్నారు. ఏపీ ప్రజల కష్టంతోనే అమెరికా ఆర్థిక అభివృద్ధి సాధిస్తోందని, ఆ దేశంలో స్థిరపడిన వారిలో ఏపీ వాసులే ఎక్కువని రాధాకృష్ణన్ గుర్తుచేశారు. కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ మాట్లాడుతూ ఏపీలో అనేక పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని, రానున్న రోజుల్లో కేంద్రం సాయంతో మరింతగా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. తొలుత ఉపరాష్ట్రపతి విజయవాడ ఉత్సవ్ ప్రాంగణాన్ని సందర్శించారు. హోర్డింగ్ వద్ద కుటుంబ సభ్యులతో కలిసి ఫొటో దిగారు. స్టాల్స్‌ను పరిశీలించారు. విజయా డెయిరీ స్టాల్‌లో ఐస్‌క్రీమ్ తిన్నారు. 'విజయవాడ ది డెవలపింగ్ సిటీ ఇన్ ఇండియా' అని సంతకం చేశారు. గాయని గీతా మాధురి పాటలు విని ఆమెను ప్రశంసించారు.

దుర్గమ్మను దర్శించుకున్న ఉపరాష్ట్రపతి

ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అన్నపూర్ణాదేవి అలంకారంలో ఉన్న దుర్గమ్మకు ఆయన ప్రత్యేక పూజలు చేశారు. గన్నవరం విమానాశ్రయం నుంచి బుధవారం సాయంత్రం 4.16 గంటలకు ఇంద్రకీలాద్రి చేరుకున్నారు. నివేదన సమర్పించిన తర్వాత తొలి దర్శనం చేసుకున్నారు. రాజగోపురం వద్ద ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. తమిళ సంప్రదాయం ప్రకారం సుమంగళద్రవ్యాలు, పంచకజ్జాయం సమర్పించారు. అర్చకులతో పాటు రాధాకృష్ణన్ దంపతులు కూడా అష్టోత్తరాన్ని పఠించారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. ఉపరాష్ట్రపతి దంపతులకు దేవదాయ శాఖ కమిషనర్, ఈవో శీనానాయక్ పట్టువస్త్రాలు సమర్పించారు. అర్చకులతో ఆయన తెలుగులో సంభాషించారు. తెలంగాణ గవర్నర్‌గా పనిచేసిన సమయంలో కూడా అమ్మవారిని దర్శించుకున్నానని గుర్తుచేసుకున్నారు. అర్చకులు, వేదపండితులు, అధికారులు, మంగళవాయిద్యకారులతో ఆయన ఫొటోలు దిగారు.



విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్న ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌కు దుర్గమ్మ చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో

అరెస్టు సమయంలో.. సివిల్ దుస్తులా?

- సుప్రీం మార్గదర్శకాలు మీకు వర్తించవా?
- పోలీసులను నిలదీసిన హైకోర్టు
- సవేంద్రరెడ్డి అరెస్టు వాస్తవాల నిర్ధారణకు పోలీసు స్టేషన్ సీసీటీవీ ఫుటేజీను మా ముందుంచండి
- పోలీసులకు ధర్మాసనం ఆదేశం
- విచారణ రేపటికి వాయిదా
- నిందితుడిని స్వేచ్ఛగా వదిలేయాలని నిర్దేశం
- 26న తమ ముందు హాజరుకావాలని సవేంద్రరెడ్డికి ఆదేశాలు




అమరావతి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): నిందితులను అరెస్టు చేసే సమయంలో పోలీసులు యూనిఫాం ధరించకపోవడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. సాధారణ దుస్తుల్లో వచ్చి వ్యక్తులను అరెస్టు చేసే సంస్కృతి ఎక్కడిదని ప్రశ్నించింది. నేరగాళ్లను అరెస్టు చేసే సమయంలో పోలీసులు యూనిఫాం ధరించాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసిందని గుర్తు చేసింది. వైసీపీ నేత సవేంద్రరెడ్డి అరెస్టు సమయంలో యూనిఫాం ఎందుకు ధరించలేదని ప్రత్తిపాడు సీఐని ప్రశ్నించింది. గంజాయి విక్రయిస్తున్న సవేంద్రరెడ్డిని ట్రాప్ చేసి పట్టుకున్నామని, పోలీసు దుస్తుల్లో వెళ్తే నిందితుడు పట్టుబడే అవకాశం లేదన్న సీఐ వివరణతో విభేదించింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలు మీకు వర్తించవా అని ప్రశ్నించింది. కనీసం ఒక్క అధికారినైనా యూనిఫాంతో దూరంగా ఉంచాల్సిందని వ్యాఖ్యానించింది. కిడ్నాప్ చేశారని ఫిర్యాదు వస్తే ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా.. జనరల్ డైరీలో ఎంట్రీ చేయడం ఏమిటని తాడేపల్లి పోలీసులను నిలదీసింది. ఈ నెల 22న రాత్రి 7.30 నుంచి 8.45 మధ్య సవేంద్రరెడ్డిని అరెస్టు చేసినట్లు ప్రత్తిపాడు పోలీసులు చెబుతున్నారని.. మరోవైపు తన భర్తను కిడ్నాప్ చేశారని ఆ రోజు రాత్రి 7 గంటలకే తాడేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశానని సవేంద్రరెడ్డి భార్య అయిన పిటిషనర్ చెబుతున్నారని గుర్తుచేసింది. వాస్తవాలను తేల్చేందుకు ఈ నెల 22న సాయంత్రం 5 గంటల నుండి అర్ధరాత్రి 12 గంటల వరకు పోలీసు స్టేషన్ సీసీటీవీ ఫుటేజ్‌ను తమ ముందుంచాలని తాడేపల్లి పోలీసులను ఆదేశించింది. అలాగే ఆ రోజు సవేంద్రరెడ్డి ఫోన్ టవర్ లొకేషన్‌ను గుర్తించి వివరాలను తమ ముందుంచాలని జియో టెలికామ్ సంస్థకు స్పష్టం చేసింది. నిందితుడు సవేందర్‌రెడ్డిని శుక్రవారం వరకు స్వేచ్ఛగా వదిలేయాలని పోలీసులను ఆదేశించింది. తదుపరి విచారణ రోజు తిరిగి తమ ముందు హాజరుకావాలని నిందితుడికి స్పష్టం చేసింది. పిటిషన్‌పై విచారణను శుక్రవారాని(26)కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ టీసీడీ శేఖర్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.


నేడు మరో అల్పపీడనం

రేపటికి వాయుగుండంగా మార్పు!

- ఎల్లుండి ఉత్తరాంధ్ర వద్ద తీరంపైకి.. భారీ నుంచి అతిభారీ వర్షాలు పడతాయన్న ఐఎండీ

విశాఖపట్నం/అమరావతి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం స్థిరంగా కొనసాగుతోంది. ఇది బలహీనపడనుంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో పలుచోట్ల బుధవారం వర్షాలు కురిశాయి. కాగా, మయన్మార్, దానికి ఆనుకుని తూర్పు మధ్య బంగాళాఖాతంలో బుధవారం ఉపరితల ఆవర్తనం ఆవరించింది. దాని ప్రభావంతో గురువారం నాటికల్లా ఉత్తర, మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. ఆ తర్వాత అల్పపీడనం వాయుగుండంగా బలపడి శుక్రవారం నాటికి ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశాకు ఆనుకుని వాయవ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ప్రవేశించనుంది. ఇది శనివారం ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా మధ్య తీరం దాటనుంది. దీని ప్రభావంతో గురువారం నుంచి నాలుగు రోజులపాటు కోస్తాలో, శుక్ర, శనివారాలు రాయలసీమలో విస్తారంగా వర్షాలు కురుస్తాయి. గురువారం శ్రీకాకుళం నుంచి పల్నాడు జిల్లా వరకూ అక్కడక్కడ భారీవర్షాలు కురుస్తాయి. శుక్రవారం శ్రీకాకుళం నుంచి ప్రకాశం జిల్లా వరకూ, కర్నూలు, నంద్యాల, కడప జిల్లాల్లో అక్కడక్కడ భారీగా, పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. గురువారం నుంచి కోస్తాలో తీరం వెంబడి బలమైన గాలులు వీచే అవకాశం ఉన్నందున మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని, సముద్రంలో ఉన్న వారు తక్షణమే తీరానికి చేరుకోవాలని సూచించింది. కాగా, గురువారం కోస్తా జిల్లాల్లో కొన్ని చోట్ల భారీ వర్షాలు, తర్వాత రెండు రోజులు అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. తీరం వెంబటి గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. కృష్ణానదిలో వరద ప్రవాహం 4.55 లక్షల క్యూసెక్కులు ఉందని, మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోందని తెలిపింది. గోదావరిలో ధవళేశ్వరం వద్ద 3.97 లక్షల క్యూసెక్కుల ప్రవాహం ఉండగా, రానున్న భారీ వర్షాలకు వరద ఉధృతి పెరిగే అవకాశం ఉందని వెల్లడించింది.





2 బిల్లులకు మండలి ఆమోదం

మండలిలో రెండు బిల్లులు ఆమోదం పొందాయి. 'నాలా' ఫీజును ఆయా పంచాయతీల్లో తాగునీరు, రోడ్లు, పారిశుద్ధ్యం తదితర మౌలిక వసతుల కల్పన కోసం వినియోగించుకునేందుకు చట్టంలో సవరణలు చేస్తూ తీసుకువచ్చిన ఏపీ పంచాయతీరాజ్ సవరణ బిల్లు-2025ను మంత్రి నాదెండ్ల మనోహర్ సభలో ప్రతిపాదించారు. అదేవిధంగా.. భారతీయ నాగరిక సురక్షా సంహిత(ఏపీ సవరణ) బిల్లు-2025ను న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ప్రవేశ పెట్టారు. ఈ రెండు బిల్లులను మండలి ఏకగ్రీవంగా ఆమోదించింది.

స్టూడెంట్ కిట్లలో వెయ్యి కోట్లు ఆదా చేస్తాం

- గత ప్రభుత్వంలో నాసిరకం యూనిఫాంలు
- 2019-24 మధ్య కొనుగోళ్లపై విజిలెన్స్ విచారణ
- చేనేతపై వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు చేస్తాం: లోకేశ్



అమరావతి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఇస్తున్న స్టూడెంట్ కిట్లలో ఐదేళ్లలో రూ.వెయ్యి కోట్లు ఆదా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి లోకేశ్ వెల్లడించారు. గత ప్రభుత్వంలో భారీ ధరలతో యూనిఫాంలు, కిట్లు కొనుగోలు చేసినా, నాణ్యత లేనివి పంపిణీ చేశారని చెప్పారు. బుధవారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడారు. నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ... వైసీపీ హయాంలో ఒక్కో విద్యార్థికి యూనిఫాంకు రూ.1,061 వెచ్చించినా నాసిరకమే ఇచ్చారన్నారు. దీనిపై ఫిర్యాదులు రావడంతో విజిలెన్స్ విచారణకు ఆదేశించామన్నారు.

బుచ్చయ్య నేతృత్వంలో వర్కింగ్ గ్రూప్

చేనేతల సమస్యల పరిష్కారం, అభివృద్ధికి గోరంట్ల బుచ్చయ్య నేతృత్వంలో ఎమ్మెల్యేలతో వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు చేస్తామని లోకేశ్ ప్రకటించారు. ఎమ్మెల్యేలందరూ మంగళగిరి వెళ్లి చేనేత వస్త్రాలను పరిశీలించాలని సూచించారు. తాను ప్రధాని వద్దకు వెళితే మంగళగిరి చేనేత శాలువాలే తీసుకెళ్తున్నానని చెప్పారు. చేనేతను ప్రోత్సహించేందుకు విద్యార్థులకు ఇచ్చే యూనిఫాం తయారీని 20శాతం చేనేతలకు ఇవ్వాలన్నారు. కాగా, గురువారం నిర్వహిస్తున్న మెగా డీఎస్సీ నియామక పత్రాల పంపిణీ సభకు ఎమ్మెల్యేలంతా హాజరుకావాలని లోకేశ్ అసెంబ్లీ వేదికగా ఆహ్వానించారు. అందరికీ ఆహ్వాన పత్రాలు పంపామన్నారు. చిత్తూరులో త్వరలో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ... జిల్లాకు కనీసం ఒక యూనివర్సిటీ ఉండాలనేది ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రతి నియోజకవర్గానికి ఒక జూనియర్ కాలేజీ ఏర్పాటు చేస్తామన్నారు.

బాలికా సంరక్షణ పథకం విభజన జరగాలి: సంధ్యారాణి

ఉమ్మడి రాష్ట్రంలో ప్రారంభమైన నూతన బాలికా సంరక్షణ పథకం విభజన ఇంకా జరగలేదని, అందువల్లే బాండ్లు మెచ్యూర్ అయినా లబ్ధిదారులకు నగదు అందడం లేదని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. ఈ పథకం కింద రాష్ట్రంలో 4.39లక్షల మంది లబ్ధిదారులు ఉన్నారని తెలిపారు. ఇప్పటికే అధికారుల స్థాయిలో రెండు రాష్ట్రాల మధ్య సమావేశాలు జరిగాయని, అవసరమైతే మంత్రుల స్థాయి సమావేశం ఏర్పాటుచేసి విభజన ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. త్వరలో గిరిజనులకు ట్రైకార్ రుణాలు అందిచనున్నట్లు సంధ్యారాణి తెలిపారు.

అధికారుల భవనాలు మార్చి నాటికి పూర్తి

- అమరావతిలో పురోగతిలో 85 రకాల పనులు
- టీడీఆర్ బాండ్ల సమస్యకు త్వరలో పరిష్కారం
- జీవీఎంసీలో పది జోన్లు: మంత్రి నారాయణ



అమరావతి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): అమరావతిలో అధికారుల కోసం నిర్మించిన భవనాలను మార్చి నెలాఖరుకు పూర్తిచేస్తామని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో అడిగిన ప్రశ్నలకు బుధవారం ఆయన సమాధానాలిచ్చారు. రాజధానిలో ఇప్పటివరకూ 35వేల ఎకరాలు సమీకరించామన్నారు. గతంలో నిర్మించి మధ్యలో నిలిచిపోయిన భవనాల స్థితిపై అధ్యయనం చేయించామని, అంతర్జాతీయ స్థాయిలో టెండర్లు పిలిచామని, ఇందులో సబ్ కాంట్రాక్టులు ఇచ్చే అవకాశం లేదని చెప్పారు. టిడ్కో ఇళ్ల బకాయిలు రూ.350 కోట్లు చెల్లించామని, అమరావతికి అదనపు నిధులు ఉన్నందున త్వరితగతిన చెల్లింపులు జరుగుతున్నాయని వివరించారు. అమరావతిలో మొత్తం 85 రకాల పనులు పురోగతిలో ఉన్నాయన్నారు.

జీవీఎంసీలో 10వేల మంది ఉద్యోగులు..

గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌లో 10 జోన్లు ఏర్పాటుచేయాలని నిర్ణయం తీసుకున్నామని, త్వరలో అమల్లోకి తీసుకొస్తామని మంత్రి నారాయణ తెలిపారు. జీవీఎంసీలో మొత్తం 10వేల మందికిపైగా ఉద్యోగులు పనిచేస్తున్నారని, 4,863 కిలోమీటర్ల రహదారులు అవసరం కాగా 3,523 కిలోమీటర్లు అందుబాటులో ఉన్నాయని, 193 కిలోమీటర్ల పనులు జరుగుతున్నాయని చెప్పారు. టీడీఆర్ బాండ్ల విషయంలో నగరంలో రెండు విస్తరణ పనులు జరిగాయని, వాటిలో 149 ఆస్తుల్లో 97 ఆస్తులకు బాండ్లు జారీచేశామని తెలిపారు. సింహాచలం పరిధిలో బాండ్ల జారీకి దేవదాయ శాఖతో చర్చిస్తామన్నారు. జీవీఎంసీ పరిధి పెరిగినందున, ఉద్యోగుల్లేక పనులు జరగడం లేదని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. జోనల్ కమిషనర్ల పరిధిని నియోజవర్గాలవారీగా మార్చాలని కోరారు. అరిలోవలో తాగునీటి సమస్య పరిష్కారానికి కణితి రిజర్వాయర్ నుంచి నీరిచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఎన్నిసార్లు అడిగినా పురపాలక మంత్రి స్పందించడం లేదని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ అన్నారు. టీడీఆర్ బాండ్ల కుంభకోణంపై విజిలెన్స్ నివేదికను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. జోనల్ కమిషనర్లకు నిధులు విడుదల చేసే అధికారాలు కల్పించాలని ఎమ్మెల్యే గణబాబు కోరారు. టీడీఆర్ బాండ్ల అంశంపై రాష్ట్ర స్థాయి కమిటీని నియమించాలని పల్లా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. వైసీపీ హయాంలో భూములు లేకపోయినా ఇచ్చినట్లుగా చూపించి టీడీఆర్ బాండ్లు తీసుకున్నారని కాకినాడ ఎమ్మెల్యే కొండబాబు తెలిపారు. దీనిపై నివేదికను సభలో పెట్టాలని కోరారు.

అమరావతిపై జగన్ వైఖరి చెప్పాలి: కామినేని

గత ప్రభుత్వంలో సకల శాఖ మంత్రిగా పేరున్న వ్యక్తి తాజాగా రాజధాని అమరావతేనని చెప్పారని, జగన్ కూడా అమరావతిపై వైఖరి ప్రకటించాలని కామినేని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అమరావతికే కట్టుబడి ఉంటారా? లేక మళ్లీ మూడు ముక్కలాట ఆడతారా? అనేది ప్రజలకు తెలియాలన్నారు. రాష్ట్రంలోని కాంట్రాక్టర్లందరికీ రాజధాని కాంట్రాక్టులు ఇవ్వాలని ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు డిమాండ్ చేశారు. 9 మంది కాంట్రాక్టర్లకే అన్ని పనులు ఇస్తే మిగిలిన వారు ఎలా బతకాలని ప్రశ్నించారు.

రేపు ఎమ్మెల్యేల నుంచి పిటిషన్లు..

నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలకు అందిన పిటిషన్లను శుక్రవారం అసెంబ్లీలో పిటిషన్ల కమిటీ స్వీకరిస్తుందని ఉపసభాపతి రఘురామకృష్ణంరాజు తెలిపారు. ఎమ్మెల్యేలు ముఖ్యమైన పిటిషన్లు కమిటీకి ఇచ్చే అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

ప్రజలకు అర్థంకాని 'ప్రశ్నోత్తరాలు'

- జీరో అవర్‌లో యార్లగడ్డ వెంకట్రావు ప్రస్తావన

అమరావతి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): శాసనసభలో జరుగుతున్న 'ప్రశ్నోత్తరాలు' ప్రజలకు అర్థం కావడంలేదని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు. బుధవారం అసెంబ్లీ జీరో అవర్‌లో ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. "ముందుగా ప్రశ్న చదవకుండా... అవును, కాదు, ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు అని మాత్రమే మంత్రులు చెబుతున్నారు. దీంతో... అసలు ఆ విషయం ఏమిటో ప్రజలకు అర్థం కావడంలేదు. అందరికీ అర్థమయ్యేలా ప్రశ్నోత్తరాలు జరగాలి" అని కోరారు.

పీపీపీకి.. ప్రైవేటీకరణకు తేడా తెలీదా?


- నీలాంటి వ్యక్తి సీఎం కావడం దౌర్భాగ్యం
- వైసీపీ పాలనలో ఒక్క మెడికల్ కాలేజీ కూడా పూర్తి చేయకుండా వదిలేశారు
- కళాశాలలను అడ్డుపెట్టి వేల కోట్లు అప్పు చేశారు.. అవేం చేశారో లెక్కలేదు
- జగన్‌పై నిప్పులు చెరిగిన సత్యకుమార్
- వైద్య కళాశాలలపై మండలిలో స్వల్ప చర్చ
- వాకౌట్ చేసిన విపక్ష సభ్యులు
- పారిపోతున్నారని అధికార పక్షం ఎద్దేవా

ఐదు కాలేజీల అసలు సంగతి ఇదీ! (అంకెలు రూ. కోట్లలో)

మెడికల్ కాలేజీ	నిధులకు అనుమతి	ఐదేళ్లలో వైసీపీ ఖర్చు	ఏడాదిలో కూటమి ఖర్చు
రాజమండ్రి	475	81.74	53.73
ఏలూరు	525	136.12	53.64
విజయనగరం	500	110.3	73.37
మచిలీపట్నం	550	206.11	195(కేంద్రం గ్రాంటు)
నంద్యాల	475	75.8(లక్షలు)	57.669(లక్షలు)


బొత్స సత్యనారాయణ


మంత్రి సత్యకుమార్


మంత్రి కొలుసు పార్థసారథి

అమరావతి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): "పీపీపీ విధానంలో రెండేళ్ల కాలంలోనే రాష్ట్రంలో మొత్తం మెడికల్ కాలేజీలను పూర్తి చేయడంతోపాటు రూ.3,700 కోట్ల ఆర్థిక భారాన్ని తగ్గించుకోవాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వైసీపీ నాయకులు దానిని ప్రైవేటీకరణ అంటూ దుష్ప్రచారం చేస్తున్నారు. పబ్లిక్, ప్రైవేట్, పార్టనర్‌షిప్‌కి.. ప్రైవేటీకరణకు తేడా తెలియకుండా ఐదేళ్లపాటు ఒక వ్యక్తి ముఖ్యమంత్రిగా పనిచేశాడంటే ఈ రాష్ట్రం చేసుకున్న దౌర్భాగ్యం" అని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ శాసన మండలిలో మాజీ సీఎం జగన్‌పై నిప్పులు చెరిగారు. రూ.లక్షల కోట్ల వ్యాపారం చేసుకునే వారికి ప్రైవేటీకరణకు, పీపీపీ మోడల్‌కు తేడా తెలియకపోవడం దురదృష్టకరమని ఎద్దేవా చేశారు. మెడికల్ కాలేజీల పీపీపీ విధానంపై బుధవారం రాష్ట్ర శాసనమండలిలో స్వల్ప చర్చ జరిగింది. మంత్రి సత్యకుమార్ ప్రకటన చేస్తుండగా.. విపక్ష వైసీపీ సభ్యులు పదేపదే రన్నింగ్ కామెంట్రీ చేస్తూ మంత్రి ప్రసంగానికి అడ్డంకులు సృష్టించారు. ఈ గందరగోళ పరిస్థితుల మధ్యే మంత్రి తన ప్రసంగాన్ని కొనసాగించారు. "రాష్ట్రంలో 17 ప్రభుత్వ వైద్య కళాశాలలు.. 19 ప్రైవేట్ వైద్య కళాశాలలున్నాయి. ప్రతి జిల్లాలో ఒక వైద్య కళాశాల ఉండాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించి.. 2020లో రాష్ట్రానికి 17 కాలేజీలను మంజూరు చేసింది. వీటిలో నంద్యాల, ఏలూరు, మచిలీపట్నం, విజయనగరం, రాజమండ్రి, పాడేరు కళాశాలలు పూర్తయ్యాయి. 10 కళాశాలలో 2025-26కి పూర్తి కావాల్సి ఉన్నా అవి పూర్తికాలేదు. మొత్తం 17 కాలేజీల నిర్మాణానికి రూ.8,480 కోట్లు ఖర్చు చేయాల్సి ఉండగా.. గత ప్రభుత్వం నాలుగేళ్లలో రూ.1,550 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. అంటే ఏడాదికి సగటున రూ.387 కోట్లు ఖర్చు పెట్టింది. ఒక్కొక్క కాలేజీకి సగటున రూ.22.79 కోట్లు వెచ్చించింది. ఈ పద్ధతిలో మొత్తం 17 వైద్య కళాశాలల నిర్మాణాన్ని పూర్తి చేయాలంటే 22 నుంచి 23 సంవత్సరాలు పడుతుంది. ఏడాదిక్రితం అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం రూ.736 కోట్లు ఖర్చు చేసింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి మొదలు కావాల్సిన మార్కాపురం వైద్య కళాశాలకు మొత్తం ఆమోదిత వ్యయం రూ.475 కోట్లకు గాను నాలుగేళ్లలో రూ.46.26 కోట్లు (7శాతం) మాత్రమే గత ప్రభుత్వం చెల్లించింది. దీంతో ఈ కళాశాలలో మౌలిక వసతులు కల్పించలేదు. మిగిలిన కళాశాలల పరిస్థితి కూడా ఇలానే ఉంది.

ప్రొఫెసర్లు భయపడుతున్నారు

పులివెందుల మెడికల్ కాలేజీలో బోధించడానికి వెళ్లడానికి ప్రొఫెసర్లు భయపడుతున్నారంటే అక్కడ నాయకుల వల్ల ఎలాంటి పరిస్థితులు నెలకొన్నాయో అర్థం చేసుకోవచ్చు. మరోవైపు మెడికల్ సీట్లను అమ్మేస్తున్నారని, పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేస్తున్నారని విష ప్రచారం మొదలుపెట్టారు. వాస్తవం ఏమిటంటే.. 50 శాతం కన్వీనర్ కోటా. 35 శాతం సీట్లు మేనేజ్‌మెంట్ కోటా. 15 శాతం సీట్లు ఎన్ఆర్ఐ కోటా అంటూ 2021లో సెల్ఫ్ ఫైనాన్స్ స్కీం కింద జీవోలు తెచ్చి మెడికల్ సీట్లు అమ్మింది వైసీపీ ప్రభుత్వమే. ఇప్పుడు అదే విధానం కొనసాగుతుంది తప్ప కూటమి ప్రభుత్వం కొత్తగా చేసిందేమీ లేదని మంత్రి ప్రకటన చేశారు. కాగా, విదేశాల్లో వైద్య విద్య అభ్యసించిన వారికి ఏపీ వైద్య మండలి ద్వారా శాశ్వత రిజిస్ట్రేషన్ కల్పించే విషయాన్ని ప్రభుత్వం సానుభూతితో పరిశీలిస్తోందని మంత్రి చెప్పారు.

వైసీపీ ఆఫీసులపైనే శ్రద్ధ

వైసీపీ హయాంలో కొత్తగా 5 మెడికల్ కాలేజీలను పూర్తిచేశామని ఆర్భాటంగా చెప్పుకొంటున్నారు. కానీ, చేసిందేమీ లేదు. మరోవైపు కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణం కోసం వేల కోట్లు అప్పులు తెచ్చారు. ఆ నిధులు ఎక్కడికి పోయాయో తెలియడం లేదు. గత ప్రభుత్వంలో విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు సొమ్ములు కేటాయించారు. కానీ, నాలుగేళ్లలో రూ.1550 కోట్లు ఖర్చు పెట్టి ఒక్కటంటే ఒక్క మెడికల్ కాలేజీని కూడా పూర్తి చేయలేకపోయారు. రూ.451 కోట్ల ప్రజాధనాన్ని వృథా చేసి రుషికొండ ప్యాలెస్ నిర్మించుకున్నారు. కర్నూలు జిల్లా ఆదోని మెడికల్ కాలేజీ పూర్తి చేయలేదుగానీ, వైసీపీ కార్యాలయాన్ని నిర్మించుకున్నారు.

రెండు గంటలు ధర్మమా: బొత్స

మెడికల్ కాలేజీల అంశంపై మంత్రి సుదీర్ఘంగా స్టేట్‌మెంట్ ఇవ్వడంపై మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ అభ్యంతరం వ్యక్తం చేశారు. "సభలో మంత్రి ప్రకటన చేయడానికి రెండు గంటల సమయం తీసుకోవడం ధర్మమా?. స్టేట్‌మెంట్ ఇచ్చేటప్పుడే జగన్‌పై విమర్శలు ఎందుకు?. ఈ అంశంపై చర్చ పూర్తయిన తర్వాత మంత్రి సమాధానాలిచ్చేటప్పుడు ఏమైనా మాట్లాడమనండి. మాకు అభ్యంతరం లేదు" అన్నారు. కాగా, నిబంధనల ప్రకారమే చైర్మన్.. మంత్రికి సమయం ఇచ్చారని, మెడికల్ కాలేజీల వెనుక రాజకీయ నిర్ణయాలున్నాయి కాబట్టే మంత్రి మాజీ సీఎం ప్రస్తావన తెచ్చారని మండలిలో ఉన్న మంత్రులు కొలుసు పార్థసారథి, నాదెండ్ల మనోహర్ చెప్పారు. అనంతరం ఇదే అంశంపై చైర్మన్ మోషేన్ రాజు చర్చకు అనుమతిచ్చారు. ఈసందర్భంగా వైసీపీ ఎమ్మెల్సీలు మాట్లాడుతూ.. మెడికల్ కాలేజీల పీపీపీ విధానాన్ని వ్యతిరేకించారు. టీడీపీ సభ్యులు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, పంచుమర్తి అనురాధ తదితరులు పీపీపీని సమర్థించారు. విపక్ష నేత బొత్స మాట్లాడుతూ.. పీపీపీ విధానాన్ని నిరసిస్తూ తాము వాకౌట్ చేస్తున్నామని ప్రకటించి, వైసీపీ సభ్యులతో కలిసి బయటకెళ్లిపోయారు. అయితే, చర్చ నుంచి పారిపోతున్నారని అధికారపక్ష సభ్యులు ఎద్దేవా చేశారు.

బాబు కట్టించారని.. కూల్చేశారు!

గతంలో సీఎం చంద్రబాబు నిర్మించారనే కారణంగా ప్రజావేదికను కూల్చేశారు. కానీ, మా ప్రభుత్వం అలాంటి పనులు చేయలేదు. పీపీపీ మోడల్‌లో చేపడుతున్న కొత్త మెడికల్ కాలేజీలను.. డిజైన్, ఫైనాన్స్, బిల్డ్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్ విధానంలో నిర్మించాలని నిర్ణయించాం. యూపీ, ఒడిశా, జార్ఖండ్ తదితర రాష్ట్రాలు కూడా పీపీపీ విధానాన్ని అనుసరించి సంపద సృష్టించుకుంటున్నాయి. కొత్త మెడికల్ కాలేజీలకు కేటాయించిన భూములను అమ్మేస్తున్నామంటూ వైసీపీ సభ్యులు అడ్డగోలు ప్రచారం చేస్తున్నారు. ఈ భూముల యాజమాన్య హక్కులు రాష్ట్ర ప్రభుత్వం దగ్గరే ఉంటాయి. కాలేజీల నిర్వహణ, పెట్టుబడులు పెట్టడం, ఆపరేషన్స్ మాత్రమే ప్రైవేటు సంస్థలు చేస్తాయి. ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు ఉండవు. 33 ఏళ్ల లీజు పూర్తయిన తర్వాత ప్రభుత్వ స్వాధీనంలోకే వస్తాయి.

అదొక్కటే పూర్తి చేయాలనుకున్నారా?

వైసీపీ హయాంలో వైద్య కళాశాలలకు రూ.500 కోట్లకు అనుమతి మంజూరు చేశారు. ఈ నిధుల్లో ఒక్క పులివెందుల కాలేజీకే రూ.396.16 కోట్లు చెల్లించారు. గిరిజన ప్రాంతంలోని పార్వతీపురం వైద్య కళాశాలకు రూ.600 కోట్లతో పరిపాలనా అనుమతి ఇచ్చారు. కానీ, ఇంతవరకు భూసేకరణ కూడా చేయలేదు. టెండర్లు కూడా పిలవలేదు. పార్వతీపురంలో ఉన్న 100 పడకల మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌ను చూపించి అక్కడ మెడికల్ కాలేజీకి అనుబంధంగా ఆసుపత్రి నిర్మించామని చెబుతున్నారంటే ఏమనుకోవాలి?. రాష్ట్రంలో మిగిలిన మెడికల్ కాలేజీలన్నింటినీ గాలికొదిలి ఒక్క పులివెందుల కాలేజీని మాత్రమే పూర్తి చేయాలనుకున్నారా?. ఆయన(జగన్) కేవలం పులివెందులకే ముఖ్యమంత్రి అనుకున్నారా?. లేక రాష్ట్రం మొత్తానికి ముఖ్యమంత్రిగా వ్యవహరించారా?. అనేది ఆయనే ఆత్మపరిశీలన చేసుకోవాలి. తాడేపల్లి, ఇడుపులపాయ, బెంగుళూరులో భూములు సేకరించకుండానే ప్యాలెస్‌లు నిర్మించారా?

'వైఎస్' పేరెత్తారని వాకౌట్

- మండలి ప్రశ్నోత్తరాల సమయంలో వైసీపీ సభ్యుల విచిత్ర వైఖరి
- దుర్గగుడి అధికారులు ఫోన్లు ఎత్తట్లేదు
- చైర్మన్ మోషేన్ రాజు అసహనం

అమరావతి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): శాసనమండలిలో బుధవారం ప్రశ్నోత్తరాల సమయంలో వైసీపీ సభ్యులు విచిత్రంగా వ్యవహరించారు. ఓ సందర్భంలో అధికార పక్ష సభ్యులు దివంగత వైఎస్ పేరెత్తగానే వైసీపీ సభ్యులు మండలి నుంచి వాకౌట్ చేశారు. తొలుత ఉద్యోగ కల్పన, నిరుద్యోగ భృతిపై వైసీపీ సభ్యులు ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని చైర్మన్ మోషేన్‌రాజు తిరస్కరించారు. దీంతో 'సూపర్ సిక్స్'లో ప్రకటించిన ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి ఇస్తామన్న హామీ ఏమైందని విపక్ష సభ్యులు ప్రశ్నించారు. నిరుద్యోగ భృతిపై చర్చకు పట్టుబట్టారు. కానీ, చైర్మన్ అంగీకరించకపోవడంతో నిరసనకు దిగారు. అనంతరం, కాకినాడ పోర్టులో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సీజ్ చేయించిన షిప్ ఏమైందని, ప్రభుత్వం పెట్టిన కేసులు ఏమయ్యాయని వైసీపీ సభ్యులు ప్రశ్నించారు. బహిరంగ ప్రదేశాల్లో అనధికార విగ్రహాల ఏర్పాటుపై ఎలాంటి చర్యలు తీసుకున్నారన్న టీడీపీ సభ్యుల ప్రశ్నపై మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సమాధానం చెబుతున్న సమయంలో.. కడపలో స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామంటే నాటి వైసీపీ ప్రభుత్వం అడ్డుకుందని టీడీపీ ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి ఆరోపించారు. గత పాలకులు ప్రభుత్వ ధనంతో బహిరంగ ప్రదేశాల్లో వైఎస్సార్ విగ్రహాలు పెట్టారని అన్నారు. దీంతో 'వైఎస్సార్' పేరు ప్రస్తావించడాన్ని విపక్ష నేత బొత్స సత్యనారాయణ అభ్యంతరం వ్యక్తం చేస్తూ, దీనికి నిరసనగా ప్రశ్నోత్తరాలను వాకౌట్ చేస్తున్నట్లు చెప్పి వెళ్లిపోయారు. దీనికిముందు.. 2024, జూన్ నుంచి ప్రైవేట్ సంస్థలకు భూ కేటాయింపులు, ఇప్పటి వరకు కల్పించిన ఉద్యోగాలపై వైసీపీ సభ్యులు అడిగిన ప్రశ్నకు పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ ఇచ్చిన లిఖిత పూర్వక సమాధానంలో.. మెగా డీఎస్సీ ద్వారా 16 వేల పోస్టుల భర్తీ చేసినట్లు ఉండటంతో విపక్ష సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. టీచర్ పోస్టుల భర్తీని పారిశ్రామిక సంస్థల ఏర్పాటుతో ఎలా చూపుతారని ప్రశ్నించారు. దీనిపై సమాధాన పత్రాల్లో పొరపాటున మరొకటి వచ్చిందని మంత్రి అన్నారు.

పరిశ్రమలకు ప్రోత్సాహం: భరత్

రాష్ట్రంలో 2024, జూన్ నుంచి ప్రైవేట్ కంపెనీలకు ఏపీఐఐసీ 6,022 ఎకరాలు కేటాయించినట్లు పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. ఇప్పటి వరకు 3.48 లక్షల మందికి ఉపాధి కల్పించినట్లు చెప్పారు. ఏపీ పారిశ్రామిక విధానం 4.0, ఎంఎస్ఎంఈ, ఎంటర్‌ప్రెన్యూర్ డెలవప్‌మెంట్ పాలసీ 4.0, ఇంటిగ్రేటెడ్ గ్రీన్ ఎనర్జీ పాలసీలు తెచ్చినట్లు చెప్పారు. సుస్థిర పెట్టుబడులను ప్రోత్సహించనున్నట్లు తెలిపారు.

విగ్రహాలకు అనుమతి లేదు: జనార్దన్‌రెడ్డి

బహిరంగ ప్రదేశాల్లో విగ్రహాల ఏర్పాటుకు అనుమతి లేదని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో బహిరంగ ప్రదేశాల్లో 2,524 అనధికార విగ్రహాలు ఉన్నాయని వెల్లడించారు. పులివెందుల, కడపలో కూడళ్ల సుందరీకరణకు రూ.10.71 కోట్లుమంజూరు చేశామన్నారు.

ఆ బియ్యం వేలం వేస్తున్నాం: నాదెండ్ల

రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టడానికి జిల్లాస్థాయిలో టాస్క్‌ఫోర్స్‌లు ఏర్పాటు చేసి, ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టిందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. 2024, జూన్ నుంచి గత ఆగస్టు వరకు బియ్యం అక్రమ రవాణాపై 2,438 కేసులు పెట్టామని, 282 వాహనాలు సీజ్ చేశామని తెలిపారు. 5.65 లక్షల క్వింటాళ్ల బియం స్వాధీనం చేసుకుని వేలం వేయగా రూ.6.60 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. రేషన్ మాఫియా బలంగా పాతుకుపోయిందని, కేసులు పెడితే కోర్టుకు వెళ్తున్నారని తెలిపారు.

పర్యాటకంలో పెట్టుబడులు: దుర్గేష్

పర్యాటక ప్రాజెక్టులపై మంత్రి కందుల దుర్గేష్ సమాధానమిస్తూ.. 15 నెలల్లో రూ.10,644 కోట్ల పర్యాటక పెట్టుబడులు, 103 సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నామని చెప్పారు. రూ.3,887కోట్లతో 15 ప్రాజెక్టులకు అడుగులు పడ్డాయని తెలిపారు. 100 పుణ్యక్షేత్రాల్లో టెంట్ సిటీలు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. దీనిపై విపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. 2024-29 మధ్య టూరిజం ప్రాజెక్టుల గురించి అడిగితే మీ పాలనలోవి చెబుతున్నారని అన్నారు. దీంతో 2019-24 మధ్య టూరిజానికి సంబంధించి రూ.21,941 కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగినా.. 20% కూడా అమలు కాలేదని మంత్రి చెప్పారు. గత ప్రభుత్వంలో కట్టినవాటిల్లో రుషికొండ ప్యాలెస్ ఒకటని,దీని కరెంటు బిల్లు బకాయి పెట్టిపోయారన్నారు.

దుర్గమ్మ దర్శనం దక్కట్లేదు: చైర్మన్

దసరా ఉత్సవాల సందర్భంగా దుర్గగుడికి వెళ్తున్న ఎమ్మెల్సీలకు దర్శనం చేయించడానికి ఎవరూ స్పందించడం లేదని మండలి చైర్మన్ మోషేన్ రాజు అసహనం వ్యక్తం చేశారు. దర్శనం కోసం వెళ్లిన ఎమ్మెల్సీలు 10 సార్లు ఫోన్ చేసినా.. అధికారులు ఫోన్లు ఎత్తడం లేదన్నారు. దీనిపై మంత్రి మనోహర్ జోక్యం చేసుకుని, ప్రొటోకాల్ ప్రకారం సభ్యులకు ఉదయం 7-9 గంటల మధ్య వీఐపీ దర్శనం చేయిస్తామని తెలిపారు.



'అమృత్' అక్రమాలపై.. సభాసంఘానికి మంత్రి నో


- 5 రెట్లు ఎక్కువ చెల్లింపులు జరిగాయంటూనే నిరాకరణ
- తమ నియోజకవర్గాల్లో పనులే మొదలుకాలేదని ఎమ్మెల్యేల గగ్గోలు
- హౌస్ కమిటీకి పట్టుబట్టిన కూన రవికుమార్
- సీరియస్ సమస్య అని డిప్యూటీ స్పీకర్ చెప్పినా పట్టించుకోని మంత్రి నారాయణ

అమరావతి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో అమృత్ 2.0 పథకం కింద చెరువుల సుందరీకరణ పనులు చేయకుండానే బిల్లులు చెల్లించారని.. దీనిపై సభాసంఘాన్ని నియమించాలని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ సహా పలువురు ఎమ్మెల్యేలు కోరినా పురపాలక మంత్రి పి.నారాయణ ససేమిరా అన్నారు. తమ ప్రాంతంలో రూపాయి పని కూడా జరగలేదని కూన చెప్పగా.. మూడు పనులు జరిగినట్లుగా తమ రికార్డుల్లో ఉందని మంత్రి జవాబిచ్చారు. దీంతో మంత్రి, అధికారులు ఆమదాలవలస వచ్చి.. అక్కడ కనీసం రూపాయి పనైనా జరిగిందో లేదో చూసి చెప్పాలని కూన ఆహ్వానించారు. ఆమదాలవలసలో ఆర్టీసీ బస్టాండ్ పక్కన 46.2 ఎకరాల విస్తీర్ణంలో ఒక చెరువు ఉందని, సుందరీకరణ కోసం గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ద్వారా రూ.85 లక్షల విలువైన పనులు మంజూరు చేశారని.. ఇందులో పనులేమీ జరగకుండానే రూ.42 లక్షలు చెల్లించారని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలా పనులు చేయకుండా రూ.101 కోట్లు చెల్లించగా.. ఇందులో 25శాతం పనులు కూడా జరగలేదని.. ఆమదాలవలస ప్రాజెక్టుకు సంబంధించి ఖర్చు కంటే 55 శాతం ఎక్కువ చెల్లింపులు జరిగాయని మంత్రి అంగీకరించారు. అయితే సభాసంఘం వేయడానికి మాత్రం సమ్మతించలేదు. ఈ నిధులు తాడేపల్లి, రుషికొండ ప్యాలెస్‌ల కోసం, విజయవాడ ఎయిర్‌పోర్టు, విజయవాడ స్వరాజ్ మైదాన్, జీ-20 సదస్సుకు ఖర్చు చేశామంటూ ఆర్వీ కన్‌స్ట్రక్షన్‌కు చెల్లింపులు చేశారని.. దీనిపై విచారణ చేయాలని కూన కోరారు. సెంట్రల్ ప్లాంటేషన్ పథకంలో అంచనా ఖర్చు, ఒప్పందంలో వేసిన వ్యయం ఒకేలా ఉన్నాయని.. వాస్తవానికి ఇవి రెండూ వేర్వేరుగా ఉండాలని చెప్పారు. ఇవన్నీ చూస్తుంటే ఆ కార్పొరేషన్‌లో చీఫ్ ఇంజనీర్ నుంచి కింది స్థాయి ఉద్యోగుల వరకు అందరూ ప్రజాధనం దుర్వినియోగం చేశారని అర్థమవుతోందన్నారు. పథకం కింద రూపాయి కూడా ఖర్చు పెట్టకపోవడం సీరియస్ అంశమని డిప్యూటీ స్పీకర్ అభిప్రాయపడ్డారు. జీ-20 సదస్సు నిర్వహణ సమయంలో కూడా ఈ పథకం కింద నిధులు దుర్వినియోగం చేశారని.. విచారణ చేపట్టాలని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మంత్రిని కోరారు. తమ ప్రాంతంలో ఉన్న వెంకటరాయన కోనేరు సుందరీకరణ కోసం రూ.23 లక్షలు మంజూరు చేశారని, తీరా చూస్తే అక్కడ ఏ ఒక్క పనీ జరగలేదని.. దీనిపై హౌస్ కమిటీ వేయాలని పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణ కూడా విజ్ఞప్తి చేశారు. తమ ప్రాంతంలో ఉన్న చెరువు సుందరీకరణకు నిధులు మంజూరు చేసినప్పటికీ.. అక్కడ ఏ పనీ చేయలేదని కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి కోరారు. చాలా మంది ఎమ్మెల్యేలు తమ ప్రాంతంలోనూ ఇవే సమస్యలున్నాయన్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఈ సమస్య ఉందని, దీనిపై మంత్రి మాట్లాడతారని డిప్యూటీ స్పీకర్ చెప్పారు. నారాయణ స్పందిస్తూ.. ఆమదాలవలసలో పనులు జరిగాయనే మళ్లీ చెప్పారు. వాటికి ఐదు రెట్లు డబ్బు ఎక్కువ చెల్లించారనీ తెలిపారు. తాడేపల్లి, పాడాలో జరిగిన పనులపై విజిలెన్స్ నివేదిక రావలసి ఉందన్నారు. దీనిపై కూన మాట్లాడుతూ.. 'ఈ ప్రభుత్వం వచ్చి 15 నెలలైంది. ఇంకా నివేదిక రాలేదంటే కాలయాపనే కదా! హౌస్ కమిటీ వేయడానికి ప్రభుత్వానికి ఉన్న ఇబ్బందేమిటి' అని ప్రశ్నించారు. డిప్యూటీ స్పీకర్ అనుమతితో హౌస్ కమిటీ కోరుతూ కూన తీర్మానం ప్రవేశపెట్టారు. అయినప్పటికీ మంత్రి స్పందించలేదు. దీంతో మంత్రి నుంచి అందిన సమాచారం ప్రకారం.. ఈ సమస్యపై మరింత సమయం తీసుకుని మళ్లీ చర్చిద్దామని డిప్యూటీ స్పీకర్ చెప్పారు.

సచివాలయాలు, ఆక్వా సవరణ బిల్లులకు ఆమోదం

అసెంబ్లీ బుధవారం రెండు బిల్లులను ఆమోదించింది. ఏపీ గ్రామ/వార్డు సచివాలయాల చట్టం (2023)లో.. గ్రామ సచివాలయంలో విద్య అంశాలను వార్డు విద్య, డేటా విశ్లేషణ కార్యదర్శి నుంచి తొలగించి వార్డు సంక్షేమ, అభివృద్ధి కార్యదర్శికి అప్పగించేలా చేసిన సవరణను సభ్యులు ఆమోదించారు. ఎమ్మెల్యేలు గణబాబు, ఆదిరెడ్డి శ్రీనివాస్ దీనిపై మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేపల పెంపకపు అభివృద్ధి ప్రాధికార సంస్థ చట్టం (2020)లో కూడా సవరణ చేశారు. దాదాపు 20 శాతం మంది ఆక్వా రైతులు తమ పాత రిజిస్ట్రేషన్లను నిర్ణీత సమయంలోపు ఎండార్స్ చేసుకోలేదని, దీనిని పరిష్కరించడం కోసం ఈ సవరణ చేస్తున్నట్లు మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.


SAMSUNG
Galaxy S25 Ultra
Got a question? Go live. Get answers.
12:00
100
Google Gemini Live
Gemini, what's the best way to style this for a rock-meets-Indian party?
For a rock themed Indian party, you could pair it with a black leather jacket and some chunky silver jewelry.
Google Gemini
Own now at ₹ 111499 (1 unit)*
Get benefits worth ₹ 18500#
Pair-up Galaxy Watch8 Classic Get ₹ 15000~ off
Samsung Care+ (Two year protection plan)
Starting ₹ 425/month^
HDFC BANK
Samsung Finance+™
samsung.com
Please dispose of e-waste and plastic waste responsibly. Customers can WhatsApp on 180057267864 for information on e-waste/plastic waste.
Image simulated, actual may vary. Actual UX/UI may vary. Color and feature as per availability. Samsung disclaims any and all liabilities thereof. Google and Gemini are trademarks of Google LLC. Results for illustrative purposes and may vary. Check responses for accuracy. Compatible with certain features and with certain accounts. Internet connection required. Available on select devices, languages, and countries. Only available to users 18 years and older *T&C apply. Effective offer price of ₹ 111499 for 1 unit of Galaxy S25 Ultra 12GB|256GB, inclusive of instant cashback worth ₹ 6500 and an upgrade bonus worth ₹ 12000. #Cumulative benefits worth ₹ 18500, inclusive of instant cashback worth ₹ 6500 and an upgrade bonus worth ₹ 12000. Upgrade program provided by the brand/dealer at their sole discretion upon exchange of select devices. ~Discount amount of ₹ 15000 applicable only when purchasing 1 unit of Galaxy Watch8 Classic together with 1 unit of Galaxy S25 Ultra. ^1 unit of Samsung Care+ 2-year Complete Protection Plan worth ₹ 11999 available at ₹ 425/month, only when purchased with Galaxy S25 Ultra through Samsung Care+ partners. Customers are eligible for 1 claim per year under ADLD, as per applicable terms. Samsung Care+ EMI amount calculated post a 15% up-front down payment on the remaining 85% amount. Samsung disclaims any liabilities with the same. All third party logos/ marks shown are registered/owned/licensed logos/ marks of respective brand owners. Offers may be revised or withdrawn without prior notice.
Scan to meet your true AI companion
Or WhatsApp "S25" to 9870 494949 to buy at Samsung Exclusive Store
Cheil-28809/25



దుర్గా నవరాత్రులు

నేటి అలంకారం
శ్రీ కాత్యాయనీ దేవి
ఆశ్వయుజ శుద్ధ చవితి
గురువారం

శరన్నవరాత్రి మహోత్సవాల్లో నాలుగో రోజున శ్రీ కాత్యాయనిదేవిగా విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ దర్శనమిస్తారు. పూర్వం 'కత' అనే మహర్షికి దేవీ ఉపాసన వల్ల ఒక కుమారుడు కలిగాడు. చిన్నతనం నుంచే తండ్రి నుంచి భక్తిని అలవరచుకున్న ఆ తపస్వికే 'కాత్యాయనుడు' అని పేరు. ఆయన గొప్ప తపశ్శక్తి సంపన్నుడు. దేవి భక్తుడు కావడంతో దేవినే పుత్రికగా పొందాలని తపస్సు చేశాడు. దేవి ప్రసన్నురాలై ఆ మహర్షికి పుత్రికగా జన్మించింది. కాత్యాయనుడి పుత్రిక కనుక ఆమె 'కాత్యాయనీదేవి'గా ప్రసిద్ధి పొందింది. లోకకంటకులైన రాక్షసులను... ముక్కోటి దేవతలు, త్రిమూర్తులు ప్రసాదించిన శక్తితో కాత్యాయనీ దేవి అంతం చేసి, లోకకల్యాణానికి దోహదం చేసింది. ఆమె భక్తుల పాలిట కల్పవల్లి. ఆ తల్లిని ఆరాధించడం వల్ల చతుర్విధ పురుషార్థాలు సిద్ధిస్తాయని, రోగాలు, శోకాలు, భయాలు నశిస్తాయని, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు భక్తుల ఇళ్లలో వర్ధిల్లుతాయని పురాణ వచనం.

నైవేద్యం:
పొంగలి, పరమాన్నం
అలంకరించే చీర రంగు:
ఎరుపు
అర్చించే పూల రంగు:
ఎరుపు
పారాయణ చెయ్యాల్సినవి:
కాత్యాయనీ మంత్రం, అష్టోత్తరం

గూగుల్ జెమిని రూపొందించిన 'నానో బనానా ఏఐ టూల్' అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. ఫొటోలు అప్‌లోడ్ చేసి క్షణాల్లో 3డి ఇమేజ్‌లా మార్చేసుకుని ఇన్‌స్టా, ఫేస్‌బుక్, వాట్సప్‌ల్లో షేర్ చేసుకుంటూ మురిసిపోతోంది యువత. ఇదిలా ఉంటే ఓ యువతికి ఎదురైన అనుభవం మాత్రం భయాందోళనలను కలిగించేలా ఉంది. కంటికి కనిపించకుండా గోప్యంగా ఉంచిన పుట్టుమచ్చను సైతం ఏఐ గుర్తించి ఫొటోలో చూపించిందని ఆమె ఇన్‌స్టాలో పోస్ట్ చేయడం చర్చనీయాంశమైంది.

'బనానా శారీ'తో భద్రం సుమా...

ఏంటీ శారీ ట్రెండ్..?

● చీరలంటే ఇష్టపడని ఆడవాళ్లు ఉండరు. అందులోనూ చీరకట్టులో ఫొటో అంటే ఎగిరి గంతేస్తారు. అందుకే ఈ నానో బనానా ఏఐ శారీ ట్రెండ్ అంతలా పాపులర్ అయింది. ముందుగా ఏదైనా ఫొటోను అప్‌లోడ్ చేసి చీరకట్టులో ఎలా ఉండాలని అనుకుంటున్నారో దానికి తగ్గట్టు ప్రాంప్ట్ ఇస్తే చాలు. క్షణాల్లో కోరుకున్న ఫొటో కళ్లముందు ప్రత్యక్షమవుతుంది. చీర రకం, చీర కట్టు, రంగు, బోర్డర్, పోల్కా డాట్స్, వింటేజ్ లుక్, రెట్రో స్టయిల్, అలనాటి నటీమణుల స్టయిల్, లాంగ్ హెయిర్, కర్లీ హెయిర్ లాంటివాటిని ప్రాంప్ట్‌లో వివరంగా చేరిస్తే చాలు చక్కగా ఫొటో వచ్చేస్తుంది. వానలో తడుస్తున్నట్లు, గొడుగు లేదా పూల సజ్జ పట్టుకున్నట్లు, గాల్లో చీర కొంగు ఎగురుతున్నట్లు ఉన్న మోడల్స్ యువతులను ఎక్కువగా ఆకర్షిస్తున్నాయి. ఇలా ఏఐ తీసిన ఫొటోల్లో ఎంత అందంగా ఉన్నారో చూసుకుంటూ ఇన్‌స్టా, ఫేస్‌బుక్‌ల్లో షేర్ చేస్తూ మురిసిపోతున్నారు అమ్మాయిలు.



జెమినికి ఎలా తెలుసు..?

ఇన్‌స్టాగ్రామ్‌లో తెగ వైరల్ అవుతున్న నానో బనానా శారీ ట్రెండ్‌ను చూసి తను కూడా ప్రయత్నించాలనుకుంది ఓ ఇన్‌ఫ్లుయెన్సర్. గూగుల్ జెమినిలోని ఫ్లాష్ 2.0 ఇమేజ్ మోడల్ సహాయంతో శారీ ఇమేజ్ పొందాలనుకున్నారు. అందులో భాగంగా ఫుల్ హ్యాండ్స్ ఉన్న చుడీదార్‌తోపాటు దుపట్టా వేసుకున్న ఫొటోను అప్‌లోడ్ చేశారు. ఆపై బ్లాక్ శారీ లుక్‌లో ఫొటో కావాలని ప్రాంప్ట్ ఇచ్చారు. వెంటనే నల్లచీర కట్టుకున్నట్లుగా ఓ స్టయిలిష్ ఫొటో ప్రత్యక్షమైంది. ఫొటో అందంగా వచ్చిందని ఆమె సంతోషించింది. అంతలోనే తన ఎడమ చేతిపై ఉన్న పుట్టుమచ్చ స్పష్టంగా కనిపిస్తుండడంతో ఒక్క నిమిషం భయం వేసిందని ఇన్‌స్టాలో చెప్పుకొచ్చారు ఆమె. 'వాస్తవానికి నా ఎడమ భుజం మీద పుట్టుమచ్చ ఉంది. నేను అప్‌లోడ్ చేసిన ఫొటోలో అది కనిపించడం లేదు. అయినా ఏఐ ఇమేజ్‌లోకి ఎలా వచ్చింది? నా పుట్టుమచ్చ గురించి జెమినికి ఎలా తెలుసు? ఏదేమైనా సామాజిక మాధ్యమాలు, ఏఐ వేదికల్లో ఫొటోలు అప్‌లోడ్ చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండండి' అంటూ ఆమె పోస్ట్ చేసిన వీడియో అందరినీ ఆలోచింపజేస్తోంది.



ఏ జాగ్రత్తలు తీసుకోవాలంటే...

- కొత్త ట్రెండ్స్ వచ్చినప్పుడు ఇష్టానుసారం ఫొటోలను అప్‌లోడ్ చేయడం, షేర్ చేయడం రెండూ మంచి పద్ధతులు కావు. తగిన జాగ్రత్తలు తీసుకోవడం మరిచిపోకూడదు. లేదంటే ఫొటోలే కాదు వ్యక్తిగత సమాచారం, సోషల్ మీడియా ఖాతా కూడా దుర్వినియోగం కావచ్చు.
- అప్‌లోడ్ చేసేముందు ఫొటోల మీద పేరు, ఊరు, ఫోన్ నెంబరు లాంటివి ఏవైనా ఉన్నాయేమో పరిశీలించుకోవాలి. ఫొటోల వెనక కూడా ఏమీ లేకుండా చూసుకోవాలి. ఎలాంటి సమాచారం ఉన్నా దాన్ని తొలగించాకే ఫొటోను అప్‌లోడ్ చేయడం మంచిది.
- సామాజిక మాధ్యమాల్లో తప్పనిసరిగా ప్రైవసీ సెట్టింగ్స్ పెట్టుకోవాలి. ఫొటోలు, ఇతర సమాచారాన్ని అందరికీ కాకుండా కావాల్సినవాళ్లకు మాత్రమే కనిపించేలా ఏర్పాట్లు చేసుకోవాలి.
- ఏఐ తీసిచ్చిన ఫొటోలను షేర్ చేసేముందు ఒకసారి క్షుణ్ణంగా పరిశీలించుకోవాలి. వీటిని వెరిఫై చేయడానికి నమ్మకమైన టూల్స్‌ని మాత్రమే ఉపయోగించాలి.





తెలుగు రాష్ట్రాల్లో సుమారు 6 లక్షల మంది ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. వీరిలో చాలా మంది రైతు సాధికార సంస్థ (ఆర్‌వైఎస్‌ఎస్) నుంచి శిక్షణ పొందిన వారే! ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంటల వల్ల ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతోందని అధ్యయనాలు చెబుతున్నాయంటారు ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ **అడిదం నీరజ**. వినూత్నమైన ఆలోచనలతో మరింత ఎక్కువ మంది రైతులను సహజ వ్యవసాయం వైపు మళ్లించే ప్రయత్నాలు చేస్తున్న నీరజను 'నవ్య' పలకరించింది.

ప్రకృతి వ్యవసాయంతోనే మనిషికి ఆరోగ్యం

"నేను పుట్టింది విజయవాడ దగ్గర. చదివింది ఆంధ్ర యూనివర్సిటీలో. ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్(ఐఎఫ్ఎస్) వచ్చిన తర్వాత ఉత్తరప్రదేశ్ వెళ్లిపోయాను. కేంద్ర ప్రభుత్వంలో సెక్రటరీగా రిటైరయ్యాను. గత 75 ఏళ్లలో ఐఎఫ్ఎస్ నుంచి ఇప్పటి దాకా ఇద్దరికే పూర్తిస్థాయి హోదా వచ్చింది. అందులో రెండో వ్యక్తిని నేనే! నేను కేంద్రంలో వ్యవసాయ శాఖ జాయింట్ సెక్రటరీగా పనిచేస్తున్నప్పుడు సేంద్రియ వ్యవసాయం.. ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన అనేక స్కీమ్‌లు ప్రారంభించాం. వీటి ద్వారా మన దేశంలో ఉన్న రకరకాల వ్యవసాయ పద్ధతులు.. రైతులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి తెలిసింది. ఆ తర్వాత ఎరువుల శాఖలో అడిషనల్ సెక్రటరీగా పనిచేస్తున్నప్పుడు మన దేశంలో రసాయన ఎరువుల వినియోగం ఎంత తీవ్రంగా ఉందో.. దాని వల్ల కలిగే సమస్యలేమిటో అర్థమయింది. ప్రతి సీజన్‌లోను ఎరువులకు డిమాండ్ విపరీతంగా పెరిగిపోయేది. అప్పుడు మన రైతులు రసాయన ఎరువులపై ఎంత ఆధారపడ్డారో తెలిసింది. దీనికి ప్రత్యామ్నాయం కేవలం ప్రకృతి వ్యవసాయమే అనే స్పష్టత కూడా వచ్చింది.

9 మూల సిద్ధాంతాలు..

నాకు ఆర్‌వైఎస్‌ఎస్ గురించి చాలా కాలంగా తెలుసు. సంస్థ ఛైర్మన్ విజయకుమార్ గారు మాజీ ఐఏఎస్. ఆయన రైతుల మనిషి. వారితో మమేకమై పనిచేసే మనిషి. రసాయన ఎరువులపై ఆధారపడిన రైతులను ప్రకృతి వ్యవసాయంవైపు మళ్లించటం అంత సులభం కాదు. ఈ విషయంలో ఆయన అసాధారణమైన కృషి చేస్తున్నారు. అందుకే నేను రిటైరైన తర్వాత ఆర్‌వైఎస్‌ఎస్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా చేరాను. ప్రస్తుతం మా సంస్థలో ఆరు లక్షల మంది రైతులు భాగస్వాములుగా.. సుమారు ఆరు లక్షల ఎకరాల్లో సాగుచేస్తున్నారు. తొమ్మిది మూల సిద్ధాంతాలపై ఆధారపడి ఆర్‌వైఎస్‌ఎస్ పనిచేస్తుంది. ఆవు మూత్రం, పేడ, ఇతర పదార్థాలను వినియోగించి జీవామృతం, ద్రవామృతం, కషాయాలను ఎలా తయారుచేయాలో ఆర్‌వైఎస్‌ఎస్ సిబ్బంది రైతులకు నేర్పిస్తారు. పంటను అమ్మేందుకు ఉన్న అవకాశాలను వారికి వివరిస్తారు. ఈ క్రమంలో ఆర్‌వైఎస్‌ఎస్ రైతులు తమ కాళ్ల మీద తామే నిలబడేలా చేస్తుంది. మా ఉద్దేశంలో- ప్రోత్సాహకాలు ఇవ్వటం కన్నా.. వారికి విజ్ఞానాన్ని అందించి.. స్వయంసమృద్ధి కలిగేలా చేయటమే ముఖ్యం. అదే మా సిద్ధాంతం. అంతే కాదు. మా సంస్థను రైతులే నడుపుతారు. వారే తమ సహరైతులకు శిక్షణ ఇస్తూ ఉంటారు. దీని కోసం వారు రకరకాల మోడల్స్‌ను తయారుచేశారు. ఉదాహరణకు రాయలసీమలో ఎక్కువ వర్షాలు పడవు. అందువల్ల అక్కడ భూమి, వాతావరణ పరిస్థితులకు తగినట్టుగా మోడల్స్‌ను తయారుచేసి అందిస్తారు. దీని వల్ల వారికి ఎక్కువ దిగుబడి లభిస్తుంది. ఇక ప్రకృతి వ్యవసాయంలో అనుసరించే విధానాల వల్ల భూమిలో సారం, పంట దిగుబడులు పెరుగుతాయి. రైతుకు ఆదాయం కూడా



పెరుగుతుంది. రసాయనాలు, రసాయన ఎరువులు లేని ఆహార ఉత్పత్తులు తీసుకోవటం వల్ల ప్రజల ఆరోగ్యం మెరుగవుతుంది. ఇలా సమాజంలోని అందరికీ ఏదో ఒక మేలు జరుగుతుంది. ఇక్కడ ఇంకో ముఖ్యమైన విషయం చెప్పాలి. ఆర్‌వైఎస్‌ఎస్ అనుసరిస్తున్న విధానాన్ని కేంద్ర ప్రభుత్వం- 'నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్'- పేరిట దేశంలోని అన్ని రాష్ట్రాలలోనూ అమలు చేయటానికి ప్రయత్నాలు ప్రారంభించింది. కేవలం కేంద్ర ప్రభుత్వమే కాదు.. అనేక స్వచ్ఛంద సంస్థలు కూడా ఆర్‌వైఎస్‌ఎస్‌తో కలిపి పనిచేస్తున్నాయి. ప్రస్తుతం 15 రాష్ట్రాలలో ఈ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

ఆరోగ్యంపై కూడా దృష్టి..

ఒకవైపు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడంతో పాటు ఆ విధంగా పండించిన ఆహారాన్ని తింటే ఎటువంటి ఫలితాలు వస్తున్నాయన్న అంశంపై అధ్యయనాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం 400 గ్రామాల్లోని మహిళలతో కలిసి ఆర్‌వైఎస్‌ఎస్ పనిచేస్తోంది. వారికి కిచెన్ గార్డెన్స్ ఎలా ఏర్పాటు చేసుకోవాలి.. ఫుడ్ బాస్కెట్స్ వల్ల ప్రయోజనాలేమిటనే విషయంపై అవగాహన కల్పిస్తున్నాం. ఒక కుటుంబం ఆరోగ్యంగా ఉండాలంటే- గృహిణికి ఆహారపదార్థాల పట్ల అవగాహన అవసరం. ఇటీవల ఆర్‌వైఎస్‌ఎస్‌తో కలిపి మంగళగిరి ఎయిమ్స్‌కు చెందిన డాక్టర్లు కొన్ని పరిశోధనలు చేశారు. వీరి అధ్యయనంలో ఎటువంటి రసాయనాలు లేని ఆహారపదార్థాలు తిన్న గర్భిణుల లోనూ, చిన్నారులలోనూ హిమోగ్లోబిన్ శాతం పెరిగింది. అంటే సహజమైన ఆహార ఉత్పత్తులను క్రమం తప్పకుండా తింటే ఆరోగ్యసమస్యలు కూడా రావు. ఈ విషయంపై ప్రజల్లో అవగాహన పెరిగితే అనేక ఆరోగ్య సమస్యలకు పరిష్కారాలు లభిస్తాయి. కేవలం రక్తహీనత వంటి సమస్యలే కాకుండా రసాయన ఎరువుల ద్వారా పండించే పంటల వల్ల క్యాన్సర్ వంటి సమస్యలు వస్తున్నాయని అధ్యయనాలు చెబుతున్నాయి. దీనిపై ప్రజల్లో అవగాహన పెరిగితే వారు ప్రతి రోజు తినటం మొదలుపెడతారు. దీని వల్ల ఈ ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతుంది. డిమాండ్ పెరిగితే రైతులు ముందుకు వచ్చి పంటలు పండించటం మొదలుపెడతారు. అందుకే మేము రైతుల్లోనే కాకుండా.. ప్రజల్లో కూడా అవగాహన పెంచటానికి ప్రయత్నాలు చేస్తున్నాం.

● బూటు శ్రీనివాస్, విశాఖపట్నం
ఫొటోలు: రఫీ

కౌన్సెలింగ్

గర్భధారణ - రక్తస్రావం

డాక్టర్! నాకు 30 ఏళ్లు. గర్భధారణ తర్వాత నెలసరి ఆగిపోయినా, అప్పుడప్పుడూ ఎంతో తక్కువగా రక్తస్రావం కనిపిస్తోంది. ఇలా ఎందుకు జరుగుతోంది? ఇది సహజమేనా?

ఓ సోదరి, హైదరాబాద్

వైద్య పరిభాషలో దీన్ని 'స్పాటింగ్' అంటారు. పది శాతం ఆరోగ్యకరమైన గర్భిణుల్లో ఈ లక్షణం కనిపిస్తుంది. అయితే ఈ లక్షణం తీవ్రత, పర్యవసానాలు, గర్భధారణ తర్వాతి తొలి, మలి నెలల మీద ఆధారపడి ఉంటాయి. గర్భం దాల్చిన తొలినాళ్లలో తేలికపాటి ఇంప్లాంటేషన్ బ్లీడింగ్ కనిపించవచ్చు. లేదా గర్భాశయ ముఖద్వారం దగ్గర బిడ్డ పక్కనే చిన్న రక్తపు గడ్డ ఏర్పడవచ్చు. అయితే ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ లేదా గర్భస్రావం మాదిరిగా ఈ రెండు పరిస్థితులూ ప్రమాదకరమైనవి కావు. అయితే గర్భం దాల్చిన చివరి నెలల్లో ఇలాంటి స్పాటింగ్ గర్భస్రావాన్నీ, నెలలు నిండకుండా జరిగిపోయే ప్రసవాన్నీ సూచిస్తాయి. అలాగే ప్లాసెంటా ప్రీవియా అనే పరిస్థితి కారణంగా జరగబోయే తీవ్ర రక్తస్రావాన్ని కూడా ఇది సూచిస్తుంది. కాబట్టి గర్భిణుల్లో చుక్కలుగా రక్తస్రావం జరిగినప్పుడు ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రతించి, గర్భస్రావాన్ని నివారించుకోవడం కోసం, గర్భంలో బిడ్డ పరిస్థితి, ప్లాసెంటా ఉన్న ప్రదేశాన్ని తెలుసుకోవడంతో పాటు, స్పెక్యులమ్‌ను కూడా పరీక్షించుకోవాలి.



డాక్టర్ శ్రుతి రెడ్డి పొద్దుటూరు,
కన్సల్టెంట్ అబ్‌స్టెట్రీషియన్,
గైనకాలజిస్ట్ అండ్ ల్యాప్రోస్కోపిక్ సర్జన్,
బర్త్‌రైట్ బై రెయిన్‌బో, హైదరాబాద్.

మరకలను వదిలించేద్దాం..!

ఎంత జాగ్రత్తగా ఉన్నప్పటికీ ఒక్కోసారి దుస్తుల మీద మరకలు పడుతుంటాయి. రకరకాల మరకలను సులభంగా ఎలా వదిలించాలో తెలుసుకుందాం...

- దుస్తుల మీద టీ లేదా కాఫీ ఒలికినప్పుడు అక్కడ టిష్యూ పేపర్ లేదా పొడి గుడ్డతో గట్టిగా అద్దాలి. ఆపైన కొన్ని నీళ్లు చిలకరిస్తూ చేత్తో రుద్దితే మరక చాలావరకు పోతుంది. ఇంకా మరక కనిపిస్తుంటే మాత్రం ఒక చెంచా బేకింగ్ సోడాలో కొన్ని చుక్కల నీళ్లు కలిపిన మిశ్రమాన్ని రాసి ఆరనివ్వాలి. తరవాత బ్రష్‌తో రుద్దితే మరక పోతుంది. ఉప్పు కలిపిన నిమ్మరసం వేసి రుద్దినా ప్రయోజనం కనిపిస్తుంది.
- డ్రెస్‌పై నూనె పడితే వెంటనే దానిమీద ఫేస్ పౌడర్ లేదా కార్న్‌ఫ్లోర్ చల్లాలి. పది నిమిషాల్లో అవి నూనెను పూర్తిగా పీల్చుకుంటాయి. తరవాత పాత బ్రష్‌తో రుద్ది డ్రెస్‌ను గట్టిగా దులపాలి. ఇంకా మరక ఉందనిపిస్తే దానిమీద కొద్దిగా డిష్ వాషింగ్ లిక్విడ్ లేదా షాంపూ రాసి, నీళ్లతో కడిగేస్తే సరిపోతుంది. నీళ్లు కలిపిన వెనిగర్‌తో రుద్దినా మరక మాయమవుతుంది.







దసరా నవరాత్రుల సందర్భంగా మహిళలు ఉపవాసం ఉంటూ అమ్మవారిని అర్చిస్తుంటారు. ఉపవాసం కారణంగా శరీరం నీరసించి అలసటగా అనిపిస్తుంటుంది. అలాంటి సమయాల్లో తక్షణ శక్తిని అందించడంతోపాటు తినదగిన వంటకాల తయారీ మీకోసం...

ఉపవాస విందు ఇలా..

గురువారం

కుట్టు పరాటా- మఖానా మఖనీ గ్రేవీ



ఒక గిన్నెలో కుట్టు పిండి, ఉప్పు వేసి నీళ్లు చల్లుకుంటూ చపాతీ పిండిలా కలపాలి. దీన్ని చిన్న ఉండలుగా చేసి పరాటాలు పామాలి. స్టవ్ మీద పాన్ పెట్టి నూనె రాసి పరాటాలు వేసి రెండువైపులా దోరగా కాల్చాలి. స్టవ్ మీద గిన్నె పెట్టి వెన్న, లవంగాలు, ఏలకులు, జీలకర్ర, గరం మసాల పొడి, కసూరి మేథీ వేసి రెండు నిమిషాలపాటు వేయించాలి. తరవాత టమాటా ప్యూరీ వేసి దగ్గరకు వచ్చేదాకా ఉడికించాలి. ఆపైన క్రీమ్, వేయించిన మఖానా వేసి పాలు పోసి బాగా కలపాలి. తరవాత ఉప్పు కలిపి కొత్తిమీర తరుగు చల్లి స్టవ్ మీద నుంచి దించాలి. ఈ మఖానా గ్రేవీని కుట్టు పరాటాతో కలిపి తింటే రుచిగా ఉంటుంది.

శుక్రవారం

మఖానా ఖీర్

చిన్న గిన్నెలో కొన్ని వేడిపాలు పోసి కుంకుమపువ్వు రేకులు వేసి నానబెట్టాలి. స్టవ్ మీద పాన్ పెట్టి నెయ్యి వేసి కరిగించాలి. ఆపైన మఖానా వేసి కలుపుతూ దోరగా వేయించి పళ్లెంలోకి తీయాలి. అవి చల్లారాక చేత్తో కచ్చాపచ్చాగా మెదపాలి. స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి పాలు పోసి మరిగించాలి. తరవాత మఖానా మిశ్రమం వేసి ఉడికించి స్టవ్ మీద నుంచి దించాలి. అందులో బెల్లం తురుం, యాలకుల పొడి, కుంకుమ పువ్వు రేకుల మిశ్రమం, వేయించిన బాదం-జీడిపప్పుల పలుకులు వేసి మెల్లగా కలపాలి. ఈ ఖీర్‌ను వేడిగా, చల్లగా కూడా తినవచ్చు.



శనివారం

స్వీట్ పొటాటో- సాబుదాన టిక్కీ



సగ్గుబియ్యంలో నీళ్లు పోసి అరగంటసేపు నానబెట్టాలి. దనిసి గడ్డలను శుభ్రంగా కడిగి మెత్తగా ఉడికించాలి. ఆపైన వెడల్పాటి గిన్నెలో వేసి మెత్తగా మెదపాలి. అందులో నానబెట్టిన సగ్గుబియ్యం, కచ్చాపచ్చాగా దంచిన వేరుశనగ పప్పు, పచ్చిమిర్చి ముక్కలు, అల్లం తురుం, కొత్తిమీర తరుగు, ఉప్పు, జీలకర్ర పొడి, నిమ్మరసం వేసి ముద్దలా కలపాలి. అరచేతికి కొద్దిగా నెయ్యి రాసుకుని పై మిశ్రమాన్ని చిన్న టిక్కీల మాదిరి చేసి పెట్టుకోవాలి. స్టవ్ మీద పాన్ పెట్టి నెయ్యి రాసి టిక్కీలు పేర్చి రెండు వైపులా దోరగా వేయించి పళ్లెంలోకి తీయాలి. ఈ టిక్కీలను గ్రీన్ చట్నీతో తినవచ్చు.

ఆదివారం

కుట్టు పూరీ- జీరా ఆలు

కుట్టు పిండి (చిలగడ దుంపల పిండి)లో ఉప్పు వేసి వేడి నీళ్లు చల్లుతూ ముద్దలా కలపాలి. ఈ పిండిని కొద్ది కొద్దిగా తీసుకుంటూ పూరీలు పామాలి. స్టవ్ మీద మూకుడు పెట్టి నూనె పోసి వేడిచేయాలి. అందులో పూరీలు వేసి దోరగా వేయించి పళ్లెంలోకి తీయాలి. స్టవ్ మీద గిన్నె పెట్టి కొద్దిగా నెయ్యి, జీలకర్ర, పచ్చి మిర్చి ముక్కలు వేసి వేయించాలి. తరవాత ఉడికించి తొక్కతీసిన ఆలు గడ్డ ముక్కలు, ఉప్పు వేసి టాస్ చేస్తూ కలపాలి. చివరగా కొత్తిమీర తరుగు చల్లి దించాలి. కుట్టు పూరీలను జీరా ఆలు కూరతో కలిపి తింటే రుచి బాగుంటుంది.



సోమవారం

స్వీట్ పొటాటో- కుట్టు పిజ్జెట్స్



ఒక గిన్నెలో పన్నీర్ తురుం, ఉడికించిన ఆలు గడ్డల ముక్కలు, పచ్చి మిర్చి ముక్కలు, పుదీనా తరుగు, కొత్తిమీర తరుగు, కొద్దిగా క్రీమ్, మిరియాల పొడి, ఉప్పు వేసి కలిపి పెట్టుకోవాలి. దనిసి గడ్డలను ఉడికించి వెడల్పాటి గిన్నెలో వేసి మెత్తగా మెదపాలి. అందులో కుట్టు పిండి, ఉప్పు, నెయ్యి వేసి వేడి నీళ్లు చల్లుతూ ముద్దలా కలపాలి. ఈ మిశ్రమంతో చిన్న బిళ్లలు చేయాలి. స్టవ్ మీద పాన్ పెట్టి కొద్దిగా నూనె రాసి ఈ బిళ్లలు పరిచి రెండు వైపులా దోరగా వేయించాలి. ఈ బిళ్లల మీద కొద్దిగా పన్నీర్-ఆలుగడ్డ ముక్కల మిశ్రమం ఉంచి రెండు నిమిషాలు మగ్గించి పళ్లెంలోకి తీయాలి.